సత్యమేవ జయతే
సాక్షి
'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 303
శనివారం 24-1-2026
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

జోయాలుక్కాస్
వరల్డ్స్ ఫేవరేట్ జ్యువెలర్

కండరాల బలం కోసం స్ట్రెంత్ ట్రయినింగ్ లేదా వెయిట్ ట్రయినింగ్ తప్పనిసరి అనే విషయం చాలా సార్లు వినే ఉంటాం. అయితే స్ట్రెంత్ ట్రయినింగ్ అనేది మజిల్ లాస్‌ను రివర్స్ చేయడమే కాదు మెదడు ఆరోగ్యానికి కూడా ఉపకరిస్తుందని, వయసు పెరిగినా మెదడు చురుగ్గా పనిచేసేలా చేస్తుందని తాజా అధ్యయనం తెలియజేస్తోంది. ఈ అధ్యయనాన్ని వాషింగ్టన్ యూనివర్శిటీలోని ఓ పరిశోధక బృందం నిర్వహించింది.

వెయిట్ ట్రయినింగ్ బ్రెయిన్‌కూ బెటరే

1,164 మందిపై...

యాభై ఐదు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న 1,164 మంది స్త్రీ, పురుషులపై వాషింగ్టన్ పరిశోధక బృందం ఈ అధ్యయనం నిర్వహించింది. వీరిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూప్‌కి వారానికి రెండుసార్లు వెయిట్ ట్రయినింగ్ చేయడం అలవాటు. రెండో గ్రూప్‌నకు ఈ అలవాటు లేదు, మొదటి గ్రూపు వారు జ్ఞాపకశక్తి పరీక్షలో మెరుగ్గా రాణించారు. వెయిట్ ట్రయినింగ్ చేయని వారితో పోల్చితే చేసేవారు ఆరోగ్యకరమైన మెదడు న్యూరాన్‌లను కలిగి ఉన్నారు.

స్ట్రెంత్ ట్రయినింగ్ అంటే?

డంబెల్స్, బార్బెల్స్, ఒక మోస్తరు బరువులు, రెసిస్టెంట్ బ్యాండ్, బాడీ వెయిట్ (ఉదా: పుషప్‌లు), వాటర్ బాటిల్స్, బ్రిక్స్‌తో చేసే వ్యాయామం.

మతిమరుపునకు దూరంగా...

వెయిట్ ట్రయినింగ్ అనేది మెదడు ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి వివిధ న్యూరోప్రొటెక్టివ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ కారకాలను ఉత్పత్తి చేస్తుందని, డిమెన్షియా (మతిమరుపు)ను దూరం చేస్తుందని చెబుతున్నారు పరిశోధకులు.

ఉపయోగాలు

మెదడుపై వెయిట్ ట్రయినింగ్ ఏ రకంగా ప్రభావం చూపుతుందంటే...

- ఏకాగ్రతను పెంచుతుంది
- జ్ఞాపకశక్తిని వృద్ధి చేస్తుంది
- ఒత్తిడిని తగ్గిస్తుంది
- నాడుల రక్షణకు ఉపయోగపడుతుంది

వయసు పైబడిన వారికి వెయిట్ ట్రయినింగ్

2-3 వారానికి రెండు లేదా మూడు సెషన్‌లు చేస్తే సరిపోతుంది

45-60 ప్రతి సెషన్ 45 నుంచి 60 నిమిషాల మధ్య ఉండాలి

2-3 రెండు నుంచి మూడు రకాల ఎక్సర్‌సైజ్‌లను సెట్ చేసుకోవచ్చు

వయసు పైబడిన వారు, వృద్ధులు రోజూ 25 నిమిషాల నడక, సైక్లింగ్, ఈతతో పాటు ఇతర రకాల వ్యాయామాలు చేస్తే... మెదడు చురుగ్గా పనిచేయడానికి అవి ఉపకరిస్తాయి. రోజుకు రెండు కిలోమీటర్లకు పైగా నడక అల్జీమర్స్ ముప్పును తగ్గిస్తుంది.





'జస్ట్ రిటైర్డ్ స్టార్' అంటున్నారు సునీతా విలియమ్స్ అభిమానులు. అరవై సంవత్సరాల సునీత జీవితంలో విలువైన అంతరిక్ష అనుభవాలు ఎన్నో... ఎన్నెన్నో! అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) ప్రారంభ రోజుల నుంచి వివిధ మిషన్‌ల వరకు... అంతరిక్ష ప్రయాణంలో కీలకమైన ముందడుగులను, మానవులకు అంతరిక్షం ఎలా అందుబాటులోకి వచ్చిందో చూసిన అపురూప కాలానికి సునీత విలియమ్స్ కేంద్రబిందువుగా నిలిచారు. నేడు జాతీయ బాలికా దినోత్సవం. కోట్లాదిమంది బాలికలకు స్ఫూర్తినిచ్చే అపూర్వ శక్తి సునీత విలియమ్స్ జీవితానికి ఉంది. శాస్త్రసాంకేతిక విషయాలే కాదు మధుర గాయకుడు మహ్మద్ రఫీ పాట నుంచి మలబారు అందాల వరకు మాట్లాడే సునీత విలియమ్స్ అంతరంగం ఆమె మాటల్లోనే...

● సునీత విలియమ్స్... ఆ స్ఫూర్తి ఆకాశమంత

నేడు జాతీయ బాలికా దినోత్సవం

బాగా కష్టపడాలనే తపన ఉన్న, సృజనాత్మకత, తెలివితేటలు మూర్తీభవించిన వ్యక్తులతో కలిసి పనిచేసే అవకాశం రావడం నాకు లభించిన అదృష్టం అని నా భర్త చెబుతుంటారు. అది నిజం. నేను పదవీ విరమణ చేసినప్పటికీ చాలా బిజీగా ఉండడం వల్ల ఆ భావన కలగడం లేదు. నా బాధ్యతలను తదుపరి తరానికి అప్పగించాల్సిన సమయం వచ్చింది.

■ అరరే... మిస్సవుతున్నానే!

నాకూ ఫోమో (ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్) ఉంది! ఆర్టెమిజ్ ప్రోగ్రామ్ కింద చేపడుతున్న రాబోయే మూన్ మిషన్ నాకు 'ఫోమో'లాంటిది. చంద్రుడి మీదికి వెళ్లాలని ఎవరికి మాత్రం ఉండదు? అసలు నేను 'నాసా'లో చేరాలనుకోవడానికి ప్రధాన కారణం అదే. అందువల్ల నాకు ఖచ్చితంగా 'ఫోమో' ఉంటుంది. మూన్ మిషన్‌లో భాగమైన నా స్నేహితులు అదృష్టవంతులు. వారి ప్రయాణాన్ని చూడడానికి నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను.

■ అంతరిక్షం టు లోక సంచారం

ప్రతి ఒక్కరికి తమకు నచ్చిన ప్రదేశం ఒకటి ఉంటుంది. నా విషయానికి వస్తే నాకు అత్యంత ఇష్టమైన ప్రదేశం అంతరిక్షం. మరి ఆ తరువాత? అంతరిక్షం తరువాత భూమిపై ఉన్న అందమైన, అద్భుతమైన ప్రదేశాల గురించి తెలుసుకున్నాను. నా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన సమయం వచ్చేసింది. భారతదేశమంతటా పర్యటించాలనుకుంటున్నాను. ఆ ప్రదేశాలలో కేరళ ఒకటి.

■ టాప్ గన్...ఇన్‌స్పిరేషన్

ఇన్‌స్పిరేషన్ ఎక్కడి నుంచైనా రావచ్చు... అది హాలీవుడ్ అయినా కావచ్చు! అవును... హాలీవుడ్ సినిమా 'టాప్ గన్' ప్రభావం నాపై ఉండడం వల్లే తొలిసారిగా జెట్‌లు నడపాలనుకున్నాను. అయితే నేను హెలికాప్టర్ పైలట్‌గా మారాను. ఇరవై ఏళ్ల వయస్సులో టెస్ట్ పైలట్‌కు హాజరైన తరువాత, అక్కడ వ్యోమగాములను కలిసిన తర్వాతే వారికి ఉన్న అర్హతలలో కొన్ని నాకు ఉన్నాయనిపించింది. 'ఇది నేను ఎంచుకోవాల్సి దారి' అని అప్పుడే బలంగా అనిపించింది.

■ వినాయకుడి ఆశీర్వాదం

నా భారతీయ వారసత్వ సంపదపై నాకు చాలా గౌరవం ఉంది. దానిలో కొంత భాగాన్ని వివిధ రూపాల్లో అంతరిక్షంలోకి తీసుకువెళ్లినందుకు సంతోషంగా ఉంది. గణేష్ ఎప్పుడూ మా ఇంట్లోనే ఉంటాడు. నేను నివసించిన ప్రతిచోటా గణేష్ ఉన్నాడు. అందుకే నాతోపాటు అంతరిక్షంలోకి రావాల్సిందే అనుకున్నాను. ఇక భారతీయ ఆహారం విషయానికి వస్తే... ఎంత తిన్నా తనివి తీరదు. భారతీయ ఆహారం తినబోయే ముందు చాలా ఉత్సాహంగా ఉంటుంది. ఆ ఉత్సాహంతోనే అంతరిక్షంలో నా వెంట కొన్ని సమోసాలు ఉండేలా చూసుకోవాల్సి వచ్చింది!

■ నమ్మలేదు... కాని అది నిజం!

నా మొదటి అంతరిక్ష యాత్ర సందర్భంగా...

'భారత్‌లోని ప్రజలు నువ్వు సురక్షితంగా తిరిగి రావాలని ప్రార్థించారు' అని నాన్న చెప్పినప్పుడు నేను మొదట నమ్మలేదు. 'అలా జరిగే అవకాశం లేదు' అని కూడా అన్నాను. అయితే దినపత్రికలలో వచ్చిన కథనాలు చదివినప్పుడు నాన్న చెప్పింది అక్షరాలా నిజమని తెలుసుకున్నాను. నా స్నేహితురాలు ఒకరు హిమాలయాల్లోని ఒక స్కూల్‌లో ఉండేది. ఆమె నాతో...

'నీ ఫోటో స్కూల్‌లో ఉంది' అని చెప్పింది. భారతదేశం నన్ను తన కుమార్తెగా స్వీకరించడం నాకు హృద్యంగా, సంతోషంగా అనిపించింది.

■ ఎలాంటి పుస్తకాలు ఇష్టమంటే...

నా జీవితంలో శునకాలకు అధిక ప్రాధాన్యత ఉంది. 2017లో గోర్బి (శునకం పేరు) నాకు దూరమైనప్పుడు చాలా బాధపడ్డాను. నేను అంతరిక్షంలో ఉన్నప్పుడు, ఒక కార్గో నౌకలో నాకు ప్రియమైన శునకాల త్రీడీ-ప్రింటెడ్ మీనియేచర్‌లను పంపించారు. వాటిని చూసినప్పుడు ఎంతో సంతోషంగా అనిపించింది.

పుస్తకాలు చదవడం ఇష్టం. అయితే చిన్నప్పుడు సైన్స్ ఫిక్షన్ పుస్తకాల కంటే జంతువులు, మిస్టీరియస్ కథల పుస్తకాలు ఎక్కువగా చదివే అలవాటు ఉండేది. ఇప్పుడు మాత్రం చరిత్ర, కాల్పనిక చరిత్ర పుస్తకాలు అంటే ఇష్టం. స్లోవేనియన్ సంస్కృతిని పరిచయం చేసే నవల ఒకటి ప్రస్తుతం చదువుతున్నాను.

బార్ బార్ దిన్ యే ఆయే!

* తన 59 పుట్టిన రోజు సందర్భంగా ప్రముఖ మ్యూజిక్ కంపెనీ 'సారెగామా' నుంచి ప్రత్యేక బహుమతిని అందుకున్నారు సునీతా విలియమ్స్. లెజెండరీ గాయకుడు మహ్మద్ రఫీ ప్రసిద్ధ పాట 'బార్ బార్ దిన్ యే ఆయే' (ఈరోజు మళ్లీ మళ్లీ రావాలి)తో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసింది. ఆమెకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి సంగీతకారులు, గాయకులతో ప్రముఖ బృందాన్ని ఏర్పాటు చేసింది. 'రండి.. అతి పెద్ద ఐకాన్‌లతో కలిసి పాడుదాం. అంతరిక్షంలో ఉన్న సునీతా విలియమ్స్‌కు మనం అందరం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేద్దాం' అనే కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది సారెగామా.

* ఆస్ట్రోనాట్‌గా సుపరిచితురాలైన సునీతా విలియమ్స్ అథ్లెట్ కూడా..రన్నింగ్, స్విమ్మింగ్, ట్రయాథాన్స్, విండ్ సర్ఫింగ్, స్నో బోర్డింగ్, బౌ హంటింగ్, రాక్ క్లైంబింగ్ అంటే ఇష్టం. స్పేస్‌లో మారథాన్ చేసిన తొలి వ్యక్తిగా రికార్డ్ సృష్టించారు. ఇక సంగీతం విషయానికి వస్తే గిటార్ వాయించడంలో సునీత విలియమ్స్‌కు ప్రావీణ్యం ఉంది.

అది మన సంస్కృతి

ఆపదలో ఉన్న వ్యక్తికి సాయం చేయడం, తిరిగి ఏమీ ఆశించకపోవడం అనే భారతీయ సంస్కృతిని జపాన్ వేదికగా చాటి చెప్పాడు ఓ భారతీయుడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరలవుతూ అందరి హృదయాలను గెలుచుకుంటోంది.

రోహన్ రానా అనే వ్యక్తి తన స్నేహితునితో కలిసి జపాన్‌లో మెట్రో ట్రెన్‌ని పట్టుకోవడానికి వేగంగా వెళ్తుండగా.. ఓ వృద్ధుడైన జపనీస్ వ్యక్తి కిందపడి ఉండటాన్ని గమనించారు. ఆ వృద్ధుడికి దెబ్బ తగిలి రక్తం కారుతోంది. చుట్టూ చాలామంది ఉన్నప్పటికీ ఎవరూ ఆ వృద్ధుని పట్టించుకోలేదు. కానీ రోహన్ రానా, అతని స్నేహితుడు క్షణం కూడా ఆలోచించకుండా అతనికి సాయం చేయడానికి ముందుకెళ్లారు. ఆ వృద్ధుడికి చేయూతనిచ్చి కూర్చోబెట్టి, తమ వద్ద ఉన్న బ్యాండేజీని గాయంపై వేసి, అతనికి ధైర్యం చెప్పారు. కృతజ్ఞతగా ఆ వృద్ధుడు రోహన్‌కి కొంత డబ్బు ఇవ్వబోయాడు. కానీ రోహన్ ఆ డబ్బును నిరాకరించాడు.

అనంతరం రోహన్ ఆ విషయాన్ని చెబుతూ ఆ వృద్ధుడు ఇచ్చిన డబ్బుని చూడటం కూడా తనకు నచ్చలేదని, అది ఒక భారతీయుడిగా తన వ్యక్తిగత విలువలకు విరుద్ధమని భావోద్వేగానికి లోనయ్యాడు. సాటి మనిషిపై చూపిన జాలి, మానవత్వం భారతీయుల విలువలకు అద్దం పడుతోంది.

వహ్ వా! వాకా వాకా

సంగీతానికి సరిహద్దులు లేవని, ఏ భాష పాటకైనా మన మట్టి వాసనను అద్ది కొత్తగా మార్చవచ్చని రాజస్థానీ జానపద కళాకారులు నిరూపించారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన పాటకి మన స్థానిక సంస్కృతిని జోడించి.. అందరిచే వహ్ వా అనిపించుకుంటున్న వారి సృజనాత్మకతకు నెటిజనులు ఫిదా అయ్యారు.

ఆఫ్రికన్ రిథమ్స్‌తో సాగే షకీరా పాడిన వాకా వాకా అనే ఆ పాటకు మన మూలాలను జోడించడం అద్భుతం. ఇండియాస్ గాట్ టాలెంట్‌లో మూడుసార్లు పాల్గొన్న ఈ కళాకారుల బృందం, తమదైన శైలిలో రాజస్థానీ సాంప్రదాయ సంగీతంలోకి వాకా వాకా పాటను రీమిక్స్ చేసి అందరినీ ఆకట్టుకుంటున్నారు. సారంగి, ఖర్తాల్, డోలక్ వంటి వాద్యాలతో ఈ గ్లోబల్ పాటకు దేశీ టచ్ ఇచ్చారు. ఈ పాట చివరలో వచ్చే దిస్ టైమ్స్ ఆఫ్ ఆఫ్రికా అనే ప్రసిద్ధ పంక్తిని వారు వెల్కమ్ టు రాజస్థాన్ అని మార్చడం ఇందులోని ప్రత్యేక ఆకర్షణ. రంగు రంగుల తలపాగాలు, ఎంబ్రాయిడరీ జాకెట్లు, అద్దాలతో అలంకరించిన డ్రస్సులతో పక్కా రాజస్థానీ వాతావరణాన్ని కళ్ల ముందు ఉంచారు ఆ కళాకారులు.

రాజస్థానీ జానపద కళాకారుల బృందం ఈ వీడియోని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో వైరలయ్యింది. బస్సు ప్రయాణంలో కూడా తమ కళను ప్రదర్శిస్తూ వారు పంచుతున్న ఆనందం నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

హ్యూమర్‌మరాలు

అమ్మా కొడుకుల ముందు ఐన్‌స్టీన్లూ, న్యూటన్లూ బలాదూరు!

ఎందుకో తెలియదుగానీ... ముందునుంచీ మా బుజ్జిగాడిని ఓ మేధావిలాగా... ఓ సైంటిస్టులాగా తీర్చిదిద్దాలనే ఉబలాటం నాది. అందుకే... వాడి వయసు నాలుగ్గేళ్లే అయినప్పటికీ సైన్సు గురించీ... సైంటిస్టుల గురించి కథలు కథలుగా చెబుతూ ఉండటం... చిన్న చిన్న నోటి లెక్కలు చేయిస్తూ ఉండటం నాకు అలవాటు.

ఓ మంచిరోజ్జూసుకుని... తన నెత్తిన ఆపిల్ పడటంతో భూమికి ఆకర్షణ ఉందన్న విషయాన్ని న్యూటన్ గారు ఎంత యుక్తిగా కనుగొన్నారో చెప్పా. సాదా సీదా విషయాలను అబ్జర్వ్ చేయడం వల్ల... పెద్ద పెద్ద సిద్ధాంతాలూ ఎలా తెలుసుకోవచ్చో వివరించా.

రాత్రిళ్లు పక్క తడపకూడదనే ఉద్దేశంతో... రోజులాగే ఆరోజు కూడా బుజ్జిగాడితో 'సూ సూ' పోయించడానికి పెరట్లోకి తీసుకెళ్లా. సూ సూ పోస్తున్నవాడు కాస్తా ''నాకెందుకో న్యూటన్‌కు బె..ద్ధ...గా తెలివితేటలు లేవేమోనని అనిపిచ్చోంది నానా'' అన్నాడు సడన్‌గా.

''ఎంట్రా అంతమాటన్నావు?''

''కాదా మరి... నేను సూసూ పోస్తుంటేనే తెలిచిపోయింది కదా భూమికి ఆకర్షణ ఉందని. మరి అలాంటిది... అంత బే...ద్ధ...గా పెరిగిపోయాక... అందునా నెత్తి మీద ఆపిల్ పడేదాకా న్యూటన్ గారికి ఆ చంగతి తెలియలేదంటే... నాకెందుకో ఆయన తెలివితేటల మీద డౌటొచ్చింది నానా'' ఇదీ మూడేళ్ల మా బుజ్జిగాడి మాట.

అక్కడితో ఊరుకోలేదు... ''చేసే ప్రతి పనికీ రివర్స్ యాక్షను ఉంటుందన్న చంగతి కూడా నాకెప్పుడో తెలిసిపోయింది. అలాంటిది ఆయనకేమో బెద్దయ్యేవలకూ తెలియలేదు'' అన్నాడు.

''నీకేం తెలిసిందీ, ఎలా తెలిసిందీ?'' అడిగా.

''మొన్న ఆటాడుకుంటుంటే నా బంతి కాస్తా అమ్మ తలకు తగిలింది కదా... అంతే ఎఙ్జాట్లీ నా తలకాయ మీద కూడా అదే చ్చాటులో బొప్పి తేలింది. అంతే నువ్వు నాకు చెప్పిన న్యూటన్ చిద్దాంతం అర్దమయ్యింది''

●●●

''నాకు తెలియక అడుగుతా... ప్లచ్చు ఇంటూ ప్లచ్చు ప్లచ్చవుతంది. కానీ... మైనచూ మైనచూ ప్లచ్చెలా అవుతుంది నానా?'' అడిగాడు మా బుజ్జిగాడు.

నాకేం చెప్పాలో అర్థం కాలేదు.

అదృష్టవశాత్తూ సరిగ్గా అదే టైములో వాళ్ల అమ్మ ఉతికిన బట్టలారేస్తూ ఉంది. బట్టలుతికిన తర్వాత ఆమె వాటిని ఉల్టా చేసి అంటే తిరగేసి ఆరేస్తుంటుంది. ఈ పనిలో నేనూ, మా బుజ్జిగాడూ ఆమెకు హెల్ప్ చేస్తున్నాం.



వెంటనే ప్రాక్టికల్‌గా డిమాన్‌స్ట్రేట్ చేసి మరీ వాడి డౌటును క్లియర్ చేసింది నా భార్య. అదెలాగంటే...

''ఒరేయ్... బట్టలారేసేటప్పుడు వాటిని ఉల్టా చేసి ఆరేస్తామా... ఆరాక మళ్లీ వాటిని తిరగేసి తొడుగుతాం కదా! ఇలా రెండుసార్లు ఉల్టా చేశాక ఆ బట్ట మళ్లీ సీదాగా మారడంలా. ఇదీ అంతే'' అని జవాబిచ్చింది.

●●●

ఎట్టకేలకు నాకు అర్థమైన విషయమేమిటంటే... జస్ట్ పుస్తకాల్లోనే కాదు... నిత్యజీవితంలోనూ సైన్సూ మ్యాథ్సూ ఉంటాయి. బట్టల వాషింగ్‌లో భాగహారాలూ, దుస్తులు తిరగేయడాల్లో తీసివేతలూ, కబ్బోర్డు కారంలో గుణకారాలూ, ఇంటెనకాల పెరట్లో ఈ ఈజీక్వల్టూ ఎమ్సీ స్క్వేర్లూ... ఇలా ఎక్కడెక్కడ ఏయే సిద్ధాంతాలుంటాయో, ఏ కిచెన్‌లో ఏయే ఈక్వేషన్లుంటాయో బుజ్జిగాళ్లకూ, వాళ్ల అమ్మలకే తెలుసు.

అన్నట్టు... ఆ న్యూటనులూ, ఐన్‌స్టీన్ల కంటే... అమ్మలూ, బుజ్జిగాళ్లూ, బుజ్జిపిల్లలే చాలా చాలా తెలివైనవాళ్లూ... బహు గొప్పవాళ్లు!

– యాసీన్

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
జనవరి 23న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,60,000	1,60,700	1,59,710	1,60,700	1,60,000	1,59,820
బంగారం (22 క్యారెట్లు)	1,47,200	1,46,400	1,46,400	1,50,790	1,47,200	1,46,500
వెండి	3,22,938	3,36,700	3,60,000	3,36,700	3,26,000	3,60,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 303

శనివారం 24-1-2026

ఇషాన్, సూర్య విధ్వంసం

రెండో టి20లోనూ న్యూజిలాండ్‌పై భారత్ ఘనవిజయం -10లో

అమ్మకాల తుఫాన్

82వేల దిగువకు సెన్సెక్స్.. రూ. 6.95 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి -10లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

'విద్యుత్'ధర్మానికి బాబు సర్కారు తూట్లు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అధికారానికి చంద్రబాబు సర్కార్ తూట్లు పొడవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు పెంచబోమన్న బాబు.. అధికారంలోకి రాగానే దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు.

వివరాలు 11లో ▸

30 మంది విద్యార్థులకు అస్వస్థత

అనంతపురం జిల్లా 43 ఉడేగోళం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతుండడంతో.. వారిని ఆస్పత్రికి తరలించారు.

వివరాలు 2లో ▸

ఇరాన్‌పై యుద్ధమేఘాలు!

అమెరికా యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలు భారీ స్థాయిలో పశ్చిమాసియా వైపు కదులుతున్నాయి. వాటితో పాటు పదాతి సైన్యాన్ని కూడా అమెరికా మోహరిస్తోంది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విస్పష్టంగా ప్రకటించారు.

వివరాలు 6లో ▸

78 ఏళ్ల బంధానికి వీడ్కోలు

ఐక్యరాజ్యసమితి అనుబంధ ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నుంచి అమెరికా అధికారికంగా పూర్తిస్థాయిలో వైదొలిగింది. 78 ఏళ్ల బంధాన్ని తెంచేసుకుంది. ఈ విషయాన్ని అమెరికా ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.

వివరాలు 6లో ▸

• బంధువుకు భూ పందేరం..

గీతం కబ్జాలకు గిఫ్ట్!

విశాఖలో రూ.5,000 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి

'గీతం' వర్సిటీకి అడ్డగోలుగా కట్టబెట్టేందుకు బాబు సర్కారు పావులు

దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ సాహసించని విధంగా భూ దోపిడీ

బాబు సొంత కుటుంబ సభ్యులకు అత్యంత ఖరీదైన గిఫ్ట్.. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సర్కారు భూములు మళ్లీ 'గీతం' చెరలోకే

బాలకృష్ణ చిన్న అల్లుడు, నారా లోకేశ్ తోడల్లుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు నజరానా

గీతం కబ్జా చేసిన 54.79 ఎకరాల ప్రభుత్వ భూములపై ఉన్నత స్థాయిలో తీవ్ర ఒత్తిళ్లు

30న జీవీఎంసీ కౌన్సిల్ చివరి సమావేశంలో ఆమోదించేలా భారీ స్కెచ్

గీతం ఆక్రమణల చెర నుంచి వైఎస్సార్‌సీపీ హయాంలో విడిపించిన భూములపై టీడీపీ పెద్దల కన్ను

ఇప్పటికే ఎండాడలో గీతం భూములను 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి మార్ట్‌గేజ్, బ్యాంకు రుణాలిప్పించిన బాబు సర్కారు

2లో

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ – మధురవాడ జోన్ – టౌన్ ప్లానింగ్ విభాగం – విశాఖపట్నం రూరల్ మండలం తహసీల్దార్ వారు – ఎండాడ గ్రామం మరియు రుషికొండ గ్రామాలలో గల ప్రభుత్వ భూమి మొత్తం విస్తీర్ణం ఎకరాలు 54.79 సెంట్లు గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ (GITAM) విశ్వవిద్యాలయం తరపున క్రమబద్ధీకరణ (Regularization) మరియు బదలాయింపు (Alienation) ప్రతిపాదనలకు సంబంధించి GVMC కౌన్సిల్ తీర్మానం (Resolution) కొరకు – సమర్పించుట – గురించి. ఆర్.సి.నెం.1992/026/ఎంపి-II/ఉ2	టౌన్ ప్లానింగ్ మధురవాడ జోన్

గీతం యూనివర్సిటీ కబ్జా చేసిన 54.79 ఎకరాల భూమిని క్రమబద్ధీకరణ చేసేందుకు జీవీఎంసీ కౌన్సిల్ అజెండాలో చేర్చిన భాగం

'ల్యాండ్ టైట్లింగ్' ఆదర్శం

దావోస్ వేదికగా ఐఎంఎఫ్ ఎండీ గీతా గోపీనాథ్ ప్రశంసలు

- అన్ని రాష్ట్రాలూ ఈ దిశగా మరింత దృష్టి సారించాలని సూచన
- భారత్‌లో భూసేకరణ, సమస్యలు గందరగోళం.. ఇది వృద్ధికి, తయారీ రంగానికి ఒక పెద్ద సవాలు
- అయితే కొన్ని రాష్ట్రాలు కొత్త పద్ధతులతో ప్రయోగాలు
- ఏపీలో సృజనాత్మక రీతిలో భూ వినియోగం, భూ సంస్కరణలు
- ఈ దిశగా ల్యాండ్ టైట్లింగ్ అంశంపై గట్టిగా ముందుకు వెళ్లడం ముఖ్యమని స్పష్టీకరణ
- సీఎం చంద్రబాబు సమక్షంలోనే అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు
- తద్వారా ఎన్నికలకు ముందు బాబు, ఎల్లో మీడియా చేసిందంతా దుష్ప్రచారమేనని తేటతెల్లం
- జగన్‌పై కక్షతో దాన్ని ఏకపక్షంగా రద్దు చేసిన బాబు సర్కారు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన భూ సంస్కరణలకు దావోస్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్న సమావేశంలోనే అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయి. తద్వారా ఎన్నికలకు ముందు ఎల్లో మీడియా చేసిందంతా దుష్ప్రచారమేనని తేటతెల్లమైంది. జగన్‌పై కక్షతో చంద్రబాబు విపరీతంగా దుష్ప్రచారం చేసి, అధికారంలోకి రాగానే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయడం తెలిసిందే. అయితే ల్యాండ్ టైట్లింగ్ అన్నది ఆదర్శనీయమని..

మిగతా 2వ పేజీలో ▶

నకిలీ మద్యం కేసులో జోగి సోదరులకు బెయిల్

బెయిల్ మంజూరుచేసిన తంబళ్లపల్లి కోర్టు

విజయవాడ జైలు నుంచి విడుదల

అక్రమ కేసుల వెనుక చంద్రబాబు

నా మీద లోకేశ్ చేసిన ఆరోపణలపై ప్రమాణానికి రావాలి

మాజీ మంత్రి జోగి రమేశ్ ఫైర్

11లో

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజల్ని తప్పదోవ పట్టించారు

- నాడు దుష్ప్రచారం చేసిన టీడీపీ నాయకులు.. ఇప్పుడు దానిలో భాగమైన రీసర్వేను అమలు చేస్తున్నారు
- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజం
- బ్రిటిష్ హయాం తర్వాత మళ్లీ వైఎస్ జగన్ మాత్రమే సమగ్ర భూ రీసర్వే చేయించారు
- వందేళ్ల తర్వాత అత్యంత పారదర్శకంగా జరిగింది
- సర్వే రాయిపై బొమ్మ ఉన్నంత మాత్రాన భూములు కొట్టేయడం సాధ్యమా?
- తాజా సర్వే అని చెప్పడానికే బొమ్మ వేశాం

2లో

ఉద్యోగులకు బాబు సర్కారు మరణశాసనం

ప్రభుత్వ వేధింపులకు పది రోజుల్లోనే నలుగురు ఉద్యోగులు బలి

- అలవికాని లక్ష్యాలతో మానసిక క్షోభకు గురిచేస్తున్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల మరణాలపై స్పందించి సమీక్ష ఏర్పాటు చేయాలి
- ఉద్యోగులతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు గౌరవంగా వ్యవహరించాలి
- సర్కారు వైఖరిని మార్చుకోకపోతే ఉద్యోగుల తరఫున పోరాటం ఉధృతం
- ఉద్యోగులూ అధైర్యపడకుండా ఓపికతో ఉండండి.. మళ్లీ మంచి రోజులొస్తాయి
- ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి

9లో

మద్యం అక్రమ కేసులో ఈడీ విచారణకు హాజరైన ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అన్యాయంగా ఇరికించిన మద్యం అక్రమ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల విచారణకు ఎంపీ మిథున్‌రెడ్డి హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 11 గంటలకు చేరుకున్న మిథున్‌రెడ్డిని ఈడీ అధికారులు సాయంత్రం 6 గంటల వరకు ప్రశ్నించారు. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. విచారణ అనంతరం బయటికి వచ్చిన మిథున్‌రెడ్డితో మాట్లాడించేందుకు మీడియా యత్నించగా.. కేసు గురించి మాట్లాడకూడదని, కోర్టు పరిధిలో ఉన్నందున మాట్లాడలేనని వెల్లడించారు.

గోవిందరావుది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

- ఉన్నతస్థాయి స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని డిమాండ్
- జీవీఎంసీ ఎస్ఈ గోవిందరావుకు వైఎస్సార్‌సీపీ నేతల నివాళి

9లో

ఎస్ఈ గోవిందరావుకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



ఇదండీ సంగతి

ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఓటుకేమీ ప్రమాదం లేదుగా అని అడుగుతున్నార్సార్!!

చంద్రబాబు ప్రత్యేక విమానాల ఖర్చు..

ఏడాదికి రూ.54.63 కోట్లు

3లో

- నాలుగో త్రైమాసిక వ్యయానికి రూ.13.66 కోట్లు విడుదల
- సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ
- గత మూడు త్రైమాసికాల్లో ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల అద్దెకు రూ.40.97 కోట్లు
- మరోవైపు లోకేశ్, పవన్‌కళ్యాణ్ కూడా ప్రత్యేక హెలికాప్టర్లలోనే చక్కర్లు.. వారి లెక్కలు తేలాల్సి ఉంది

నీరు విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం

9లో

కేసీ కెనాల్‌కు తక్షణమే నీరు విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోయారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండల పరిధిలోని మల్యాల ఎత్తిపోతల పథకం ఎదుట శుక్రవారం పెద్ద సంఖ్యలో రైతులు ధర్నాకు దిగారు. రబీలో వేసిన మొక్కజొన్న, కంది, వరి తదితర పంటలు నీరు లేక ఎండిపోతున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తమకు అండగా నిలవకపోతే.. బాబు ప్రభుత్వానికి భవిష్యత్‌లో పుట్టగతులుండవని హెచ్చరించారు.

మల్యాల ఎత్తిపోతల పథకం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

మల్లనహట్టి నుంచి వలస వెళ్తున్న కూలీలు

ఊళ్లకు ఊళ్లు వలసబాట

రాయలసీమలో ఉపాధి కరవై ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతున్నాయి. స్థానికంగా పనులు దొరక్క ప్రజలు సుదూర ప్రాంతాలకు పయనమవుతున్నారు. కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలో కౌతాళం మండలం మల్లనహట్టికి చెందిన 40 కుటుంబాలు శుక్రవారం వలస వెళ్లాయి. కల్లుదేవకుంటలో రెండు వ్యాన్లలో పిల్లల చదువు మాన్పించి మరీ వలస వెళ్తున్న దృశ్యాలు స్థానికులను కలచివేశాయి.

- మంత్రాలయం రూరల్

క్లుప్తంగా...

'జగన్నాథుని జనయాత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించిన వైఎస్ జగన్

చాపాడు(వైఎస్సార్ కడప జిల్లా): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ శుక్రవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో 'జగన్నాథుని జనయాత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర చేసిన విధానం, తీరుతెన్నులు, ప్రజలతో మమేకం, నవరత్నాల రూపకల్పన, అన్ని వర్గాల ప్రజల కోసం రూపొందించిన పథకాలు తదితర వివరాలతో మైదుకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పుస్తకాన్ని రూపొందించారు. కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేతాజీ చూపిన పోరాట మార్గం నేటికీ ఆదర్శనీయం
సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపిన పోరాటమార్గం నేటికీ ఆదర్శనీయమని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. 'స్వాతంత్య్రం ఎవరో ఇచ్చేది కాదు.. పోరాటంతోనే సాధించుకోవాలి అని బలంగా నమ్మి ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించిన స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్. దేశభక్తి, ధైర్యం, పోరాట పటిమ, క్రమశిక్షణే ఆయన జీవన విధానం. నేతాజీ చూపిన పోరాట మార్గం నేటికీ ఆదర్శనీయం. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నాను' అని వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

యువతకు స్ఫూర్తిని అందించిన సైనా

- మీ భవిష్యత్ ప్రయాణం విజయవంతంగా సాగాలి
- మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ రిటైర్‌మెంట్ ప్రకటనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. సైనాకు అభినందనలు తెలియజేస్తూ ఆయన శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'నిజంగా అద్భుతమైన మీ క్రీడా ప్రస్థానానికి హృదయపూర్వక అభినందనలు సైనా. మీరు బ్యాడ్మింటన్ నుంచి రిటైర్ కావాలని తీసుకున్న నిర్ణయం పట్టుదల, క్రమశిక్షణ, అత్యున్నత ప్రతిభకు నిదర్శనంగా నిలిచిన ఒక శకానికి ముగింపు పలికింది. మీరు దేశానికి గర్వకారణంగా నిలిచారు. లక్షలాది మంది యువతకు స్ఫూర్తిని అందించారు. మీ భవిష్యత్ ప్రయాణం విజయవంతంగా, సుఖసంతోషాలతో సాగాలని కోరుకుంటున్నాను' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం తిన్న 30 మంది విద్యార్థులకు అస్వస్థత

- కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిపాలు
- అనంతపురం జిల్లా 43 ఉడేగోళం పాఠశాలలో ఘటన

అస్వస్థతకు గురై కణేకల్లు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కణేకల్లు: అనంతపురం జిల్లా కణేకల్లు మండలం 43 ఉడేగోళం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనం కలుషితమవడంతో 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరు ప్రస్తుతం కణేకల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పాఠశాలలో మొత్తం 129 మంది విద్యార్థులుండగా 116 మంది హాజరయ్యారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఉదయం పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తిన్న కొద్దిసేపటి తరువాత పలువురు విద్యార్థులు కడుపునొప్పితో బాధపడ్డారు. సాయంత్రం నాలుగు గంటలకు స్కూల్ వదిలిన తరువాత ఇళ్లకు వెళ్లారు. అనంతరం కళ్లు తిరగడం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటోల్లో కణేకల్లు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అంజలి, శివానంద, సులోచన, సాయికీర్తన, నాగప్ప, శివప్రియ, మహేశ్వరి, మౌంతేష్, అంకిత్, సురేష్, దశ్వంత్, అమృత, మరో 18 మంది విద్యార్థులు కణేకల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్నవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కె.ఉషారాణి, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి తదితరులు పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఫోన్‌లో వైద్యులతో మాట్లాడి పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

● బంధువుకు భూ పందేరం..

గీతం కబ్జాలకు గిఫ్ట్!

విశాఖలో రూ.5,000 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిని 'గీతం' వర్సిటీకి అడ్డగోలుగా కట్టబెట్టేందుకు బాబు సర్కారు పావులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: రాజు తలుచుకుంటే అడ్డేముంది? చంద్రబాబు బరితెగిస్తే తిరుగేముంది? దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ సాహసించని విధంగా భూ దోపిడీతో తన సొంత కుటుంబ సభ్యులకు చంద్రబాబు ఇస్తున్న అత్యంత ఖరీదైన గిఫ్ట్ ఖరీదు ఏకంగా రూ.5,000 కోట్లు!! విశాఖలో అత్యంత విలువైన రుషికొండ ప్రాంతంలో తన బంధుగణం కబ్జా చేసి ఆక్రమించిన విలువైన ప్రభుత్వ భూమిని దోచిపెట్టేందుకు చంద్రబాబు తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తన బావమరిది అయిన బాలకృష్ణ చిన్న అల్లుడు, తన తనయుడు నారా లోకేశ్ తోడల్లుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు చెందిన గీతం యూనివర్సిటీ కబ్జాలకు పాల్పడి ఆక్రమించుకున్న 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని కానుకగా కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. విశాఖ నడిబొడ్డున ఉన్న అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములను గీతం వర్సిటీకి కట్టబెట్టేందుకు జీవీఎంసీ వేదికగా కుట్రలకు తెర తీశారు. ఈ భూ సంతర్పణకు జీవీఎంసీ చివరి పాలక వర్గ సమావేశాన్ని వేదికగా చేసుకున్నారు. ఈ నెల 30న జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో దీనికి ఆమోద ముద్ర వేసేందుకు అజెండాలో 15వ అంశంగా చేర్చారు. ఎకరం రూ.100 కోట్లు చొప్పున రూ.5 వేల కోట్లకు పైగా విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూములను గీతం సంస్థలకు ధారాదత్తం చేయాలని నిర్ణయించారు. నాడు గీతం యాజమాన్యం ఆక్రమణల చెర నుంచి విడిపించి విలువైన ప్రభుత్వ భూములను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాపాడితే.. ఇప్పుడు చంద్రబాబు సర్కారు వాటిని నజరానాగా తమ బంధువులకు అప్పగించేందుకు సన్నద్ధమైంది. రూ.వేల కోట్ల ఆస్తులకు వారసుడైన ఎంపీ శ్రీభరత్.. ప్రభుత్వ భూములను అప్పనంగా కొట్టేసి తన భూ దాహాన్ని తీర్చుకోవడానికే విశాఖ ఎంపీ అవతారమెత్తారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చివరి సమావేశంలో కుట్రలకు పదును!

బలం లేకపోయినా.. జీవీఎంసీ మేయర్ పీఠాన్ని బలవంతంగా లాక్కొన్న టీడీపీ కౌన్సిల్‌కు ఇదే చివరి సమావేశం కావడం గమనార్హం. ఇదే అదునుగా ప్రభుత్వ పెద్దలు తమ కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూర్చేలా అధికార యంత్రాంగంపై తీవ్ర ఒత్తిళ్లు తెచ్చినట్లు తెలుస్తోంది. సీఎంవో, లోకేశ్ పేషీ నుంచి జీవీఎంసీపై తీవ్ర ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను గీతం వర్సిటీకి ధారాదత్తం చేయాలనే కుట్రలకు పదును పెట్టారు. రూ.5,000 కోట్లకు పైగా విలువైన భూముల్ని చివరి సమావేశంలో నారా లోకేశ్ తోడల్లుడు ఎంపీ శ్రీభరత్‌కు కానుకగా ఇవ్వాలని కౌన్సిల్ భావిస్తోంది.

ఆక్రమిత భూములేనని తేల్చిన 'సిట్..'

1996లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పటి నుంచి తమ సన్నిహితుల భూ ఆక్రమణలను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే 'గీతం' ఆక్రమణల పర్వం మొదలైంది. ఒక్కో గజం తమ చెరలోకి తీసుకుంటూ ప్రభుత్వ భూములకు అక్రమాల కంచె వేసింది. 2014–19 మధ్య చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు కూడా గీతం ఆక్రమణ చెరలో ఉన్న భూములను సదరు వర్సిటీకి ఎలినేషన్ కింద బదలాయించేందుకు సన్నాహాలు చేసినా పాచిక పారలేదు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ.. విశాఖలో భూ కుంభకోణాలపై కొరడా ఝుళిపించింది. కబ్జారాయుళ్ల చెరలో ఒక్క సెంటు కూడా ప్రభుత్వ భూమి ఉండటానికి వీల్లేదని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ క్రమంలో.. గీతం భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు నివేదిక సిద్ధం చేశారు. గీతం ఆక్రమించుకున్న భూమిలో 40.51 ఎకరాలకుపైగా దశలవారీగా స్వాధీనం చేసుకున్నారు. గీతం వర్సిటీ అడ్డగోలుగా ప్రభుత్వ భూములను ఆక్రమించేసి అందులో నిర్మించిన రక్షణగోడ, గార్డెన్, గ్రావెల్ బండ్‌లను తొలగించారు. గీతం యాజమాన్యం కోర్టుని ఆశ్రయించగా స్టేటస్ కో ఇచ్చింది. మిగిలిన 14 ఎకరాలకు పైగా భూమికి సంబంధించి కోర్టులో విచారణ పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వ భూములను ఆక్రమించిన గీతం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ 2016లోనే స్థానికుల నుంచి పలు ఫిర్యాదులు అందాయి. గీతం చెరలో ఉన్న భూములు ఆక్రమించినవేనని నాడు చంద్రబాబు ప్రభుత్వం నియమించిన 'సిట్' కూడా స్పష్టం చేసింది. ఇప్పుడు అవే భూములను గిఫ్ట్‌గా ఇచ్చేందుకు బాబు సర్కారు సన్నద్ధమైంది.

గతంలో గీతం వర్సిటీలో ఆక్రమణలను తొలగించి, ఇది ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సర్కారు భూములపై 'గీతం' లోన్లు.!

ఒకవైపు గీతం ఆక్రమించిన భూములకు అధికారిక ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పటికే గీతం వర్సిటీకి కేటాయించిన ప్రభుత్వ భూములపై లోన్లు తీసుకునేందుకు గతేడాది అనుమతులు మంజూరు చేసింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గీతం కోసం అడ్డగోలు నిర్ణయాన్ని తీసుకుంది. గీతం కోసం గతంలో ఎండాడలోని సర్వే నం. 17/1, 17/28లోని 71.15 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఈ భూములు 22 ఏ జాబితాలో ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిమీద బ్యాంకులో లోన్లు తీసుకునేందుకు అడ్డగోలుగా అనుమతించింది. 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూములను మార్ట్‌గేజ్ చేసి.. బ్యాంకుల నుంచి లోన్లు తెచ్చుకునే విధంగా అనుమతులు జారీ చేశారు. ఇప్పుడు ఆక్రమిత భూములను సైతం కట్టబెడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఎలా కేటాయిస్తారు?

గీతం యాజమాన్యం భూ కబ్జాలపై అప్పటి ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ అది భూముల ఆక్రమణే అని స్పష్టం చేశారు. తాను 'చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్' (సీసీఎల్ఏ) బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో గీతం యూనివర్సిటీకి భూ కేటాయింపులను అడ్డుకున్నట్లు వెల్లడించారు. ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గీతం యాజమాన్యం సుమారు 34 ఎకరాల ప్రభుత్వ భూమిని కోరిందని, దీనిపై రాజకీయ ఒత్తిళ్లు వచ్చినప్పటికీ నిబంధనలకు విరుద్ధమని తాను తిరస్కరించినట్లు పేర్కొన్నారు. గీతం కోరిన ఆ భూమిని ప్రైవేట్ సంస్థకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ విభాగాలైన ఇన్‌కమ్ ట్యాక్స్, కస్టమ్స్, సామాజిక సంక్షేమ శాఖలకు కేటాయిస్తూ 2014 ఫిబ్రవరి 26న సీసీఎల్ఏ నుంచి ప్రొసీడింగ్స్ ఇచ్చామని తెలిపారు. అయితే తాను పదవీ విరమణ చేసిన తర్వాత నాటి ప్రభుత్వం (టీడీపీ సర్కారు) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందని వెల్లడించారు. 2014లో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ని రద్దు చేస్తూ 2017 మే 15న జీవో నం.165 విడుదల చేశారని చెప్పారు. అప్పటికే ఆ ప్రభుత్వ భూములను గీతం విద్యాసంస్థలు ఆక్రమించుకున్నాయన్న ఆరోపణలు వాస్తవమేనంటూ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనప్పుడు దానిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను (కంచె వేయడం, ఆక్రమణల తొలగింపు లాంటివి) ఐవైఆర్ సమర్థించారు. 'ఎవరు కబ్జా చేసినా ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకోవడం సరైన చర్యే' అని స్పష్టం చేశారు.

ఊరు పేరు లేని ఉర్సా కోసం..

విశాఖలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో రూ.వేల కోట్ల విలువైన భూములను చంద్రబాబు ప్రభుత్వం ఊరు పేరు లేని 'ఉర్సా' లాంటి సంస్థలకు బరి తెగించి అప్పనంగా కట్టబెడుతోంది. ఎకరం కేవలం 99 పైసలకే లీజుకు ఇచ్చేస్తూ ప్రభుత్వ ఖజానాకు భారీ గండి కొడుతోంది. ఈ విషయం బహిర్గతం కావడంతో జీవోల జారీ అంశాన్ని పెండింగ్‌లో పెట్టింది.

... of Industries and mortgaging of the alienated lands for borrowing financial institutions wherein in the alienation conditions, general permission was accorded as follows.

"...alienee of the Government land is permitted to mortagage the said Government land in favour of the Financial Institution/ Banks for raising loans for setting up of the industrial units, subject to confirmation of the payment of market value by the Collector."

Therefore, based on the instructions of the CCLA, AP, Vijayawada, the matter is being contested ... Hon'ble High Court in both WP.No.30106 of 202... as well as in CC.No. 3604 of 2024.

బ్యాంకులో లోన్లు తీసుకునేందుకు 'గీతం'కు చంద్రబాబు సర్కారు అడ్డగోలు అనుమతి

REVENUE(ASSIGNMENT-II) DEPARTMENT

G.O.MS.No. 165 Dated: 15-05-2017
Read the following

1.From the Dist. Collector,Visakhapatnam Lr.Rc.No.5285/2005/E2, dt.26.01.2016.
2.From the Spl CS & CCLA Lr.No.Assn.I(2)/B3/123/2010, dt.15.06.2016.

ORDER

Under the circumstances reported by the District Collector, Visakhapatnam and the Special Chief Secretary & Chief Commissioner of Land Administration, A.P., Vijayawada in the references 1st and 2nd read above, Government after careful examination hereby order for cancellation of the Proceedings No.N3/298/2014 of CCLA, A.P., dated.26.02.2014 for alienation of Government lands in favour of certain Government Departments and handing over possession of lands and consequential Proceedings Rc.No.5285/2005/E2, dated.26.02.2014 of the District Collector, Visakhapatnam to handover advance possession of the same lands to the Departments.

2. The Special Chief Secretary & Chief Commissioner of Land Administration, A.P., Vijayawada and the District Collector, Visakhapatnam shall take further necessary action accordingly in the matter.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

ప్రభుత్వ విభాగాలకు భూములు కేటాయించాలంటూ సీసీఎల్ఏ, విశాఖ కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను 15 మే, 2017లో రద్దు చేసిన చంద్రబాబు సర్కారు

To
The Commissioner of Police,
Commissioner's Office,
Visakhapatnam

Date 16.12.2016

Respected Sir,

Sub: Request to take necessary action for illegal Encroachment of Government lands in Rushikonda Village and Yendada Villages in S.No. 15P, 16P, 19P, 20P, 55P, 61P, 34, 35, 37, 38 to an extent of Ac.55.24 Cents and also take necessary action against Gitam's College President Mr. M.V.V.S.Murthy who grabbed the Government lands for his illegal constructions – Regarding.

I, Mr. Achanta Venkata Ramana, S/o. ... Rao, R/o D.No.1-93-1, Plot no. 61, Sector-1, M.V.P.Colony, Visakhapatnam submit few lines for your kind consideration to take necessary action.

One Mr. M.V.V.S Murthy President of Gitam's College illegally grabbed Government lands in S.Nos. 15P,16P,19P,20P,55P,61P,34,35,37,38 in Rushikonda and Yendada Villages for an extent of Ac.55.24 cents and constructed buildings and compound walls without any permissions. The Government authorities Dist.Collector, RDO, Tahsildar and Asst. Director Survey conducted survey on dated 08.10.2015 and issued a report and combined sketch regarding the illegal enchroachment of lands in Yendada and Rushikonda Villages, but till now there is no any action taken against him. So kindly make an enquiry on the above matter by verifying all the records in Mandal Revenue Office, Tahsildar's Office and RDO's Office and register case against him. Earlier in the March, 2016 I have filed a complaint in P.M.Palem Police Station regarding the same matter but no action is taken till now.

గీతం ఆక్రమణలపై 2016లోనే విశాఖ సీపీకి స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు

బడ్డీ కొట్లు తొలగిస్తూ... బడాబాబుకు భూములా?

పొట్ట కూటి కోసం వలస వచ్చి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలను పోలీస్ బలగాలు, పొక్లెయిన్లతో ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా నిర్వాసితులను చేస్తోంది. వీధి వ్యాపారులను కూడా అదే విధంగా తొలగిస్తోంది. మరోవైపు రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న బడాబాబుకి మాత్రం దానం చేస్తోంది. రాష్ట్రంలో పెద్దలకు ఒక న్యాయం, నిస్సహాయులకు ఇంకొక న్యాయం! ప్రభుత్వ పెద్దలు తమ బంధువుకి చెందిన గీతం వర్సిటీ ఆక్రమించిన రూ.వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరణ పేరుతో దానం చేయాలని యత్నించడం అత్యంత దారుణం. ఏ నియమం కింద క్రమబద్ధీకరణకు అనుమతి ఇస్తారు? బీఎస్‌వో–24, రెవిన్యూ శాఖ 2012లో జారీ చేసిన జీవో నం.571 ప్రకారం ప్రభుత్వ భూముల్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వకూడదు. దీనిపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అత్యున్నత న్యాయస్థానాన్ని ధిక్కరించి నిర్ణయాలు ఎందుకు తీసుకుంటోందో రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమిందారీ సంస్థలు కావు. ప్రజాస్వామ్య విధానాలకు, చట్టాలకు లోబడి పని చేయాలి. గీతం వ్యవహారంపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తా.

– ఈఏఎస్ శర్మ
కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

'ల్యాండ్ టైట్లింగ్' ఆదర్శం

▶ మొదటి పేజీ తరువాయి

దీనిపై అన్ని రాష్ట్రాలు దృష్టి సారించాలని ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్) ఎండీ గీతా గోపీనాథ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఇటీవల జరిగిన దావోస్ సదస్సులో భారత ఆర్థిక వ్యవస్థపై ఆమె కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, ఇతర ప్రముఖులతో కలిసి ఒక చర్చాగోష్టిలో మాట్లాడారు. 'భారతదేశంలో చాలా సానుకూల పరిణామాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దేశంలో ఉన్న ఆర్థిక స్థిరత్వం చాలా ముఖ్యమైంది. కేవలం వృద్ధి రేటు మాత్రమే కాకుండా, ద్రవ్యోల్బణం కూడా తక్కువగా సింగిల్ డిజిట్‌లోనే ఉండటం భారత్‌కు కలిసి వచ్చే అంశం' అని గీతా గోపీనాథ్ అన్నారు. అయితే భూసేకరణ, డీ రెగ్యులేషన్ వెనక్కు నెడుతున్నాయని ఆమె గతంలో చెప్పిన విషయాలను వ్యాఖ్యాత ఉటంకించగా, ఆమె స్పందిస్తూ 'భూసేకరణ, సమస్యలు గందరగోళంగా ఉన్నాయనడం కంటే అది చాలా పెద్ద సమస్య అనడం కరెక్ట్. ఇది వృద్ధికి, తయారీ రంగానికి ఒక పెద్ద సవాలు. అయితే భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలు కొత్త పద్ధతులతో ప్రయోగాలు చేస్తున్నాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భూ వినియోగం, భూ సంబంధిత విషయాల్లో సృజనాత్మకమైన పద్ధతులను అనుసరిస్తూ మంచి పనితీరు కనబరుస్తోందని నేను భావిస్తున్నాను. ల్యాండ్ టైట్లింగ్ అంశంపై గట్టిగా ముందుకు వెళ్లడం చాలా ముఖ్యం' అని స్పష్టం చేశారు.

విస్తృత అధ్యయనం తర్వాతే అమలు యత్నం

గీతా గోపీనాథ్ చెప్పిన అంశాలు జగన్ హయాంలో జరిగినవే. ఆమె ఉదహరించిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం వస్తే భూముల వ్యవస్థ సమూలంగా మారిపోతుందని ప్రపంచం మొత్తం నమ్ముతోంది. అందుకే దానిపై విస్తృతమైన అధ్యయనం చేశాక దేశంలోనే తొలిసారిగా వైఎస్ జగన్ దాన్ని ఏపీలో అమలు చేసేందుకు చట్టాన్ని చేశారు. కేంద్రం ఆమోదం కూడా తీసుకున్నాక అమలు చేసేందుకు ప్రయత్నించారు. కానీ చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం ఆ చట్టం వస్తే మీ భూములు పోతాయని, జగన్ ప్రజల భూములన్నీ లాగేసుకుంటాడని ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేశారు. దానిపై దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా.. ఎల్లో మీడియా పత్రికలో ఒక ఫుల్ పేజీ వ్యతిరేక ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఇవ్వడాన్ని బట్టి ఏ స్థాయిలో తప్పుడు ప్రచారం చేశారో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర గతిని మార్చే చట్టాన్ని ఎన్నికల్లో వివాదాస్పదంగా మార్చిన చంద్రబాబు.. ప్రజల్లో లేనిపోని భయాందోళనలు రేకెత్తించారు. అప్పటికి ఆ చట్టం ఇంకా అమల్లోకి రాకపోయినా అది అమలై పోతున్నట్లు, భూములు పోయినట్లు ప్రచారం చేసి తాను అధికారంలోకి వస్తే ఆ చట్టాన్ని రద్దు చేస్తానని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రయోజనాల కంటే తన సొంత ప్రయోజనాలే ప్రధానమని దేశానికే రోల్ మోడల్‌గా మారిన చట్టాన్ని రద్దు చేశారు. అయితే దాంతో ముడిపడి ఉన్న భూముల రీ సర్వేను మాత్రం కొనసాగిస్తూ యూటర్న్ తీసుకున్నారు. ఇప్పుడు అదే రీ సర్వే క్రెడిట్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దావోస్‌లో గీతా గోపీనాథ్ చేసిన వ్యాఖ్యలు జగన్ అమలు చేసిన విప్లవాత్మకమైన భూ సంస్కరణలను మళ్లీ తెరపైకి తెచ్చాయి. చంద్రబాబు అదే దావోస్‌కు వెళ్లి తన పాలన గొప్పగా జరుగుతున్నట్లు ఎన్ని మైకుల్లో ఊదరగొట్టినా ఎవరూ పట్టించుకోలేదు. అయితే వైఎస్ జగన చేసిన మంచి పనులు, భూ సంస్కరణలు అక్కడ చర్చకు వచ్చాయి. దీన్నిబట్టి ఎవరి పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ స్వార్థం కోసం మంచి చట్టాలు, మంచి పనుల్ని చంద్రబాబు రద్దు చేసినా.. వాటి ఫలితం, ప్రభావం ఎలా ఉంటుందో దావోస్ వేదికగా బయట పడింది. చంద్రబాబు కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పొందుదామనుకున్న క్రెడిట్‌ను జగన్.. తన హయాంలో చేసిన మంచి పనుల ద్వారా సాధించడం గమనార్హం.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజల్ని తప్పుదోవ పట్టించారు

మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ డ్రాఫ్ట్‌ను బీజేపీ ప్రభుత్వం తెచ్చిందని చెబుతున్న టీడీపీ నేతలు గతంలో వైఎస్సార్‌సీపీని దూషించారని, ఇప్పుడు అదే చట్టంలో భాగమైన రీసర్వేను ఎలా అమలు చేస్తున్నారని, అంటే టీడీపీ వారంతా దొంగలేనా అంటూ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ టైట్లింగ్ విషయంలో టీడీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఈ చట్టంపై 40 ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయని, అనేక రిపోర్టులూ తెప్పించారని గుర్తు చేశారు. చివరిగా బీజేపీ ప్రభుత్వం నీతి ఆయోగ్‌కి రిఫర్ చేసిందని, ఇవన్నీ అధ్యయనం తరువాత నీతి ఆయోగ్ ఒక డ్రాఫ్ట్ తయారు చేసిందన్నారు. అదే టైట్లింగ్ యాక్ట్ డ్రాఫ్ట్ అని వివరించారు. భూ వ్యవహారాలు రాష్ట్ర ప్రభుత్వ జాబితాలో ఉంటాయని, అందుకే దేశంలోని అన్ని అసెంబ్లీలకు ఈ మేరకు చట్టం చేయాలని పంపించారని వివరించారు. ఈ చట్టం డ్రాఫ్ట్‌ను మోదీ ఆధ్వర్యంలోని కేంద్రమే చేసిందని స్పష్టం చేశారు. చట్టం ఆమోదం పొందినప్పుడు టీడీపీ సభ్యులు కూడా అసెంబ్లీలోనే ఉన్నారని, నాడు ఈ చట్టాన్ని చూడలేదా అని ప్రశ్నించారు. భూములు కొట్టేయడానికి ఈ చట్టం తెచ్చారని ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడుతున్నారని, అంటే మోదీపై కూడా ఆరోపణలు చేసినట్టేనని అన్నారు. పాస్‌బుక్ మీద బొమ్మ ఉంటే భూమి లాగేసుకుంటారు అని ఒక క్యాబినెట్ మంత్రి చెబుతున్నారని, బొమ్మ ఉంటే భూమిని లాగేసుకున్నట్టేనా అని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలోని విజ్ఞులు, న్యాయవాదులు ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. కేంద్రంతో కలిసి ఉన్న టీడీపీ నేతలు అదే కేంద్రం తెచ్చిన చట్టాన్ని ఎలా విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. భూములు కొట్టేయడానికి రాజ్యాంగం అంగీకరిస్తుందా? అని ప్రశ్నించారు.

వందేళ్ల తర్వాత పకడ్బందీగా రీసర్వే

గడిచిన వందేళ్లుగా సర్వే జరగలేదని, వైఎస్ జగన్ హయాంలో తాజాగా జరిగిందని చెప్పడానికే బొమ్మలు వేశామని వివరించారు. ఎంతో కీలకమైన సర్వేను నిర్వహించడానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నామని, పటిష్టంగా, పకడ్బందీగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సర్వేచేయించామని చెప్పారు. టైటిలింగ్ యాక్ట్‌కు సంబంధించి తాజాగా వైఎస్ జగన్ కూడా ఓ కార్యక్రమంలో చక్కగా వివరించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో తాము తెచ్చిన విప్లవాత్మక మార్పులు మ్యుటేషన్, ల్యాండ్ పార్సిల్ మ్యాప్ ఉంటేనే రిజిస్ట్రేషన్‌కు అనుమతి, స్మార్ట్ విధానంలో డిజిటల్ రిజిస్ట్రేషన్‌తో పాటు గ్రామస్థాయిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వంటి వాటిని ఇప్పటికీ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం అవన్నీ తమ ఘనతలేనని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

మేం చెప్పిందే చేయాలి

అధికారులకు ఎస్.కోట టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హుకుం

టీడీపీ ఎమ్మెల్యే లలితకుమారికి వివరణ ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న తహసీల్దార్ రమేష్

లక్కవరపుకోట : తాము చెప్పిందే అధికారులు చేయాలంటూ విజయనగరం జిల్లా ఎస్.కోట టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పార్టీ శ్రేణులతో కలిసి లక్కవరపుకోట తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నాకు దిగారు. కోర్టులో ఉన్నదైనా సరే తనకు తెలియకుండా తమపార్టీ నాయకుల భూమిని వివాదాస్పద భూమి జాబితాలోకి ఎందుకు మార్చారంటూ రెవెన్యూ సిబ్బందిపై ఊగిపోయారు. లక్కవరపుకోట రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 422–5లో 0.67 సెంట్లు, 422–6లో 0.70 సెంట్ల మెట్టభూమికి సంబంధించి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావుకు, ఎం.జయశ్రీకి మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. ఆ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం రూ.3 కోట్ల వరకు పలుకుతుంది. ఈ భూమికి సంబంధించి ఈశ్వరరావు పేరుపై వన్‌బీ నమోదై ఉంది. ఈ విషయమై జయశ్రీ ఆర్డీవో కోర్టును ఆశ్రయించారు. ఆర్డీవో ఆదేశాలతో దీనిపై విచారించిన తహసీల్దార్ గత డిసెంబర్ 12న ఆర్డీవోకి నివేదిక ఇచ్చారు. అదే నెల 15న జేసీ ఆ భూమిని వివాదాస్పద భూమి జాబితాలో చేర్చారు. ఈ విషయాన్ని ఈశ్వరరావు టీడీపీ ఎమ్మెల్యే లలితకుమారికి చెప్పారు. ఆమె టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టెంట్‌వేసి ధర్నాకు దిగారు. ఆ భూమిని వివాదాస్పద భూముల జాబితా నుంచి తొలగించేవరకు ధర్నా విరమించేది లేదని చెప్పారు. ప్రస్తుతం అదనపు బాధ్యత వహిస్తున్న తహసీల్దార్ టి.రమేష్ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించినా వినిపించుకోలేదు. మీరు మాకు చెప్పకుండా పనులు చేసేస్తున్నారంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఈ భూమి వివాదం కోర్టులో ఉండటంతో జేసీ డిస్ప్యూట్ భూముల జాబితాలో చేర్చారని తహసీల్దార్ చెప్పినా ఎమ్మెల్యే పట్టించుకోలేదు.

చంద్రబాబు ప్రత్యేక విమానాల ఖర్చు...

ఏడాదికి రూ.54.63 కోట్లు

నాలుగో త్రైమాసిక వ్యయానికి రూ.13.66 కోట్లు విడుదల	సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ	గత మూడు త్రైమాసికాల్లో ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల అద్దెకు రూ.40.97 కోట్లు

సాక్షి, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో ముఖ్యమంత్రి చంద్రబాబు వినియోగిస్తున్న ప్రత్యేక హెలికాప్టర్, విమానాల అద్దె ఖర్చు రూ.54.63 కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో సీఎం చంద్రబాబు (వీవీఐపీ) వినియోగించిన ప్రత్యేక హెలికాప్టర్లు, విమానాల అద్దె చెల్లించేందుకు రూ.13,65,75,000 విడుదల చేస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి (రాజకీయ) జె.శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నాలుగు త్రైమాసికాలకు కలిపి ప్రత్యేక హెలికాప్టర్లు, విమానాల అద్దెకు రూ.54.63 కోట్లు అయినట్లు ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఇప్పటికే మూడు త్రైమాసికాలకు ప్రత్యేక హెలికాప్టర్లు, విమానాల అద్దె చెల్లింపునకు రూ.40.97 కోట్లను విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఏ జిల్లాకు వెళ్లినా ప్రత్యేక హెలికాప్టర్‌తో పాటు ప్రత్యేక విమానం వినియోగిస్తున్న విషయం తెలిసిందే. అలాగే ఆయన తరచూ ప్రత్యేక విమానంలో హైదరాబాద్, విజయవాడ మధ్య ప్రయాణం చేస్తున్నారు. దేశంలో ఎక్కడికి వెళ్లినా సీఎం చంద్రబాబు ప్రత్యేక విమానాలను వినియోగిస్తున్నారు. అందువల్లే ఏడాదిలోనే రూ.54.63 కోట్లు అద్దెల రూపంలో చెల్లించాల్సి వచ్చిందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

2025-26 ఆర్థిక సంవత్సరంలో చంద్రబాబు ప్రత్యేక హెలికాప్టర్, విమానాల అద్దె వ్యయం ఇలా..

తొలి త్రైమాసికం రూ.19,12,05,000	రెండో త్రైమాసికం రూ.10,92,60,000
మూడో త్రైమాసికం రూ.10,92,60,000	నాలుగో త్రైమాసికం రూ.13,65,75,000

పవన్, లోకేశ్ ప్రత్యేక విమానాల ఖర్చు ఎంతో?

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఎక్కడికి వెళ్లినా ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లనే వినియోగిస్తున్నారు. వీరు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల పర్యటనలకు, తరచూ హైదరాబాద్‌కు ప్రత్యేక హెలికాప్టర్లు, విమానాల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. అయినా పవన్‌కళ్యాణ్, లోకేశ్ తిరుగుతున్న ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్ల అద్దెల వ్యయం గురించి ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం. వీరిద్దరి ప్రత్యేక హెలికాప్టర్లు, విమానాల అద్దెలకు ఎంత ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారనే విషయం చర్చనీయాంశంగా మారింది.

రాయితీల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు వెల్లడి

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 100 శాతం రాయితీల విడుదల అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి.. పరిష్కరిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల జేఏసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అందువల్ల తమ ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు వెల్లడించింది. ప్రోత్సాహకాల విడుదలలో ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న అన్యాయాన్ని జేఏసీ నాయకులు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు మంత్రి కొండపల్లి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ.. 100 శాతం రాయితీ నిధుల విడుదలకు కృషి చేస్తానని చెప్పారు. ఈ నెల 28న పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించి.. ఆ తర్వాత సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో ఈ నెలాఖరు వరకు ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. సానుకూల స్పందన రాకపోతే.. తిరిగి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

బాబు పాలనలో రైతులకు అన్ని విధాలుగా నష్టమే

ఏపీ కౌలు రైతుల సంఘం

సాక్షి, అమరావతి: చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు అన్ని విధాలుగా నష్టమే జరిగిందని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు సుభిక్షంగా ఉన్నారంటూ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. కౌలు రైతుల కోసం నూతన చట్టం తెస్తామని, గుర్తింపు కార్డులు ఇస్తామంటూ ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయకుండా చేతులెత్తేశారని మండిపడ్డారు. ఒక్క కౌలు రైతుకు కూడా 'అన్నదాత సుఖీభవ' కింద పైసా సాయం చేయలేదని దుయ్యబట్టారు. గతేడాది ధరలు లేక, కొనేవారు లేక మిర్చి రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

డ్వాక్రా గ్రూపు ఖాతాలపై చార్జీలు తగ్గించాలి

- 233, 234వ ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- గోదావరి పుష్కరాల నిర్వహణపైనా సమీక్ష



సాక్షి, అమరావతి: డ్వాక్రా గ్రూపు బ్యాంకు ఖాతాలపై బ్యాంకర్లు విధిస్తున్న 15 రకాల చార్జీలను తగ్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసినట్లుగానే ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లనూ బలోపేతం చేయాలని ఆయన బ్యాంకర్లకు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన 233, 234వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని రంగాలు అభివృద్ధి బాట పట్టాలంటే ఎంఎస్‌ఎంఈలను ఎక్కువగా ప్రోత్సహించాలని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇచ్చి పెద్దఎత్తున రుణాలివ్వాలన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పరిశ్రమలు ప్రారంభించే వారికి వివిధ బ్యాంకుల నుంచి మద్దతు ఇస్తున్నట్లు పలువురు బ్యాంకర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ విజయానంద్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలు

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను కుంభమేళాను తలపించేలా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కర ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, అధికారులతో శుక్రవారం సమీక్షించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు మొత్తం 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేయాలని సీఎం ఆదేశించారు. పుష్కర స్నానం ఆచరించేందుకు సుమారు 10 కోట్ల మంది భక్తులు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. గోదావరి ప్రవహించే 212 కిలోమీటర్ల పొడవునా 373 ఘాట్లు ఏర్పాటుచేసి, 9,918 మీటర్ల పొడవున అభివృద్ధి చేసేలా ప్రణాళికలకు రూపకల్పన చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మహా కుంభమేళాలో వినియోగించినట్లే ఏఐ బేస్డ్ టెక్నాలజీని గోదావరి పుష్కరాలకు అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు.

చెవిరెడ్డికి మంతెన ఆశ్రమంలో చికిత్సకు కోర్టు అనుమతి

విజయవాడ లీగల్: చంద్రబాబు ప్రభుత్వం అన్యాయంగా ఇరికించిన అక్రమ మద్యం కేసులో 220 రోజులుగా జైలు జీవితం గడుపుతున్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఏసీబీ కోర్టు ఊరట కల్పించింది. కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతున్న తాను గతంలో మంతెన ఆశ్రమంలో చికిత్స తీసుకోవడం వల్ల తగ్గిందని, అదే ఆశ్రమంలో చికిత్స తీసుకునేందుకు అనుమతించాలని కోరుతూ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి భాస్కర్‌రావు మంతెన ఆశ్రమంలో 15 రోజుల పాటు చికిత్స పొందేందుకు చెవిరెడ్డికి అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆశ్రమంలో చికిత్స తీసుకునే అవకాశం కల్పించారు.

చంద్రబాబు, లోకేశ్ పదవులు తప్ప

అన్నీ పీపీపీనే



సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, లోకేశ్ వారి పదవులు తప్ప అన్నీ పీపీపీ అంటూ ప్రైవేటుపరం చేస్తున్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీ.వి.రాఘవులు ధ్వజమెత్తారు. ప్రైవేటీకరణ కంటే పీపీపీ అత్యంత ప్రమాదకరమైందన్నారు. రాష్ట్రాన్ని గంపగుత్తగా ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు పీపీపీ జపం చేస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిధులతో ప్రైవేటు వ్యక్తులకు లాభాలు కట్టబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. పెట్టుబడుల పేరుతో చంద్రబాబు అధికారంలో ఉన్నన్నాళ్లు దావోస్ తీర్థయాత్రలకు వెళుతూనే ఉన్నారని, కనీసం విమాన చార్జీల ఖర్చులంత పెట్టుబడులు కూడా రావడం లేదని చెప్పారు. దావోస్‌లో ఎంవోయులన్నీ రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమేనన్నారు. నిజంగా రూ.20 లక్షలకోట్ల పెట్టుబడులు వచ్చి ఉంటే రాష్ట్రం ఏడోస్థానంలో ఎందుకుందో చెప్పాలన్నారు. కాగా, మోదీ ప్రభుత్వం తీసుకొస్తున్న వీబీజీరాంజీ, విద్యుత్‌చట్టాల సవరణ, లేబర్‌కోడ్‌లు, మినీ అణువిద్యుత్ ప్లాంటు బిల్లులను వ్యతిరేకిస్తూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ప్రచారం చేసి 5న అన్ని మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తామని రాఘవులు చెప్పారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సాక్షి, అమరావతి: దూర విద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 31లోగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 2026 నుంచి ప్రారంభం కానున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొందాలనుకునే వారు రూ.1,500 ఫీజు చెల్లించి ఫిబ్రవరి 7లోగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలు www.angrau.ac.in లో, 90632 19959, 80960 85560కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

వనమునందు తపములోనున్న మునీశ్వరునికి సైతం
మిత్రులు, శత్రువులు, ఉదాసీనులు సంభవించెదరు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 24 జనవరి 2026

ఈ మండలి శాంతికేనా?!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు తన మనోభీష్టాన్ని నెరవేర్చుకున్నారు. గాజాలో 'శాంతి నెలకొల్పడమే' లక్ష్యంగా 19 సభ్యదేశాలతో 'శాంతిమండలి' ఏర్పాటైనట్టు గురువారం ప్రకటించారు. అర్జెంటీనా మొదలుకొని వియత్నాం, పాకిస్తాన్ వరకూ పోటీ పడి ఇందులో సభ్యత్వం తీసుకోగా, ఈ అర్థరహిత విన్యాసానికి మన దేశం దూరంగా ఉండి మంచి పని చేసింది. అమెరికా చిరకాల సన్నిహిత దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్, నార్వే, స్వీడన్, స్లొవేనియాలు ఇందులో చేరబోమని ప్రకటిస్తే, మనతోపాటు రష్యా, చైనా, జర్మనీ, యూరోపియన్ యూనియన్(ఈయూ), సింగపూర్ వగైరాలు తటస్థంగా ఉండి పోయాయి. అమెరికా ప్రత్యక్ష, పరోక్ష సహాయ సహకారాలతో రెండేళ్లపాటు గాజాలో నరమేధం సాగించిన ఇజ్రాయెల్ సైతం 'తగుదునమ్మా' అంటూ ఇందులో చేరటం కొసమెరుపు. 'నాకు నోబెల్ శాంతి బహుమతి రాలేదు గనుక, ఇకపై శాంతి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు' అని ప్రకటించిన ట్రంప్, వారం తిరిగేసరికల్లా అంతర్జాతీయ శాంతిదూత అవతారం ఎత్తడం ఒక వైచిత్రి.

భద్రతామండలి తన 70 ఏళ్ల చరిత్రకు కళంకం తెచ్చుకునే విధంగా గత నవంబర్‌లో గాజా శాంతికి అగ్రరాజ్యాలు చొరవచూపాలని కోరుతూ ఆమోదించిన తీర్మానాన్ని అడ్డుపెట్టుకుని ట్రంప్ ఈ చర్యకు సాహసించారు. రష్యా, చైనాలు వీటో చేసివుంటే ఆ తీర్మానానికి ఆమోదముద్ర పడేదికాదు. కానీ గైర్హాజరుతో సరిపెట్టి ఈ వైపరీత్యానికి వారూ తోడ్పడ్డారు. దురాక్రమణలు, నరమేధాలు, ఊచకోతలు, సైనిక కుట్రలు తదితరాలను ఎదుర్కొనటానికి అంతర్జాతీయంగా ఆమోదించిన అనేక చట్టాలున్నాయి. వాటిల్లో ఏ చట్టాలు విఫలమైనాయని, ఎలాంటి ప్రయత్నాలు చేసిందని నవంబర్ తీర్మానాన్ని ఆమోదించాల్సి వచ్చిందో భద్రతామండలి చెప్పాలి. గాజాలో అకారణంగా, అన్యాయంగా వేలాదిమందిని హతమారుస్తుంటే, విధ్వంసకాండను కొనసాగిస్తుంటే కంటితుడుపు ప్రకటనలు చేయటం మినహా, ఆ సంస్థ పక్షాన జరిగిన యత్నాలేమీ లేవు. కానీ అకృత్యాలకు పాల్పడినవారికే దాన్ని ఉద్ధరించేందుకు లైసెన్సునిచ్చింది. ఈ 'శాంతిమండలి' అమెరికా కోసం కాదు... ఏకంగా ప్రపంచ ఉద్ధరణకేనని దావోస్‌లో ట్రంప్ ఘనంగా ప్రకటించుకున్నారు. గాజాలో శాంతి నెలకొల్పగానే అది ప్రపంచంలోని ఇతర ఘర్షణలపై దృష్టిసారిస్తుందని కూడా ఆయన చెబుతున్నారు.

ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి ఎంతగా విఫలమైనా, వాటికి ఉజ్వలమైన చరిత్ర ఉంది. రెండో ప్రపంచయుద్ధం మానవాళికి తెచ్చిపెట్టిన లాంటి ఉత్పాతం భవిష్యత్తులో ఎన్నడూ సంభవించనీయబోమని వాగ్దానం చేస్తూ అవి ఆవిర్భవించాయి. కానీ ఇప్పుడు పుట్టుకొచ్చిన 'శాంతిమండలి' ట్రంప్ అల్లుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి జేర్డ్ కుష్నెర్ మానసపుత్రిక. 3,000 కోట్ల డాలర్ల వ్యయంతో గాజా సాగరతీరాన కళ్లు చెదిరే భవంతులు, రిక్రియేషన్ క్లబ్‌లు, క్యాసినోలు నిర్మించాలని ఆయనగారి తపన. తరతరాలుగా పేదరికంలో మగ్గిన పాలస్తీనియన్లు ఈ అభివృద్ధి చూసి మూర్ఛపోతారని ట్రంప్ చెబుతున్నారు. శాంతిమండలిలో చేరిన నెతన్యాహూ అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో యుద్ధనేరారోపణలు ఎదుర్కొంటున్నారు. స్విట్జర్లాండ్‌లో అడుగుపెడితే అరెస్టవుతానని తెలిసి ఈ సంబరానికి దూరంగా ఉండిపోయారు. నిర్మానుష్యమైన తూర్పు జెరూసలేంలోని ఐక్యరాజ్యసమితి సహాయసంస్థ భవనాన్ని బుల్‌డోజర్లతో నేలమట్టం చేయించిన మర్నాడే ఆయన 'శాంతిమండలి'లో చేరటం గమనార్హం.

ఇంతవరకూ ట్రంప్‌కు అంటిన మరకలు ఇకపై శాంతిమండలి సభ్యులకూ తప్పవు. వెనిజులాపై సైనిక దాడి చేసి ఆ దేశాధ్యక్షుణ్ణి అపహరించటం, అక్కడి ముడిచమురుపై తమ ఆధిపత్యాన్ని ప్రకటించుకోవటం, గ్రీన్‌ల్యాండ్‌ను కాజేయాలని ఆత్రపడటం, మాట వినని దేశాలపై భారీ సుంకాలు విధించటం, ప్రపంచం నలుమూలలా సైనిక స్థావరాల ఏర్పాటు యత్నాలు వంటి ట్రంప్ అనాలోచిత చర్యలకూ, ఆయన బెదిరింపు ధోరణులకూ ఇకపై ఈ మండలి సైతం సంజాయిషీ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. సమితికి సంబంధించిన కర్తవ్యాలు శాంతిమండలి స్వీకరిస్తుందని ట్రంప్ చెప్పటంతోపాటు భవిష్యత్తులో సమితికి కాలం చెల్లుతుందనటాన్ని గమనిస్తే ఇదంతా చివరకు ఎటుపోతుందో... ఏమవుతుందో సులభంగానే గ్రహించవచ్చు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.11.01 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ప.1.20 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.12.46 నుండి 2.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.38 నుండి 8.08 వరకు, **అమృత ఘడియలు:** ఉ.8.40 నుండి 10.11 వరకు

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.47
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

క్లాసిక్

బాక్సాఫీస్ వద్ద విఫలమైన సినిమాలు తీసినందుకు నేను చింతించను. సాధారణ జీవితానికి దూరంగా ఒక క్లాసిక్ సినిమా చేయాలని మీకు కోరికగా ఉన్నప్పుడు, ఆ కోరికను తీర్చుకోవటానికి మీరు ఆ మాత్రం రిస్క్ తీసుకోవలసిందే! అదేమీ పతనం కాదు.

– సుభాష్ ఘయ్, చిత్ర దర్శకుడు

అక్కర్లేదు

మొండిగా ప్రయత్నించండి. నిర్భయంగా ఉండండి. విజయం సాధించటానికి డిగ్రీ, కుటుంబ నేపథ్యం, మంచి ఇంగ్లిష్ ... ఇవేమీ అక్కర్లేదు. కలల్ని నిజం చేసుకోవటానికి మీరు పట్టు వదలకపోవటమే మిమ్మల్ని విలువైన వ్యక్తిగా మారుస్తుంది.

– అనిల్ అగర్వాల్, పారిశ్రామికవేత్త

కిటికీ

'అవకాశాల కిటికీ' ఎప్పుడు మూసుకుపోతుందో గుర్తించండి. మారుతున్న ప్రపంచంలో స్తబ్ధత అతి పెద్ద ప్రమాదం కనుక, చురుగ్గా ఉండండి. విజయం ఖాయమని ముందే అనుకోకండి. ప్రతి అడుగునూ విజయం వైపే వేయండి. అంతా నిశ్శబ్దంగా జరిగిపోవాలి. – విజయ్ కేశవ్ గోఖలే, మాజీ విదేశాంగ కార్యదర్శి

ఒకేసారి

నా 20-30 ఏళ్ల వయసులో నేను పనిలో మునిగిపోయి, రెండో పని గురించి ఆలోచించకుండా పొరపాటు చేశాను. మీ కెరీర్‌లో మీరెంత సంపాదిస్తూ, సంతృప్తిగా ఉన్నా రెండో ఏర్పాటైతే ఎప్పుడూ ఉండాలి. అయితే ఒకదాని తర్వాత ఒకటి కాదు. రెండూ ఏకకాలంలో!

– పీయూష్ గుప్తా, బ్యాంకర్

అవసరం

నేనొక చిన్న తాబేలుని. కుటుంబ జీవితం నుండి బయటికి అడుగుపెట్టకుండానే, నేను విజయం సాధించాలని నా ఆశ. విజయానికి ఏది అవసరమో అది నేను చేయటం కాదు, నాకు అవసరమైనది ఏదీ వదులుకోకుండానే నేను విజయం సాధించాలి.

– రేఖా భరద్వాజ్, గాయని

లీగ్

వైఫల్యం అంటే ముగిసిపోయినట్లు కాదు. టోర్నమెంట్‌లో ఒకసారి ఓడిపోతే మీరు ఔట్ అయినట్లే! కానీ జీవితం లీగ్ లాంటిది. మీరు ఎల్లప్పుడూ తిరిగి పుంజుకోవటానికి, మిమ్మల్ని మెరుగుపరుచుకోవటానికి అవకాశాలు పొందుతూనే ఉంటారు.

– ఆంథోనీ అమల్‌రాజ్, టెన్నిస్ ఆటగాడు

కమ్యూనిస్టు కూటమికి ఎదురుగాలి

అభిప్రాయం

దిలీప్ రెడ్డి

కమ్యూనిస్టు సంకీర్ణ సర్కారుకు కేరళలో కష్టాలు మొదలయ్యాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వారిది నల్లేరు మీద బండి నడక కాదని ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో ఇప్పుడు వీస్తున్న గాలి సంకేతాలిస్తోంది. దళిత రిజర్వు నియోజక వర్గాల్లో ఓటర్లంతా దళితులే ఉండరు. కానీ, గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్ష ఫ్రంట్ (ఎల్డీఎఫ్)కు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో లభించిన మద్దతు అటువంటిది. అసెంబ్లీకి మరో మూడు నెలల్లోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇదీ పరిస్థితి. మరోవైపు ఎన్డీయే కూటమి ఉనికి పెంచుకుంటుంటే, కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రత్యర్థి కూటమి 'యూడీఎఫ్' బలపడుతోంది.

దేశంలోనే ఏకైక కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కేరళలో నడుపుతున్న వామపక్ష ప్రజాస్వామ్య కూటమి (ఎల్డీఎఫ్) పదేళ్ల పాలన తర్వాత ఎదురీదుతోంది. ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు సైద్ధాంతిక మందగింపు, కులాల కుమ్ములాటలు కూటమిని బలహీనపరుస్తున్నాయి. ముఖ్యంగా రిజర్వుడు స్థానాల్లో వివిధ ప్రభావాల వల్ల ఎల్డీఎఫ్ బలహీనపడ్డ తీరు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాల్లో పతనం తర్వాత దేశంలో మిగిలిన ఏకైక కమ్యూనిస్టు (కూటమి) ప్రభుత్వం ఇక్కడుంది. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో గెలుపు వరించాలంటే 71 స్థానాల మేజిక్ ఫిగర్ చేరుకోవాలి. 16 రిజర్వుడ్ (పద్నాలుగు ఎస్సీ, రెండు ఎస్టీ) స్థానాలపై పట్టు కీలకం! 2011, 2016, 2021 మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ 14లో 12 ఎస్సీ స్థానాల్లో ఎల్డీఎఫ్ విజయ పరంపర కొనసాగించింది. ఇతర స్థానాల్లోనూ ఎల్డీఎఫ్ దళితుల మద్దతు అపారంగా పొందుతూ వచ్చింది. కార్మికోద్యమాలు, బడుగుల సంక్షేమం, పింఛన్లు, రిజర్వేషన్లు వంటి అంశాల్లో కమ్యూనిస్టుల సహజ సైద్ధాంతిక బలం, వ్యవస్థీకృత నిర్వహణ వంటివి దళితుల మద్దతు కూడగట్టడంలో కూటమికి కలిసి వచ్చిన అంశాలు. కానీ, ఇప్పుడా మద్దతు సన్నగిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో... ఎన్నికలకు సంబంధించి కేరళలో 'పీపుల్స్ పల్స్' సర్వే ప్రారంభించింది.

వేగంగా మార్పులు

కేరళ అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికల్లో మూడు ముఖ్య కూటముల గెలుపోటములను ప్రధానంగా మూడంశాలు ప్రభావితం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. కమ్యూనిస్టు మూస విధానాలను వ్యతిరేకిస్తూ ఆశావహంగా పెరిగిన నగర–పట్టణ ఓటర్ ఆకాంక్షలు; కులాల కుంపట్లతో, విభిన్న సామాజిక వాదాలతో వచ్చిన చీలికల్లో 'ఎల్డీఎఫ్ ఓటు బ్యాంకులు' బలహీనపడటం; కొత్త ప్రాంతాలకు విస్తరిస్తూ బీజేపీ, తిరిగి పుంజుకుంటూ, యూడీఎఫ్ కిందటి అసెంబ్లీ ఎన్నికల నుంచి బలపడుతూ రావటం... ఈ మూడంశాలు 'ఓటు రాజకీయాల్ని' ప్రభావితం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. అక్కడక్కడ బీజేపీ ఎదుగుదల నేరుగా సొంతానికైనా లాభించవచ్చు, లేదా ఓటు బ్యాంకు చీలికల వల్ల పరోక్షంగా యూడీఎఫ్‌కైనా మేలు చేయ వచ్చన్న వాదన వినిపిస్తోంది. స్థానిక ఎన్నికల్లో తిరువనంతపురం కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకోవడం, అంతకు ముందరి అసెంబ్లీ ఎన్నికల (2021) ఫలితాలకు భిన్నంగా పలుచోట్ల యూడీఎఫ్ కొత్తగా బలపడటం ఇందుకు నిదర్శనం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే వాతావరణం కొనసాగితే.... నికరంగా నష్టపోయేది ఎల్డీఎఫ్ అనడంలో సందేహమే లేదు.

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

గతంతో పోల్చి చూస్తే దేశవ్యాప్త రాజకీయ పరిణామాల ప్రభావం కేరళ రాజకీయాలపైన ఇప్పుడు అధికంగా కనిపిస్తోంది. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గెలిచి రాజీనామా చేయడం, ఫలితంగా జరిగిన ఉప ఎన్నికలో ఆయన సోదరి, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ గెలవడం ఓ పెద్ద పరిణామమే! పార్టీ మరో ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర నాయకుడు కె.సి. వేణుగోపాల్‌కు ఏఐసీసీలో ప్రాధాన్యం పెరగటం వంటివి కేరళ రాజకీయాల్ని నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఒక లోక్‌సభ స్థానాన్ని గెలవటం, మరుసటి యేడు (2025) జరిగిన స్థానిక ఎన్నికల్లో తిరువనంతపురం కార్పొరేషన్‌ను కైవసం చేసుకోవడం బీజేపీకి కలిసివచ్చిన అంశాలే! లోక్‌సభ ఎన్నికల్లో 11 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి ఆధిక్యత లభించగా అందులో 2 ఎస్సీ రిజర్వుడు స్థానాలున్నాయి. పరిమిత వర్గాల్లోనే అయినా దళితుల్లో బీజేపీ బలపడటం సీపీఎంకు ఆందోళన కలిగిస్తున్న అంశం.

చీలిక విసిరిన సవాల్

దళిత ఉప కులాల్లో వచ్చిన చీలికలు అటు యూడీఎఫ్‌కు, ఇటు ఎన్డీయేకు ఎంతో కొంత మేలు చేస్తున్నాయి. ఫలితంగా రిజర్వుడు స్థానాల్లో రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. మొత్తం కేరళలో ఎస్సీల జనాభా 9 శాతం. దళితుల్లో ప్రధానంగా ఉన్న పులియలకు తోడు పరయ, కురవ, కనక్కన్, తండన్ వంటి ఉప కులాలున్నాయి. రెండు ఎస్టీ రిజర్వు స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తూ వస్తున్నా, 14 ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో 12 చోట్ల ఎల్డీఎఫ్ వరుస ఎన్నికల్లో గెలుస్తూ వస్తోంది. మిగిలిన రెండు స్థానాల్లో ఒకటి కాంగ్రెస్ చేతిలో ఉంటే మరొక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. రాబోయే ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో యూడీఎఫ్ ఆధిక్యత 3–6 స్థానాలకు పెరిగితే, ఎల్డీఎఫ్ పట్టు 10–7 స్థానాలకు పరిమితం కావచ్చనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

దళితుల్లో అధిక సంఖ్యాకులైన పులియ సామాజికవర్గం పైన కమ్యూనిస్టులకు గట్టి పట్టుంది. ఎస్సీల్లోని ఇతర ఉపకులాలు సహజంగానే దాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకున్న ఎస్సీ వర్గీకరణ అంశం కూడా ఎస్సీల్లో కుల వివాదాలకు, వైషమ్యాలకు, తద్వారా చీలికకు హేతువవుతోంది. అది కూడా పరోక్షంగా కమ్యూనిస్టులు దళితుల్లో పట్టు కోల్పోవడానికి కారణంగా నిలుస్తోంది. పార్టీ సైద్ధాంతికంగా మందగిల్లడం, ఇతరేతర కారణాల వల్ల పులియ వర్గంలోనూ కమ్యూనిస్టులకు కొంత పట్టు సడలింది. కురవ సామాజికవర్గ మద్దతు పరంగా ఎల్డీఎఫ్‌కు గట్టి పట్టున్న దక్షిణాది జిల్లాలు కొల్లం, పత్తనంతిట్టలలోనూ కులాల్లో వచ్చిన చీలిక వారిని బలహీనపరిచింది.

ప్రజానాడి సంకేతాలే కీలకం

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ స్థానిక స్వపరిపాలనను పటిష్ఠపరచుకున్న కేరళలో గత స్థానిక ఎన్నికలు జనం మనోగతాన్ని కొంతమేర వెల్లడి చేశాయి. అలా చూస్తే 2021 అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పునకు భిన్నమైన ఫలితాలు 2025 స్థానిక ఎన్నికల్లో వచ్చాయి. అవి యూడీఎఫ్, ఎన్డీయేకు కొంత ఆశావహంగానే ఉన్నాయి. వరుస రాజకీయ పరిణామాల్లో వచ్చిన మార్పు, దళిత ఉప కులాల్లో వచ్చిన చీలిక పాలక ఎల్డీఎఫ్ వ్యతిరేక వాతావరణాన్నే స్పష్టం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకున్న దాదాపు మూడు మాసాల వ్యవధిలో పరిస్థితులు ఇంకా ఎలా మారనున్నాయో వేచి చూడాల్సిందే!

వ్యాసకర్త పొలిటికల్ ఎనలిస్ట్,
పీపుల్స్ పల్స్ రిసెర్చ్ సంస్థ డైరెక్టర్

యథా లీడర్ తథా టీమ్

వ్యూ పాయింట్:

పాడ్‌కాస్ట్:
థింక్‌రైట్

అతిథి:
బి.కె. శివానీ,
ఆధ్యాత్మిక గురువు :

చంద్రజిత్ బెనర్జీ,
కాన్ఫెడరేషన్ ఆఫ్
ఇండియన్ ఇండస్ట్రీ
(సి.ఐ.ఐ.) డైరెక్టర్
జనరల్

హోస్ట్:
రాజన్ నవానీ,
'థింక్‌రైట్' ఫౌండర్
'జెట్‌సింథెసిస్' ఎండీ,
వైస్–చైర్మన్

'అధిక ఒత్తిడిలో శక్తిని పుంజుకొని విధులను నిర్వహించటం ఎలా?' (సింపుల్ స్టెప్స్ టు బి మెంటల్లీ ఎనర్జైజ్డ్) అనే అంశంపై ఆధ్యాత్మిక గురువు బి.కె.శివానీ, సి.ఐ.ఐ. డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీలతో 'థింక్‌రైట్' పాడ్‌కాస్ట్ హోస్ట్ రాజన్ నవానీ సంభాషించారు. మన శక్తి సామర్థ్యాలు బయటి పరిస్థితులను బట్టి కాకుండా, మన ఆలోచనల నాణ్యతపై ఆధారపడి ఉంటాయని శివానీ చెప్పగా; కార్పొరేట్ నాయకత్వ శైలిలో వస్తున్న మార్పుల గురించి, మానసిక శక్తిని హరించే అంతస్సంఘర్షణ నుంచి ఎలా బయటపడాలనే దాని గురించి చంద్రజిత్ బెనర్జీ మాట్లాడారు. ఆయన వైపు నుంచి తీసుకున్న ముఖ్యాంశాలివి:

ఒత్తిడికి... వ్యాపించే గుణం ఉంది!

''కార్పొరేట్ ప్రపంచాన్ని గమనిస్తే, క్రమేణా మనం పాత కాలపు వ్యావహారిక నిర్వహణ శైలుల నుండి బయటకు వస్తున్నామని నాకు అర్థమైంది. మనం ఇప్పుడు 'కాన్షియస్ లీడర్‌షిప్' (ఎరుకతో కూడిన నాయకత్వం) యుగంలోకి అడుగుపెడుతున్నామని నేను నమ్ముతున్నాను. ఒక లీడర్‌గా నా ధోరణి కేవలం నా వ్యక్తిగత విషయం మాత్రమే కాదని నేను గుర్తించాలి. ఎందుకంటే... నా ఆలోచనలే నా నిర్ణయాల్లోనూ, నా టీమ్ వాతావరణంలోనూ ప్రతిఫలిస్తాయి. నా మనసు గందరగోళంగా ఉన్నా, లేదా నేను ఒత్తిడిలో ఉన్నా, ఆ ప్రభావం ఆఫీసు అంతటా వ్యాపిస్తుంది. అందుకే, సమర్థంగా నాయకత్వం వహించడానికి నా మనసును ప్రశాంతంగా, స్పష్టంగా ఉంచుకోవడం నా వృత్తిపరమైన బాధ్యతగా నేను భావిస్తాను.

చంద్రజిత్ బెనర్జీ

రాజన్ నవానీ

నిబద్ధత ఉంటే శక్తి వృథా అవదు!

''మన ఆలోచనలకు, మన ఆచరణలకు మధ్య పెరిగే దూరం వల్ల సంభవించే రాపిడి (ఫ్రిక్షన్) వల్లనే మానసిక అలసట వస్తుందని నేను గుర్తించాను. నా దృష్టిలో పని పట్ల నైతిక నిబద్ధత అనేది మానసిక శక్తికి ఒక ప్రధాన వనరు. నేను స్పష్టమైన విలువలతో నాయకత్వం వహిస్తూ, నా ఆచరణ ఆ విలువలకు అనుగుణంగా ఉన్నప్పుడు... అపరాధ భావన, సంశయం, లేదా తడబాటు వంటి వాటి వల్ల నా శక్తి వృథా కావటం అన్నది ఉండదు. ఈ అంతర్గత సమతూకం నాలో ఒక నిలకడను, స్థిరత్వాన్ని కలిగిస్తుంది.

భయం, ఆవేశం చేటు తెస్తాయి!

''సి.ఐ.ఐ. డైరెక్టర్ జనరల్‌గా నేను, పరిశ్రమలు నిత్యం ఎంతటి ఒత్తిడిని ఎదుర్కొంటుంటాయో చూస్తుంటాను. నా ఉద్దేశంలో తట్టుకునే శక్తి అంటే కేవలం సంక్షోభం తర్వాత కోలుకోవడం మాత్రమే కాదు, సంక్షోభ సమయంలోనూ స్థిరంగా ఉండగలిగే మనోబలాన్ని కలిగి ఉండటం. ఈ విపరీతమైన ఒత్తిడితో కూడిన ప్రపంచంలో ప్రయాణించాలంటే, రక్షణ కవచం లాంటి ఒక మానసిక 'బఫర్'ను మనం పెంపొందించుకోవాలి.

ఆశయం రీఛార్జ్ చేస్తుంటుంది!

''ఏ పని ఎందుకు చేస్తున్నామో విస్మరించినప్పుడే మనకు తీవ్రమైన మానసిక అలసట కలుగుతుందని నేను బలంగా నమ్ముతాను. నా రోజువారీ పనులు ఒక గొప్ప ఆశయంతో ముడిపడి ఉన్నప్పుడు... మన దేశ పారిశ్రామిక అభివృద్ధి కావచ్చు. లేదా మా ఉద్యోగుల సంక్షేమం కావచ్చు... ఆ 'ముడి' నా మనసుకు నిరంతరం ఛార్జింగ్ ఇచ్చే బ్యాటరీలా పనిచేస్తుంది. కేవలం వ్యక్తిగత లాభం, లేదా కె.పి.ఐ. (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్) టార్గెట్ల కోసం కాకుండా, అంతకు మించిన ఒక గొప్ప లక్ష్యం కోసం పనిచేయడం నిరంతర స్ఫూర్తినిస్తుంది. ఇది కష్టపడి చేసే పనిని ఒక అర్థవంతమైన సేవగా మారుస్తుంది. దీనివల్ల అలసట కలగడానికి బదులుగా సహజంగానే మనలో ఉత్సాహం ప్రవహిస్తుంది.

❑ ఎడిటోరియల్ టీమ్

యాభై అయిదేళ్ల ధిక్కార స్వరం

ఇన్ బాక్స్

విప్లవ రచయితల సంఘం (విరసం) తన ప్రస్థానంలో మరో కీలక ఘట్టానికి చేరుకుంది. 1970 జూలై 4న ఆవిర్భవించిన ఈ సంస్థ, గడిచిన ఐదున్నర దశాబ్దాలుగా భారత సామాజిక, రాజకీయ రంగాల్లో సంభవించిన పెనుమార్పులకు నిలువుటద్దంగా నిలిచింది. ఈ అర్ధ శతాబ్ద కాలంలో మానవ ఆలోచనలు, మేధా వికాసం కొత్త పుంతలు తొక్కినప్పటికీ, మరో వైపు రాజకీయ విలువలు పతనం కావడం, నూతన అభివృద్ధి నమూనాలతో పెరిగిన అసమానతలు సమాజాన్ని తీవ్రంగా విభజించాయి.

పాలక వర్గాల నిరంకుశ పోకడలు, మత విద్వేష రాజకీయాల మధ్య విరసం తనదైన రచనా మార్గాన్ని ఎంచుకుంది. సాహిత్యాన్ని, కళలను కేవలం వినోద సాధనాలుగా కాకుండా, సామాజిక మార్పునకు ఆయుధాలుగా మలచుకోవడంలో ఈ సంస్థ దిశానిర్దేశం చేసింది. ఈ సుదీర్ఘ కాలంలో రెండు సార్లు నిషేధానికి గురైనా, అనేక నిర్బంధాలను తట్టుకుంటూ వర్గ పోరాటాన్ని ఇరుసుగా చేసుకుని సాహిత్య సృజనను ఒక బాధ్యతగా స్వీకరించింది. 'శ్రమ నుండి సాహిత్యం' అనే తాత్వికతను బలంగా వినిపిస్తూ, ప్రజల పక్షాన నిరసన గళాన్ని అక్షరబద్ధం చేస్తూ ప్రగతిశీల సాహిత్యానికి అసలైన చిరునామాగా మారింది.

నేటి కొత్త రచయితల ఆలోచనా రీతులనూ, వారి రచనా సంవిధానాన్నీ విరసం నిశితంగా అంచనా వేస్తోంది. 1990ల నాటి ఆర్థిక సంస్కరణల ప్రభావంతో యువత కొంతకాలం సాహిత్య రంగానికి దూరమైన మాట వాస్తవమే. అయితే, ఇటీవలి కాలంలో తిరిగి సాహిత్య సృజనలోకి రావడం ఒక ఆసక్తికర పరిణామం. వివిధ ప్రక్రియల ద్వారా యువత గళం విప్పడాన్ని విరసం స్వాగతిస్తోంది. ముఖ్యంగా ప్రపంచ స్థాయి మేలిమి రచనలు అనువాద రూపంలో తెలుగు పాఠకులకు చేరువవుతుండటం వల్ల పఠనాశక్తి పెరుగుతోంది.

ప్రపంచీకరణ నేపథ్యంలో మనుషుల అభిరుచులు, జీవన శైలి మారుతున్నాయి. స్త్రీ, దళిత, ముస్లిం, ఆదివాసీ సమూహాల ఆత్మగౌరవ పోరాటాలు సాహిత్య ముఖచిత్రంపై నమోదవుతున్నాయి. విరసం ఈ పరిణామాలను నిరంతరం గమనిస్తూ ప్రోత్సహిస్తోంది. దేశంలో విద్వేష రాజకీయాలు, మతం పేరిట విభజన రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. 'ఆపరేషన్ కగార్' పేరిట సాగుతున్న మానవ హననాన్ని విరసం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ అణచివేత తరుణంలో, విరసం తన 30వ మహాసభలను జరుపుకుంటోంది. ఈ కఠోర సమయంలో, ప్రజల పక్షాన నిలబడి భావజాల–సాంస్కృతిక రంగాల్లో పోరాడతామని విరసం మరోసారి దృఢమైన భరోసాను ప్రకటిస్తోంది.

– అరసవిల్లి కృష్ణ I 'విరసం' అధ్యక్షులు
(హైదరాబాదులో నేడు, రేపు 'విరసం' 30వ మహాసభలు)

వెయ్యి కోట్ల జనాభా

డేటా పాయింట్

'ఇండియా స్టాట్ డాట్‌కామ్' అంచనా ప్రకారం, 2050 నాటికి జనాభాలు ఇలా ఉండనున్నాయి (కోట్లలో)

ఇండియా	చైనా	ప్రపంచం
180.78	142.41	953.89

ఇండియా ప్రస్తుత జనాభా 144 కోట్లను దాటి 145 కోట్లకు చేరువవుతోంది. 2030 నాటికి ఇది 151 కోట్లు కానుందని అంచనా. మరోవైపు చైనా జనాభాలో వరుసగా నాలుగో ఏడాది కూడా తగ్గుదల నమోదయ్యిందని ఆందోళన మొదలయ్యింది.

ప్రాణనాథుడికి ప్రణామం



దేవుడిని ప్రత్యక్షంగా చూడగోరే వారికి యజ్ఞ దాన తపస్సులూ, ధ్యానాలూ, యోగాలూ నియమంగా అనుష్ఠించటం ఒక మార్గం. తెల్లవారుతూనే... తూర్పు దిశగా దృష్టి సారించి, అరుణ కిరణాలతో అతి సుందరంగా పైకెక్కి వస్తున్న సూర్యభగవానుడిని చూసి నమస్కరించుకోవటం సులభ మార్గం! తనకు ఉపకారం చేసే వారిపట్ల కృతజ్ఞత చూపాలి అన్న ఉదాత్త భావం ఆదిమానవుడిలో ఎప్పుడు పొడసూపిందో, అప్పట్నుంచీ ఈ దేశంలో ఆదిత్యారాధన సంప్రదాయం నెలకొని ఉంది.

వేద ఋషులు ఆయనను వేనోళ్ళతో స్తుతించారు. ఆయనను పరబ్రహ్మగా, జగత్తుకు ఆత్మగా, విశ్వసాక్షిగా, లోకోపకారిగా, ఆరోగ్యదాయకుడిగా, మహా మహిమాన్వితుడిగా, సకల శుభప్రదాతగా కొనియాడే వేదసూక్తాలకు కొదవలేదు. అలాగే పురాణాలలోనూ సూర్య మాహాత్మ్యాన్ని వర్ణించే కథలూ, గాథలూ అసంఖ్యాకాలు. 'సౌర పురాణం' అనే ఉప పురాణం పూర్తిగా సూర్యుడి చరిత్రకు కేటాయించబడింది.

వేద పురాణాల మాట అలా ఉంచి, నిత్యం మన కంటి ఎదుటే జరిగే లోక వ్యవహారాన్ని పరిశీలించినా, మన మనుగడకే ఆధారమైన మార్తాండుడు పోషించే పాత్ర మహాద్భుతం. సూర్యుడు లేకుంటే వాన లేదు, నీరు లేదు. ఆయన లేకుంటే ఆహారం లేదు, ఆరోగ్యం లేదు, ఉత్సాహం లేదు, ఉత్తేజం లేదు, అసలు ప్రాణకోటి ఉనికే లేదు అని గ్రహించేందుకు గొప్ప శాస్త్రజ్ఞానం అక్కర్లేదు. అందుకే, ఆయనకు కృతజ్ఞతను ప్రకటిస్తూ, మాఘ శుద్ధ సప్తమి తిథిని ఆయన జయంతిగా, 'రథసప్తమి' పర్వదినంగా జరుపుకోవటం సముచితమైన సంప్రదాయం.

ఆయనను స్మరిస్తూ, అర్క పత్రాలు తలదాల్చి పవిత్ర స్నానాలు చేయటం, పిడకల కుంపటితో పాలు పొంగించి, పాయసం వండి, ఆయనకు నివేదించి ఆరగించటం, యథాశక్తి సూర్యార్చనలు చేయటం ఇత్యాదులు 'ఉడతా భక్తి'గా చూపే భక్తిశ్రద్ధలు. ఇవి అవశ్యం ఆచరణీయాలే. అర్థవంతమైన ఆచారాలే. కానీ ప్రాణికోటికి సూర్యభగవానుడు చేసే మహోపకార ఋణం ఇంతలో తీరేది కాదు సుమా!

– ఎం. మారుతి శాస్త్రి (రేపు రథ సప్తమి పర్వదినం)

ఉదయం ఇడ్లీ.. రాత్రి చికెన్

2025 ఆర్డర్లలో చికెన్ బిర్యానీ ఫస్ట్, రెండోస్థానంలో ఇడ్లీ

ఇది విజయవాడ వాసుల ఆహారపు అలవాట్లు

నివేదిక విడుదల చేసిన స్విగ్గీ

సాక్షి, అమరావతి: బెజవాడ వాసుల ఆహారపు అలవాట్లు భలే ఉన్నాయి. ఉదయం ఇడ్లీ, వెజ్ దోశ వంటి సాత్విక ఆహారంతో దైనందిన కార్యకలాపాలు ప్రారంభిస్తున్న వారికి చీకటి పడితే చికెన్ ముక్క గొంతు దిగాల్సిందేనట. 2025లో వచ్చిన ఆర్డర్ల ఆధారంగా విజయవాడ వాసుల ఆహారపు అలవాట్లపై ఆన్‌లైన్ ఫుడ్ యాప్ సంస్థ స్విగ్గీ ప్రత్యేక నివేదికలో వెల్లడించింది.

చికెన్ వంటకాలకు క్రేజ్

ఆ సంస్థకు వచ్చిన ఫుడ్ ఆర్డర్లలో 7.78 లక్షల ఆర్డర్లతో చికెన్ బిర్యానీ తొలిస్థానంలో నిలిచింది. 3.2 లక్షల ఆర్డర్లతో ఇడ్లీ రెండో స్థానంలో, 2.7 లక్షల ఆర్డర్లతో వెజ్ దోశ 3వ స్థానంలో నిలిచాయి.

బ్రేక్ ఫాస్ట్‌లో ఇడ్లీ.. దోశ పోటాపోటీ

ఉదయం వేళల్లో వచ్చిన ఆర్డర్లలో సింహ భాగం ఇడ్లీదే. 1.43 లక్షల ఆర్డర్లతో ఇడ్లీ అగ్రస్థానంలో నిలవగా.. తదుపరి స్థానంలో 1.12 లక్షల ఆర్డర్లతో వెజ్ దోశ నిలిచింది. వీటితోపాటు ఉల్లి దోశ, పూరీ, వెజ్ వడలు ఉదయం వేళ అత్యధికంగా ఆర్డర్ చేశారు.

పెరుగుతున్న అర్ధరాత్రి ఆర్డర్లు

అర్ధరాత్రి ఆర్డర్లు ఇచ్చే సంస్కృతి విజయవాడలో వేగంగా విస్తరిస్తోందని స్విగ్గీ ఆ నివేదికలో పేర్కొంది. గతేడాదితో పోలిస్తే రాత్రి 12 నుంచి రెండు గంటల్లోపు ఇచ్చే ఆర్డర్లు 47.7 శాతం పెరిగాయి. అర్ధరాత్రి ఇచ్చే ఆర్డర్లలో అత్యధికంగా చికెన్ బిర్యానీ ఉండగా, ఆ తర్వాత చికెన్ బర్గర్లు, చికెన్ ఫ్రై, చికెన్ పిజ్జా, చికెన్ నగ్గెట్స్ వంటి నాన్ వెజ్ వంటకాలు ఉన్నాయి.

బెంగాలీ.. పంజాబీ వంటకాలపై మోజు

విజయవాడ వాసులు బెంగాలీ, పంజాబీ వంటకాలను అత్యధికంగా ఇష్టపడుతున్నారని వెల్లడించింది. గతేడాదిలో పోల్చితే బెంగాలీ వంటకాల ఆర్డర్లు 35 శాతం, పంజాబీ వంటకాల ఆర్డర్లు 30 శాతం పెరిగాయి.

బయట తినేద్దాం

విజయవాడలో బయట భోజనాలు చేసే అలవాటు పెరుగుతోందని వెల్లడించింది.అత్యధికంగా మదర్స్‌డే నాడు బయట హోటల్స్‌లో తినగా.. ఇందులో ఒక కుటుంబం రూ.30,079 బిల్లు చేసినట్లు పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బయట తినేవారి సంఖ్య 276 శాతం పెరిగినట్టు స్విగ్గీ పేర్కొంది. స్విగ్గీ డైన్ అవుట్ ద్వారా నగరం సమష్టిగా రూ.90 లక్షలు ఆదా చేసిందని, ఒక కస్టమర్ సింగిల్ బుకింగ్‌లో రూ. 15,109 అత్యధికంగా ఆదా చేశారని స్విగ్గీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సిద్ధార్థ్ భాకూ తెలిపారు. ఫుడ్ ఆన్ ట్రైన్‌కు కూడా డిమాండ్ బాగా పెరుగుతోందని, విజయవాడ జంక్షన్‌లో ఫుడ్ ఆన్ ట్రైన్ ద్వారా చేసే ఆర్డర్లు 233 శాతం పెరిగినట్లు తెలిపింది.

కొనసాగుతున్న బిర్యానీ హవా

ఇక దేశవ్యాప్తంగా బిర్యానీ తన రాజసాన్ని కొనసాగిస్తోంది. 2025లో దేశవ్యాప్తంగా 93 మిలియన్ బిర్యానీల ఆర్డర్లు వచ్చాయి. నిమిషానికి 194, ప్రతీ సెకనుకు 3.25 బిర్యానీలు లాగించేస్తున్నారు.

యూరియా లారీని అడ్డుకున్న రైతులు

త్రిపురాంతకం: గ్రామానికి వచ్చిన యూరియా లారీని మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేయడంతో రైతులు అడ్డుకున్నారు. మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం విశ్వనాథపురం సొసైటీకి కేటాయించిన 450 బస్తాల యూరియా లారీ గ్రామానికి వచ్చింది. తక్షణమే లారీని వెనక్కి తీసుకురావాలని సంబంధిత శాఖాధికారుల ఆదేశాలతో డ్రైవర్ లారీని తరలించే ప్రయత్నం చేశాడు. దీంతో గ్రామస్తులు లారీని అడ్డుకుని యూరియా బస్తాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సొసైటీ అధికారులు గ్రామంలో 250 బస్తాలు దించారు. మిగిలిన వాటిని వెల్లంపల్లికి తరలించారు. ఏడాది కాలంగా రైతు సేవా కేంద్రాల ద్వారా ఒక్క బస్తా యూరియా కూడా తమకు అందించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా సకాలంలో ఎరువులు, యూరియా అందించినట్లు రైతులు తెలిపారు. అయితే రైతు సేవా కేంద్రంలో సిబ్బంది లేనందున యూరియా అందించట్లేదని ఏవో సంగమేశ్వరరెడ్డి తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

– తిరుమల

శ్రీవారి ఆలయంలో ఘనంగా వార్షిక విశేషపూజ

తిరుమల: వసంత పంచమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో శుక్రవారం వార్షిక విశేష పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఆలయంలోని కళ్యాణ మండపంలో అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని వేంచేపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్దశ కలశావాహనం గావించి పుణ్యాహవచనం, వివిధ క్రతువులను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగిసింది.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శుల నియామకం

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పలువురు నాయకులను పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమించారు. పి.అనిల్‌కుమార్(గోపాలపురం, తూర్పు గోదావరి జిల్లా), ఎస్.సందీప్(తాడికొండ, గుంటూరు జిల్లా), జి.అబ్రహం(అభి)(కనిగిరి, ప్రకాశం జిల్లా), వై.ఆంజనేయరెడ్డి(మార్కాపురం, ప్రకాశం జిల్లా), డి.క్రాంతికుమార్ (ఒంగోలు, ప్రకాశం జిల్లా), ఆర్.దశరథరామయ్య గౌడ్(సర్వేపల్లి, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా), ఎ.మధుసూదన్‌రెడ్డి(తంబళ్లపల్లి, అన్నమయ్య జిల్లా), కె.కిరణ్ కుమార్‌రెడ్డి(శ్రీకాళహస్తి, చిత్తూరు), వి.భానుకుమార్‌రెడ్డి(చంద్రగిరి, చిత్తూరు జిల్లా)లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమించారు.

వైఎస్సార్‌సీపీ గల్ఫ్ దేశాల కన్వీనర్ల నియామకం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కంట్రీ కన్వీనర్ల(జీసీసీ)ను కూడా నియమించారు. కువైట్‌కు ముమ్మడి బాలిరెడ్డి, దుబాయ్(యూఏఈ)కి సయ్యద్ అక్రమ్, ఒమన్(మస్కట్)కు జీజీ భాస్కర్‌రావు, దోహ(ఖతార్)కు షేక్ జాఫర్ హుస్సేన్, జుబైల్ (సౌదీ అరేబియా)కు షేక్ మహబూబ్ ఇలాహి, రియాద్ (సౌదీ అరేబియా)కు సయ్యద్ రబ్బానీ, బహ్రెయిన్‌కు ఒర్సు నాగరాజును నియమించారు. ఈ మేరకు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

వీఎల్‌టీడీ లేకపోయినా కొత్త లారీల రిజిస్ట్రేషన్లు అనుమతించాలి

రాష్ట్ర లారీ యజమానుల సంఘం

సాక్షి, అమరావతి: 'వెహికిల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్ (వీఎల్‌టీడీ) ఉంటేనే కొత్త లారీల రిజిస్ట్రేషన్ చేస్తామనే నిబంధనను తాత్కాలికంగా సడలించాలని రాష్ట్ర లారీ యజమానుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. మార్కెట్‌లో తగినన్ని వీఎల్‌టీడీ పరికరాలు అందుబాటులో లేవని చెప్పింది. ఇక అందుబాటులో ఉన్న వీఎల్‌టీడీ పరికరాల్లో సాంకేతిక లోపాలు, నెట్‌వర్క్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంది. దీంతో కొత్త లారీల రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయని చెప్పింది. ఒక్కో లారీకి రూ.25వేలు వెచ్చించి వీఎల్‌టీడీ పరికరాలను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ విషయాన్ని ఇప్పటికే రవాణా శాఖ దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పింది. వీఎల్‌టీడీ పరికరాలు లేకపోయినా కొత్త లారీల రిజిస్ట్రేషన్‌కు అనుమతించాలని రాష్ట్ర లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

అనుమానాస్పద స్థితిలో భార్య, భర్త, కుమారుడు మృతి

మూడో కుమార్తె పరిస్థితి విషమం

మధుసూదనరావు, సత్యవతి, మోసు(ఫైల్)

జియ్యమ్మవలస రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో అనుమానాస్పద స్థితిలో దంపతులు, కుమారుడు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మీనక మధుసూదనరావు(35), మీనక సత్యవతి(32) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె మాధురి చినమేరంగి కేజీబీవీలో ఏడో తరగతి చదువుతుండగా, రెండో కుమార్తె మోక్ష బొమ్మికలోని తాతగారింట్లో ఉంటూ నాలుగో తరగతి చదువుతోంది. మధుసూదనరావు తాపీమేస్త్రీ కాగా, సత్యవతి పొలం పనులు చేస్తుంటుంది. అయితే ఆ కుటుంబానికి ఏం కష్టమొచ్చిందో తెలియదు... శుక్రవారం ఉదయం బయటకు రాకపోయేసరికి స్థానికులు తలుపు తట్టారు. ఎవరూ స్పందించకపోవడంతో మధుసూదనరావు తండ్రి మీనక గౌరు మరికొందరు కలిసి తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లారు. అప్పటికే దంపతులిద్దరితో పాటు కుమారుడు మోసు(4) విగత జీవులుగా పడి ఉన్నారు. మూడో కుమార్తె ఆయుసు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఇంట్లో వారు పడుకున్న మంచం కింద నిప్పుల కుంపటి ఉండడంతో పొగ కమ్ముకుంది. ఆయుసును బయటకు తీసుకొచ్చి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. భార్యభర్తలు అన్యోన్యంగా ఉంటారని, ఈ ఘటన ఎలా జరిగిందో తెలియడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రమాదమా? ఆత్మహత్యా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలాన్ని ఎస్పీ మాధవ్‌రెడ్డి పరిశీలించారు.

టీటీడీకి రూ.2.50 కోట్లు విరాళం

తిరుమల: హైదరాబాద్‌కు చెందిన పి.ఎల్.రాజు కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ సంస్థ శుక్రవారం టీటీడీలోని వివిధ ట్రస్ట్‌లకు రూ.2.50 కోట్లు విరాళంగా అందించింది. అందులో శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.75 లక్షలు, శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్ట్‌కు రూ.75 లక్షలు, బర్డ్ ట్రస్ట్‌కు రూ.50 లక్షలు, శ్రీవేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్ట్‌కు రూ.25 లక్షలు, శ్రీవేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.25 లక్షలు ప్రకటించగా, ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి రాజగోపాలరాజు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

దుత్తలూరు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, దుత్తలూరు సెంటర్‌లో ఆర్టీసీ బస్సు చక్రం నుంచి ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. కావలి ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఉదయగిరి నుంచి ప్రయాణికులతో కావలికి వెళ్తుండగా దుత్తలూరు సెంటర్ వద్ద ఎడమ వైపు వెనుక టైరు వద్ద పొగలు రావడం గమనించిన ప్రయాణికులు డ్రైవరుకు చెప్పడంతో వెంటనే బస్సు ఆపేశాడు. డ్రైవర్ ప్రయాణికులను కిందికి దించి, టైరుపై నీళ్లు చల్లడంతో పొగలు ఆగిపోయాయి. ప్రయాణికులను మరో బస్సులో గమ్యానికి చేర్చారు.

టీడీపీకి నామినేషన్ వేసేవారు లేకే ఎన్నిక రద్దు

- ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- విజయ డెయిరీకి భూమా విఖ్యాత్‌రెడ్డిని చైర్మన్‌ను చేయాలని చూస్తే ఊరుకోబోం
- డెయిరీకి విఖ్యాత్ రూ.1.20 కోట్ల అప్పున్నాడు
- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహా మరో ఇద్దరు గృహ నిర్బంధం
- ఎన్నిక రద్దుతో విడుదల

గృహనిర్బంధంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ/రుద్రవరం: విజయ డెయిరీ ఎన్నికలకు సంబంధించి టీడీపీకి నామినేషన్ వారు లేకే రద్దు చేశారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. అధికారం ఉంది కదాని ఒక డిఫాల్టర్ అయిన భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిని చైర్మన్‌ను చేయాలని చూస్తే ఊరుకోబోమని శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన హెచ్చరించారు. డెయిరీకి విఖ్యాత్ రూ.1.20 కోట్ల మేర అప్పు ఉన్నాడన్నారు. ఈ డెయిరీని వైఎస్సార్‌సీపీ నిలబెట్టుకోవడానికి న్యాయబద్ధంగా పోరాటంచేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. 26 ఏళ్లు డెయిరీని పాలించారని, కానీ ఏనాడైనా రైతులకు బోనస్, ఇన్సెంటివ్ ఇచ్చారా అని బిజేంద్రారెడ్డి ప్రశ్నించారు. ఈరోజు నామినేషన్ వేసేవారు లేక ఎన్నికలను రద్దుచేసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని ఆపేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మాచినేనిపల్లెలో అధికార దుర్వినియోగానికి పాల్పడితే సహించబోరన్నారు.

డెయిరీ నాశనానికి కుట్ర..

విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేవలం పోలీసులతో ఒత్తిడి తీసుకొచ్చి ఎన్నికలను ఆపేశారన్నారు. ఆళ్లగడ్డలో జగత్ డెయిరీ ఎప్పుడైతో మొదలైందో విజయ డెయిరీ పతనానికి శ్రీకారం చుట్టారని.. పాలన్నీ జగత్‌కు తరలించారని ఆరోపించారు. తాను చైర్మన్ అయ్యాక విజయ డెయిరీ టర్నోవర్ రూ.180 కోట్ల నుంచి రూ.360 కోట్లకు చేరిందన్నారు. ఐదేళ్లలో రైతులకు రూ.25 కోట్ల బోనస్ ఇచ్చామని చెప్పారు.. డిఫాల్టర్‌ను చైర్మన్ చేసి తద్వారా విజయ డెయిరీని పతనం చేసేందుకు కుట్ర చేశారని ఎస్వీ ఆరోపించారు. ఒక ప్రైవేటు డెయిరీ పెట్టుకుని విజయ డెయిరీలో మెంబర్ కావాలనుకోవడమే పెద్ద తప్పన్నారు. డెయిరీ ఆస్తులను తాను కబ్జాచేశానని నిరూపిస్తే తన ఆస్తులన్నీ రాసిస్తానని.. లేదంటే రాజీనామా చేస్తావా అని ఎమ్మెల్యే అఖిలప్రియకు ఎస్వీ సవాల్ విసిరారు.

ఎర్రగుడిదిన్నెలో మాజీ ఎమ్మెల్యే గృహ నిర్బంధం..

ఇదిలా ఉంటే.. శుక్రవారం నంద్యాలలోని విజయ డెయిరీ వద్ద ఎన్నికలు జరగాల్సి ఉన్నందున డెయిరీ వద్దకు ఎవరూ రాకుండా అధికార పక్షం నేతలు కుట్రలు పన్నారు. ఉదయాన్నే రుద్రవరం మండలంలోని ఎర్రగుడిదిన్నెలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఇంటిని పోలీసులు చుట్టుముట్టి ఆయనను గృహనిర్బంధం చేశారు. అదే గ్రామంలో ఉన్న డైరెక్టర్లు గంగుల విజయసింహారెడ్డి, ఎస్వీ జగన్‌లను కూడా గృహనిర్బంధం చేశారు. మధ్యాహ్నం ఎన్నికలు వాయిదా పడ్డాయని తెలిశాక వారిని విడిచిపెట్టారు.

గాలి జనార్దనరెడ్డి మోడల్ హౌస్‌కు నిప్పు

కంటోన్మెంట్ లేఅవుట్‌లోని ఇంటిపై పెట్రోలు పోసి తగలబెట్టిన దుండగులు

మోడల్ హౌస్‌లో చెలరేగిన మంటలు

సాక్షి, బళ్లారి: బళ్లారిలోని కంటోన్మెంట్ ప్రాంతంలో కర్ణాటక మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి కొత్తగా నిర్మించుకున్న జీస్క్వేర్ మోడల్ హౌస్‌కు శుక్రవారం గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టారు. అయితే ఆ ఇంటిలో ఎవరూ నివాసం ఉండకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో గాలి జనార్దనరెడ్డి బెంగళూరులో ఉన్నారు. తన ఇంటికి నిప్పుపెట్టారని తెలిసిన వెంటనే పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు సేకరించి బళ్లారికి బయలుదేరారు. స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేశారు. గాలి మోడల్ హౌస్‌కు ఎవరు, ఎందుకు నిప్పు పెట్టారన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జనవరి ఒకటో తేదీన బ్యానర్ రగడ, కాల్పుల ఘటన సద్దుమణగక ముందే గాలి జనార్దనరెడ్డి మోడల్ హౌస్‌కు నిప్పు పెట్టడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

నారా భరత్‌రెడ్డి అనుచరుల పనే..!

బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అనుచరులే తన సోదరుడు గాలి జనార్దనరెడ్డి మోడల్ హౌస్‌కు నిప్పు పెట్టారని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన బళ్లారిలో విలేకరులతో మాట్లాడారు. జనవరి 1న గాలి జనార్దన్‌రెడ్డి ఇంటి వద్ద బ్యానర్ రగడ, కాల్పులు జరిగిన సమయంలో అదే రోజు రాత్రి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తాను తలచుకుంటే గాలి జనార్దనరెడ్డి ఇంటిని భస్మం చేయడం పెద్ద పనేమీ కాదని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. దీన్ని బట్టి నారా భరత్‌రెడ్డి అనుచరులే మోడల్ హౌస్‌కు నిప్పు పెట్టి ధ్వంసం చేశారని సోమశేఖరరెడ్డి విమర్శించారు.

దీని ఇస్తేమా ప్రారంభం



ఇస్తేమాలో గురువుల సందేశాలను ఆలకిస్తున్న ముస్లింలు

కడప సెవెన్‌రోడ్స్: కడపలోని కొప్పర్తి వద్ద మూడు రోజులపాటు నిర్వహించనున్న దీని ఇస్తేమా శుక్రవారం తెల్లవారుజామున ఫజర్ నమాజ్ అనంతరం వైభవంగా ప్రారంభమైంది. ప్రాంగణానికి లక్షలాదిగా ముస్లింలు తరలివచ్చారు. ప్రార్థనల అనంతరం విడతల వారీగా ముస్లిం గురువులు, ప్రముఖులు తమ ప్రసంగాలను వినిపించారు. దీని ఇస్తేమా ప్రాధాన్యాన్ని వివరించారు. రాత్రి ఇషా నమాజ్ తర్వాత తొలిరోజు కార్యక్రమాలు ముగిశాయి.

ఇండియా అబ్బాయి.. చైనా అమ్మాయి

మూడు ముళ్లతో ఒక్కటైన జంట

యశవంతపుర: ప్రేమకు దేశం, భాష అనే హద్దులు లేవు. కర్ణాటకలోని చిక్కమగళూరుకు చెందిన యువకుడు, చైనాకు చెందిన యువతి మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. చిక్కమగళూరు హౌసింగ్ బోర్డుకు చెందిన రూపక్.. చైనాకు చెందిన జేడ్‌కు ఆస్ట్రేలియాలో చదువుతున్న సమయంలో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని పెద్దలకు తెలిపారు. రెండు కుటుంబాలు అంగీకరించడంతో చిక్కమగళూరులోని ఒక్కలిగర కల్యాణ మండపంలో గురువారం ఘనంగా వివాహం జరిగింది. భారత్–చైనా సంప్రదాయాలు దాదాపు ఒకే మాదిరిగా ఉన్నాయని నవ వధువు సంతోషం వ్యక్తం చేసింది.

వీబీ- జీరామ్‌జీకి తమిళ నాడు అసెంబ్లీ నో

మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలని తీర్మానం

సాక్షి,చెన్నై: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు కొనసాగించాలని తమిళనాడు అసెంబ్లీలో శుక్రవారం తీర్మానించారు. జీ రామ్‌జీ పథకంతో రాష్ట్రాలకు తీవ్ర నష్టం తప్పదని ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ వ్యాఖ్యానించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికామిషన్- గ్రామీణ(వీబీ –జీరామ్‌జీ) పథకం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీలో శుక్రవారం సీఎం స్టాలిన్ ప్రత్యేక తీర్మానం ప్రవేశ పెడుతూ గాంధీ పేరు కొనసాగించాలని సభ ఆమోదానికి విన్నవించారు. జీరామ్‌జీతో రాష్ట్రాల నెత్తిన ఆర్థిక భారం, నిధుల పిడుగు పడ్డట్టేనని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే సాధారణ ప్రజలు, రైతులు, రైతు కూలీలు, పేద ప్రజలకు తీవ్ర మోసం తలబెట్టారని ధ్వజమెత్తారు. గ్రామీణ పేదల జీవనోపాధి పూర్తిగా నాశనం చేయనున్న జీరామ్‌జీ వద్దే వద్దు అని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ అప్పావు సభ్యుల మెజారిటీ ఆధారంగా తీర్మానాన్ని ఆమోదించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం. 11 టు 14/2025-26 తేది : 22.01.2026

ఎన్.టి.ఆర్. జిల్లాలోని ప్రత్యేక డివిజన్, విజయవాడ పరిధిలో 4 పనులకు గాను రూ. 96.92 లక్షల అంచనాలతో పర్యవేక్షణ మరియు నిర్వహణతో సహా సమర్థవంతమైన నీటి నియంత్రణ కోసం నీటి పారుదల వ్యవస్థ పునరుద్ధరణ కొరకు టెండర్లను పిలుచుట. టెండరు డాక్యుమెంట్స్ లభ్యమగు తేది : 24.01.2026, ఉ. 11.00 గం.ల నుండి 09.02.2026 సా. 04.00 గం.ల వరకు. ఇతర వివరాలను www.apeprocurement.gov.inలో చూడగలరు. ఫోన్ : 7675014632

సం/- కార్యనిర్వాహక ఇంజినీర్, ప్రత్యేక విభాగము, విజయవాడ

DIPR RO No. 18867/CL/Advt/1/1/2021-22, Dt : 23.01.2026

రైల్వే మంత్రిత్వ శాఖ
(దక్షిణ మధ్య రైల్వే)
ప్రకటన
సికింద్రాబాద్, 21 జనవరి, 2026

PUB/1814/26

S.O.347(E)- రైల్వే చట్టం 1989 (24 ఆఫ్ 1989)లోని సెక్షన్ 20A లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ (ఇకమీదట సదరు చట్టంగా నిర్దేశించబడును) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో మంగళగిరి మండలంలో నంబూరు – మంగళగిరి స్టేషన్ల మధ్య కి.మీ.19/7-9 వద్ద లెవల్ క్రాసింగ్ (LC) నం.14 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్ కోసం దీనికి జత చేసిన షెడ్యూలులో ఇచ్చిన సంక్షిప్త వివరణ గల భూమి ప్రజోపయోగార్థం కావలసివున్నదని కేంద్ర ప్రభుత్వం సంతృప్తి చెందిన తరువాత సదరు అవసరానికి సదరు భూసేకరణకు తన ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిలో ప్రయోజనం గల ఏ వ్యక్తి అయినా అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి ముప్పై (30) రోజులలోగా సదరు చట్టంలోని సెక్షన్ 20D లోని సబ్-సెక్షన్ (1) క్రింద, పైన తెలిపిన అవసరార్థం సదరు భూమి ఉపయోగానికి మరియు సేకరణకు ఆక్షేపణలు తెలియచేయవచ్చును.

అట్టి ప్రతి ఆక్షేపణ సమర్థ ప్రాధికారి అంటే సబ్-కలెక్టర్, తెనాలి, గుంటూరు జిల్లా వారికి వ్రాతపూర్వకముగా దానికి గల కారణాలతో తెలియచేయవలెను మరియు సమర్థ ప్రాధికారి మరియు సబ్-కలెక్టర్, తెనాలి, గుంటూరు జిల్లా వారు ఆక్షేపణదారుకు స్వయంగా లేదా లీగల్ ప్రాక్టీషనర్ ద్వారా విచారణ జరిపేందుకు అవకాశం కల్పిస్తారు మరియు అట్టి ఆక్షేపణలన్నీ విచారించిన మీదట భూ సేకరణ కొరకు సమర్థ ప్రాధికారి (CALA) అవసరమని భావిస్తే తదుపరి విచారణ జరిపిన తరువాత ఆక్షేపణలను అనుమతిస్తూ లేదా అనుమతించకుండా ఉత్తర్వు జారీచేస్తారు.

సదరు చట్టంలోని సెక్షన్ 20(D) లోని సబ్-సెక్షన్ (ii) క్రింద భూ సేకరణ కోసం సమర్థ ప్రాధికారిచే చేయబడిన ఏ ఉత్తర్వు అయినా తుదిగా ఉంటుంది. ఈ ప్రకటన క్రింద కవరయ్యే భూమి ప్లాన్లు మరియు భూమి ఇతర వివరాలు సమర్థ ప్రాధికారి (CALA) యొక్క పైన తెలిపిన కార్యాలయంలో లభిస్తాయి మరియు ప్రయోజనంగల వ్యక్తులు తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

సేకరణ క్రింద ఉన్న భూముల వివరణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో మంగళగిరి మండలంలో నంబూరు – మంగళగిరి స్టేషన్ల మధ్య కి.మీ. 19/7-9 వద్ద లెవల్ క్రాసింగ్ నం.14 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం.

క్ర. సం.	మండలం పేరు	గ్రామం పేరు	సర్వే నం.	తాత్కాలిక విస్తీర్ణం (చ.మీ.లలో)	తాత్కాలిక విస్తీర్ణం (హెక్టార్లలో)	భూమి రకం (ప్రభుత్వ/ప్రైవేట్)	భూమి స్వభావం (మాగాణి/మెట్ట)
1	మంగళగిరి	మంగళగిరి	271/A-1A2	777.05	0.0777	ప్రభుత్వ మెట్ట (దేవస్థానం)	మెట్ట
2			271/A-1B			పోరంబోకు	రోడ్డు
3			272-A1	1039.54	0.10395	పట్టా భూమి	మెట్ట
4			272-A2			పోరంబోకు	రోడ్డు
5			272-B1			పట్టా భూమి	మెట్ట
6			272-B2			పోరంబోకు	రోడ్డు
7			272-C1			పట్టా భూమి	మెట్ట
8			272-C2			పోరంబోకు	రోడ్డు
9			273/A-3A2	6038.31	0.6038	పోరంబోకు	రోడ్డు
10			273/B	1624.15	0.16241	పోరంబోకు	రోడ్డు
11			274/A-B2	204.48	0.0204	పోరంబోకు	రోడ్డు
12			274/A-B1A			ప్రభుత్వ మెట్ట	మెట్ట
13			274/A-A2			పోరంబోకు	రైల్వే
14			274/B	509.25	0.0509	పోరంబోకు	రైల్వే
15			274/C-2D1	1315.78	0.1315	పట్టా భూమి	మెట్ట
16			274/C-2D2			పోరంబోకు	రోడ్డు
17			274/C-2C1			పట్టా భూమి	మెట్ట
18			274/C-2C2			పోరంబోకు	రోడ్డు
19			274/C-2B1			పట్టా భూమి	మెట్ట
20			274/C-2B2			పోరంబోకు	రోడ్డు
21			274/C-1A2B			పట్టా భూమి	మెట్ట
22			274/C-2A2			పోరంబోకు	రోడ్డు
23			276-B1	145.76	0.0145	పట్టా భూమి	మెట్ట
24			276-B2			పోరంబోకు	రోడ్డు
25			287-A	230.47	0.0230	పోరంబోకు	రోడ్డు
26			292-A	23.19	0.0023	పట్టా భూమి	మెట్ట
27			292-B			పోరంబోకు	రోడ్డు
28			303	861.0914	0.0861	పోరంబోకు	రోడ్డు
29			304	75.9773	0.00759	పోరంబోకు	రోడ్డు
30			305-A2	1372.37	0.1372	ప్రభుత్వ మెట్ట	VGTM-UDA
31			305-B			పోరంబోకు	రోడ్డు
32			309-A	1535.35	0.1535	ప్రభుత్వ మెట్ట	VGTM-UDA
33			309-B			పోరంబోకు	రోడ్డు
మొత్తం				15,752.7744	1.5753		

[File No.: RSP/Gazette/20A/LC.No.14/GNT-KCC/GNT]
(మనోజ్ కుమార్),CE/C/RSP

A2297

తమిళనాడులో అరాచక పాలన

ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

- డీఎంకే అంటే అవినీతి, మాఫియా, నేరాలు
- బహిరంగ సభలో మోదీ ఆగ్రహం
- డీఎంకే ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని వెల్లడి

మధురాంతకం(తమిళనాడు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో సీఎంసీ(కరప్షన్, మాఫియా, క్రైమ్) సర్కార్ రాజ్యమేలుతోందని మండిపడ్డారు. అవినీతి, మాఫియా, నేరాలకు డీఎంకే పర్యాయ పదంగా మారిపోయిందని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో డీఎంకేకు గట్టిగా బుద్ధి చెప్పాలని తమిళనాడు ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని స్పష్టంచేశారు. సీఎంసీని ఎవరూ సహించబోరని అన్నారు. ప్రధాని మోదీ శుక్రవారం తమిళనాడులోని మధురాంతకంలో భారీ బహిరంగ సభకు హాజరయ్యారు. ప్రజలతోపాటు ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. అన్నా డీఎంకే అధ్యక్షుడు ఎడప్పాడి పళనిస్వామి, అమ్మ మక్కల్ కట్చి కళగం(ఏఎంఎంకే) అధినేత టీటీవీ దినకరన్, పీఎంకే నాయకుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, టీఎంసీ-ఎం నేత జీకే వాసన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. డీఎంకే ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని పేర్కొన్నారు. అరాచక పాలన నుంచి విముక్తి కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లు తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సుపరిపాలన కోసం వారంతా ఎదురు చూస్తున్నారని వ్యాఖ్యానించారు.

డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాలి

డీఎంకే ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. తిరుప్పరకుండ్రంలో ఇటీవల జరిగిన కార్తీక దీప వివాదాన్ని ప్రస్తావించారు. కోర్టు ఆదేశాలను కూడా డీఎంకే లెక్కచేయడం లేదని ఆక్షేపించారు. భక్తుల హక్కుల రక్షణకు తాము కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. డీఎంకేలో ఎవరైనా పైకి ఎదగాలంటే వారసత్వం, అవినీతి, మహిళలపై వేధింపుల్లో ప్రమేయం ఉండాలని ఎద్దేవా చేశారు. మన సంస్కృతిని అవమానించేవారికి ఆ పార్టీలో పెద్దపీట వేస్తుంటారని విమర్శించారు. డీఎంకే ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం, పారదర్శకత, జవాబుదారీతనం అంటే ఇష్టం ఉండదని చెప్పారు. కేవలం ఒక్క కుటుంబం కోసం పనిచేస్తోందని మండిపడ్డారు. తమిళనాడులో ఎంత అవినీతి జరిగిందో, ఎవరికి జేబుల్లోకి ఎంత సొమ్ము వెళ్లిందో చిన్నపిల్లలకు కూడా తెలుసని పేర్కొన్నారు. డీఎంకే కబంధ హస్తాల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించడానికి మనమంతా ఒక్కటి కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఎన్నుకుందామని సూచించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం కేంద్రంతో భుజం భుజం కలిపి పనిచేసే ప్రభుత్వం కావాలన్నారు. డీఎంకే పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆక్షేపించారు. డ్రగ్స్, నేరాలు తప్ప ఇక్కడ అభివృద్ధి లేదన్నారు. యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో చిక్కుకున్నారని, మహిళలు వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దివంగత ముఖ్యమంత్రి జయలలిత అధికారంలో ఉన్నప్పుడు నేరాలను కట్టడి చేశారని ప్రధాని మోదీ కొనియాడారు. ప్రస్తుతం డీఎంకే పాలనలో ప్రజలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు.

అది ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్

- ప్రతిపక్షంపై ప్రధాని మోదీ ఆగ్రహం
- కేరళ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా

వేదికపై ప్రధాని మోదీతో సీఎం విజయన్

తిరువనంతపురం: విపక్ష కాంగ్రెస్ అధికారం కోసం సంఘ విద్రోహ శక్తులను ప్రోత్సహిస్తోందని, ముస్లిం లీగ్‌తో అంటకాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్(ఎంఎంసీ)గా మారిపోయిందని ఆరోపించారు. శుక్రవారం కేరళ రాజధాని తిరువనంతపురంలో భారీ బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగించారు. కాంగ్రెస్ దుష్ట రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వారి దుర్మార్గ వ్యూహాలకు కేరళను ప్రయోగశాలగా వాడుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్‌కు అభివృద్ధి అజెండా లేదన్నా రు. మావోయిస్టులను మించిన కమ్యూనిస్టులుగా, ముస్లింలీగ్‌ను మించిన మతతత్వవాదులుగా మారిపోయారని కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. సీపీఎం నేతృత్వంలోని అధికార ఎల్డీఎఫ్ తీరుపై మండిపడ్డారు. శబరిమలలో అయ్యప్ప ఆలయ సంప్రదాయాలను ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. అయ్యప్ప బంగారాన్ని సైతం చోరీ చేశారని విమర్శించారు. కేరళలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే బంగారం చోరీపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. దోషులను గుర్తించి జైలుకు పంపిస్తామన్నారు. ఇదీ మోదీ గ్యారంటీ అని స్పష్టంచేశారు. రాష్ట్రంలో వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఒక్కటేనని విమర్శించారు. అవినీతికి చరమగీతం పాడి అభివృద్ధికి బాటలు వేసే బీజేపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కేరళ ప్రజలకు పిలుపునిచ్చారు. మన నినాదం 'వికసిత్ కేరళం' అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మార్పునకు ఇదే సరైన సమయమని వెల్లడించారు. గుజరాత్‌లో నాలుగు దశాబ్దాల క్రితం తొలుత అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పాగా వేసి, క్రమంగా రాష్ట్రమంతటా విస్తరించామని అధికారం దక్కించుకున్నామని మోదీ గుర్తుచేశారు. అదే తరహాలో కేరళలోని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను గెల్చుకున్నామని, ఇక రాష్ట్రంలో అధికారంలోకి రాబోతున్నామని ధీమా వ్యక్తంచేశారు. గుజరాత్ ఫలితం కేరళలో పునరావృతం అవుతుందన్నారు. తిరువనంతపురం మేయర్‌గా ఎన్నికైన వి.వి.రాజేశ్‌ను బహిరంగ సభ వేదికపై ప్రధాని మోదీ అభినందించారు. ఆయనతో కలిసి చేతులు పైకెత్తి ప్రజలకు అభివాదం చేశారు. తిరువనంతపురం మున్సిపల్ కార్పొ రేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల మోదీ హర్షం వ్యక్తంచేశారు. డిప్యూటీ మేయర్ ఆశానాథ్.. మోదీ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం అందుకున్నారు. ప్రధాని మోదీ కేరళలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు.

ఇరాన్‌పై యుద్ధమేఘాలు!

భారీగా అమెరికా మోహరింపులు

- పశ్చిమాసియాకు తరలుతున్న సైన్యం
- నౌకలు, యుద్ధ విమానాలు, జలాంతర్గాములు
- స్వయంగా ధ్రువీకరించిన ట్రంప్

విమానంలో విలేకరులతో మాట్లాడుతున్న ట్రంప్

వాషింగ్టన్: ఇరాన్‌పై యుద్ధానికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించుకున్నారా? పాలస్తీనాలో యుద్ధానికి తెర దించేందుకు 'శాంతి బోర్డు' ఏర్పాటును ప్రకటించిన మర్నాడే పశ్చిమాసియాను మరోసారి రణరంగంగా మార్చబోతున్నారా? ఆ దిశగా సర్వసన్నాహాలూ శరవేగంగా జరిగిపోతున్నాయా? జరుగుతున్న పరిణామాలు, ట్రంప్ వ్యాఖ్యలను బట్టి చూస్తుంటే అవుననే సమాధానమే వస్తోంది. అమెరికా యుద్ధనౌకలు, యుద్ధవిమానాలు భారీ స్థాయిలో పశ్చిమాసియా వైపు కదులుతున్నాయి. వాటితో పాటు పదాతి సైన్యాన్ని కూడా అమెరికా మోహరిస్తోంది. ఇజ్రాయెల్ కూడా ఐరన్‌డోమ్‌తో పాటు తన రక్షణ వ్యవస్థలన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పటిష్టపరుచుకుంటోంది! దాంతో పశ్చిమాసియాపై మరోసారి యుద్ధ మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నట్టే కనిపిస్తోంది.

అరేబియా దిశగా నౌకలు

యుద్ధ నౌకలు, డిస్ట్రాయర్లు, జలాంతర్గాములు, యుద్ధ విమానాలతో కూడిన భారీ సైనిక పటాలాన్ని ఇరాన్ దిశగా అమెరికా తరలిస్తోంది! ఇటీవలి దాకా దక్షిణ చైనా సముద్రంలో లంగరేసిన యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమానవాహక యుద్ధనౌక అరేబియా సముద్రం కేసి కదులుతోంది. అది జనవరి 20 నాటికే మలక్కా జలసంధిని దాటి హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించింది. ఆ తర్వాత నౌక తన ఆటోమాటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌ను ఆఫ్ చేయడం గమనార్హం. దాంతో ప్రస్తుతం అదెక్కడున్నదీ గుర్తించే వీల్లేకుండా పోయింది. గంటకు 20 నాటికల్ మైళ్లకు మించిన వేగంతో ప్రయాణిస్తున్న నేపథ్యంలో శుక్రవారానికే ఆ నౌక అరేబియా సముద్రంలోకి ప్రవేశించినట్టు భావిస్తున్నారు. ఇరాన్‌లోని లక్ష్యాలను ఢీకొట్టాలంటే అది ఉత్తర అరేబియా సముద్రంలో లంగరు వేయాల్సి ఉంటుంది. పలు డిస్ట్రాయర్ నౌకలు, అణ్వాయుధాలతో కూడిన జలాంతర్గాములు, యుద్ధ విమానాలు అబ్రహం లింకన్‌తో పాటు తరలి వెళ్తున్నాయి. దానిపై కనీసం 60 దాకా అత్యాధునిక ఎఫ్/ఏ-18 యుద్ధ విమానాలున్నట్టు సమాచారం. రీ ఫ్యూయలింగ్ అవసరం లేకుండా ఏకంగా 2,300 కి.మీ. దూరంలోని లక్ష్యాలను చేరగల సామర్థ్యం వాటి సొంతం! అయినా ముందుజాగ్రత్తగా యుద్ధ విమానాలకు గాల్లోనే ఇంధనం నింపే కేసీ-135 ఏరియల్ రీఫ్యూయలర్లను కూడా అమెరికా రంగంలోకి దించుతోంది! ఇక ఐఎస్ఎస్ లింకన్‌కు తోడుగా వెళ్తున్న జలాంతర్గాముల్లో వీటితో పాటు ఒహాయో శ్రేణికి చెందిన అత్యాధునిక గైడెడ్ క్షిపణులుండటం విశేషం. వాటిలో ఒక్కో జలాంతర్గామికీ కనీసం 154 తోమహాక్ క్రూయిజ్ క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యముంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడులు చేసేందుకు అమెరికా సర్వసన్నద్ధంగా ఉన్నట్టే. వీటితోపాటు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాలు కూడా ఇప్పటికే పశ్చిమాసియాలోని పలు సైనిక స్థావరాల్లో మోహరించాయి. ఒక విమానం లాండవుతున్న ఫొటోలను యూఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇవేగాక థాడ్, పాట్రియాట్ వంటి అదనపు క్షిపణి విధ్వంసక వ్యవస్థలను పశ్చిమాసియా పొడవునా, ముఖ్యంగా ఇజ్రాయెల్, ఖతర్‌లోని అమెరికా సైనిక స్థావరాల్లో మోహరిస్తున్నట్టు ఆ దేశ మీడియా వెల్లడించింది.

ఇరాన్‌పై డేగకన్ను: ట్రంప్

అతి పెద్ద అమెరికా సైనిక పటాలం ఇరాన్‌కేసి కదులుతోందని ట్రంప్ విస్పష్టంగా ప్రకటించారు. ''మా కీలక యుద్ధ నౌకలు, డిస్ట్రాయర్లు గల్ఫ్‌కేసి దూసుకెళ్తున్నాయి. వాటన్నింటి దృష్టీ ఇరాన్ మీదే ఉంది'' అని స్పష్టం చేశారు. గురువారం దావోస్ నుంచి వాషింగ్టన్ తిరిగి వెళ్తూ ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''ఇప్పటికిప్పుడు 'పెద్ద నిర్ణయం' తీసుకునే ఉద్దేశం నాకేమీ లేదు. అయితే ఇరాన్‌ను నిశితంగా పరిశీలిస్తున్నాం. బహుశా ఈసారి ఆ దేశంపై మా సైనిక శక్తియుక్తులను ప్రయోగించాల్సిన అవసరం రాకపోవచ్చేమో. కానీ అక్కడి పరిస్థితిని డేగకళ్లతో గమనిస్తున్నాం. చూద్దాం ఏం జరుగుతుందో!'' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.

సీ-17 రవాణా విమానాలూ...

అమెరికాకు చెందిన అత్యంత భారీ సీ-17 సైనిక రవాణా విమానాలు కూడా మూడు రోజులుగా జోర్డాన్‌లోని మఫ్రాక్ అల్ ఖవాజా వైమానిక స్థావరం నుంచి ఇరాన్ సమీపంలోని అమెరికా బేస్‌లకు చక్కర్లు కొడుతున్నాయి. ఇరాన్ దాడిని కాచుకునేందుకు అవి ఇజ్రాయెల్‌కు పాట్రియాట్-3 శ్రేణి క్షిపణులను సరఫరా చేస్తున్నట్టు భావిస్తున్నారు. తమపై దాడి అంటూ జరిగితే ముందుగా ఇజ్రాయెల్ భరతం పడతామని ఇరాన్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ మిత్ర దేశం భద్రత విషయంలో అమెరికా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నట్టు చెబుతున్నారు. ఇవేగాక అవసరాన్ని బట్టి డీగో గార్షియా దీవిలోని వైమానిక స్థావరం నుంచి బీ2 స్టెల్త్ బాంబర్లను కూడా అప్పటికప్పుడు రంగంలోకి దించాలని అమెరికా సైన్యం నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు! లేదంటే నేరుగా అమెరికా నుంచి కూడా వాటిని ఇరాన్ దిశగా తరలించే అవకాశముంది.

ట్రంప్‌వి పచ్చి అబద్ధాలు

దుబాయ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'ఉరిశిక్షల రద్దు' ప్రకటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇటీవలి భారీ నిరసనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న వందలాది మందికి ఇరాన్ ఉరిశిక్షలు విధించినట్టు వార్తలు రావడం తెలిసిందే. అలాగైతే సైనిక చర్య తప్పదన్న తన హెచ్చరికల వల్ల కనీసం 840 ఉరిశిక్షలను ఇరాన్ రద్దు చేసిందని గురువారం కూడా ట్రంప్ ప్రకటించుకున్నారు. అది పచ్చి అబద్ధమని ఇరాన్ న్యాయాధికారి మొహమ్మద్ మొవాహెదీ అన్నారు. 'అసలు ఆ సంఖ్య ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. మా న్యాయవ్యవస్థ అలాంటి నిర్ణయమే తీసుకోలేదు'' అని ఆయన శుక్రవారం చెప్పుకొచ్చారు. మరోవైపు, భారీ నిరసనల్లో మరణించిన వారి సంఖ్యను 3,117గా ఇరాన్ తాజాగా పేర్కొంది. కానీ 5,000 మందికి పైగా మరణించినట్టు హక్కుల సంఘాలు తెలిపాయి.

వాణిజ్యం ఛిన్నాభిన్నమే!

ఇరాన్‌పై అమెరికా యుద్ధానికే దిగితే ప్రపంచ వాణిజ్యం అతలాకుతలం కావడం ఖాయం. ముఖ్యంగా చాలా దేశాలకు చమురు సరఫరా నిలిచిపోనుంది. ఇరాన్ నియంత్రణలోని హార్మూజ్ జలసంధి గుండా రోజుకు ఏకంగా 2 కోట్ల బ్యారెళ్ల మేరకు చమురు రవాణా జరుగుతుంది. యుద్ధ పరిస్థితే వస్తే దాన్ని పూర్తిగా నిలిపేయవచ్చు. అంతేకాదు, ఇరాన్ దగ్గర భారీ పరిమాణంలో ఉన్న యురేనియం పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారుతుంది. దాని వద్ద 10 అణుబాంబుల తయారీకి సరిపోయే 400 కిలోల శుద్ధి చేసిన యురేనియం ఉన్నట్టు అంచనా.

కాంగ్రెస్ కీలక భేటీకి... థరూర్ డుమ్మా

రాహుల్ తీరుపై అసంతృప్తితోనే!

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశిథరూర్‌కు పార్టీతో నానాటికీ దూరం మరింతగా పెరుగుతున్నట్టు కన్పిస్తోంది. కేరళలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో శుక్రవారం ఢిల్లీలో జరిగిన కీలక భేటీకి ఆయన డుమ్మా కొట్టారు. కోజికోడ్‌లో జరుగుతున్న కేరళ సాహిత్య సదస్సులో పాల్గొనాల్సి ఉన్నందున భేటీకి రాలేకపోతున్నట్టు అధిష్టానానికి థరూర్ ముందే సమాచారమిచ్చి అనుమతి తీసుకున్నట్టు ఆయన కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. కానీ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఇటీవల థరూర్‌తో వ్యవహరించిన తీరే ఈ గైర్హాజరీకి కారణమని చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విజేతలను అభినందించేందుకు జనవరి 19న కోచిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన వేడుకలో థరూర్‌ను రాహుల్ అవమానించారని ఆయన సన్నిహి తులు ఆక్షేపిస్తున్నారు. ''వేదికపై థరూర్‌ను రాహుల్ కనీసం పలకరించను కూడా లేదు. ఆయన ప్రసంగంలో కూడా ఇతర నేతలందరి పేర్లు ప్రస్తావించి థరూర్ పేరును మాత్రం విస్మరించారు. పైగా రాహుల్ వేదికపైకి వస్తున్న సమయంలో థరూర్ ప్రసంగిస్తుండగా నిర్వాహకులు బలవంతంగా ఆపేశారు. రాహుల్ ఒక్కరే మాట్లాడతారని చెప్పారు. కానీ రాహుల్ ప్రసంగం తర్వాత చాలామంది నేతలు మాట్లాడారు'' అని వారు చెప్పుకొచ్చారు. ఇవన్నీ థరూర్‌కు చాలా బాధ కలిగించాయని, ఈ ఉదంతంపై ఏఐసీసీ పెద్దలకు ఆయన లేఖ కూడా రాశారని సమాచారం.

గ్రీన్‌లాండ్ దీవుల్లో... కొంతభాగం యూఎస్‌కు!

- అమెరికాతో డెన్మార్క్ సంప్రదింపులు

హామిల్టన్: గ్రీన్‌లాండ్ ద్వీపంపై వివాదానికి తెర దించేందుకు అమెరికా, డెన్మార్క్ నడుమ తెర వెనక విస్తృత చర్చలు సాగుతున్నట్టు తెలుస్తోంది. ప్రపంచంలోకెల్లా అతి పెద్దదైన ఆ దీవి జాతీయ రక్షణ ప్రయోజనాల రీత్యా తమకు కావాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొన్నాళ్లుగా పట్టుబడుతుండటం తెలిసిందే. అందుకు అవసరమైతే బలప్రయోగానికి కూడా వెనకాడబోనని ఒక దశలో ఆయన హెచ్చరించారు. అలాంటి చర్యలకు దిగబోనని తాజాగా దావోస్ సదస్సు వేదికగా చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో మధ్యేమార్గంగా గ్రీన్‌లాండ్‌లోని కొన్ని మారుమూల భూభాగాలను అమెరికాకు అప్పగించేందుకు డెన్మార్క్ సుముఖత వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. తద్వారా ఆ ప్రాంతాల్లో అమెరికా మరిన్ని సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించనుందని సమాచారం.

'ప్రేమ' ఖైదీలు!

రాజస్తాన్ ఓపెన్ జైలులో కిల్లర్ల ప్రేమాయణం

పెళ్లికోసం 15 రోజుల పెరోల్ మంజూరు

ప్రియా సేథ్ హనుమాన్

ఒకరు 'టిండర్' యాప్ పరిచయంతో వ్యాపారవేత్తను ముక్కలు ముక్కలు చేసి సూట్‌కేస్‌లో కుక్కిన హంతకురాలు.. మరొకరు తన ప్రియురాలి కోసం ఆమె భర్తను, ముగ్గురు పిల్లలను బలి తీసుకున్న క్రూరుడు. చట్టం దృష్టిలో వీరు ఇద్దరూ పరమ కిరాతకులు.. జీవిత ఖైదీలు. కానీ, జైలు గోడల సాక్షిగా వీరి మధ్య ప్రేమ పుట్టింది. వినడానికి ఏదో నెట్‌ఫ్లిక్స్ క్రైమ్ సిరీస్‌లా ఉన్నా, ఇది అక్షరాలా నిజం.

జైలు సంస్కరణలతో ప్రేమికులయ్యారు

రాజస్తాన్‌లోని సంగనేర్ 'ఓపెన్ జైలు' వీరికి వేదికైంది. ఖైదీల్లో మార్పు కోసం ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ క్యాంప్‌లో పగటిపూట బయటకు వెళ్లి పని చేసుకుని, రాత్రికి జైలుకు వచ్చే వెసులుబాటు ఉంటుంది. ఈ క్రమంలోనే 31 ఏళ్ల ప్రియా సేథ్, 29 ఏళ్ల హనుమాన్ ప్రసాద్‌లు కలిశారు. ఆరు నెలలుగా వీరిద్దరూ జైలు ఆవరణలోనే 'లివ్-ఇన్' రిలేషన్‌లో ఉండటం విశేషం.

అలాంటిలాంటి క్రూరులు కారు

ప్రియా సేథ్.. 2023లో దేశాన్ని కుదిపేసిన జైపూర్ 'టిండర్-సూట్‌కేస్' మర్డర్ కేసులో నిందితురాలు. దుష్యంత్ శర్మ అనే వ్యాపారవేత్తను ట్రాప్ చేసి, కిడ్నాప్ చేసి, చివరకు చంపేసి మృతదేహాన్ని ముక్కలు చేసి సూట్‌కేస్‌లో దాచిన కిలేడీ. హనుమాన్ ప్రసాద్.. 2017లో ఆల్వార్‌లో తన ప్రియురాలి భర్త, అతని ముగ్గురు కుమారులు, మేనల్లుడిని అత్యంత దారుణంగా చంపిన కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు.

పెళ్లి బాజాలకు పెరోల్

తాము పెళ్లి చేసుకోవాలనుకుంటున్నామని, అందుకు పెరోల్ ఇవ్వాలని వీరిద్దరూ రాజస్తాన్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా పెరోల్ అడ్వైజరీ కమిటీ వీరికి 15 రోజుల పాటు పెరోల్ మంజూరు చేసింది. బుధవారం వీరు పెళ్లి కోసం జైలు నుంచి బయటకు నడిచారు. హనుమాన్ ప్రసాద్ స్వగ్రామంలో వీరి వివాహం జరగనుంది.

బాధిత కుటుంబాల ఆగ్రహం

ఈ నిర్ణయం ఇప్పుడు పెను దుమారాన్ని రేపుతోంది. 'అత్యంత దారుణమైన హత్యలు చేసిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇవ్వడం ఏంటి?'.. అని బాధితుల తరపు న్యాయవాదులు ప్రశ్నిస్తున్నారు. ఈ పెరోల్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మళ్లీ కోర్టు మెట్లు ఎక్కేందుకు వారు సిద్ధమవుతున్నారు. బహుశా.. కటకటాల వెనుక ప్రేమ చిగురించడం, అది పెళ్లి పీటల దాకా వెళ్లడం భారత నేర చరిత్రలో ఇదే తొలిసారి కావచ్చు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

సీటు కోసం కాలిపై వేటు

డాక్టర్ కావాలనుకుని.. దివ్యాంగుడయ్యాడు

జౌన్‌పూర్ (యూపీ): 'నేను 2026లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంబీబీఎస్ డాక్టర్ కావాలి!'.. ఇది తన డైరీలో ఒక యువకుడు రాసుకున్న బలమైన నిశ్చయం. కానీ, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అతను ఎంచుకున్న దారి చదివితే ఎవరికైనా వెన్నులో వణుకు పుట్టాల్సిందే. వైద్య కళాశాలలో సీటు కోసం రిజర్వేషన్ పొందేందుకు ఒక విద్యార్థి తన కాలినే తెగ్గోసుకున్న ఉదంతం ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తోంది.

వరుస వైఫల్యాలతో వికృత ఆలోచన!

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని జౌన్‌పూర్ జిల్లా ఖలీల్‌పూర్ గ్రామానికి చెందిన సూరజ్ భాస్కర్ (20) అనే యువకుడు రెండుసార్లు 'నీట్' పరీక్ష రాసినా ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించలేకపోయాడు. విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనైన సూరజ్, ఎలాగైనా మెడికల్ సీటు కొట్టాలని భయంకరమైన ప్లాన్ వేశాడు. దివ్యాంగుల కోటా ఉంటే తక్కువ మార్కులకే సీటు వస్తుందని గ్రహించిన అతను, తన కాలిని స్వయంగా నరుక్కున్నాడు.

నేరస్తుల దాడి అంటూ 'డ్రామా'!

ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తన తమ్ముడిపై దాడి చేసి, కాలు నరికేసి పారి పోయారని సూరజ్ అన్న పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో కథ మొదలైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. సూరజ్ మాటల్లో పొంతన లేకపోవడం అనుమానాలకు తావిచ్చింది.

దర్యాప్తులో షాకింగ్ నిజాలు

పోలీసులు సూరజ్ ఫోన్‌ను, డైరీని పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. స్వహస్తాలతోనే కాలును వేరు చేసుకున్న సూరజ్, దానిని నేరస్తులపైకి నెట్టేందుకు ప్రయత్నించాడు. దివ్యాంగుల కోటా కింద మెడికల్ సీటు పొందడమే లక్ష్యంగా ఈ దుస్సాహసానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఈ యువకుడు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, తప్పుడు సమాచారం ఇచ్చినందుకు అతనిపై ఏయే సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలో పోలీసులు న్యాయసలహా కోరుతున్నారు. మెడికల్ సీటు కోసం ఒక యువకుడు జీవితాంతం అంగవైకల్యంతో మిగిలిపోయే నిర్ణయం తీసుకోవడం.. అక్షరాలా ఒక సామాజిక అనారోగ్యానికి సంకేతం.

78 ఏళ్ల బంధానికి వీడ్కోలు

డబ్ల్యూహెచ్ఓకు అమెరికా బైబై

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి అనుబంధ ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) నుంచి అమెరికా అధికారికంగా పూర్తిస్థాయిలో వైదొలిగింది. 78 ఏళ్ల బంధాన్ని తెంచేసుకుంది. ఈ విషయాన్ని అమెరికా ప్రభుత్వ వర్గాలు గురువారం ప్రకటించాయి. డబ్ల్యూహెచ్ఓ నుంచి తప్పుకుంటున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏడాది క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సంస్థకు ఇకపై నిధులు ఇవ్వబోమని ఆయన వెల్లడించారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేశారు. డబ్ల్యూహెచ్ఓ సమర్థవంతంగా పని చేయడం లేదని నిందించారు. కోవిడ్-19 విపత్తు, ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కోవడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో విదేశాల్లో పని చేస్తున్న అమెరికా సిబ్బందిని వెనక్కి రప్పించారు. అయితే, అమెరికా ఉపసంహరణ ఇంకా పూర్తి కాలేదని డబ్ల్యూహెచ్ఓ స్పష్టంచేసింది. అమెరికా ప్రభుత్వం తమకు 133 మిలియన్ డాలర్లు బకాయి పడినట్లు వెల్లడించింది. బకాయిలన్నీ చెల్లిస్తేనే ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందని తేల్చిచెప్పింది. 2024, 2025లో చెల్లించాల్సిన సొమ్ము ఇంకా ఇవ్వలేదని పేర్కొంది. బకాయిలు చెల్లించడానికి అభ్యంతరం లేదని అమెరికా అధికారులు సంకేతాలిచ్చారు.

చందమామ అందలేదు

- నా కెరీర్లో అదొక్కటే వెలితి: సునీత
- నాసాలో చేరిందే అందుకని వెల్లడి
- సహచరులు సాధిస్తారని వ్యాఖ్యలు



కోజికోడ్: నాలుగు అంతరిక్ష యాత్రలు! అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఏకంగా 608 రోజులు! 62 గంటలకు పైగా స్పేస్ వాక్‌లు!!! ఇన్ని ఘనతలు సాధించినా, చంద్రునిపై కాలు పెట్టలేకపోయానన్న వెలితి తనకెప్పటికీ ఉంటుందని ఇటీవలే రిటైరైన నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ (60) చెప్పారు. ''చంద్రునిపైకి వెళ్లాలని ఎవరికి మాత్రం ఉండదు! అసలు నేను నాసాలో చేరిందే చంద్రునిపై కాలు పెట్టే లక్ష్యంతో'' అని వెల్లడించారు. ''కనుక మూన్ మిషన్‌లో భాగం కాలేకపోయాననే వెలితి ఉంటుంది. కాకపోతే, నా తోటి వ్యోమగాములు త్వరలోనే మరోసారి ఆ ఘనత సాధించబోతున్నారు. అది తలచుకుంటేనే ఎంతో ఉత్కంఠగా ఉంది'' అని చెప్పారు. కోజికోడ్‌లో జరుగుతున్న కేరళ సాహితీ సదస్సులో సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాసాలో తన 27 ఏళ్ల కెరీర్ గురించిన ఆసక్తికర విషయాలెన్నింటినో పంచుకున్నారు. ''అంతరిక్ష యాత్రల బిజీలో భూమిపై ఉన్న ఎన్నో అద్భుతమైన ప్రదేశాలను ఇప్పటిదాకా చూడలేకపోయా. వాటిలో కేరళ ఒకటి. ఇకపై వాటన్నింటినీ ఒక్కొక్కటిగా పర్యటిస్తా.

ఆ అనుభూతులకు దూరం...

అంతరిక్షంలో ఉన్న సమయంలో చిన్న చిన్న అనుభూతులకు దూరమైన వెలితి మాత్రం బాగా బాధించేదని సునీత గుర్తు చేసుకున్నారు. ''నా కుటుంబీకులతో వీడియో కాల్స్ ద్వారా టచ్‌లో ఉండేదాన్ని. భూమిపై ఎక్కడేం జరుగుతున్నదీ లేటెస్ట్ న్యూస్‌తో సహా ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉండేది. కానీ తొలి చినుకుల స్పర్శ, ముఖానికి పిల్లతెమ్మెరల మృదువైన తాకిడి, బీచ్‌లో కాళ్లకింద మెత్తగా జారిపోయే ఇసుక వంటివి అంతరిక్షంలో కలలోని అనుభూతులే. వీటన్నింటికీ మించి నా బుజ్జి పెంపుడు కుక్కలకు దూరంగా గడపాల్సి వచ్చేది. తల్లి వంటి భూమికి, ఆ వాతావరణానికి, అక్కడి అనుభూతులకు, చెట్లు, చేపలు తదితరాలకు దూరంగా ఉండటం బాధించేది'' అని చెప్పుకొచ్చారు. తొలి అంతరిక్ష యాత్ర సందర్భంగా నాన్న తనకు ఫోన్ చేసి, భారత్‌వ్యాప్తంగా అందరూ తాను క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థిస్తున్నారని చెబితే నమ్మలేకపోయానని కూడా సునీత గుర్తు చేసుకున్నారు. ''నేను నమ్మను పొమ్మన్నా. కానీ అది నిజమేనని తిరిగొచ్చాక పత్రికల్లో వార్తలు, వ్యాసాలు చూస్తే తెలిసింది.

భయమే అన్పించలేదు

అంతరిక్ష యాత్రల్లో ఏనాడూ భయం తన దరిదాపుల్లోకి కూడా రాలేదని సునీత గుర్తు చేసుకున్నారు. సునీత, బచ్ విల్మోర్‌లతో బయల్దేరిన బోయింగ్ తొలి అంతరిక్ష నౌక స్టార్‌లైనర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానమయ్యే క్రమంలో సాంకేతిక వైఫల్యాలను ఎదుర్కొనడం, 8 రోజుల యాత్ర కాస్తా 286 రోజుల పాటు సాగడం తెలిసిందే. ''అప్పుడు కూడా అస్సలు భయం అనిపించలేదు. నాసా సైంటిస్టులపై పూర్తి నమ్మక ముంచా. నా సహచరుడు విల్మోర్, నేను కూడా మా పరస్పర సామర్థ్యాలను పూర్తిగా నమ్మాం. మా దృష్టినంతా సమస్యను ఎలా పరిష్కరించాలా అన్నదానిపైనే కేంద్రీకరించాం'' అని ఆమె వివరించారు. కేరళ సాహితీ సదస్సులో సాహిత్యం నుంచి సినిమాల దాకా పలు రంగాలకు చెందిన హేమాహేమీలు పాల్గొంటున్నారు.

ఎక్కడో హిమాలయాల్లో ప్రాథమిక స్కూల్లో పని చేసే నా స్నేహితురాలు ఫోన్ చేసి, 'మా స్కూల్లో నీ ఫొటో ఉంది తెలుసా!' అని చెప్పినప్పుడు చెప్పలేని అనుభూతి కలిగింది. భారత్ నన్ను నిజంగా సొంత కూతురిలా అక్కున చేర్చుకుంది'' అంటూ హర్షం వెలిబుచ్చారు.

నాటో పాత్రను చులకన చేస్తారా!

ట్రంప్ క్షమాపణ చెప్పాలన్న స్టార్మర్

లండన్: అఫ్గానిస్తాన్‌లో యుద్ధం సమయంలో అమెరికా బలగాలు మాత్రమే ముందుండగా నాటో దేశాల బలగాలు దూరంగా ఉండిపోయాయని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై యూకే ప్రధానమంత్రి స్టార్మర్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన అవమా నకరమైన వ్యాఖ్యలతో దిగ్భ్రాంతిచెందాను. ఆ వ్యాఖ్యలు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారి కుటుంబ సభ్యులకు, అలాగే దేశ ప్రజలకు తీవ్ర వేదన కలిగించాయి'అని స్టార్మర్ పేర్కొన్నారు. అఫ్గానిస్తాన్‌లో నాటో బలగాలు సాహసోపేతంగా పోరాడాయని, దేశం కోసం త్యాగాలు చేశాయని స్టార్మర్ కొనియాడారు. నాటో బలగాల గురించి అవమానకరంగా మాట్లాడినందుకు క్షమాపణ చెప్పాలని ట్రంప్‌ను ఆయన కోరారు. అవసరమైనప్పుడు అమెరికాకు మద్దతు ఇవ్వడానికి నాటో సిద్ధంగా ఉంటుందన్న తనకు నమ్మకం లేదని ట్రంప్ దావోస్‌లో ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'మాకు నాటో అవసరం ఎప్పుడూ రాలేదు, మేం వారిని నిజానికి ఏమీ అడగలేదు. నాటో దేశాల వారు అఫ్గానిస్తాన్‌కు, ఇతర ప్రాంతాలకు కొన్ని దళాలను పంపించారు. కానీ, వారు ముందు వరుసలో ఉండటానికి బదులు వెనుకనే ఉండిపోయారు'అని ట్రంప్ వ్యాఖ్యానించడం తీవ్ర దుమారం రేపింది.

WHY DIAMOND APPEARS MORE BRIGHTER?

LIGHT REFLECTION AND REFRACTION

KEY WORDS

- **Plane mirror:-** A flat mirror that reflects light and forms virtual images.
- **Parallel Beams:-** Light rays that are traveling in the same direction and do not converge or diverge.
- **Concave Lens:-** A Lens that is thinner at the center and thicker at the edges.
- **Convex Lens:-** A lens that is thicker at the center and the the thinner at the edges.
- **Dispersion:** The process of separating light into its component colours.
- **Angle of incidence:** It is the angle between the incident ray and the normal to the reflecting surface of the point of incidence. It is denoted by i.
- **Plane of reflection:** The plane in which the incident ray, reflected ray and normal will lie is called the plane of reflection.
- **Lateral inversion:** The sideways reversal of the image in a plane mirror is known as lateral inversion.
- **Angle of reflection:** It is the angle between the reflected ray and the normal to the reflecting surface at the point of incidence. It is denoted by r.
- **Normal:** The line drawn perpendicular to the reflecting surface at the point of incidence is called the normal at that point.
- **Object distance:** It is the distance between the object and pole of the mirror. It is denoted by 'u'.
- **Radius of curvature:** It is the radius of the sphere of which the mirror forms a part.
- **Focus/Focal point:** It is the point on the principal axis where a beam of light parallel to the principal axis either actually converges into or appears to diverges from after reflection from the mirror.
- **Pole:** It is the mid point of the spherical mirror.
- **Principal axis:** The line passing through the pole and the centre of curvature of the mirror is called its 'principal axis'.
- **Focal length:** It is the distance between the principal focus and the pole of the mirror.
- **Real image:** If a beam of rays starting from a point source of light, after reflection or refraction actually converges to a point then the second point is called the real image of the first.
- **Image distance:** It is the distance between the image and pole of the mirror. It is denoted by V.
- **Virtual image:** If a beam of rays starting from a point source of light, after reflection or refraction, appears to diverge from another point, then the second point is called the virtual image of the first.
- **Centre of curvature:** It is the centre of the sphere of which the mirror forms a part.
- **Laws of reflection:**
  a) When light gets reflected from a surface the angle of incidence is equal to the angle of reflection.
  b) The incident ray, the normal to the point of reflection and the reflected ray will lie in the same plane.
- **Refraction:** The Process of changing speed at an interface when light travels from one medium to another resulting in a change in direction is refraction of light.
- **Rarer medium:** Any medium in which the velocity is comparatively less is known as rarer medium
- **Denser medium:** Any medium in which the velocity is comparatively more is known as denser medium.
  - When light enters from one medium to another, the light ray bends at the interface of the two media.
  - When light enters from rarer medium to denser medium the refracted ray bends towards the normal. In this case $\angle i > \angle r$
  - When light enters from denser to rarer medium, the refracted ray moves away from the normal. In this case $\angle i < \angle r$
- **Snell's law:** The relation between angle of incidence and angle of Refraction is given by Snell's law.

$$\frac{\text{Sin}\, i}{\text{Sin}\, r} = \text{Constant (or)}$$

$$n_1 \text{ Sin } i = n_2 \text{ Sin } r$$

- **Refractive index (n):** Refractive index is the property of a medium through which we can say how fast or slow the light travels in that medium.

Refractive index $n = \frac{C}{V}$

C = Speed of light in vacuum
V = Speed of light in medium

- **Relative refractive index:** The refractive index of one medium (n_1) with respect to another medium (n_2) is the relative refractive index.
  Relative refractive index (n_{21})

$$= \frac{\text{Refractive index of second medium}(n_2)}{\text{Refractive index of first medium}(n_1)}$$

$$\text{(or)} \frac{n_2}{n_1} = \frac{v_1}{v_2}$$

Where v_1 and v_2 are the speeds of light in medium (1) and medium (2).

- **Optical centre:** The geometric centre of the lens (or) the point situated within the lens through which a ray if light passes undeviated is called optical centre (p) of the lens.
- **Lens:** It is a portion of a transparent medium bounded by two surfaces, at least one of them is a curved surface.
- **Focal length:** The distance between the principal focus and the optical centre of the lens.
- **Centre of curvature:** The centre of curvature of the surface of a lens is the centre of the sphere of which it forms a past. It is denoted by 'C'.
- **Principal axis:** It is the imaginary line passing the two centres of curvature of the lens and passes through optic centre is called as principal axis.
- **Focus:** A beam of light parallel to the principal axis either converges to a point or appears to diverge from a point on the principal axis after refraction through the lens. This point is called 'principal focus'.
- **Radius curvature:** The distance between centre of curvature and the 'curved surface is known as radius curvature. It is donated by 'R'.
- **Some points to remember about curved surfaces:**
  a) The bulged out surface is known as convex surface.
  b) The bulge in surface is known as concave surface.
  c)



  - For a curved mirror 'P' is the pole, 'F' is the principal focus, 'C' is the centre of curvature.
  - The distance between P and F is known as focal length (f) and the distance between P and C is radius of curvature (r)
    r = 2f
- **Rules to draw a ray diagram:**
  - Any ray passing parallel to principal axis and incidents on mirror, passes through principal focus after reflection.
  - Any ray passes through principal focus and incidents on mirror, passes parallel to principal axis after reflection.
  - Any ray passes through centre of curvature and incidents on mirror, traces the same path backwards after reflection.

1 Mark Questions

1. Write the mirror formula.

A. $\frac{1}{f} = \frac{1}{u} + \frac{1}{v}$

2. Which Image formation in a convex mirror?

A. In convex mirror, the image is always erect, virtual and smaller than the object.

3. Define Magnification:

A. $m = \frac{\text{size of image } (h_i)}{\text{size of object } (h_o)}$

(or) $\frac{-\text{image distance } (v)}{\text{objects distance } (u)}$

4. The magnification produced by a mirror is –1. What does it mean?

A. The image is real, inverted and the size of image is equal to the size of the object.

5. Why does the image suffer lateral inversion in a plane mirror?

A. While looking into the mirror, our brain feels that the ray is coming from the inside of the mirror. That is why the image in the mirror suffers lateral inversion.

6. Write a list of materials required to perform the experiment to find the position and nature of images by a concave mirror?

A. Concave mirror V-stand, optical bench screen, candle, match box, pencil, scale.

Continued on next page..

2 Marks Questions

1. Find the focal length of a lens of Power –2.0 D. What type of lens is this

Given Power $P = -2D$

A. $P = \frac{100}{f(cm)}$

$f(cm) = \frac{100}{P} = \frac{100}{-2} = -50\,cm$

focal length f = –50cm, since f is negative, lens is concave

2. A Doctor has prescribed a Corrective lens of power +1.5 D. Find the focal length of the lens. Is the prescribed Lens diverging (or) converging.

A. $power\ of\ lens(P) = +1.5D\ P = \frac{100}{f(cm)}$

$f(cm) = \frac{100}{P} = \frac{100}{1.5} = \frac{100}{15} = 66.67\,cm.$

focal length f = 66.67 cm.

The Lens is convex lens (diverging) because f is positive.

3. The refractive index of glass is 1.5 then what is the speed of light in glass?

A. Refractive index of glass

$n = 1.5 = \frac{15}{10} = \frac{3}{2}$

Speed of light in vacuum (c) $= 3 \times 10^8$ m/sec

$\text{Refractive index (n)} = \frac{C}{V}$

$\frac{3}{2} = \frac{3 \times 10^8 m/sec}{V}$

$3V = 3 \times 2 \times 10^8$ m/sec

∴ Velocity of light in glass

$V = 2 \times 10^8$ m/sec

4. The critical angle of benzene is 42°. Determine its refractive index.

A. Critical angle of benzene c = 42°

∴ Sin c = sin 42° = 0.67

$\text{Sin}\,c = \frac{1}{n_{12}} \Rightarrow 0.67 = \frac{1}{n_{12}}$

$n_{12} = \frac{1}{0.67} = 1.5$

∴ Refractive index of benzene = 1.5

5. Draw a ray diagram showing the ray tracking when light travels from denser to rarer medium. What do you conclude?

A.



I conclude that $\angle i < \angle r$

6. Write the characteristics of image formed by a plane mirror.

A. The image formed in a plane mirror is

a) Erect b) Virtual

c) Size of image is equal to the size of the object

d) The image suffers lateral inversion

7. Why diamond appears more brighter?

A. Total internal reflection is the main reason for brightness of diamond.

The critical angle of a diamond is very low. So, if a light ray enters a diamond it is very likely to undergo total internal reflection which makes the diamond shine.

8. The focal length of a converging lens is 20 cm. An object is 60 cm from the lens. Where will the image be formed and what kind of image is it?

A. Given Focal length of converging lenses (f) = 20 cm.

Object distance (u) = 60 cm

Image distance (v) = ?

Lens formula $\frac{1}{f} = \frac{1}{v} - \frac{1}{u}$

(Here u is negative, v is positive and f is +ve)

$\therefore \frac{1}{f} = \frac{1}{v} - \frac{1}{u}$

$\frac{1}{v} = \frac{1}{f} - \frac{1}{u} \Rightarrow \frac{1}{20} - \frac{1}{60} \Rightarrow \frac{3-1}{60} \Rightarrow \frac{2}{60} \Rightarrow \frac{1}{30}$

∴ v = 30 cm

Here a real, diminished and inverted image is formed.

9. A double convex lens has two surfaces of equal radii 'R' and refractive index n = 1.5 Find the focal length 'f'.

A. Given, Radius of curvature $R_1 = R_2 = R$

Refractive index n = 1.5

Focal length of the lens, f = ?

Lens maker's formula

$\frac{1}{f} = (n-1)\left(\frac{1}{R_1} - \frac{1}{R_2}\right)$

For double convex lens, R_1 is positive, R_2 is negative.

$\therefore \frac{1}{f} = (n-1)\left[\frac{1}{R_1} + \frac{1}{R_2}\right]$

$\frac{1}{f} = (1.5-1)\left(\frac{1}{R} + \frac{1}{R}\right)$

$\frac{1}{f} = 0.5\left(\frac{2}{R}\right) = \frac{1}{R}$

$\boxed{\therefore f = R}$

∴ The focal length of the double convex lens is 'R'.

10. Pose any two questions on the Concept of Refraction of Light.

A. 1) What is meant by refraction of light?

2) During refraction, does light-follow the laws of refraction.

3) How does refraction occurs in different mediums?

4) What happens when light enters one transparent medium to another?

5) What are some examples of Refraction in daily Life? why is the tungsten used almost exclusively for filament of electric Lamps.

11. Why do we prefer a Convex mirror as a rear-view mirror in vehicles.

A. Convex mirror always forms virtual, erect and diminished images irrespective of distance of the object and also enables a driver to view large area of the traffic behind him.

12. Distinguish between real and virtual images.

A.

Real Image	Virtual Image
1. Real image is formed due to converging of light rays.	1. Virtual image is formed due to diverging of light rays.
2. This image can be formed on screen.	2. This image cannot be formed on screen.
3. Generally this image is inverted.	3. Generally this image is erect.
4. It cannot be seen in the mirror.	4. It can be seen in the mirror.

13. One-half of a Convex Lens is covered with a black paper. Will this lens produce complete image of the object. Explain your observations.

A. When the lower half of a convex lens is covered with a black paper. It still forms the complete image of the object as that with uncovered lens. But the intensity of the image is reduced when one half of a the convex lens is covered with a black paper.

AV Sudhakar
School Assistant (PS),
ZPPHS Chennarayunipalem,
Bogole (M), SPSR Nellore

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. According to modern atomic theory, an 'orbital' is defined as:

a) A fixed circular path an electron follows around the nucleus.

b) The path an electron takes when moving between energy levels.

c) The region of space where the probability of finding an electron is highest.

d) The exact physical location of a proton within the nucleus.

2. How many quantum numbers are typically used to fully describe the state of an electron in an atom?

a) Two b) Three c) Four d) Five

3. The labels 's, p, d, and f' are used to categorize which of the following?

a) Principal energy levels

b) Sub-shells

c) Magnetic spins

d) Atomic masses

4. Which principle states that orbitals of the lowest energy must be occupied before those of higher energy?

a) Pauli Exclusion Principle

b) Hund's Rule

c) Aufbau Principle

d) Heisenberg Uncertainty Principle

5. Which rule states that no two electrons in the same atom can have the exact same set of four quantum numbers?

a) Aufbau Principle

b) Pauli Exclusion Principle

c) Hund's Rule

d) Dalton's Atomic Theory

క్లుప్తంగా...

నీరు విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం

- కేసీ కెనాల్ ఆయకట్టు రైతుల ఆందోళన
- పంటలు ఎండుతున్నా పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం

నందికొట్కూరు: మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోయారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండల పరిధిలోని మల్యాల ఎత్తిపోతల పథకం ఎదుట శుక్రవారం శాతనకోట, మల్యాల గ్రామాలకు చెందిన 100 మంది రైతులు ధర్నాకు దిగారు. నీరు లేక రబీ సీజన్‌లో వేసిన మొక్కజొన్న, కంది, వరి పంటలు ఎండిపోతున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతులను ఇబ్బంది పెడుతున్న టీడీపీ ప్రభుత్వానికి భవిష్యత్‌లో పుట్టగతులుండవని హెచ్చరించారు. ఓట్లు దండుకోవడానికి రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఒరిగిందేమీ లేదని ధ్వజమెత్తారు. కేసీ కెనాల్‌కు తక్షణమే సాగునీరు విడుదల చేసి పంటలు ఎండిపోకుండా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆత్మహత్యలకు పాల్పడడం తప్ప వేరే మార్గం లేదని రైతులు వాపోయారు. జగనన్న పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించి అన్నదాతలకు అండగా నిలిచారని స్పష్టం చేశారు.

బైబిల్ మిషన్ సభలకు ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): గుంటూరు జిల్లా, నంబూరులో ఈ నెల 24 నుంచి 27 వరకు జరిగే 88వ బైబిల్ మిషన్ వార్షికోత్సవ సభలకు వచ్చే భక్తులు, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కాకినాడ టౌన్ – గుంటూరు మధ్య అన్ రిజర్వ్‌డ్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. సర్వీసు నంబర్ 07625 కాకినాడ టౌన్–గుంటూరు ప్రత్యేక రైలు ఈ నెల 26న ఉదయం 5.30 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, 11.45 గంటలకు గుంటూరు చేరుకుంటుందని తెలిపారు.

జాతీయ స్థాయి కబడ్డీ చాంపియన్ హరియాణా

హరియాణా జట్టు సభ్యులతో నాయకులు

గుడివాడ టౌన్ : కృష్ణా జిల్లా గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఐదు రోజులుగా జరుగుతున్న 69వ జాతీయ అండర్ – 14 బాలికల కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో హరియాణా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో హిమాచల్‌ప్రదేశ్, హరియాణా జట్లు పోటీపడ్డాయి. హరియాణాకు 51 పాయింట్లు రాగా, హిమాచల్ ప్రదేశ్ 24 పాయింట్లకే పరిమితమైంది. 3, 4 స్థానాల కోసం మహారాష్ట్ర, తమిళనాడు పోటీపడగా మహారాష్ట్ర 34, తమిళనాడు 16 పాయింట్లు సాధించాయి. మహారాష్ట్ర విజయం సాధించడంతో 3వ స్థానం దక్కింది. తమిళనాడు 4వ స్థానంతో సరిపెట్టుకుంది. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో విజేతలకు షీల్డ్‌లు అందజేశారు.

ఏకాత్మ మానవతా సిద్ధాంతమే వికసిత్ భారత్‌కు మార్గదర్శి

సాక్షి, అమరావతి/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): స్వాతంత్య్రం వచ్చాక చాలా మంది నాయకులు సోషలిజం, కమ్యూనిజం వంటి ఆచరణ సాధ్యంగాని పాశ్చాత్య సిద్ధాంతాలను దేశ ప్రజలపై బలవంతంగా రుద్దారని బీజేపీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నేతలు పేర్కొన్నారు. దేశ సమగ్ర స్వరూపానికి పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1965లోనే ప్రవచించిన ఏకాత్మ మానవతా సిద్ధాంతం ఇప్పుడు వికసిత్ భారత్‌కు మార్గదర్శకంగా మారిందని చెప్పారు. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా '60 సంవత్సరాల ఏకాత్మ మానవ దర్శనం పునఃస్మరణ' పేరిట విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో బీజేపీ ఏపీ శాఖ నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ ఆనాటి జనసంఘ్ జాతీయ సదస్సు జరిగిన తీరును వివరించారు. బీజేపీ జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి సంతోష్, ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారణి రాంమాధవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, రక్షణరంగ నిపుణుడు, ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేష్, పాకా వెంకటసత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు పెన్మత్స విష్ణుకుమారరాజు, వై.సుజనాచౌదరి, ఆదినారాయణరెడ్డి, పి.వి.పార్థసారథి పాల్గొన్నారు.

నా రేటు ఏంటో వాడు చెప్పేదేంది?

పేర్ని నానిపై మంత్రి అనగాని వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి : 'నా రేటు ఏంటో వాడు చెప్పేదేంది.. వాడి బతుకేంటో నాకు తెలుసు.. నా రేటేంటో, నా ఖర్చు ఏంటో.. నా చరిత్ర ఏంటో.. నేను ఎంత కష్టపడి నిజాయితీగా పైకి వచ్చానో ప్రజలందరికీ తెలుసు' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నానిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన సచివాలయంలో తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. వాళ్లకు పదవులంటే డబ్బు సంపాదన అని, తానెప్పుడూ ప్రజల కోసం పనిచేసే వాడినని అన్నారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ వ్యాఖ్యలు చేసిన పేర్ని నానిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అతన్ని ఇంటికే పరిమితం చేసినా.. కారుకూతలు, పిచ్చికూతలు మానలేదని మండిపడ్డారు. 'తాడేపల్లి ప్యాలెస్ బయట తిరిగే డ్యాష్‌లు' అని వ్యాఖ్యానించారు.

గగనతల ఆధిపత్యమే లక్ష్యం

ఐఎన్ఎస్ డేగాలో అత్యాధునిక ఏవియేషన్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణానికి శంకుస్థాపన

- యుద్ధ విమానాల నిర్వహణ, లాజిస్టిక్ రంగంలో స్వయం సమృద్ధి దిశగా అడుగులు
- చైనా సవాళ్లను ఎదుర్కొనేలా తూర్పు తీర రక్షణ కవచం మరింత బలోపేతం
- మిగ్ 29కే స్క్వాడ్రన్, పీ 8ఐ, ఎంహెచ్ 60ఆర్ నిర్వహణకు రంగం సిద్ధం
- అధునాతన ట్రాకింగ్ సిస్టమ్‌తో ఇక్కడి నుంచే యుద్ధ విమాన విడిభాగాల నిర్వహణ

ఎంహెచ్ 60ఆర్ హెలికాప్టర్లు

సాక్షి, విశాఖపట్నం : హిందూ మహా సముద్రంలో మారుతున్న వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా భారత నౌకాదళం తన సామర్థ్యాన్ని శరవేగంగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖపట్నం మరో కీలక మైలురాయికి వేదికగా మారుతోంది. నౌకాదళ నేవల్ బేస్ ఐఎన్ఎస్ డేగాలో అత్యాధునిక విమానయాన మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా ఈ నెల 21న అత్యాధునిక ఏవియేషన్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనిద్వారా యుద్ధ విమానాల నిర్వహణ, లాజిస్టిక్స్ రంగంలో స్వయం సమృద్ధి దిశగా నౌకాదళం కీలక అడుగు వేయనుంది. ఓవైపు అణ్వాయుధ పరీక్షల్లో తనదైన ముద్ర వేస్తున్న తూర్పు తీరం... రక్షణ వ్యవస్థలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించే దిశగా దూసుకుపోతోంది. సముద్ర జలాల పరిరక్షణ, ప్రపంచ వాణిజ్య కార్యకలాపాల భద్రతకు అవసరమైన వ్యవస్థలు తూర్పు నౌకాదళంలో ఒక్కొక్కటిగా కేంద్రీకృతమవుతున్నాయి. యుద్ధ నౌకల పహారాతోపాటు గగనతలంలోనూ 'వాయు' వేగంగా స్పందించే అధునాతన వ్యవస్థలకు కేంద్ర బిందువుగా మారుతోంది. తూర్పు తీరం వెంబడి 2,562 కిలోమీటర్ల విస్తీర్ణంలో స్థావరాల్ని ఏర్పాటు చేసిన ఈఎన్‌సీ.. ఇప్పుడు యుద్ధ విమానాలకు సంబంధించి సరికొత్త వ్యవస్థను తనలో ఇముడ్చుకోనుంది.

శంకుస్థాపన అనంతరం ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ భల్లా, అధికారులు

మిగ్ 29కే స్క్వాడ్రన్

యుద్ధ విమానాల 'లాజిస్టిక్స్' హబ్

ఐఎన్ఎస్ డేగాలో ఉన్న మెటీరియల్ ఆర్గనైజేషన్ (విశాఖపట్నం)కి ఆనుకుని చేపట్టిన ఈ ప్రాజెక్ట్ కేవలం భవన నిర్మాణం కాదు.., ఇదొక టెక్నాలజీ హబ్‌గా చెప్పుకోవచ్చు. యుద్ధం జరిగేటప్పుడు ఆయుధం ఎంత ముఖ్యమో, దానికి సప్లై చైన్ కూడా అంతే ముఖ్యం. నౌకాదళం తన అమ్ములపొదిలో ఉన్న అత్యాధునిక యుద్ధ విమానాలు, గస్తీ విమానాలు, హెలికాప్టర్లను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు వాటికి అవసరమైన విడిభాగాలను ఆటోమేటెడ్ గిడ్డంగులు, అధునాతన ట్రాకింగ్ సిస్టమ్స్‌తో నిల్వ చేయడం, అత్యవసర సమయాల్లో తక్షణమే ఫ్రంట్‌లైన్‌కు పంపించడం ముఖ్యం. మెటీరియల్ ఆర్గనైజేషన్ పరిధిలో నిర్మిస్తున్న ఈ 'ఏవియేషన్ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' కీలకంగా మారనుందని నౌకాదళ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

కీలక విమానాల నిర్వహణకు బలం

అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి రానున్న ఈ సరికొత్త ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రధానంగా మూడు రకాల కీలక వైమానిక దళాలకు ఊపిరిపోయనుంది. విమానవాహక నౌకల నుంచి నిప్పులు కురిపించే మిగ్ – 29కే యుద్ధ విమానాల స్క్వాడ్రన్‌ను తూర్పు తీరంలో మోహరించడానికి ఈ సదుపాయాలు అత్యంత కీలకంగా మారనున్నాయి. అదేవిధంగా సముద్ర గర్భంలో దాగి ఉన్న శత్రు జలాంతర్గాములను వేటాడే 'హంటర్' విమానాలుగా పిలిచే పీ – 8ఐ నిర్వహణకు ప్రధాన స్థావరంగా మారబోతోంది. దీంతోపాటుగా రాత్రి, పగలు తేడా లేకుండా సముద్రంలో గస్తీ నిర్వహిస్తూ గగనతల రోమియోలుగా పిలిచే ఎంహెచ్ – 60ఆర్ సీహాక్ హెలికాప్టర్ల నిర్వహణకు అవసరమైన హ్యాంగర్లు ఇక్కడకు రాబోతున్నాయి.

డ్రాగన్‌పై పైచేయి సాధించేలా...

హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా నౌకాదళ కదలికలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ వ్యూహాత్మకంగా చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి యుద్ధ విమాన వాహక నౌకలు తూర్పు తీరంలో మోహరించినప్పుడు, వాటికి అవసరమైన పూర్తి స్థాయి వైమానిక మద్దతును విశాఖ నుంచే అందించేలా ఈ ప్రణాళిక రూపొందించారు. పూర్తి స్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో రక్షణ రంగాన్ని బలోపేతం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్ట్ అద్దం పడుతోంది. విదేశాలపై ఆధారపడకుండా, మన విమానాలకు మనమే మరమ్మతులు చేసుకునేలా, ఆధునీకీకరించుకునేలా ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు శంకుస్థాపనతో తూర్పు నౌకాదళం కేవలం సముద్రం మీదే కాకుండా గగనతలంలోనూ తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి సిద్ధమైందని నౌకాదళ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. విశాఖపట్నం ఇప్పుడు కేవలం నౌకాదళ కేంద్రమే కాకుండా దక్షిణాసియాలోనే అత్యంత కీలకమైన వైమానిక రక్షణ కేంద్రంగా అవతరించనుంది.

రీ సర్వే క్రెడిట్ చోరీ ముమ్మాటికీ నిజం

- వైఎస్ జగన్ భూ సర్వే తప్పయితే ఎందుకు కొనసాగిస్తున్నారు?
- సూటిగా ప్రశ్నించిన మాజీ మంత్రి పేర్ని నాని
- వాస్తవాలు దాచి రెవెన్యూ మంత్రి అవాకులు, చవాకులు
- జగన్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఉన్మాదిలా వ్యాఖ్యలా?

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల సమగ్ర రీ సర్వేను తామే చేసినట్లు చంద్రబాబు క్రెడిట్ చోరీ చేయడంపై వైఎస్ జగన్ ప్రశ్నలకు బదులివ్వకుండా.. ఎదురుదాడి చేస్తున్న రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ తీరుపై మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ హయాంలో వంద శాతం కచ్చితత్వంతో తొలిసారి భూ సర్వే చేపడితే.. దాన్నే ఇప్పటికీ కొనసాగిస్తూ తిరిగి ఆయనపైనే విమర్శలు చేయడాన్ని పేర్ని తప్పుపట్టారు. భూ సర్వేతో పాటు, పాస్ బుక్స్ విషయంలోనూ రెవెన్యూ మంత్రి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. భూసర్వే గురించి మాట్లాడకుండా మంత్రి సత్యప్రసాద్ మాజీ సీఎం వైఎస్ జగన్‌పై వ్యక్తిగతంగా దాడిచేస్తూ.. బూతులు మాట్లాడుతుండటం దారుణం అన్నారు. సంస్కార హీనంగా అవాకులు, చవాకులు పేలుతూ ఆటవిక సమాజంలోకి పయనించడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న కర్మ అన్నారు. ఇలాంటి సంస్కార హీనుడు రెవెన్యూ మంత్రిగా ఉంటూ ఉన్మాదిలా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. 'వైఎస్ జగన్ హయాంలో రైతులకు ఇచ్చిన పాస్ బుక్‌పై రాజముద్ర ఉంది. జగన్ ఇచ్చిన పాస్ పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ కొడితే ఏమీ రావట్లేదన్నారు. ఇప్పుడు మేం కొడితే వస్తోందిగా.. (క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి చూపించారు). గతంలో మా ప్రభుత్వం చేసిన సర్వేలో నమోదు చేసిన వివరాలే ఇప్పుడూ వస్తున్నాయి. జగన్ ప్రభుత్వం సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో మాత్రమే ఇప్పుడు జియో కోఆర్డినేట్స్ వస్తున్నాయి. ఆయన చేసిన సర్వేను వాడుకుని ఆయనపైనే బురద జల్లుతున్నారు' అని చెప్పారు. ఈ సందర్భంగా పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే...

భూ సర్వే గురించి మీకు ఏం తెలుసు?

1802లో దేశంలో మొదటి సారి భూ సర్వే చేశారు. అప్పుడు గ్రేట్ ట్రిగోనోమెట్రికల్ సర్వే (జీటీఎస్) చేశారు. మళ్లీ 1926లో మొదలుపెట్టి 1932లో పూర్తి చేశారు. మనుషులు చైన్‌ను లాగిన విధానంపై ఈ సర్వే ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఇందులో తప్పొప్పులు ఉంటాయి. ఏపీ మినహా చాలా రాష్ట్రాల్లో రీసెటిల్మెంట్ రిజిస్టర్ ప్రకారం జరిగిన ఆ సర్వేనే అనుసరిస్తున్నారు. జగన్ చేయించిన సర్వే నుంచి ఇప్పటి వరకు రీ సర్వే ల్యాండ్ రిజిస్టర్ (ఆర్ఎల్ఆర్) పేరుతో వివరాలు వస్తున్నాయి. తక్కెళ్లపాడులో భూ సర్వే పైలట్ ప్రాజెక్టుగా మొదలు పెట్టామని మీరు చెబుతున్నారు. ఇప్పుడు దాన్ని ఎందుకు కొనసాగించట్లేదు? జగన్ ప్రభుత్వంలో అమలు చేసిన శాటిలైట్ కోఆర్డినేట్స్ సర్వేనే ఇప్పటికీ ఎందుకు అమలు చేస్తున్నారు? ట్రెండ్ సెట్టర్లు అని చెప్పుకుంటున్న వారు మీరు చెబుతున్న భూ సర్వేను అమలు చేయాలి కదా? అసలు రెవెన్యూ మంత్రికి భూ సర్వే గురించి ఏం తెలుసు? జగన్ చేయించిన సర్వే అత్యంత కచ్చితమైనది. శాటిలైట్ ద్వారా చేయించిన సర్వే అది. రాష్ట్రంలో 70 బేస్ స్టేషన్లు పెట్టి జియో కోఆర్డినేట్స్ ద్వారా ఈ సర్వే చేయించారు. ఇప్పుడు ఎక్కడైనా సర్వే చేయాలంటే జగన్ పెట్టిన బేస్ స్టేషన్లు, రోవర్లు వాడాల్సిందే. ఆయన దారిలోనే నడుస్తూ ఆయన్ను విమర్శించడం మీ కుసంస్కారానికి నిదర్శనం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేసిన సాయిప్రసాద్.. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఈ సర్వే కచ్చితత్వం గురించి చెప్పారు. ఆయన మాట్లాడిన విషయాలు తప్పయితే రేపు ఆయన్ను సీఎస్‌గా నియమించకండి.

22-ఏ, సర్వే రాళ్ల పైనా అబద్ధాలే

22 –ఏ జాబితాలో భూముల విషయంలోనూ ప్రభుత్వ పెద్దలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. వైఎస్ జగన్ రూ.700 కోట్లు పెట్టి రాళ్లు వేశారని ఆరోపిస్తున్న చంద్రబాబు.. ఆయన పేరు తీసేయడానికి రూ.15 కోట్లు ఖర్చు పెడుతున్నారు. జగన్ పేరు చూడటం ఇష్టం లేకపోతే రాయి వెనక్కి తిప్పుకోవచ్చుగా.. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వం నుంచి డబ్బులు తీసుకుని ఇళ్లు కట్టుకుంటే ప్రధాని మోదీ, శివరాజ్ సింగ్ చౌహాన్ ఫొటోలతో రెండు రాళ్లు పెట్టారు. మరి వాళ్లను మీరు ప్రశ్నించగలరా? జగన్ హయాంలో భూ సర్వే బాగా జరిగిందని కేంద్రం రూ.400 కోట్ల రాయితీలు ఇస్తే దాన్ని తీసుకోవడానికి మాత్రం వెనుకాడరు. కోటీ 25 లక్షల సర్వే రాళ్ల కోసం మేం రూ.400 కోట్లు ఖర్చు చేస్తే.. రూ.700 కోట్లంటూ దుష్ప్రచారం చేస్తుండటం దారుణం. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఇప్పుడు జనం సొమ్ము రూ.1,750 కోట్లతో అమరావతిలో ఆయన విగ్రహం పెడతారా? ఇందులో పావలా వంతు ఖర్చుతో రైతులకు సర్వే రాళ్లు వేయిస్తే తప్పేంటి? ఇకనైనా వాస్తవాలు తెలుసుకుంటే మంచిది.

మాంసం, చేపల దుకాణాలకూ ఈ-వేలమేనా!?

- అధికారులు ఏసీ రూముల్లో కూర్చొని నిర్ణయాలు తీసుకుంటున్నారు
- విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై హైకోర్టు మండిపాటు



సాక్షి, అమరావతి : ఏసీ రూముల్లో కూర్చొని నిర్ణయాలు తీసుకుంటున్న అధికారులు క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడంలేదని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. మాంసం, చేపల దుకాణాల కేటాయింపునకు సైతం 'ఈ-వేలం' నిర్వహించడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. కంప్యూటర్‌పై కనీస పరిజ్ఞానం కూడా లేని చిన్న వ్యాపారులకు షాపులు కేటాయించే విషయంలో సాంప్రదాయ బహిరంగ వేలం కాకుండా ఈ-వేలం నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తప్పుబట్టింది. ఇందులో పాల్గొనాలంటే పలు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని, ఆ డాక్యుమెంట్లు ఏవనే విషయంపై కూడా ఆ చిరు వ్యాపారులకు అవగాహన ఉండదని, వారిలో చాలా మంది పెద్దగా చదువుకుని ఉండరని తెలిపింది. క్షేత్ర స్థాయి ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా, అధికారులు ఏసీ రూముల్లో కూర్చొని ఎలా పడితే అలా నిర్ణయాలు తీసుకుంటున్నారని వ్యాఖ్యానించింది. పైపెచ్చు ఈ-వేలం టెండర్ నోటిఫికేషన్‌ను ఇంగ్లిష్‌లో ప్రచురించడాన్ని కూడా హైకోర్టు తప్పుబట్టింది. తెలుగు పత్రికలో తెలుగు భాషలో నోటిఫికేషన్‌ను ఇవ్వాలని నిబంధనలు చెబుతుంటే, తెలుగు పత్రికలో ఇంగ్లిష్‌లో నోటిఫికేషన్ ఇవ్వడంపై విస్మయం వ్యక్తం చేసింది. ఏం ప్రయోజనాలు ఆశించి ఇలా చేస్తున్నారని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను నిలదీసింది. విజయవాడ మహంతి మార్కెట్‌లో షాపుల కేటాయింపు నిమిత్తం ఈనెల 6న విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జారీ చేసిన ఈ-వేలం నోటిఫికేషన్‌ను తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు నిలిపేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కార్పొరేషన్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 3కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ-వేలంపై పిటిషన్

మహంతి మార్కెట్‌లో మాంసం, చేపల దుకాణాల కేటాయింపు కోసం ఈ-వేలానికి ఈ నెల 6న విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ అదే మార్కెట్‌లో చేపల వ్యాపారం చేస్తున్న హరి మాణిక్యం శంకరరావు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం విచారణ జరిపారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఈ-వేలం నోటిఫికేషన్ గురించి అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, తెలుగు పత్రికలో ఇంగ్లిష్‌లో నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. పిటిషనర్‌తో సహా ఇతర వ్యాపారుల్లో చాలా మంది నిరక్షరాస్యులు, కంప్యూటర్ పరిజ్ఞానం లేనివారున్నారని.. దీంతో నోటిఫికేషన్‌కు స్పందించలేకపోయారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలే తప్ప, క్లిష్టతరంగా ఉండకూడదని అభిప్రాయపడ్డారు.

గోవిందరావుది ముమ్మాటికీ చంద్రబాబు ప్రభుత్వ హత్యే

మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఆ పార్టీ నాయకులు

- మృతదేహానికి నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నాయకులు
- ఉన్నతస్థాయి స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని డిమాండ్

డాబాగార్డెన్స్ (విశాఖ): టీడీపీ నేత, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి వేధింపులతో ఒత్తిడికి గురై మరణించిన జీవీఎంసీ మెకానికల్ ఎస్ఈ గోవిందరావు మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పార్టీ నేతలు శుక్రవారం సందర్శించారు. గోవిందరావుకు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నగరంలోని ఓ ఆస్పత్రిలో ఉన్న గోవిందరావు మృతదేహాన్ని సందర్శించిన అనంతరం వీరు విలేకరులతో మాట్లాడారు. గోవిందరావు పట్టాభి తీరు వల్లే గుండెపోటుతో మరణించారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని స్పష్టం చేశారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని కోరారు. ఓ కాంట్రాక్ట్ విషయంలో కూటమి నేతలకు అనుకూలంగా నడుచుకోలేదనే కోపంతో నిజాయితీ గల అధికారిని సమీక్ష పేరిట అందరి ముందూ అనరాని మాటలతో పట్టాభి వేధింపులకు గురిచేశారని ధ్వజమెత్తారు. అధికారం ఉందనే అహంకారంతో పట్టాభి రెచ్చిపోయారని మండిపడ్డారు. గోవిందరావు మృతికి కారకుడైన పట్టాభిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావు, తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ కట్టుమూరు సతీష్, నాయకుడు పల్లా దుర్గారావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బాబు సర్కారు మరణశాసనం

- ప్రభుత్వ వేధింపులకు పది రోజుల్లోనే నలుగురు ఉద్యోగులు బలి
- ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు ప్రభుత్వ ఉద్యోగులకు మరణ శాసనం రాస్తోందని, ఒత్తిడికి గురిచేసి వారి మరణాలకు కారణమవుతోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగులపై వేధింపులు ఎక్కువైపోయాయని చెప్పారు. వీడియో కాన్ఫరెన్సులు, టెలీకాన్ఫరెన్సులు, అసాధ్యమైన సర్వే టార్గెట్ల పేరుతో ఉద్యోగులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని విమర్శించారు. గత పది రోజుల్లోనే పని ఒత్తిడితో నలుగురు ఉద్యోగులు గుండెపోటుతో మరణించడం ప్రభుత్వ వేధింపులకు నిదర్శనమని మండిపడ్డారు. పది రోజుల్లో ఒక తహసీల్దార్, ఒక ఎస్ఈ, ఇద్దరు సచివాలయ ఉద్యోగులు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారని, వీరంతా 30 నుంచి 40 ఏళ్లలోపు వారే కావడం బాధాకరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే వలంటీర్లను తొలగించేసి వారు చేయాల్సిన పనిని సచివాలయ ఉద్యోగులకు అప్పగించి వారిపై ఒత్తిడి పెంచిందని దుయ్యబట్టారు. సచివాలయ ఉద్యోగులను పగలూ రాత్రీ, సెలవు రోజులు అని తేడా లేకుండా ఇంటింటికీ తిరిగి సర్వేలు చేయాలని అమానవీయమైన ఉత్తర్వులు జారీ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో రాత్రిపూట సర్వే చేయాలని ఇచ్చిన ఆర్డర్లను ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి ఉదహరించారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల మరణాలపై స్పందించి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, ఉద్యోగులతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు గౌరవంగా నడుచుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యోగుల తరఫున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగులూ అధైర్యపడకుండా ఓపికతో ఉండాలని, మంచి రోజులు మళ్లీ వస్తాయని కాకర్ల వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు.

పట్టాభిపై హత్య కేసు నమోదు చేయాలి

'గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి విశాఖపట్నం జోనల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి.., జీవీఎంసీ మెకానికల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ గోవిందరావుపై రెచ్చిపోయి, గదమాయిస్తూ తీవ్రంగా అందరి ముందు అవమానించారు. డంపింగ్ యార్డ్‌లో చెత్త నిల్వల తరలింపునకు పాత కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్త కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు ఎస్ఈ వివరణ ఇస్తున్నా వినిపించుకోకుండా.. ఏం తమాషా చేస్తున్నావా అంటూ పట్టాభి మండిపడ్డారు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురైన గోవిందరావు అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. అందుకే ఎస్ఈ మృతికి ముమ్మాటికీ పట్టాభిదే బాధ్యత. ఒక ఉన్నతాధికారికే రక్షణ లేకపోతే, ఇక చిన్న ఉద్యోగుల పరిస్థితి రాష్ట్రంలో ఎంత దయనీయంగా ఉంటుందో అందరూ ఆలోచించాలి. ఇటీవల ఒక తహసీల్దార్ మృతి, పలువురు సచివాలయాల ఉద్యోగులు ఆత్మహత్యలకు అధికార పార్టీ వేధింపులే కారణం. ఒక ఎస్ఈ ప్రాణాలు బలిగొన్న పట్టాభిపై వెంటనే హత్య కేసు నమోదు చేయడమే కాకుండా, ఆయన్ను కార్పొరేషన్ చైర్మన్ పదవి నుంచి తొలగించాలి. లేకుంటే రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తాం' అని వెంకట్రామిరెడ్డి హెచ్చరించారు.

అధికార జులుంతో ఉద్యోగుల ప్రాణాలు తీస్తారా?

ప్రభుత్వం, పట్టాభి తీరుపై వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి ఫైర్

సాక్షి, అమరావతి: అధికార జులుం ప్రదర్శించి ఉద్యోగుల ప్రాణాలు తీసే పరిస్థితికి రాష్ట్రాన్ని నెట్టినందుకు కూటమి ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖలోని గాజువాక జోన్‌లో నిర్వహించిన సమీక్షలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తీవ్రస్థాయిలో దూషించడంతో విశాఖ మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ) మెకానికల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) గోవిందరావు తీవ్ర ఒత్తిడికి లోనై, అక్కడికక్కడే కుప్పకూలారని, ఓ నిండు ప్రాణం బలి తీసుకున్న పాపం పట్టాభిదేనని మండిపడ్డారు. జీవీఎంసీలో చెత్త సేకరణ కాంట్రాక్ట్‌ను తమ జేబు సంస్థకు అప్పగించేందుకే పట్టాభి అధికారులపై విరుచుకుపడ్డారని విమర్శించారు. పట్టాభిపై వెంటనే హత్య కేసు నమోదు చేయడమే కాకుండా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కారులో ఒక ఉన్నతాధికారికే రక్షణ లేకపోతే, చిన్న ఉద్యోగుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందనేది అందరూ ఆలోచించాలని చంద్రశేఖర్‌రెడ్డి హితవుపలికారు. ఇటీవల ఒక తహసీల్దార్ మృతి, ఇంకా సచివాలయాల ఉద్యోగులు పలువురి ఆత్మహత్యలకు అధికార పార్టీ వేధింపులే కారణమని విమర్శించారు. శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అటవీ అధికారులపై దాడి చేసినా చర్యలు తీసుకోకపోవడం వల్లే రాష్ట్రంలో అధికారులపై దాడులు పెరిగాయని చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
770	241
81,538	25,049

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,566	△	130
డోజోన్స్	49,152	▽	231
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,132	▽	18
డాక్స్	24,914	△	58
షాంఘై	4,136	△	14
నికాయ్	53,847	△	158

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	91.10	92.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	121.50	124.55
€	యూరో	ఎస్‌బీఐ	105.70	108.50
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.14	58.52
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	60.07	63.98
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	69.10	72.82
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.54	25.05
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	24.06	25.32
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.26	14.09

పరుగు ఆపని పసిడి

వెనక్కి తగ్గని వెండి

- ఫ్యూచర్స్‌లోనూ రికార్డుల రేస్
- వెండి రూ. 12,638 ప్లస్
- పసిడి ధర రూ. 2,885 అప్

న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా జోడు గుర్రాల్లా పరిగెడుతున్న వెండి, బంగారం మరోసారి కదంతొక్కాయి. స్పాట్ మార్కెట్లో 99.9 స్వచ్ఛతగల పసిడి 10 గ్రాములు రూ. 1,500 బలపడి రూ. 1,58,700కు చేరింది. ఇక కేజీ వెండి ధర రూ. 9,500 జంప్‌చేసి రూ. 3,29,500ను తాకింది. ఫ్యూచర్స్ మార్కెట్లో కూడా బంగారం, వెండి సరికొత్త రికార్డులను సాధించాయి. కేజీ వెండి తాజాగా 4 శాతం జంప్‌చేసింది. ఎంసీఎక్స్‌లో మార్చి కాంట్రాక్ట్ రూ. 12,638 బలపడి రూ. 3,39,927ను తాకింది.ఇదే బాటలో బంగారం 10 గ్రాములు 2 శాతం(రూ. 2,885) ఎగసింది. ఫిబ్రవరి డెలివరీ రూ. 1,59,226కు చేరింది. బుధవారం వెండి(కేజీ) రూ. 3,35,521 వద్ద, గురువారం పసిడి(10 గ్రా.) రూ. 1,56,341 వద్ద చారిత్రక గరిష్టాలకు చేరిన విషయం విదితమే. వెరసి బంగారం వరుసగా ఐదో రోజు లాభపడింది. ప్రపంచ కరెన్సీలతో మారకంలో డాలరు 98.31కు వెనకడుగు వేయడం, యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపును చేపట్టవచ్చన్న అంచనాలు విలువైన లోహాలకు డిమాండ్ పెంచుతున్నట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి.

అంతర్జాతీయంగా సిల్వర్ సెంచరీ..

యూఎస్ కామెక్స్‌లోనూ వెండి, బంగారం గరిష్ట ధరలతో ధగధగలాడుతున్నాయి. ఔన్స్ వెండి చరిత్రలో తొలిసారి 100 డాలర్లను దాటగా.. బంగారం అంచనాలను నిజం చేస్తూ ఔన్స్(31.1 గ్రా.) 5,000 డాలర్ల సమీపానికి చేరింది. సిల్వర్ మార్చి ఫ్యూచర్స్ 3.7 డాలర్లు ఎగసి 100 డాలర్లను తాకింది. గోల్డ్ ఫిబ్రవరి కాంట్రాక్ట్ 4,989.54 డాలర్లను తాకింది. వెరసి 2020 మార్చి తదుపరి ఈ వారం అత్యధికంగా లాభపడినట్లు నిపుణులు వెల్లడించారు.

అమ్మకాల తుఫాన్

- మార్కెట్లో టెన్షన్
- ఒకశాతం కరెక్షన్
- 82వేల దిగువకు సెన్సెక్స్
- రూ.6.95 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

ముంబై: అంతర్జాతీయ అనిశ్చితులు, విదేశీ ఇన్వెస్టర్ల భారీ అమ్మకాలతో దేశీ స్టాక్ మార్కెట్లు మరోసారి ఎరుపెక్కాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి జీవితకాల కనిష్టం 92 దిగువకు పతనం కావడం ఇన్వెస్టర్లను నిరాశపరిచింది. ఫలితంగా సెన్సెక్స్ శుక్రవారం 770 పాయింట్లు నష్టపోయి 81,538 వద్ద నిలిచింది. నిఫ్టీ 241 పాయింట్లు తగ్గి 25,049 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. కార్పొరేట్ కంపెనీల నిరుత్సాహక త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటనకు తోడు అదానీ కంపెనీల షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలతో సూచీలు మరింత నష్టాలు చవిచూశాయి. ఒక దశలో సెన్సెక్స్ 836 పాయింట్లు క్షీణించి 81,472 వద్ద, నిఫ్టీ 264 పాయింట్లు కుప్పకూలి 25,025 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి. అంచనాలకు తగ్గట్లే బ్యాంక్ ఆఫ్ జపాన్ కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడంతో నికాయ్ ఇండెక్స్ 0.50% రాణించింది. చైనా, హాంగ్‌కాంగ్, తైవాన్ ఇండెక్సులు 1% పెరిగాయి. యూరప్ మార్కెట్లు అర శాతం నష్టపోయాయి. అమెరికా స్టాక్ సూచీలు పావుశాతం నష్టంతో ట్రేడవుతున్నాయి.

వారంలో రూ.16.28 లక్షల కోట్లు ఆవిరి: ఈ వారంలో సెన్సెక్స్ 2,033 పాయింట్లు(2.43%), నిఫ్టీ 645 పాయింట్లు(2.51%) క్షీణించాయి. తాజాగా శుక్రవారం రూ.6.95 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 451 లక్షల కోట్లకు దిగివచ్చింది.

- ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావడంతో రియల్టీ షేర్లు పతనమయ్యాయి. బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. రంగాల వారీగా ఇండెక్సుల్లో సర్వీసెస్ 4.20%, వినిమయ 3.52%, రియల్టీ 3.35%, విద్యుత్ 2.81%, పీయూఎస్ బ్యాంకు 2.37%, క్యాపిటల్ గూడ్స్ 2.09%, ఇండస్ట్రియల్స్ 1.69%, బ్యాంకెక్స్ 1.44 శాతం పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరసగా 2.19%, 1.56 శాతం క్షీణించాయి.
- అదానీ గ్రూప్ షేర్లు ట్రేడింగ్‌లో 13% వరకు క్షీణించాయి. 265 మిలియన్ డాలర్ల లంచం ఆరోపణల కేసులో గౌతమ్ అదానీ, సాగర్ అదానీలకు సమన్లు పంపేందుకు అమెరికాకు చెందిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ కోర్టు అనుమతి కోరినట్లు వార్తలు వెలుగులోకి వచ్చాయి. అలాగే ఈ గ్రూప్‌లోని కొన్ని కంపెనీలు డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు నిరాశపరిచాయి. ఫలితంగా ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 9% నష్టపోయింది. అదానీ పవర్ 9%, అదానీ పోర్ట్స్ 8%, అదానీ టోటల్ గ్యాస్ 7.55%, అంబుజా సిమెంట్స్ 6% నష్టపోయాయి. మొత్తంమీద అదానీ గ్రూప్‌నకు రూ.1.4 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.

కరిగిపోతున్న విలువ

రూపాయి విలవిల..

- కొత్త కనిష్టస్థాయికి పతనం
- ఇంట్రాడే ట్రేడింగ్‌లో 92 కిందికి
- చివరికి 32 పైసలు బలహీనపడి 91.90 వద్ద ముగింపు

ముంబై: డాలరు డామినేషన్‌కు రూపాయి విలవిల్లాడుతోంది. విలువ అంతకంతకూ కరిగిపోతోంది. తాజాగా శుక్రవారం డాలర్ మారకంలో 32 పైసలు క్షీణించి జీవితకాల కనిష్టం 91.90 వద్ద స్థిరపడింది. దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం, అంతర్జాతీయ అనిశ్చితులు రూపాయి పతనానికి ప్రధాన కారణమయ్యాయి. అలాగే క్రూడాయిల్ ధరల ర్యాలీ, అమెరికా బాండ్లపై రాబడులు పెరగడమూ ఒత్తిడి పెంచాయని నిపుణులు తెలిపారు. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంలో రూపాయి విలువ 91.45 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఒక దశలో 42 పైసలు క్షీణించి 92.00 వద్ద చరిత్రాత్మక ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేసింది. డాలర్ బలోపేతం, ఎఫ్ఐఐల విక్రయాల ప్రభావంతో గతేడాదిలో 5% క్షీణించి రూపాయి... 2026లో జనవరి 23 వరకు 2% (202 పైసలు) పతనమైంది. ''అంతర్జాతీయ మార్కెట్లో రిస్క్ సామర్థ్యం తగ్గడం, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల కొనసాగింపు ఒత్తిళ్ల ప్రభావంతో రూపాయి మరింత క్షీణించే వీలుంది. వచ్చే వారం నెలాఖరు కావడంతో దిగుమతిదారులు, హెడ్జర్ల నుంచి డాలర్ల డిమాండ్ నెలకొనవచ్చు. రానున్న రోజుల్లో 91.60 – 92.30 శ్రేణిలో ట్రేడవ్వొచ్చు'' అని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ విశ్లేషకుడు అనుజ్ చౌదరీ తెలిపారు.

బిజినెస్ నుంచి బ్రేకింగ్ న్యూస్ దాకా



అదానీ చేతికి ఐఏఎన్‌ఎస్ ఇండియా

- మిగిలిన 24% వాటా కొనుగోలు
- ఇప్పటికే ఎన్‌డీటీవీ, బీక్యూప్రైమ్‌లో వాటా

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా ఇండో–ఏషియన్ న్యూస్ సర్వీస్(ఐఏఎన్ఎస్)ను పూర్తిగా స్వాధీనంలోకి తెచ్చుకుంది. ఇప్పటికే న్యూస్ ఏజెన్సీలో మెజారిటీ వాటా కొనుగోలు చేసిన అదానీ గ్రూప్ మిగిలిన 24 శాతం వాటాను సైతం చేజిక్కించుకుంది. డీల్ విలువను వెల్లడించనప్పటికీ అనుబంధ సంస్థ ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ ద్వారా ఐఏఎన్ఎస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్‌లో మిగిలిన వాటాను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. కాగా.. 2023 డిసెంబర్‌లో అదానీ గ్రూప్ ఏఐఎన్ఎస్ న్యూస్ ఏజెన్సీలో 50.5 శాతం వాటా కొనుగోలు చేసింది. తద్వారా న్యూస్‌వైర్ ఏజెన్సీని ఏఎంజీ మీడియాకు అనుబంధ సంస్థగా మార్చుకుంది. తిరిగి 2024 జనవరిలో ఐఏఎన్ఏస్‌లో వాటా పెంచుకోవడం ద్వారా ఏఎంజీ మీడియా 76 శాతం వోటింగ్ హక్కులను సొంతం చేసుకుంది. ఈ బాటలో మిగిలిన 24 శాతాన్ని సొంతం చేసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఐఏఎన్ఎస్‌ను పూర్తి అనుబంధ సంస్థగా ఏర్పాటు చేసుకోనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. దేశీయంగా వివిధ భాషల న్యూస్ ఏజెన్సీలలో ఒకటైన ఐఏఎన్ఎస్ ప్రింట్, డిజిటల్, బ్రాడ్‌క్యాస్ట్ ప్లాట్‌ఫామ్స్‌కు వార్తలు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎన్‌డీటీవీ, బీక్యూ ప్రైమ్‌లలో వాటాలు కొనుగోలు చేసిన అదానీ గ్రూప్ ఇకపై మీడియా, కంటెంట్ ఎకోసిస్టమ్‌లో కార్యకలాపాలను మరింత విస్తరించనుంది.

ఇండస్‌ఇండ్‌కు

మైక్రోఫైనాన్స్ మంటలు

రూ. 128 కోట్లకు పరిమితమైన క్యూ3 లాభాలు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. బ్యాంక్ నికర లాభం 90 శాతం క్షీణించి రూ. 128 కోట్లకు పరిమితమైంది. కొత్త యాజమాన్య నిర్వహణలో లోన్ బుక్ వెనకడుగు వేయడం, మైక్రోఫైనాన్స్ బుక్‌లో క్షీణత ప్రభావం చూపాయి. గత క్యూ3లో బ్యాంక్ లాభం రూ. 1,402 కోట్లుగా నమోదైంది. తాజాగా.. నికర వడ్డీ ఆదాయం 13% నీరసించి రూ. 4,562 కోట్లకు చేరింది. స్లిప్పేజీలు రూ. 2,200 కోట్ల నుంచి రూ. 2,560 కోట్లకు పెరిగాయి. వీటిలో మైక్రో రుణాల వాటా రూ. 1,022 కోట్లు కాగా.. మైక్రో లోన్‌బుక్ 46% క్షీణించి రూ. 17,669 కోట్లకు పరిమితమైంది. స్థూల మొండిబకాయిలు 2.25% నుంచి 3.56 శాతానికి పెరిగాయి.

బ్యాంక్ షేరు బీఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 893 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

క్వార్టర్ ఫైనల్లో సింధు ఓటమి

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్స్ పీవీ సింధు, లక్ష్య సేన్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు 13–21, 17–21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యు ఫె (చైనా) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 18–21, 20–22తో ప్రపంచ 44వ ర్యాంకర్ పానిత్‌చఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలయ్యాడు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సింధు, లక్ష్య సేన్‌లకు మూడు వేల డాలర్ల (రూ. 2 లక్షల 75 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ, 5,040 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

అండర్-19 వన్డే ప్రపంచకప్ టోర్నీ
భారత్ x న్యూజిలాండ్; వేదిక: బులవాయో
మధ్యాహ్నం గం. 1 నుంచి జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

డబ్ల్యూపీఎల్‌లో నేడు
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు x ఢిల్లీ క్యాపిటల్స్
రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రసారం

బంగ్లాదేశ్ చివరి ప్రయత్నం!

డీఆర్‌సీకి లేఖ రాసిన బోర్డు

ఢాకా: టి20 ప్రపంచకప్‌లో తమ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు తరలించాలనే డిమాండ్ విషయంలో పట్టు వీడని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తమ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. తమ విజ్ఞప్తిని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పట్టించుకోకపోవడంతో వివాద పరిష్కారాల కమిటీ (డీఆర్‌సీ)ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఆశ్రయించింది. తాము భారత్‌లో ఆడాల్సిందేనంటూ ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేయాలంటూ డీఆర్‌సీని బీసీబీ కోరింది. అయితే ఐసీసీ ఆధ్వర్యంలోనే పని చేసే డీఆర్‌సీ వారి విజ్ఞప్తికి స్పందించే అవకాశం లేదు. ఐసీసీ నిబంధనల ప్రకారం బోర్డు డైరెక్టర్లు కలిసి తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షించే అధికారం డీఆర్‌సీకి లేదు. ఇక్కడా తమకు సానుకూల స్పందన లభించకపోతే చివరగా కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్స్ (సీఏఎస్)కు వెళ్లాలని కూడా బంగ్లాదేశ్ యోచిస్తోంది. మరోవైపు తమ జట్టు భారత్‌లో మ్యాచ్ ఆడదంటూ తీసుకున్న నిర్ణయాన్ని ముందుగా ఐసీసీకి చెప్పకుండా బీసీబీ చైర్మన్ అమీనుల్ ఇస్లామ్ మీడియా ముందు ప్రకటించడం కూడా ఐసీసీకి ఆగ్రహం కలిగించింది. ప్రస్తుతానికి పరిస్థితి చూస్తే బంగ్లాదేశ్‌ను తప్పించడం దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. అండర్–19 వరల్డ్ కప్ జరుగుతున్న నమీబియాలో ఉన్న ఐసీసీ చైర్మన్ జై షా బంగ్లాదేశ్‌ను వరల్డ్ కప్ నుంచి తప్పిస్తూ స్కాట్లాండ్‌కు అవకాశం ఇస్తున్నట్లుగా శనివారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

గట్టెక్కిన సబలెంకా – ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్న ప్రపంచ నంబర్‌వన్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సూర్య, ఇషాన్ విధ్వంసం

టి20ల్లో భారత్ ఆధిపత్య ప్రదర్శన కొనసాగుతోంది. సిరీస్ తొలి పోరులో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన టీమిండియా మరో ఏకపక్ష గెలుపును అందుకొని 2–0తో పైచేయి సాధించింది. 6 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన వేళ 209 పరుగుల లక్ష్యం పెద్దదిగా అనిపించినా... భారత్ అలవోకగా 28 బంతులు మిగిలి ఉండగానే ఛేదించేసింది. ఓపెనర్లు విఫలమైన చోట ఈసారి నేనున్నానంటూ ఇషాన్ కిషన్ మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా, ఎట్టకేలకు తన స్థాయిని చూపిస్తూ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 23 ఇన్నింగ్స్‌ల తర్వాత ఈ ఫార్మాట్‌లో అర్ధ సెంచరీ నమోదు చేశాడు. టీమిండియా ఇన్నింగ్స్‌లో బౌండరీల (21 ఫోర్లు, 12 సిక్సలు) ద్వారానే 156 పరుగులు వచ్చాయి.

రెండో టి20లోనూ భారత్‌దే విజయం ● సిరీస్‌లో 2-0తో పైచేయి
7 వికెట్లతో న్యూజిలాండ్ చిత్తు ● రేపు గువాహటిలో మూడో మ్యాచ్

సూర్యకుమార్

రాయ్‌పూర్: భారత జట్టు దూకుడైన బ్యాటింగ్‌తో న్యూజిలాండ్‌పై వరుసగా రెండో మ్యాచ్‌లో విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన రెండో టి20లో భారత్ 7 వికెట్ల తేడాతో కివీస్‌పై గెలుపొందింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. మిచెల్ సాంట్నర్ (27 బంతుల్లో 47 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (26 బంతుల్లో 44; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) జట్టు స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం భారత్ 15.2 ఓవర్లలో 3 వికెట్లకు 209 పరుగులు చేసి గెలిచింది. సూర్యకుమార్ యాదవ్ (37 బంతుల్లో 82 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (32 బంతుల్లో 76; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) కలిసి జట్టును గెలిపించారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 49 బంతుల్లోనే 122 పరుగులు జోడించారు. ఆ తర్వాత సూర్య, శివమ్ దూబే (18 బంతుల్లో 36 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) నాలుగో వికెట్‌కు 37 బంతుల్లో అభేద్యంగా 81 పరుగులు జత చేసి గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు. ఈ మ్యాచ్‌లో భారత్ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చింది. గాయం కారణంగా అక్షర్ పటేల్ ఆడలేదు. వీరిద్దరి స్థానాల్లో హర్షిత్, కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వచ్చారు. ఇరు జట్ల మధ్య మూడో టి20 ఆదివారం గువాహటిలో జరుగుతుంది.

హాఫ్ సెంచరీ లేకుండానే...

న్యూజిలాండ్ జట్టు బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శించిన 7 ఓవర్లలో కలిపి 120 పరుగులు రాగా... భారత బౌలర్లు కట్టడి చేసిన మిగతా 13 ఓవర్లలో 88 పరుగులే లభించాయి. ఓపెనర్లు కాన్వే (9 బంతుల్లో 19; 3 ఫోర్లు, 1 సిక్స్), సీఫెర్ట్ (13 బంతుల్లో 24; 5 ఫోర్లు) కలిసి 20 బంతుల్లోనే 43 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లోనే కాన్వే 3 ఫోర్లు, 1 సిక్స్ బాది 18 పరుగులు రాబట్టగా, అర్ష్‌దీప్ తర్వాతి ఓవర్లో సీఫెర్ట్ వరుసగా 4 ఫోర్లు కొట్టాడు. అయితే ఓపెనర్లిద్దరూ ఒకే స్కోరు వద్ద వెనుదిరిగారు. హర్షిత్ తన తొలి ఓవర్‌ను 'మెయిడిన్'గా వేసినా... అతని తర్వాతి ఓవర్లో రచిన్ 2 భారీ సిక్స్‌లు, ఒక ఫోర్ బాదాడు. వరుణ్ ఓవర్లోనూ రెండు సిక్స్‌లతో రచిన్ జోరు కొనసాగించగా... కుల్దీప్ ఓవర్లో సిక్స్, 2 ఫోర్లు కొట్టిన గ్లెన్ ఫిలిప్స్ (19) అదే ఓవర్లో అవుటయ్యాడు. ఆ తర్వాత నాలుగు పరుగుల వ్యవధిలో మిచెల్ (18), రచిన్ పెవిలియన్ చేరడంతో కివీస్ స్కోరు వేగం మందగించింది. చాప్‌మన్ (10) కూడా విఫలమైనా, చివర్లో సాంట్నర్, ఫోక్స్ (15 నాటౌట్) ధాటిగా ఆడటంతో స్కోరు 200 దాటింది. చివరి 3 ఓవర్లలో వీరిద్దరు కలిసి 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో మొత్తం 47 పరుగులు రాబట్టారు. కివీస్ ఇన్నింగ్స్‌లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా లేకపోవడం గమనార్హం.

అభిషేక్ శర్మ 'డకౌట్'

ఇన్నింగ్స్ రెండో బంతికే అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నా దానిని ఉపయోగించుకోలేక సామ్సన్ (6) తొలి ఓవర్లోనే నిష్క్రమించాడు. తొలి మ్యాచ్‌లో అదరగొట్టిన అభిషేక్ శర్మ (0) ఈసారి మొదటి బంతికే అవుటయ్యాడు. అయితే ఇషాన్ మెరుపు బ్యాటింగ్‌తో లక్ష్య ఛేదన సులువుగా మారిపోయింది. ఫోక్స్ ఓవర్లో 3 ఫోర్లు, సిక్స్‌తో చెలరేగిన ఇషాన్... సాంట్నర్ ఓవర్లో వరుసగా 3 ఫోర్లు కొట్టాడు. ఆ తర్వాత హెన్రీ ఓవర్లోనూ వరుసగా 6, 4, 4 బాది 21 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారత్ చేసిన తొలి 100 పరుగుల్లో 76 అతని బ్యాట్ నుంచే వచ్చాయి. ఇషాన్ వెనుదిరిగిన తర్వాత సూర్య బాధ్యత తీసుకున్నాడు. భారత కెప్టెన్ చాలా కాలం తర్వాత అంచనాలకు తగిన ఆటను ప్రదర్శించాడు. ఫోక్స్ ఓవర్లో అతను వరుసగా 4, (వైడ్), 4, 4, 4, 6 బాదడంతో మొత్తం 25 పరుగులు వచ్చాయి. 23 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్న సూర్య ఆ తర్వాత అదే ధాటిని చివరి వరకు కొనసాగించాడు.

ఇషాన్ కిషన్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) పాండ్యా (బి) హర్షిత్ 19; సీఫెర్ట్ (సి) ఇషాన్ (బి) వరుణ్ 24; రచిన్ (సి) అర్ష్‌దీప్ (బి) కుల్దీప్ 44; ఫిలిప్స్ (సి) పాండ్యా (బి) కుల్దీప్ 19; మిచెల్ (సి) పాండ్యా (బి) దూబే 18; చాప్‌మన్ (సి) అభిషేక్ (బి) పాండ్యా 10; సాంట్నర్ (నాటౌట్) 47; ఫోక్స్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 208. **వికెట్ల పతనం:** 1–43, 2–43, 3–98, 4–125, 5–129, 6–161. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–53–0, పాండ్యా 3–0–25–1, హర్షిత్ 3–1–35–1, వరుణ్ 4–0–35–1, కుల్దీప్ 4–0–35–2, అభిషేక్ 1–0–12–0, దూబే 1–0–7–1.

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) రచిన్ (బి) హెన్రీ 6; అభిషేక్ (సి) కాన్వే (బి) డఫీ 0; ఇషాన్ కిషన్ (సి) హెన్రీ (బి) సోధి 76; సూర్యకుమార్ (నాటౌట్) 82; శివమ్ దూబే (నాటౌట్) 36; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (15.2 ఓవర్లలో 3 వికెట్లకు) 209. **వికెట్ల పతనం:** 1–6, 2–6, 3–128. **బౌలింగ్:** హెన్రీ 3–0–41–1, డఫీ 4–0–38–1, ఫోక్స్ 3–0–67–0, సాంట్నర్ 2–0–27–0, సోధి 3–0–34–1, మిచెల్ 0.2–0–2–0.

అభిషేక్, సౌరభ్ అర్ధ సెంచరీలు

- ఆంధ్ర 228 ఆలౌట్
- 71 పరుగుల ఆధిక్యంలో విదర్భ

అభిషేక్

సౌరభ్

సాక్షి, అనంతపురం: ఓపెనర్ అభిషేక్ రెడ్డి (91 బంతుల్లో 73; 12 ఫోర్లు), సౌరభ్ కుమార్ (87 బంతుల్లో 62; 8 ఫోర్లు) హాఫ్ సెంచరీలతో రాణించడంతో.... విదర్భ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీలో గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. టీమిండియా పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (48 బంతుల్లో 35; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా... కెప్టెన్ రికీ భుయ్ (0), షేక్ రషీద్ (0), శ్రీకర్ భరత్ (9) విఫలమయ్యారు. విదర్భ బౌలర్లలో దర్శన్, ఆదిత్య, నచికేత్, పార్థ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ... రెండో రోజు ఆట నిలిచే సమయానికి 2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. చేతిలో 10 వికెట్లు ఉన్న విదర్భ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలుపుకొని ఓవరాల్‌గా 71 పరుగుల ముందంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 267/7తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ... చివరకు 295 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (115; 14 ఫోర్లు) క్రితం రోజు స్కోరుకు 11 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఆంధ్ర బౌలర్లలో కేవీఎస్‌ఎన్ రాజు 5 వికెట్లు పడగొట్టగా... సాయితేజ 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.

క్లుప్తంగా...

ఏసీబీకి పట్టుబడిన పల్నాడు డీఆర్‌ఓ

క్యాటరింగ్ నిర్వాహకుడి నుంచి రూ.3 లక్షలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన వైనం

నరసరావుపేట: పల్నాడు జిల్లా డీఆర్‌ఓ ఏకా మురళి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. శుక్రవారం సాయంత్రం తన చాంబర్‌లో ఓ క్యాటరింగ్ నిర్వాహకుడి నుంచి రూ.3 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర మాతే ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై అదనపు ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ గతంలో ఓ ప్రభుత్వ కార్యక్రమానికి 41,500 మీల్స్ పొట్లాలను సాగర్‌మాత క్యాటరింగ్ నిర్వాహకుడు కరిముల్లా సరఫరా చేశారు. అందుకు అతనికి రూ.37లక్షల బిల్ చెల్లించాల్సి ఉంది.. ముందస్తుగా అతనికి రూ.10లక్షలు చెల్లించారు. మిగతా రూ.26,71,392లకు బిల్లు చెల్లించేందుకు డీఆర్‌ఓ రూ.3లక్షలు డిమాండ్ చేశారు. ఆ మొత్తాన్ని తీసుకొని తాను కూర్చున్న టేబుల్ సొరుగులో పెట్టుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను పట్టుకున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినిపై లైంగిక దాడి

తగరపువలస: ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని(20)పై అదే కళాశాలలో ఎంసీఏ ఫైనలియర్ విద్యార్థి దిలీప్ కుమార్ (24) లైంగిక దాడికి పాల్పడిన ఘటన భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. అనకాపల్లి జిల్లాకు చెందిన విద్యార్థిని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. మద్దిలపాలేనికి చెందిన దిలీప్‌కుమార్ ఈ నెల 21న ఆమెను తగరపువలస పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై తిప్పి లైంగికదాడికి పాల్పడ్డాడని విద్యార్థిని శుక్రవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. లైంగిక దాడి సమయంలో తీసిన ఫొటోలతో దిలీప్‌కుమార్ ఆమెను బ్లాక్ మెయిల్ చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమిలి పోలీసులు మాత్రం వివరాలు వెల్లడించడానికి నిరాకరిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నందున ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు కాని, దిలీప్‌ను అరెస్ట్ చేయడం కాని జరగలేదని చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి శుక్రవారం రాత్రికి ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చూపించే అవకాశం ఉంది.

నెయ్యి కల్తీ కేసులో సీబీఐ తుది చార్జిషీట్

తిరుపతి క్రైం: తిరుమలలో నెయ్యి కల్తీ ఆరోపణల కేసులో మొత్తం 36 మంది నిందితులుగా చేర్చిన సీబీఐ శుక్రవారం తుది చార్జిషీట్ దాఖలు చేసింది.

'విద్యుత్'ధర్మానికి బాబు సర్కారు తూట్లు

ఏపీఈఆర్‌సీ స్వతంత్ర అధికారాలకు కూటమి మంగళం

- స్వతంత్ర సంస్థగా ఏపీఈఆర్‌సీ ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకోలేకపోతోంది
- అధికారంలోకి వస్తే చార్జీలు పెంచబోమని బాబు మోసం చేశారు
- స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టాలన్న లోకేశ్ ఇప్పుడు నోరుమెదపరే..!
- విజయవాడలో జరిగిన ఏపీఈఆర్‌సీ అభిప్రాయ సేకరణలో మండిపడిన ప్రజలు

విజయవాడలో మాట్లాడుతున్న ఏపీఈఆర్‌సీ సభ్యుడు పీవీఆర్ రెడ్డి

సాక్షి, అమరావతి: "ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)కి ఓ రాష్ట్ర హైకోర్టుకు ఉన్నంత అధికారం ఉంటుంది. కానీ బాబు సర్కారు ఏపీఈఆర్‌సీ విద్యుత్‌ధర్మానికి తూట్లు పొడిచింది. స్వతంత్ర అధికారాలకు మంగళం పాడింది. స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకుండా చేసింది" అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ తూర్పు(ఏపీఈపీడీసీఎల్),మధ్య(ఏపీసీపీడీసీఎల్), దక్షిణ(ఏపీఎస్పీడీసీఎల్) విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు సమర్పించిన ఆదాయ, అవసరాల నివేదిక (అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్–ఏఆర్ఆర్), రిటైల్ టారిఫ్ ప్రతిపాదనలపై ఏపీఈఆర్‌సీ శుక్రవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బహిరంగ విచారణ నిర్వహించింది. వివిధ వర్గాల ప్రజల నుంచి ఏపీఈఆర్‌సీ సభ్యుడైన పీవీఆర్ రెడ్డి, ఇన్‌చార్జ్ చైర్మన్ హోదాలో అభిప్రాయాలను స్వీకరించారు.

లెక్కలిస్తే సరా..డబ్బులివ్వరా

ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు ఇవ్వాల్సిన సబ్సిడీ సొమ్ము 2025 సెప్టెంబర్ నాటికి రూ.12,718 కోట్లు ఉందని, పూర్తిగా డిస్కంలకు సర్కారు చెల్లించడం లేదని విద్యుత్ వినియోగదారుల ఐక్య వేదిక కన్వీనర్ ఎంవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా రూ.4,495 కోట్లు కూడా సబ్సిడీ బకాయిలకు కలిశాయని పేర్కొన్నారు. ప్రభుత్వం లేఖ ఇస్తే సరిపోదని, డబ్బులూ సకాలంలో ఇవ్వాలని, అలా ఇవ్వకపోవడం వల్ల డిస్కంలు అప్పుల పాలవుతున్నాయన్నారు. దీనికి తోడు బిల్లుల బకాయిల రూ.15137 కోట్లు 2025 మార్చినాటికి ఉన్నాయన్నారు. ఇందులో ప్రైవేటు సంస్థలవి రూ.6,288 కోట్లు కాగా, మిగిలినవి ప్రభుత్వ సంస్థలవేనని వివరించారు.

ఆ చార్జీలను తొలగించాలి

ఇక శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆన్‌లైన్ (వర్చువల్) విధానంలో ప్రజాభిప్రాయసేకరణ జరిగింది. ట్రూ అప్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలను తొలగించాలని, విద్యుత్ అధికారులు, వినియోగదారులకు సమన్వయ సమావేశాలను ప్రతి నెలా నిర్వహించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిస్కంల సీఎండీలు పి.పుల్లారెడ్డి, శివశంకర్ లోతేటి, ఏపీఈఆర్‌సీ జాయింట్ డైరెక్టర్ డి.రమణయ్యశెట్టి, కార్యదర్శి పి.కృష్ణ, విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, సీజీఎంలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 27న కర్నూలులో ప్రజాభిప్రాయసేకరణ జరగనుంది.

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోని చంద్రబాబు, లోకేశ్

సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం, తగ్గిస్తాం అని హామీ ఇచ్చారని, కానీ గడిచిన 18 నెలల్లో భారీగా చార్జీలు పెంచారని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. అదే విధంగా స్మార్ట్ మీటర్లు పెడితే ప్రజలు పగలగొట్టాలని చెప్పిన మంత్రి లోకేశ్ ఇప్పుడు బలవంతంగా మీటర్లు పెట్టిస్తున్నా.. నోరు మెదపరేమని దుయ్యబట్టారు. విద్యుత్ బిల్లులోని క్యూఆర్‌కోడ్ పనిచేయడం లేదని, అడ్డగోలు చార్జీలతో ప్రజల నడ్డి విరుస్తున్నారని పలువురు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు వేధిస్తున్నారని పారిశ్రామికవేత్తలు ఫిర్యాదు చేశారు.

నకిలీ మద్యం కేసులో జోగి సోదరులకు బెయిల్

బెయిల్ మంజూరుచేసిన తంబళ్లపల్లి కోర్టు

జోగి రమేష్ నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయవాడ లీగల్/తంబళ్లపల్లె: అన్యాయంగా ఇరికించిన నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాముకు తంబళ్లపల్లి కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారిని విజయవాడ జైలునుంచి విడుదల చేశారు. ఈ కేసులో గత ఏడాది నవంబరు 2న ఇబ్రహీంపట్నంలో ఇంట్లో నిద్రిస్తున్న జోగి సోదరులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. తొలుత విజయవాడ భవానీపురం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టు చేసిన వారిని తరువాత ములకలచెరువులో గత డిసెంబరు 2న నమోదైన మరోకేసులో అరెస్టు చేసి నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉంచారు. అనంతరం వారి అభ్యర్థన మేరకు న్యాయాధికారి డిసెంబరు 18వ తేదీన నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విజయవాడ జిల్లా జైలుకు మార్చారు. వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వారి తరఫున సీనియర్ న్యాయవాదులు చైతన్యకుమార్, చిరిగుడి ఆదాంకుమార్ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం న్యాయాధికారి షరతులతో బెయిల్ మంజూరు చేశారు.

అక్రమ కేసుల వెనుక చంద్రబాబు హస్తం

జైలు నుంచి విడుదలైన అనంతరం జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ తనపై అక్రమ కేసు పెట్టి 83 రోజులు నిర్బంధించారని చెప్పారు. ఈ అక్రమ కేసుల వెనుక చంద్రబాబునాయుడు ఉన్నారని తెలిపారు. నెల్లూరు, మదనపల్లె, విజయవాడ జైళ్లలో సామాన్య ఖైదీలా ఇబ్బందులు పెట్టారని చెప్పారు. తనపై ఆరోపణలు నిజమైతే ఏ శిక్షకైనా సిద్ధమని పలుమార్లు స్పష్టంగా చెప్పానన్నారు. సీబీఐ విచారణకు డిమాండ్ చేశానని, హైకోర్టు, తిరుమల వెంకన్నస్వామి సన్నిధిలో, అమ్మ కనకదుర్గమ్మ వద్ద ప్రమాణానికి సిద్ధమన్నానని చెప్పారు. అయినా రాక్షసానందం కోసం తనను, తన సోదరుడిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. కేసులతో వైఎస్సార్‌సీపీ నాయకులను భయపెట్టవచ్చనుకుంటే అది పొరపాటేనని హెచ్చరించారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. తన భార్య, పిల్లలపైన కేసులు నమోదు చేశారని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లినప్పుడు అక్కడ కూడా సమస్యలు సృష్టించారన్నారు. కొంత మంది పోలీస్ అధికారులు అధికార పార్టీ ఆదేశాల మేరకే పనిచేశారని మండిపడ్డారు. లోకేశ్ తనపై చేసిన ఆరోపణలపై కనకదుర్గమ్మ సాక్షిగా ప్రమాణానికి రావాలని సవాల్ విసిరారు. లోకేశ్ వారం రోజుల్లో ప్రమాణానికి రాకపోతే తానే మీడియా ముందుకు వస్తానని చెప్పారు. అవసరమైతే చంద్రబాబునాయుడు ఇంటివద్దకే వెళతానని చెప్పారు. ప్రజల పక్షాన తమ పార్టీ జెండాను ఎప్పటికీ రెపరెపలాడిస్తానని ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు జైలు వద్దకు వచ్చి నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా, ఇబ్రహీంపట్నంలో పార్టీ శ్రేణులు జోగి సోదరులకు ఘన స్వాగతం పలికారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులివ్వాలి

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

ఒంగోలు టౌన్: ఏపీఎస్ ఆర్టీసీలో అర్హులైన ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవనంలో శుక్రవారం యూనియన్ నిర్మాణ మహాసభ నిర్వహించారు. ఒంగోలు, కందుకూరు, అద్దంకి డిపోల నుంచి పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సభకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు పిడుగు వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ.. గత ఏడాది అక్టోబర్‌లో 7,500 మందికి పదోన్నతులు రావాల్సి ఉండగా 550 మందికి మాత్రమే ఇచ్చారని తెలిపారు. ఎన్నో ఇబ్బందులు ఉన్నా సరిపడా బస్సులు, సిబ్బంది లేకపోయినా స్త్రీ శక్తి పథకం అమలులో ఆర్టీసీ ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని, అయితే తనిఖీ అధికారులు వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా కేసులు నమోదు చేస్తున్నారని, ఫలితంగా ఉద్యోగులు సస్పెన్షన్లు, ఇంక్రిమెంట్ల కోతలకు గురికావాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారకుంటే ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తోందని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ ఆర్టీసీలో 10 వేల ఉద్యోగాలు ఖాళీ ఉన్నా భర్తీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీ నిర్వహించకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ఆలోచన చేయడం ప్రమాదకరమన్నారు. డీజిల్ బస్సుల కొనుగోలుపై దృష్టి పెట్టకపోతే భవిష్యత్తులో ఆర్టీసీ నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 26న విజయవాడలోని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ కార్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి సెక్రటేరియట్ సమావేశంలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్

సాక్షి, అమరావతి: ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది. ఎయిడెడ్ పాఠశాలల్లో చేరిన సిబ్బందికి అటు పాత పెన్షన్, ఇటు సీపీఎస్ వర్తించకపోవడం వల్ల ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఏ బకాయిల జమ విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బీ చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు.

పదోన్నతులు 70:30 నిష్పత్తిలో చేపట్టాలి

స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్ పదోన్నతుల్లో ఎస్‌జీటీలకు 70:30 నిష్పత్తిలో కల్పించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేశవరపు జాలి రెడ్డి, షేక్ జంషీద్ డిమాండ్ చేశారు. విజయవాడలో జరిగిన గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జిల్లా పరిషత్ హై స్కూళ్లలోని మోడల్ ప్రైమరీ స్కూళ్లను సపరేట్ చేసి పీఎస్ హెచ్‌ఎంకు బాధ్యతలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే డైస్ కోడ్‌ను కేటాయించాలని, పీఎస్ హెచ్‌ఎంలుగా వెళ్లిన స్కూల్ అసిస్టెంట్లకు కన్వర్షన్ చేసుకునే వీలు కల్పించాలని, ఏ ఒక్క పాఠశాలను మూసి వేయకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సిఫార్సు లేఖతో రండి.. పోస్టు కొట్టండి!

- అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అడ్డగోలు నియామకాలు
- రాజకీయ ఉపాధి కేంద్రంగా వర్సిటీ
- టీడీపీ నేతల సిఫారసు లేఖలతో భారీగా నియామకాలు
- ప్రభుత్వ జీవోలు, వర్సిటీ నిబంధనలను తుంగలో తొక్కుతున్న వీసీ
- పాలకుల మెప్పు కోసం వర్సిటీని భ్రష్టు పట్టిస్తున్నారంటూ విమర్శలు
- 11 మంది గెస్ట్ ఫ్యాకల్టీలు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా కన్వర్షన్
- ఈసీ అనుమతి లేకుండానే 58మందికి పైగా నాన్–టీచింగ్ ఉద్యోగాలు
- చంద్రబాబు ప్రభుత్వం రాగానే 34 మంది చిరుద్యోగులను తొలగించిన వీసీ



Dr.B.R.Ambedkar University Srikakulam, Etcherla -532410.A.P

REGISTRAR

PROCEEDINGS OF THE VICE-CHANCELLOR

ORDER:

(BY ORDER)

REGISTRAR

కేంద్ర మంత్రి సిఫారసు ఆధారంగా గెస్టు ఫ్యాకల్టీలను కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా కన్వర్షన్ చేస్తున్నట్లుగా వర్సిటీ ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రాజకీయ ఉపాధి కేంద్రంగా మారుతోంది. వర్సిటీలో బోధన ప్రమాణాలు, నిర్వహణపై దృష్టిపెట్టాల్సిన పాలక యంత్రాంగం నిబంధనలను కాలరాస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. టీడీపీ నేతల సిఫారసు లేఖలే పరమావధిగా సాక్షాత్తూ వైస్ చాన్సలర్ అడ్డగోలు నియామకాలు చేపట్టడం వర్సిటీలో అలజడులను సృష్టిస్తోంది. రాజ్యాంగబద్ధ వ్యవస్థ ద్వారా వీసీగా పదవిలోకి వచ్చినప్పటికీ టీడీపీ నేతలకు జీహుజూర్ అంటూ వర్సిటీని భ్రష్టుపట్టిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి గత ప్రభుత్వంలోనే నియమితులైన వీసీ.. చంద్రబాబు ప్రభుత్వం రాగానే ప్లేటు ఫిరాయించేశారు. ఆ సమయంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 17 వర్సిటీల వీసీలతో బలవంతపు రాజీనామాలు చేయించి, పదవుల నుంచి సాగనంపారు. కానీ, అంబేడ్కర్ వీసీ మాత్రం ఇప్పటికీ కొనసాగుతూ టీడీపీ నేతలు చెప్పినదానికల్లా తలాడిస్తూ వర్సిటీని అంధకారంలోకి నెట్టేయడం గమనార్హం.

సిఫార్సు లేఖ ఉంటే పోస్టు ఖాయం!

వర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 11 మంది గెస్టు ఫ్యాకల్టీలను కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా కన్వర్ట్ చేయడం వర్సిటీల స్థాయిలో తీవ్ర చర్చనీయాంశమైంది. వాస్తవానికి ప్రభుత్వ అనుమతి లేకుండా ఎటువంటి కాంట్రాక్టు నియామకాలు చేపట్టడానికి వీలులేదని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నా.. వైస్ చాన్సలర్ పట్టించుకోలేదు. అలాగని, కాంట్రాక్టు నియామకాలకూ ఎటువంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. కేవలం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడి సిఫారసు లేఖ ఆధారంగా గెస్టు ఫ్యాకల్టీల నుంచి కాంట్రాక్టులోకి మార్చేశారు. వాస్తవానికి కాంట్రాక్టు పోస్టుల భర్తీలోనూ నిబంధనలు అనుసరించాలి. ముఖ్యంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి. కానీ, కేంద్ర మంత్రితో పాటు టీడీపీ శాసనమండలి విప్, ఎమ్మెల్సీ చిరంజీవి, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి సిఫార్సు లేఖలు ఇవ్వడంతో సదరు అభ్యర్థులను గెస్టు ఫ్యాకల్టీ నుంచి కాంట్రాక్టులోకి మార్చేశారు. విచిత్రం ఏమంటే, వర్సిటీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయట్లేదని జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన వ్యక్తిని సైతం గెస్ట్ ఫ్యాకల్టీగా చూపించి అతనిని కూడా ఒప్పంద పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించారు. ఆ వ్యక్తికి కనీసం అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఉండాల్సిన కనీస అర్హతలు లేకపోవడం కొసమెరుపు.

మంత్రి చెప్పారని 58 మందికి ఉద్యోగాలు..

వైస్ చాన్సలర్ తన పదవిని కాపాడుకోవడం కోసం వర్సిటీని టీడీపీ నాయకులకు తాకట్టుపెట్టేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం రాగానే ఏకంగా 34 మంది నాన్ టీచింగ్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. వీళ్లందరూ పేదలు. గత ప్రభుత్వంలో వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదంతో నియమితులైన ఉద్యోగులు. కానీ, పాలకుల మెప్పుకోసం ఆ చిన్న ఉద్యోగుల తొలగింపులో వైస్ చాన్సలర్ చురుగ్గా వ్యవహరించారు. ఇప్పుడు అదే వీసీ ఎటువంటి ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదం లేకుండానే స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫార్సులతో వచ్చిన వారికి అప్పనంగా రూ.వేలకు వేలు జీతాలు ఇస్తూ ఉద్యోగాలను కట్టబెట్టేశారు. ఇలా దాదాపు 58 మందికిపైగా రాజకీయ ఉపాధిని కల్పించారు. గతంలో వర్సిటీలో నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రత్యేక ఏజెన్సీ ద్వారా పారదర్శకంగా నియమించేవారు. కానీ, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ఏజెన్సీ గడువు ముగిసిందనే కారణంతో వాళ్లనూ తొలగించారు. అప్పటి నుంచి అంబేడ్కర్ వర్సిటీలో ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ ఊసే లేదు. ఫలితంగా ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకోవడంతో వర్సిటీ ప్రతిష్ట తీవ్రంగా దెబ్బతింటోంది.

రిపబ్లిక్ వేడుకల్లో ఒగ్గు డోలు విన్యాసం

- నృత్యాన్ని ప్రదర్శించనున్న తెలంగాణ కళాకారులు
- ఎం.ఎం కీరవాణి సారథ్యంలో సంగీత కార్యక్రమం

సాక్షి, న్యూఢిల్లీ: కర్తవ్యపథ్‌లో జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకల్లో తెలుగు రాష్ట్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తెలంగాణకే సొంతమైన కళారూపం ఒగ్గు డోలు నృత్యాన్ని కళాకారులు ప్రదర్శించనున్నారు. రిపబ్లిక్ డే నాడు ఇప్పటి వరకు ఎన్నో కళారూపాలు ప్రదర్శించారు. అయితే.. తొలి సారి ఒగ్గు డోలు విన్యాసానికి చోటు లభించింది. ఈ ప్రదర్శన కోసం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నుంచి ప్రఖ్యాత ఒగ్గు డోలు కళాకారుడు డాక్టర్ ఒగ్గు రవి బృందం ఆహ్వానం అందుకుంది. ఇందులో భాగంగా రవి నేతృత్వంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మంది కళాకారులు ఈ నెల 8నే ఢిల్లీకి చేరుకున్నారు. దాదాపు 15 రోజులుగా కర్తవ్య పథ్‌పై విన్యాసాల ప్రాక్టీస్ చేస్తున్నారు. మరోవైపు ఈ పరేడ్‌లో తొలిసారి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు కవాతు చేయనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం 133 మంది ఎన్‌సీసీ కేడెట్లు ఈ కవాతులో పాల్గొంటారు. ఇందులో 78 మంది బాలురు, 55 మంది బాలికలు ఉన్నారు. ఈ బృందానికి హైదరాబాద్‌లోని కవాడీగూడకు చెందిన బీటెక్ థర్డ్ ఈయర్ విద్యార్థి భరత్ నేతృత్వం వహించనున్నాడు. డిసెంబర్ 27న దేశరాజధాని ఢిల్లీకి చేరుకున్న వీరంతా.. కర్తవ్య పథ్‌పై పరేడ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అదేవిధంగా ఈ ఏడాది కర్తవ్యపథ్‌పై సుమారు 2,500 మంది సాంస్కృతిక కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. 'స్వాతంత్ర్య మంత్రం – వందే మాతరం', 'సమృద్ధి మంత్రం– ఆత్మనిర్భర్ భారత్'అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంగీత దర్శకుడిగా ఎం.ఎం.కీరవాణి వ్యవహరిస్తారని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

రష్యాలో ఉద్యోగావకాశాలు

సాక్షి, అమరావతి: రష్యాకు చెందిన స్టీల్ కంపెనీ సైబర్ స్టీల్ పరిశ్రమలో మెటల్ అండ్ పైప్ స్లైటనర్‌గా పనిచేయడానికి ఐటీఐ, డిప్లమో పూర్తి చేసి 20 ఏళ్లు దాటిన వారి నుంచి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏడాది కాలానికి కాంట్రాక్టు విధానంలో పనిచేయాల్సి ఉంటుందని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ డి.మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐలో షీట్ మెటల్ వర్కర్, ఫిట్టర్, మెకానిస్ట్, వెల్డర్ లేదా మెకానికల్ ఇంజినీర్ చేసిన వారిని ఈ ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. రోజుకు 12గంటలు పనిచేయాల్సి ఉంటుందని, నెలకు 60,000 రష్యన్ రూబెల్స్‌తోపాటు ఆహారపు వ్యయం కింద 10,000 రూబెల్స్, ఉచిత వసతి కల్పిస్తారు. ఆసక్తిగల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in అనే వెబ్‌సైట్ లేదా ఈమెయిల్ skillinternational@apssdc.in, ఫోన్ నెంబర్లు 9988853335 / 8712655686లలో సంప్రదించవచ్చు.

జాబ్ విత్ లైఫ్.. జెన్ జెడ్ స్టైల్

ఉద్యోగమే కాదు.. వ్యక్తిగత జీవితమూ ముఖ్యమేనంటున్న కొత్త తరం ఉద్యోగులు

- అభినందనలు అవసరం లేదు... ఉద్యోగ వృద్ధి ఉంటే చాలంటున్న 81 శాతం
- వేతనాల పెంపు మాత్రమే ప్రధానమన్న 21 శాతం మంది
- నౌకరీ డాట్ కామ్ అధ్యయనంలో వెల్లడి



జెన్ జెడ్.. ప్రపంచాన్ని ఉర్రూతలూగించడమే కాదు... అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకగా మారుతున్న సైన్యం... విశ్వ భవిష్యత్తుగా అవతరించిన ఈ జెన్ జెడ్ తమకంటూ నిర్దిష్ట అభిప్రాయాలను ఏర్పరచుకుంది. దేశాల్లో అధికార పీఠాలను మార్చడం నుంచి దిగ్గజ కంపెనీల తలరాతలను మార్చడంలోనూ వీరిది కీలకపాత్ర. కొంగొత్త తరం తమ ఉద్యోగాల విషయంలో వేటికి ప్రాధాన్యమిస్తున్నారు... ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారనే దానిపై ప్రముఖ ఉద్యోగ వివరాల వెబ్‌సైట్ నౌకరీ డాట్ కామ్ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. 'ది జెన్ జెడ్ వర్క్ కోడ్ 2026... వాట్ డ్రైవ్స్, ఎంగేజెస్ అండ్ రిటెయిన్స్ దెమ్'అనే పేరుతో నిర్వహించిన ఈ సర్వే వివరాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా వివిధ రంగాల కార్పొరేట్ సంస్థల్లో పనిచేస్తున్న 23 వేల మందికి పైగా ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబైతోపాటు ఇతర నగరాలకు చెందిన ఉద్యోగులున్నారు.

– సాక్షి, హైదరాబాద్

ఈ సర్వేలో ఏం వెల్లడైందంటే...

- జాబ్ ఆఫర్ల కోసం వేతనం కాకుండా దేన్ని పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించగా, 50 శాతం మంది ఉద్యోగంతోపాటు జీవితం కూడా ప్రధానమని, రెండింటినీ సమతుల్యంగా ముందుకు నడిపే ఉద్యోగాలను ఎంచుకుంటామని చెప్పారు. పనిగంటలతో పాటు వారాంతపు వినోదాలకు కూడా ప్రాధాన్యమిస్తామని చెప్పారు. కేవలం ఉద్యోగ అభివృద్ధి మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని 31 శాతం చెప్పగా, కంపెనీలో విలువలకు ప్రాధాన్యమిస్తామని 12 శాతం, నాయకత్వ తీరుకు ఓటేస్తామని 7 శాతం అభిప్రాయపడ్డారు. అయితే, 5–8 సంవత్సరాల అనుభవం ఉన్న ఉద్యోగుల్లో 60 శాతం మంది ఉద్యోగంతోపాటు జీవితాన్ని సమపాళ్లలో నడిపించేలా జాగ్రత్తలు తీసుకుంటామని వెల్లడించారు.
- కెరీర్ అభివృద్ధి అంటే ఏంటని ప్రశ్నించగా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడమేనని 57 శాతం, జీతం పెరగడమని 21 శాతం, పదోన్నతి రావడమని 12 శాతం, ప్రాజెక్టులను లీడ్ చేయడమని 10 శాతం మంది చెప్పారు.
- ఉద్యోగంలో ఎలాంటి గుర్తింపు కావాలని కోరుకుంటారన్న ప్రశ్నకు.. 81 శాతం మంది ఉద్యోగ వృద్ధి అవకాశాలు రావడమే గుర్తింపు అని చెప్పగా, నగదు బహుమతులు గుర్తింపుగా భావిస్తామని 10 శాతం, అభినందనలు గుర్తింపుగా పరిగణిస్తామని 7 శాతం, వ్యక్తిగతంగా అభినందనలు తెలపడాన్ని గుర్తింపు అనుకుంటామని 2 శాతం మంది వెల్లడించారు.
- పని ప్రదేశంలో మీ మానసిక ఆరోగ్యాన్ని ఏ అంశం ప్రభావితం చేస్తోందని ప్రశ్నించగా.. ఉద్యోగం–జీవితం సమతుల్యంగా లేకపోవడం మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని 34 శాతం మంది, ఎలాంటి అభివృద్ధి కనిపించకపోవడం బాధను కలిగిస్తోందని 31 శాతం మంది, చెడు సహచరుల వల్ల ఇబ్బంది పడుతున్నామని 19 శాతం మంది, బాసిజం తట్టుకోలేకపోతున్నామని 16 శాతం మంది చెప్పారు.
- ఒకటే ఉద్యోగంలో ఎన్నాళ్లు ఉంటారని అడిగితే.. ఒక ఉద్యోగం ఒక సంవత్సరం మాత్రమే చేస్తామని 14 శాతం మంది, 2–3 ఏళ్లు ఉంటామని 37 శాతం మంది, 4–5 ఏళ్లు ఉంటామని 13 శాతం, ఐదు కంటే ఎక్కువ సంవత్సరాలుగా ఒకే ఉద్యోగం చేస్తున్నామని 36 శాతం మంది చెప్పారు.
- కెరీర్‌కు సంబంధించిన సలహాలను స్నేహితులు, మార్గదర్శకుల నుంచి తీసుకుంటామని 43 శాతం, నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్ల నుంచి తీసుకుంటామని 40 శాతం, పాడ్‌కాస్ట్‌ల ద్వారా తెలుసుకుంటామని 13 శాతం, ఇన్‌స్టాగ్రామ్ అని 4 శాతం చెప్పారు.
- ఈ నివేదికకు ముక్తాయింపుగా... 'జెన్‌జీ ఆటలు ఆడటం లేదు. వారికి నిజం కావాలి. నిజం తప్ప ఏమీ అవసరం లేదు. ఈజ్ యువర్ కంపెనీ లిజనింగ్?'అని ప్రస్తావించడం గమనార్హం.

ట్రాప్ కెమెరాకు చిక్కిన పెద్ద పులి

బుట్టాయగూడెం: మూడు రోజులుగా గిరిజన ప్రాంతంలో సంచరిస్తూ, ఆవులపై దాడి చేస్తున్న పెద్ద పులి శుక్రవారం ట్రాప్ కెమెరాలకు చిక్కింది. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం నాగులగూడెం సమీపంలో గురువారం రాత్రి ఒక ఆవును పెద్ద పులి చంపి తింటున్న దృశ్యాలు, పులి సంచరిస్తున్న చిత్రాలు ట్రాప్ కెమెరాలకు చిక్కాయి. దీనిని ఆడ పులిగా అటవీ అధికారులు గుర్తించారు. పులి రాత్రివేళల్లో ఆవులపై దాడి చేస్తోందని జంగారెడ్డిగూడెం రేంజ్ అధికారి దుర్గాకుమార్ బాబు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అంతర్వేదిగూడెం సమీపంలో ఉన్న గుమ్మడికొండ ప్రాంతంలో పులి పాద ముద్రలు గుర్తించామని చెప్పారు.

సత్యసాయి జిల్లాలో నాటు తుపాకుల కలకలం

మూడు తుపాకులు, 25 బుల్లెట్లు స్వాధీనం

నాటు తుపాకులతో నిందితులు

కదిరి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం బట్రేపల్లి అటవీ ప్రాంతంలో నాటు తుపాకులు కలకలం రేపాయి. అటవీశాఖ డివిజినల్ రేంజ్ ఆఫీసర్ (డీఆర్‌వో) ప్రదీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి బట్రేపల్లి అటవీ ప్రాంతానికి నలుగురు వ్యక్తులు నాటు తుపాకులతో వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి చేరుకుని విచారించగా వారు బట్రేపల్లికి చెందిన మల్లికార్జున, అన్నమయ్య జిల్లా గువ్వలపల్లికి చెందిన సయ్యద్ సుబహాన్, షేక్ మహమ్మద్ షఫి, కడపకు చెందిన సయ్యద్ మహమ్మద్ సాదిక్‌లుగా గుర్తించారు. వారి నుంచి మూడు నాటు తుపాకులు, 25 బుల్లెట్లు, రెండు కత్తులు, ఆలువ చిప్పలు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణుల వేటకు వచ్చినట్లు విచారణలో తేలడంతో నిందితులను కదిరి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

గణతంత్ర వేడుకలకు ప్రత్యేక అతిథులుగా
ముగ్గురు విద్యార్థులు

ఇప్పిలి సంజన

సాక్షి, అమరావతి: ఢిల్లీలో జరగనున్న 77వ గణతంత్ర దిన వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ముగ్గురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు జాతీయ స్థాయి పాఠశాలల ఆవిష్కరణ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ అరుదైన అర్హత సాధించడం విశేషం. శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఇప్పిలి సంజన, కృష్ణా జిల్లా మొవ్వ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు దావు స్నేహ, కాకి సౌమ్య గణతంత్ర వేడుకలకు హాజరుకానున్నారు. జనవరి 26న రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ఇచ్చే ప్రత్యేక తేనీటి విందులో వీరు పాల్గొననున్నారు. ఇదిలా ఉంటే ఆవిష్కరణ పోటీల్లో సంజన తయారు చేసిన సౌరశక్తి ప్రదర్శనతోపాటు, స్నేహ, సౌమ్య రూపొందించిన రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించే ఆవిష్కరణ నిపుణులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ఈ ఆవిష్కరణ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచినట్టు అధికారులు చెప్పారు.

ప్రాణం తీసిన ఫైనాన్స్ కంపెనీ వేధింపులు

- ఇంటికి తాళం వేయడంతో యజమాని బలవన్మరణం
- కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలంలో ఘటన

ఇంటికి ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది అంటించిన నోటీసులు (ఇన్‌సెట్‌లో) హరిఓం ప్రసాద్ మృతదేహం

యలమర్రు (పెదపారుపూడి): ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ఒకరి నిండు ప్రాణం బలితీసుకుంది. అప్పు తీర్చలేదని ఇంటికి తాళం వేసి, నోటీసులు అంటించటంతో మనస్తాపం చెందిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యలమర్రు గ్రామానికి చెందిన గేదల హరిఓం ప్రసాద్ (44), స్వప్న దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రసాద్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ వ్యవసాయ పనులకు వెళ్తుంటాడు. రెండేళ్ల కిందట ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నుంచి రుణం తీసుకున్నాడు. కొంత కాలం నుంచి వాయిదాలు చెల్లించకపోవడంతో కంపెనీ పలుసార్లు నోటీసులు ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో కంపెనీ వాళ్లు గురువారం ఉదయం అధికారులను తీసుకుని గ్రామానికి వచ్చారు. ప్రసాద్ ఇంటికి తాళాలు వేసి తలుపునకు నోటీసులు అంటించారు. దీంతో హరిఓం ప్రసాద్ కుటుంబ సభ్యులతో పొరుగున ఉన్న ఈదులమాద్దాలి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. హరిఓం ప్రసాద్ రాత్రి 10 గంటలకు యలమర్రు వెళ్తున్నట్లు భార్య స్వప్నకు చెప్పి బయలుదేరాడు. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో గ్రామంలో ఉన్న రామాలయం గేటుకు ఉరేసుకుని వేలాడుతున్న హరిఓం ప్రసాద్‌ను చూసి గ్రామస్తులు స్వప్నకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

29 ఏళ్ల తర్వాత దండుపాళ్యం ముఠా సభ్యుడి అరెస్టు

హనుమంతప్ప

దొడ్డబళ్లాపురం: దండుపాళ్యం ముఠా సభ్యుడిని 29 ఏళ్ల తర్వాత మంగళూరులోని ఉర్వ పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె తాలూకా దండుపాళ్యంకి చెందిన నిందితుడు చిక్కహనుమ అలియాస్ చిక్క హనుమంతప్ప అలియాస్ కృష్ణప్ప (55) ప్రస్తుతం ఏపీలోని మదనపల్లె విజయనగర కాలనీలో కె.కృష్ణగా పేరు మార్చుకుని నివసిస్తున్నాడు. మంగళూరు మారిగుడి క్రాస్ వద్ద అన్వర్ మహల్ అనే వ్యక్తి ఇంట్లోకి 1997 అక్టోబర్ 14న అర్ధరాత్రి దండుపాళ్యం ముఠా సభ్యులు ఎనిమిది మంది చొరబడ్డారు. లూవిస్ డిమెల్లో(80), రంజిత్ వేగస్(19) అనే ఇద్దరిని హత్య చేసి దోపిడీకి పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకున్న ఉర్వ పోలీసులు ప్రధాన నిందితుడైన చిక్కహనుమ మినహా మిగతా నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని ఏపీలో గుర్తించి శుక్రవారం అరెస్టు చేశారు. ఇతనిపై 13 హత్యలు, దోపిడీ కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 37.5019 టీఎంసీలు.

డైరీ ఆవిష్కరణ

నరసరావుపేట రూరల్: జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన సంవత్సరం డైరీని కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీలో ఓటరు ప్రతిజ్ఞ

గుంటూరుఎడ్యుకేషన్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నా అనుచరుడి అరాచకం

- వడ్డెరల క్వారీకి అడ్డు పడుతున్న వైనం
- మంత్రిని కలిసినా ఉపయోగం లేకుండా పోయింది...
- కన్నాతో చెప్పించండి అంటూ మంత్రి కొల్లు ఉచిత సలహా

చినపలకలూరులోని క్వారీ (ఫైల్)

చినపలకలూరులోని క్వారీ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు రూరల్ మండలంలో సత్తెనపల్లి శాసనసభ్యుడు, మాజీ మంత్రి కన్నా అనుచరుడు, పీవీఆర్ చలపతి మెటల్ ఇండస్ట్రీస్ అధినేత పి వెంకటేశ్వరరావు అరాచకాలకు అడ్డు లేకుండా పోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబునాయుడి ప్రభుత్వం వచ్చిన తర్వాత పలకలూరులోని క్వారీలలో అనుమతులు ఉన్న ఎవరిని తవ్వనీయకుండా తానే ఏకచత్రాధిపత్యంగా వ్యవహరిస్తున్నాడని మిగిలిన క్వారీ యజమానులు ఆరోపిస్తున్నారు. క్వారీకి వెళ్లే దారిని తవ్వేయడంతోపాటు మిగిలిన క్వారీ యజమానులను బెదిరిస్తున్నాడని, ఆయనకు మాజీ మంత్రి అండదండలు ఉండటంతో పార్టీ నాయకులు కూడా ఏం చేయలేని స్థితిలో ఉన్నట్లు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 క్వారీలు ఉన్నా పక్కన ఉన్న క్వారీలపై కన్నేసిన ఆ నాయకుడు మిగిలిన క్వారీల వారికి దారి లేకుండా చేస్తున్నాడు. స్థానికంగా ఉన్న క్వారీ యజమానులు మొరపెట్టుకున్నా అధికారులు కూడా ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. తాజాగా మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామానికి చెందిన పేరేచర్ల తెల్ల క్వారీ వడ్డెర క్వారీ వర్కర్స్ లేబర్ కాంట్రాక్టర్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు గుంటూరు రూరల్ మండలం చినపలకలూరు గ్రామంలో సర్వే నెంబర్ 155/ఎ1లో 1.214 హెక్టార్ల క్వారీ లీజు ఉంది. దీన్ని 13 నెలలుగా జరగనీయకుండా సదరు నాయకుడు అడ్డు పడుతున్నాడు. తనకు కేటాయించిన స్థలంతోపాటు వడ్డెర క్వారీలో కూడా అనుమతులు కూడా లేకుండా తవ్వడంపై ఆ వడ్డెర క్వారీ వారు ఫిర్యాదు చేయడంతో అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. బాధితులు ఇబ్రహీంపట్నం రాష్ట్ర మైనింగ్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి ఒంగోలు మైనింగ్ అధికారితో విచారణ జరిపించారు. ఆయన పరిశీలన చేసి ఇరువర్గాలతో మాట్లాడిన తర్వాత గత ఏడాది నవంబర్ 26న మైనింగ్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీనిపై మంత్రి వద్దకు వెళ్లిన సదరు నేత స్టే తీసుకువచ్చారు.

కేంద్ర మంత్రి కార్యాలయంలో పంచాయితీ

ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో కూడా పంచాయితీ జరిగింది. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చారు. అయితే బయటకు రాగానే సదరు నాయకుడు అడ్డం తిరిగాడు. క్వారీకి వెళ్లే దారిని పొక్లెయిన్‌తో తవ్వేయడంతో మిగిలిన క్వారీలకు దారి లేకుండా పోయింది. దీంతో 13 నెలలుగా 50 వడ్డెర కుటుంబాలకు ఉపాధి లేకుండా పోయింది. గతంలో కూడా ఇలానే అడ్డుకుంటే గత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లడంతో వారి ఆదేశాల మేరకు క్వారీలు సవ్యంగా నడిచాయి. మళ్లీ చంద్రబాబు నాయుడి ప్రభుత్వం వచ్చిన తర్వాత దారి తవ్వేయడంతో పాటు ఆ క్వారీ వారు ఎవరూ రాకుండా తన మనుషులతో అడ్డుకుంటున్నాడు.

మంత్రి కొల్లును కలసిన వడ్డెర సంఘం నేత

తాజాగా శుక్రవారం వడ్డెర క్వారీ నిర్వాహకులతోపాటు వడ్డెర ప్రజాగళం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టు నాగేశ్వరరావు మంత్రి కొల్లు రవీంద్రను కలిశారు. మంత్రి వారి వద్ద ఉన్న కాగితాలు పరిశీలించిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే వద్ద నుంచి లేఖ తెచ్చుకోవాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే నుంచి కూడా లేఖ తెచ్చామని వారు చూపించగా సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను కలవాలని సలహా ఇచ్చారు. దీనిపై వడ్డెర క్వారీ నిర్వాహకులు ఇక్కడ ఆయనకేం పని అని ప్రశ్నించారు. తాము పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారని నాగేశ్వరరావు తెలిపారు. తమ క్వారీ నిర్వహణకు పార్టీ నాయకులతో పనేంటని ఆయన ప్రశ్నించారు. ఈ ధోరణి మారకపోతే పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఆయన సాక్షికి తెలిపారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవలు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య సమరంలో అమరత్వం సాధించిన మహానాయకుడు అని, ఆయన ధైర్యం, త్యాగం, దేశభక్తి యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తి ఇస్తాయని కలెక్టర్ కొనియాడారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఎన్నికల నమోదు అధికారులు, జిల్లా అధికారులతో శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు విభిన్న కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. యువతను ఇందులో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఓటరు దినోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రభుత్వ కార్యాలయంలో ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలి

జిల్లాలో మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి ఒక కుటుంబం–ఒక వ్యాపారవేత్తకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒక కుటుంబం –ఒక వ్యాపారవేత్త కార్యక్రమంలో బ్యాంకర్లు మంజూరు చేసిన రుణాలు మార్చి 8 నాటికి నూరు శాతం గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పాజిటివ్ పర్సెప్షన్ మరింత మెరుగుపరచాలి

జిల్లాలో ప్రజలకు అందించే ప్రభుత్వ సేవలపై పాజిటివ్ పర్సెప్షన్ మరింతగా మెరుగుపరిచేలా అధికారులు పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి జిల్లా ప్రజా రవాణా శాఖ, రవాణా శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, అగ్నిమాపక శాఖలలో వివిధ అంశాలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజలు అందించిన ఫీడ్ బ్యాక్‌పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్‌స్టేషన్లలో తాగునీరు, పరిశుభ్రత, సీటింగ్, మరుగుదొడ్ల నిర్వహణ తదితర మౌలిక సౌకర్యాలు సక్రమంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్టాండ్‌లలో ప్రయాణికులకు ఆర్ఓ వాటర్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దుకాణాల్లో ఎమ్మార్పీకే విక్రయాలు జరిగేలా తనిఖీలు నిర్వహించాలన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

న్యూస్‌రీల్

వైభవంగా వసంత పంచమి

నరసరావుపేట ఈస్ట్: వసంత పంచమిని పురస్కరించుకొని భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ శుద్ధ పంచమి రోజున శ్రీసరస్వతీ దేవి జన్మదినం సందర్భంగా శుక్రవారం తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. నరసరావుపేటలోని శ్రీశృంగేరీ శంకరమఠంలోని శ్రీశారదాంబ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పెన్నులతో అలంకరించి పూజలు జరిపారు. వినుకొండరోడ్డులోని త్రిశక్తి దేవాలయల సముదాయంలోని శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలతో పాటు పాఠశాలల్లో సరస్వతీ పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపారు.

నేడు కానుకమాత చర్చి జెండా ఆవిష్కరణ

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 176వ వార్షిక మహోత్సవంలో భాగంగా ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నవదిన ప్రార్థనలు జరుగుతాయని విచారణ గురువులు ఏరువ లూర్ధుమర్రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు జెండా ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం చర్చి ప్రాంగణంలో సిల్వర్ జూబిలేరియన్స్ రెవ.ఫాదర్ పుట్టి అంతోనిరాజు, రెవ.ఫాదర్ తుమ్మా మర్రెడ్డి, రెవ.ఫాదర్ చింతపల్లి అబ్రహం, రెవ.ఫాదర్ పోతిరెడ్డి ఇన్నారెడ్డిలచే దివ్యపూజాబలితో పండుగ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

దాసకుటిలో శ్రీసత్యనారాయణ వ్రతం

తెనాలి: ఆంధ్రవాల్మీకి శ్రీవాసుదాస స్వామి వారి పరంపరపీఠం దాసకుటి, అంగలకుదురులో పీఠాధిపతి శ్రీ సీతారామదాసస్వామి వారి ఆధ్వర్యంలో 164వ శ్రీ వాసుదాసు స్వామి జయంతిని ఘనంగా జరుపుతున్నారు. మూడు రోజుల వేడుకల్లో రెండవ రోజైన శుక్రవారం రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. జాగర్లమూడి రఘురాం ఆచార్యులు పూజా కార్యక్రమాలను చేయించారు. ప్రవచనకర్త ములుకుట్ల విశ్వనాథశాస్త్రి శ్రీ సత్యనారాయణ స్వామివ్రత కథను వివరించారు. ములుకుట్ల విశ్వనాథ శాస్త్రి దంపతులు, పులిపాక అప్పారావు దంపతులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రథసప్తమికి సహస్ర దళ సూర్యయంత్రం



తెనాలి: ఈనెల 25వ తేదీన రథసప్తమిని పురస్కరించుకుని తెనాలి బాలాజీరావుపేటలోని అయ్యప్ప దేవాలయం నిర్వాహకుడు దుర్భా హరిబాబు స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రాంగణంలో సహస్ర దళ సూర్యయంత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. రథసప్తమికి అందుబాటులోకి వస్తుందని, భక్తులందరూ దర్శించుకోవాలని సూచించారు.

కనపర్రులో వైభవంగా చర్చి వార్షికోత్సవం



నాదెండ్ల: కనపర్రు గ్రామంలోని పురాతన ఆర్‌సీఎం చర్చిలో పునీత, జోజప్ప కల్యాణ నిశ్చితార్థ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. చర్చి నిర్మించి 128 వసంతాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమానికి విచారణ గురువు ఫాదర్ చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరయ్యారు. స్థానిక విచారణ గురువు బంధనాథం లూర్దురాజు ఆధ్వర్యంలో ఉదయం సమష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. కానుకలు, కొవ్వొత్తులు సమర్పించారు. రాత్రి తేరు ఊరేగింపు నిర్వహించారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చి వద్ద ఏర్పాటుచేసిన భారీ విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది.

పోలీసుల తనిఖీల్లో భారీగా సొత్తు స్వాధీనం

సోదాలు నిర్వహించి బయటకు వస్తున్న పోలీసులు

- అతి పురాతన, విలువైన విగ్రహాలు ఉన్నాయని జిల్లా ఎస్పీకి సమాచారం రావడంతో తనిఖీలు
- సుమారు రూ.1.35 కోట్ల సొత్తు స్వాధీనం

తెనాలిరూరల్: పోలీసులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో భారీ ఎత్తున సొత్తు లభించింది. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు వచ్చిన సమాచారంతో తెనాలి పట్టణ బాలాజీరావుపేట మహేంద్ర కాలనీలో గుంటూరు నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఇక్కడి త్రీ టౌన్ పోలీసులతో కలసి శుక్రవారం తెల్లవారుజామున నాలుగు ఇళ్లలో ఏకధాటిగా నాలుగు బృందాలుగా తనిఖీలు నిర్వహించారు. ఓ రేకుల షెడ్డులో నివసిస్తున్న పేరుబోయిన గురవమ్మ వద్ద 700 గ్రాముల బంగారం, 15 కిలోల వెండి, రూ.5.60 లక్షల వరకు నగదు లభించింది. మహేంద్ర కాలనీలోని ఓ ఇంట్లో అతి విలువైన పురాతన దేవతా విగ్రహాలు, పురాతన విగ్రహాలు ఉన్నట్టు ఎస్పీకి వచ్చిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఇంత భారీ మొత్తంలో సొత్తు లభించడంతో పోలీసులు అవాక్కయ్యారు. గురవమ్మ అల్లుడు గురునాథం ఇతర రాష్ట్రాల నుంచి బంగారం, వెండి తెచ్చి విక్రయాలు జరుపుతుంటాడని, ఓ కేసులో నిందితుడిగా ఉన్న క్రమంలో పోలీసులు అతని ఇంటికి తనిఖీలకు వెళ్లే సమయానికి మూట ముల్లె సర్దుకుని పరారయ్యాడని తెలిసింది. ఈ నేపథ్యంలో ఎస్పీ జిందాల్‌కు వచ్చిన సమాచారంతో మహేంద్ర కాలనీలో తనిఖీలకు ఎస్పీ ఆదేశించగా గురునాథం అత్త వద్ద ఈ సొత్తు లభించింది. గుంటూరు నుంచి పోలీసుల బృంద సభ్యులు తెనాలి పోలీసులు తెల్లవారుజామున మూడు గంటలకు రైల్వేస్టేషన్ వద్దకు రావాలని సమాచారమిచ్చి హుటాహుటిన ఇక్కడకు వచ్చారు. స్థానిక పోలీసులను వెంటబెట్టుకుని తనిఖీలు నిర్వహించారు. స్థానిక పోలీసులకు కేసుకు సంబంధించిన వివరాలు చెప్పకుండానే గుంటూరు నుంచి వచ్చిన బృందం లభించిన సొత్తుతో నేరుగా ఎస్పీ వద్దకు వెళ్లిపోయింది.

గురునాథందీ రైస్ పుల్లింగ్ దందా.?

పోలీసులు వెతుకుతున్న గురునాథం రైస్ పుల్లింగ్ దందా నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం లభించినట్టు తెలిసింది. ఇటీవల విజయవాడలో ఖరీదైన భవంతి కొనుగోలు చేశాడని, మహేంద్ర కాలనీ కేంద్రంగా రైస్ పుల్లింగ్ వ్యవహారం నడుపుతున్నాడని ఎస్పీకి సమాచారం రావడంతో ఆకస్మిక తనిఖీలకు ఆదేశించినట్టు సమాచారం. బియ్యాన్ని ఆకర్షించే అతి పురాతన లోహపు వస్తువులు ఉన్నాయంటూ ఈ రైస్ పుల్లింగ్ ముఠా రూ.కోట్లలో దందాలకు పాల్పడుతుంటారు. ఇటువంటి కేసులోనే గురునాథం ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నట్టు సమాచారం. అతను పట్టుబడితే మరింత సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

తుక్కు తరలింపులో మెక్కేస్తున్నారు

- తూకాల్లో తేడాతో లబ్ధి పొందుతున్న ఆసుపత్రి సిబ్బంది
- పర్యవేక్షణ లేకుండా తుక్కు సామగ్రి తరలింపు
- ఆక్సిజన్ కొనుగోలులో తేలని లెక్కలు

బుధవారం రాత్రి లారీలో తుక్కును తరలిస్తున్న జీజీహెచ్ సిబ్బంది

జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

గుంటూరు మెడికల్: రోతు మెతకనైతే గుర్రం మూడుకాళ్ల మీద నడిచిందన్న చందాన గుంటూరు పెద్దాసుపత్రి(జీజీహెచ్)లో అధికారుల పరిపాలన సాగుతోంది. కొంత మంది సిబ్బంది, కొంత మంది అధికారులతో మిలాఖతై ప్రతిదాంట్లో అందిన కాడికి నొక్కేసి జేబులు నింపుకుంటున్నారు. బుధవారం రాత్రి ఎవరి కంట పడకుండా హడావుడిగా ఆసుపత్రిలోని తుక్కును తరలించి వారికి నచ్చినచోట తూకాలు వేయించి, అందిన కాడికి జేబుల్లో పెట్టేసుకున్నారు.

నచ్చిన చోట నచ్చినట్టు తూకం ...

తాజాగా బుధవారం రాత్రి జరిపిన అమ్మకాలకు సంబంధించి డబ్బు సైతం కాంట్రాక్టర్ పూర్తి స్థాయిలో హెచ్‌డీఎస్ (ఆసుపత్రి అభివృద్ధి సంఘం) అకౌంట్‌కు జమ చేయలేదు. అయినప్పటికీ యథేచ్ఛగా తుక్కును తీసుకెళ్లేందుకు అనుమతులు మంజూరు చేయడం విమర్శలకు తావిస్తుంది. పరిపాలనా అధికారి పనితీరు బాగోకపోవడంతో రెండు నెలల క్రితం సరెండర్ చేశారు. సదరు బాధ్యతలు ఎవరు నిర్వర్తిస్తున్నారో ఎవరికి తెలియదు. తుక్కు తరలింపులో ఏవో, వర్క్‌షాపు ఉద్యోగుల పాత్ర కీలకం. వీరివురు లేకుండా మరో అధికారి స్వయంగా తనకు నచ్చిన వేయింగ్ మిషన్ సెంటర్‌కు తుక్కు లారీని తరలించినట్లు ఆసుపత్రి ఉద్యోగులు చెవులు కొర్కుంటున్నారు.

వేయింగ్ మిషన్‌లో మతలబు

- ఆసుపత్రిలో వినియోగంలో లేని, పనికి రాని మంచాలు, సెలైన్ స్టాండ్లు, బీరువాలు, సర్జికల్ ట్రేలు, ఇతర వైద్య పరికరాలు వర్క్‌షాపు ద్వారా టెండర్లు పిలిచి తుక్కుగా మార్చి అమ్మేస్తుంటారు.
- గత ఏడాది టెండరు పాడుకున్న ఓ వ్యక్తి కిలో రూ.30లు వెచ్చించి ఇనుము కొనుగోలు చేస్తున్నాడు. అయితే ఆసుపత్రి పరిపాలనా అధికారి, కార్యాలయ ఉద్యోగి తప్పనిసరిగా వేయింగ్ మిషన్ వద్దకు వెళ్లి దగ్గరుండి తూకం వేయించి సదరు వివరాలు బుక్‌లో రాసి, తుక్కును కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంటుంది.
- ఆసుపత్రిలో ఈ తరహాలో తుక్కు తరలింపు జరగడం లేదు. వేయింగ్ మిషన్‌లకు అనుమతులు లేని, ఇష్టానుసారం బిల్లులు ఇచ్చేవారి వద్ద తూకం వేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆక్సిజన్ తూకాల్లోనూ తేడాలే..

- గుంటూరు జీజీహెచ్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఆక్సిజన్‌ను కర్నూలుకు చెందిన శ్రీ భారత్ ఫార్మా కంపెనీ సరఫరా చేస్తుంది. ఇక్కడ లిక్విడ్ ఆక్సిజన్ నిల్వ చేసుకునేందుకు రెండు ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి.
- ఆక్సిజన్ సరఫరా చేసే లారీ రెండు రోజులు లేదా మూడు రోజులకొకసారి తీసుకొస్తుంది. లారీ వచ్చినప్పుడు ఎంత మేరకు ఆక్సిజన్ నిల్వ ఉందనే విషయాలను ఫార్మసీ విభాగం పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కాని అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆక్సిజన్ లారీ కాటా విషయాలను పర్యవేక్షించడం విమర్శలకు తావిస్తుంది.
- ప్రతినెలా రూ.40 లక్షలకు పైగా ఆక్సిజన్ సరఫరా చేసే కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నారు. బిల్లులపై ఫార్మసీ అధికారులు, జీజీహెచ్ కార్యాలయ అధికారులు తూకాలు పర్యవేక్షించకుండా తమకు కమీషన్లు ఇస్తున్నారనే కారణంతో సంతకాలు పెట్టేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

తాడికొండ: రాజధాని ప్రాంతంలో నిర్వహించే గణతంత్ర వేడుకల ఏర్పాట్లను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ శుక్రవారం పరిశీలించారు. రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు సమీపంలో మంత్రుల బంగ్లాల ఎదురుగా ఉన్న పెరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. 22 ఎకరాల్లో పెరేడ్ కోసం గ్రౌండ్, వీవీఐపీ, వీఐపీ పార్కింగ్‌కు 15 ఎకరాలు, పబ్లిక్ పార్కింగ్‌కు 25 ఎకరాలు కేటాయించారు. అమరావతి రైతులకు ప్రత్యేకంగా వీఐపీ గ్యాలరీ ఏర్పాటు చేయడంతో పాటు వేడుకలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికలను అధికారులు పంపుతున్నారు. ఈ వేడుకలకు మొత్తం 13 వేల మందికి సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఆర్డీఏ అధికారులు మంత్రికి వివరించారు. వేడుకలకు హాజరయ్యే వీఐపీలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న పురపాలక శాఖ మంత్రి నారాయణ

నేటి నుంచి నాలుగు రోజులు బ్యాంకుల మూత

కొరిటెపాడు(గుంటూరు): జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి మంగళవారం వరకు వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. 24వ తేదీన నాలుగో శనివారం, 25న ఆదివారం సెలవు. ఇక 26న రిపబ్లిక్ డే సందర్భగా సోమవారం అధికారికంగా సెలవు ఉంటుంది. దేశ వ్యాప్తంగా బ్యాంకుల సమ్మె కారణంగా 27న మంగళవారం కూడా బ్యాంకులు మూతపడనున్నట్లు బ్యాంక్ ఉద్యోగ సంఘాలు తెలిపాయి. సమ్మె విరమణకు జాతీయ స్థాయిలో చర్చలు జరుగుతున్నందున ఇంకా స్పష్టత లేదన్నారు. ఇప్పటికైతే అన్ని బ్యాంకుల ఉద్యోగులు సమ్మెకు వెళ్లాలని పిలుపునిచ్చినట్లు తెలిపాయి.

ఎక్కువ కేసులు

రాజీ చేసేలా కృషి చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి సాయి కల్యాణ్ చక్రవర్తి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

గుంటూరులీగల్: శిక్షణ పూర్తయిన న్యాయవాదులు మధ్యవర్తిత్వాన్ని వృత్తిగా ఎంచుకొని ఎక్కువ సంఖ్యలో కేసులను రాజీ చేసే దిశగా కృషి చేయాలని, కక్షిదారులకు సరైన న్యాయం చేసేదిశగా మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు జిల్లాలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వం మీద 40 గంటలపాటు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. సుప్రీంకోర్టు మీడియేషన్, కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ శిక్షకులు శ్రీలాల్ వారియర్, నీనా ఖరేలు శిక్షణ ఇచ్చారు. పలు అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయవాదులకు అభినందనలు తెలిపి సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వారి అనుభవాలను పంచుకొని మధ్యవర్తిత్వంపై మరింత అవగాహన పెంచుకొనే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 292

కొమ్ములు : 100 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,400	12,400	12,400

కాయలు : 192 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
12,130	12,420	12,420

మొత్తం అమ్మకాలు : 219 క్వింటాళ్లు

-దుగ్గిరాల

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో నియామకాలు

పట్నం బజారు (గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీలో పలువురుని పలు పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన మునిపల్లె సంపత్‌కుమార్‌ను రాష్ట్ర ఆర్‌టీఐ విభాగం కార్యదర్శిగా, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా పాటిబండ్ల కవిత, రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శిగా కందుకూరి జ్యోతిలను నియమించారు.

తిరుమలలో అన్నదానం చేసిన భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేసేందుకు రూ.44 లక్షలు విరాళంగా అందజేసిన భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ శుక్రవారం తిరుమలలోని శ్రీతరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. భాష్యం రామకృష్ణతో పాటు భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

గుంటూరులో సిగ్నేచర్ డైన్ రెస్టారెంట్ ప్రారంభం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): గుంటూరులో అన్నివర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా సిగ్నేచర్ డైన్ రెస్టారెంట్–కన్వెన్షన్ నెలకొల్పడం అభినందనీయమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ మూడో వీధిలో సిగ్నేచర్ డైన్ రెస్టారెంట్–కన్వెన్షన్‌ను శుక్రవారం మంత్రి గొట్టిపాటి ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, మేయర్ కోవెలమూడి రవీంద్ర ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ అన్నిరకాల వేడుకలు నిర్వహించుకునేందుకు అనువుగా ఉందని అన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మన్నవ యుగంధర్ మాట్లాడుతూ సిగ్నేచర్ డైన్ రెస్టారెంట్–కన్వెన్షన్‌ను సరికొత్త హంగులతో అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. వెజ్, నాన్‌వెజ్ రెస్టారెంట్, బాంకెట్/ కాన్ఫరెన్స్ హాల్, ఫంక్షన్ హాల్, గ్రాండ్ బెడ్‌రూమ్, గ్రాండ్ కంఫర్ట్ రూమ్స్, ఎగ్జిక్యూటివ్ రూమ్స్, గ్రాండ్ క్లబ్ సూట్ రూమ్స్ అన్ని రకాల వసతులతో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

సమగ్రశిక్షలో డిప్యూటేషన్‌పై నియామకాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కో–ఆర్డినేటర్ (ఏఏఎస్‌ఎల్‌సీ) పోస్టులో ఫారిన్ సర్వీసు నిబంధనల ప్రకారం డిప్యూటేషన్ పై పని చేసేందుకు 55 ఏళ్లలోపు వయసు కలిగిన ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీమ్ బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదేళ్ల సర్వీసు కలిగిన స్కూల్ అసిస్టెంట్, ఎనిమిదేళ్ల సర్వీసు కలిగిన ఎస్జీటీలలో ఆసక్తి గల వారు ఈనెల 31లోపు గుంటూరులోని సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం నందు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్‌తో పాటు డీఈవో కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

అంతరిక్షం మన జీవితంలో భాగం

- డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి. సతీష్ రెడ్డి
- విజ్ఞాన్‌లో రెండో రోజు ఘనంగా కొనసాగిన ఏపీ స్పేస్ టెక్ సమ్మిట్

మాట్లాడుతున్న డాక్టర్ సతీష్ రెడ్డి



అమకే సొల్యూషన్స్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంటున్న విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతినిధులు

చేబ్రోలు: 'అంతరిక్షం కేవలం పరిశోధనలకే పరిమితం కాదు, అది నేడు దేశ రక్షణలో అంతర్భాగమైంది. ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ తర్వాత అంతరిక్షమే నాలుగో యుద్ధ క్షేత్రం' అని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ, అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ అకాడమీ, హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్–2026'లో భాగంగా నిర్వహించిన సౌత్ ఇండియా రాక్రెటీ ఛాలెంజ్ రెండో రోజు శుక్రవారం ఘనంగా కొనసాగింది. కార్యక్రమంలో భాగంగా దేశంలోని పలు ప్రతిష్టాత్మక కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విజ్ఞాన్ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు చేతుల మీదుగా అవగాహన పత్రాలను మార్చుకున్నారు.

- కార్యక్రమంలో డాక్టర్ జి. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ... స్పేస్ అనేది మన జీవితంలో ఒక భాగం అవుతుందని దశాబ్దాల క్రితమే చెప్పారని, నేడు అది అక్షరాలా నిజమైందన్నారు. ఒక్క క్షణం అంతరిక్ష సాంకేతికత నిలిచిపోతే మన కమ్యూనికేషన్ వ్యవస్థ, బ్యాంకింగ్, రవాణా, వ్యవసాయం, చివరికి టీవీ చానల్స్ కూడా మూతపడతాయన్నారు. సామాన్యుడి దైనందిన జీవితం అనేది స్తంభించిపోతుందన్నారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించగలరని అందుకు బెల్లాట్రిక్స్, దిగంతర సంస్థలు ఉదాహరణలుగా వివరించారు. విజ్ఞాన్ యూనివర్సిటీ కూడా స్వయంగా ఒక శాటిలైట్‌ను తయారు చేసి ప్రయోగించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.
- చాన్సలర్, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు, మాట్లాడుతూ దేశం అంతరిక్ష రంగంలో ప్రపంచానికే దిక్సూచిగా మారుతోందన్నారు. ఉపగ్రహాల ద్వారా హైస్పీడ్ డేటా కమ్యూనికేషన్ అందించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్య, వైద్యం మరియు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు.
- ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల్లో అపజయాలను చూసి కుంగిపోకూడదని, వైఫల్యాలను ఎదుర్కోవడం నేర్చుకున్నప్పుడే గొప్ప విజయాలు లభిస్తాయన్నారు. విద్యార్థులు పూర్తి సామర్థ్యంతో తమ రాకెట్లను ప్రయోగించి సాంకేతిక నైపుణ్యాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. విద్యార్థులు అసాధారణ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించారని, కెమికల్ రాకెట్‌ను ఏకంగా 1.5 కిలోమీటర్ల ఎత్తుకు విజయవంతంగా ప్రయోగించి ఆశ్చర్యపరిచారని పేర్కొన్నారు.
- కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, ఏపీ స్పేస్ టెక్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి. శేషగిరిరావు, సీఈవో కూరపాటి మేఘన, ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కేవీ కృష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేమవరంలో పట్టపగలే చోరీ

పిడుగురాళ్ల: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలు చోరీకి పాల్పడిన సంఘటన మాచవరం మండలంలోని వేమవరం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఈ సంఘటన సంబంధించి బాధితుడు గుర్రం గురవారెడ్డి తెలిపిన వివరాల మేరకు దుండగులు ఇంటి వెనుకవైపు నుంచి వచ్చి బీరువా పగలగొట్టి 64 గ్రాముల బంగారు నగలు, రూ. 2 లక్షల నగదు దొంగిలించారని తెలిపారు. ఈ మేరకు మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టపడే పనిని కష్టపడి చేస్తే నష్టపోయేది లేదు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ప్రసంగిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

మంగళగిరి టౌన్ : ప్రతి ఒక్కరు తమ జీవితంలో వారు ఇష్టపడే పనిని కష్టపడి చేస్తే నష్టపోయేది లేదని విజయం సాధిస్తారని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. చినకాకానిలోని ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్‌లో శుక్రవారం నూతన క్యాథల్యాబ్‌ను కైకలూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావుతో కలసి ఆయన ప్రారంభించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి నూతనంగా నిర్మించబోయే ఆడిటోరియం భవనానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

- ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పూర్తి సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మారుతున్న జీవనశైలి కారణంగా వస్తున్న కొత్త వ్యాధులను ఎదుర్కోవడానికి వైద్యవిద్యార్థులు నిరంతరం అప్‌డేట్ కావాలని సూచించారు. టెక్నాలజీ పెరుగుతున్న కొలది సామాన్యుడికి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందేలా చూడాలని కోరారు. వైద్యులు రోగులకు న్యాయమైన విధంగా సేవ చేయాలని, రోగులు చెప్పేది పూర్తిగా విని అవసరమైతేనే సంబంధిత వైద్యపరీక్షలు రాయాలని సూచించారు. ఈ మధ్యకాలంలో కొందరు వైద్యుల తీరు పలుకే బంగారమాయేలే అన్న చందంగా మారిందని రోగులతో, వారి సహాయకులతో తెలుగులో మాట్లాడి వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలని వైద్యులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ అడ్మినిస్ట్రేటర్ విష్ణువర్ధనరావు, డీన్ డాక్టర్ లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకారం చేసిన ధర్మకర్తల మండలి సభ్యులు

మంగళగిరి టౌన్ : మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నూతనంగా నియమితులైన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో ఈఓ సునీల్ కుమార్ సమక్షంలో ధర్మకర్తల మండలి సభ్యులు దామర్ల నాగలక్ష్మీ, మల్లాది వేదవతి, బళ్ళ ఉమా మహేశ్వరరావు, భీమవరపు శేషి రెడ్డి, మాజేటి కృష్ణ కుమారి, మేకల మోహనరావు, పేరం లీలావతి, కొక్కెరపాటి పూర్ణచంద్రరావు, గురప్రుశాల శ్రీలక్ష్మీ, చెల్లూరి వీర వెంకట సత్యనారాయణ, తుల్లిమిల్లి రామకృష్ణ, రుద్రుడు త్రిశూల ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన పాలకమండలి సభ్యులు సాంప్రదాయబద్ధంగా స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పాలకమండలి సభ్యులు చురుకుగా పాల్గొని భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఈవో కోగంటి సునీల్ కుమార్ కోరారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, వేదపండితులు, ధర్మకర్తల కుటుంబసభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా?

- మడకశిర పోలీసుల అత్యుత్సాహం
- మంగళగిరి నుంచి సోషల్‌మీడియా యాక్టివిస్టును తీసుకువచ్చిన వైనం

ఇంద్రసేనారెడ్డిని పరామర్శిస్తున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: చంద్రబాబు సర్కార్ పౌరుల ప్రాథమిక హక్కులను కూడా హరిస్తోంది. భావప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తోంది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు ఏమయ్యాయంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులపై పోలీసులను ప్రయోగిస్తోంది. అక్రమ కేసులతో తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ మంగళగిరికి చెందిన ఇంద్రాసేనారెడ్డి అనే సోషల్ మీడియా యాక్టివిస్ట్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. దీన్ని జీర్ణించుకోలేని గుడిబండ మండలం సీసీగిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మంజునాథ్ గురువారం గుడిబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఇంద్రాసేనారెడ్డిపై కేసు నమోదు చేశారు. మడకశిర పోలీసులు గురువారం రాత్రే మంగళగిరికి వెళ్లి ఇంద్రాసేనారెడ్డిని అదుపులోనికి తీసుకుని శుక్రవారం మడకశిరకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... తాను ఎవరినీ కించపరిచేలాగానీ, అభ్యంతరకరంగా వ్యాఖ్యలుగానీ చేస్తూ పోస్టు పెట్టలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై మాత్రమే పోస్టు పెట్టానని తెలిపారు. పోలీసులు తనను ఇలా వేధించడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మడకశిర నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, నాయకులు రంగనాథ్, నరేష్ రెడ్డి, మంజునాథ్, చిరంజీవి తదితరులు రూరల్ సీఐ కార్యాలయానికి చేరుకున్నారు. ఇంద్రాసేనారెడ్డికి అండగా నిలబడ్డారు. రూరల్ సీఐ రాజ్ కుమార్, గుడిబండ ఎస్ఐ రాజ్ కుళ్లాయప్పతో మాట్లాడారు. వెంటనే ఇంద్రసేనారెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈర లక్కప్ప స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మాట్లాడారు. టీడీపీ నాయకుల ఆదేశాలతో పోలీసులు సోషల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు కేసులు బనాయిస్తూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం పోలీసులు ఇంద్రసేనారెడ్డికి నోటీసు ఇచ్చి పంపారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలి

గుంటూరులో ప్రారంభమైన ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ జాతీయ సమావేశాలు

మాట్లాడుతున్న డి.రమేష్ పట్నాయక్

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఫాసిజం ప్రమాదకర స్థాయికి చేరిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్, అఖిల భారత విద్యా హక్కుల వేదిక ఉపాధ్యక్షులు డి.రమేష్ పట్నాయక్ అన్నారు. గుంటూరు కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆల్ ఇండియా దళిత రైట్స్ మూమెంట్ (ఏఐడీఆర్‌ఎం)– దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జాతీయ సమితి సమావేశాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షులు జేవీ ప్రభాకర్ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాసిజం వచ్చిన తర్వాత దాన్ని ఎదుర్కోవడం అసాధ్యమని, అది రాకముందే అడ్డుకోవడమే ఏకైక మార్గమని ఆయన స్పష్టం చేశారు. బీజేపీని ఎన్నికల్లో ఒంటరిగా చేసి ఓడించడమే కాకుండా, రోజువారీ సామాజిక జీవితంలోనూ బీజేపీ–ఆర్ఎస్ఎస్ భావజాలానికి వ్యతిరేకంగా నిరంతర పోరాటం సాగాలని పిలుపునిచ్చారు. ఎస్.వి యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ బి.వి.మురళీధర్ మాట్లాడుతూ వైవిధ్యభరిత సమాజంలో ఒకే ధర్మాన్ని ఆధారంగా తీసుకొని ప్రభుత్వం లేదా వ్యవస్థను ఏర్పాటు చేయడం ప్రమాదకరమని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర య్య మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, పేద వర్గాల ప్రజలను భక్తి పేరుతో, వివిధ రూపాలలో దోపిడీ చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఏఐడీఆర్‌ఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. నిర్మల్, ఏఐడీఆర్‌ఎం జాతీయ అధ్యక్షులు రామమూర్తి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, బీకేఎంయూ జాతీయ నాయకులు గుల్జార్ సింగ్ గోరియా, జానకీపాశ్వన్ తదితరులు మాట్లాడారు. గుంటూరు జిల్లా సీపీఐ కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, తెలంగాణ డీహెచ్‌పీఎస్ అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, అనిల్ కుమార్, బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి, గుజరాత్ తదితర రాష్ట్రాల డీహెచ్‌పీఎస్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటముల కన్నా క్రీడాస్ఫూర్తి ముఖ్యం

- ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు
- ముగిసిన అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ టోర్నీ

విజేతలతో కళాశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు రూరల్: గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జె.మురళీమోహన్, డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు. చౌడవరంలోని కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పురుషుల టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఉత్కంఠంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో సి.ఆర్. డిగ్రీ కాలేజీ (చిలకలూరిపేట) జట్టు విజేతగా నిలిచింది. కె.హెచ్. అండ్ ఎల్.ఎస్. స్కాలర్స్ డిగ్రీ కాలేజీ (పిడుగురాళ్ల) జట్టు రన్నరప్ ట్రోఫీని అందుకుంది. తృతీయ స్థానంలో ఆర్.వి.ఆర్.జె.సి.ఇంజినీరింగ్ కళాశాల, నాలుగో స్థానంలో వాగ్దేవి డిగ్రీ కాలేజీ (నరసరావుపేట) జట్లు నిలిచాయి. మెరుగైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులతో ఏఎన్‌యూ సాఫ్ట్‌బాల్ జట్టును సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసింది. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ పీ గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ, ఏఎన్‌యూ టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ సూర్యనారాయణ, సెలెక్షన్ కమిటీ మెంబర్స్ డాక్టర్ ప్రీతంప్రకాష్, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ పి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కూటమి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : రాష్ట్రంలో కూటమి పాలనకు రెండేళ్లు కావస్తుందని, ఆశించిన స్థాయిలో కూటమి పాలన లేదని, ప్రజల విశ్వాసాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేక పోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఫల్య పాలనను కూటమి పెద్దలు గమనించడం లేదన్నారు. 99 రూపాయలకు కాదు అవసరమైతే ఉచితంగా ప్రభుత్వ భూములు ఇస్తామని నారా లోకేష్ మాట్లాడడం దుర్మార్గమని, 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు తొక్కేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నారా లోకేష్ బాబుకు అధికారం అనే అహంకారం తలకెక్కిందన్నారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన భూములలో ఎన్ని పరిశ్రమలు ఏర్పడ్డాయి, నిరుద్యోగ యువతకు ఎన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. చంద్రబాబును నమ్మి రాజధానికి భూములు ఇచ్చిన రైతులు గుండె ఆగి చనిపోతున్నారన్నారు. ఒక దశ తీసుకున్న భూములకే దిక్కులేదు, రెండో దశ భూములను తీసుకునేందుకు సిద్ధమైతే రైతులు తరిమి కొడుతున్నారని తెలిపారు. మంగళగిరిలోని అంజుమన్ భూములు బలి కాబోతున్నాయన్నారు. గతంలో ప్రశ్నించడానికి పార్టీ పెట్టానని, డైలాగులు చెప్పిన పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నాడో తెలియదన్నారు.

నేటి నుంచి అప్రెంటిస్‌షిప్‌నకు ధ్రువపత్రాల పరిశీలన

పట్నంబజారు: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఐటీఐ అభ్యర్థుల విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన తేదీలు ఖరారు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం సామ్రాజ్యం తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సిన అభ్యర్థుల వివరాలను ట్రేడ్‌ల వారీగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్టీసీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 24, 26, 29వ తేదీల్లో విజయవాడలోని విద్యాధరపురంలో ఉన్న ఆర్టీసీ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. 24న మోటారు మెకానిక్, ఫిట్టర్, సివిల్, వెల్డర్, పెయింటర్, 26, 27న ఎలక్ట్రీషియన్, 29, 30న డీజిల్ మెకానిక్ అభ్యర్థులు హాజరు కావాలని తెలిపారు.

30న 'చలో విజయవాడ'

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30న చేపట్టిన హలో యువత.. చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.వలి పిలుపునిచ్చారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో విజయవాడ నిరుద్యోగ రణభేరి పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. వలి మాట్లాడుతూ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మంత్రి నారా లోకేష్ సమాధానం చెప్పాలన్నారు. యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ 85 Sq Yds (12.9x60) North Face Commercial building at 7/2 Arundelpet, GNT. price Rs. 1.30 Cr Rent Rs. 52k P.M. ✆ 9296250461

PLOT FOR SALE

■ అమరావతి ORR దగ్గరగా సత్తెనపల్లి పట్టణంలో CRDA, RERA అప్రూవల్‌లో మంచినీటి వసతితో 80%లోన్ సౌకర్యంతో చ॥గ॥ 10,999/- గల ప్లాట్లు కొరకు సం॥ బాబు - 9912353046

SERVICES

GOLD FINANCE

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

■ గుంటూరులో గల నర్సింగ్ కాలేజి నందు పనిచేయుటకు ఇంటర్ మరియు డిగ్రీ చదివిన 30 సంవత్సరాలు పైబడిన లేడీ వార్డెన్ మరియు కారు, ఆటో నడుపుటకు డ్రైవర్ కావలెను. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 81224 61164

■ శ్రీకాంతి హోమ్‌కేర్ నందు పనిచేయుటకు ఆయాలు, నర్సులు, కేర్‌టేకర్స్ (M/F) కావలెను. జీతం: 18,000/- సంప్రదించండి. 7995123705 / 9618485329

■ గుంటూరులో బస్టాండ్ ఎదురు మా సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత: 10th-డిగ్రీ, వర్క్ టైం: 9am-5.30pm, శాలరీ : 8500-9000/- సంప్ర॥ 9989398775

■ బిజినెస్ మేనేజర్స్ / బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30 సం॥లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ Wanted Staff. Wanted Lady AO / Incharge, Primary Lady Teachers English, Science, Maths. Apple Techno School, Krishnababu Nagar, Gunjjanagundla, Guntur. 63010 36083

■ డైరెక్ట్ జాయినింగ్: సూపర్‌వైజర్స్, డ్రైవర్స్, మెస్ ఇన్‌ఛార్జి, స్టోర్ ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ Ex.ఆర్మీ, ITI (Dip. All) కా. (రూం+బో) PF+ESI జీ: 18 to 32 ✆ 85019 22079

■ తెనాలి, మంగళగిరి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అ:డిగ్రీ, జీ: 15000+3000. సంప్ర: 91214 69383

■ అతిథి గృహఫుడ్స్ గుంటూరు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన DTP ఆపరేటర్ (లేడీస్) వెంటనే కావలెను. వయసు:35 సం॥లోపు, టైమ్ 10 to 8, జీతం: 15000/- సంప్ర: 93969 71898

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజీ నందు Academic Incharge గా పనిచేయుటకు వివాహితులైన లోకల్ పురుషులు కావలెను. జీతము: 25000/- నుండి 30000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: డిగ్రీ నుండి పి.జి వరకు. వయస్సు 30 నుండి 45 సంవత్సరాలు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 92487 13335

■ ఎలక్ట్రికల్ ఆటోలు & ట్రాక్టర్లు కు గుంటూరు జిల్లాలో బ్రాంచిల కొరకు 1.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ Q: ఏదైనా డిగ్రీ (ఫ్రెషర్ / అనుభవము ఉన్నవారు) కావలెను. సంప్రదించండి. సెల్ : 8008931308, 9133865966, hr.shreelakshmiinfraequipment@gmail.com

■ తాడేపల్లి, కుంచనపల్లి, పాతూరు పరిసర ప్రాంతలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 hrs. డ్యూటీ, జీతం:12000, భోజనం ఫ్రీ.Q. 10th, 50సం॥ లోపు ✆ 88014 97437

■ త్రివేణిహోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 18k - 20k, Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాకేజి రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

కల్యాణ మహోత్సవ క్యాలెండర్ ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: పాత మంగళగిరి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన జరుగనున్న శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి స్వామివారి కల్యాణోత్సవ క్యాలెండర్‌ను పాత మంగళగిరి కల్యాణ మండపంలో శుక్రవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఆవిష్కరించారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు తరలిరావాలని.. స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, బీజేపీ రాష్ట్ర చేనేత కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, పాత మంగళగిరి పద్మశాలీయ సంఘం అధ్యక్షులు ఊట్ల పాలశ్రీనివాస్, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

దుగ్గిరాల: మండలంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. దుగ్గిరాల మండలం పెనుమూలి గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను డిప్యూటీ ఎంపీడీవో కె.జె.నెహ్రూ పరిశీలించి మాట్లాడారు. మురుగు పారుదల సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో పెనుమూలి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడికి చేయూత

మంగళగిరి టౌన్: భారత అండర్–18 సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికైన క్రీడాకారుడికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ చేయూతనందించారు. ఈ మేరకు మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ముత్యాల రేవంత్‌కు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. భారత జట్టుకు ఎంపికైన రేవంత్ భారత్ తరుపున అంతర్జాతీయ టోర్నమెంట్‌కు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్న విషయం తమ దృష్టికి రావడంతో సాయం అందించాయని తెలిపారు. యువక్రీడాకారుడు దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పోగొట్టుకోకూడదనే మానవతా దృక్పథంతో స్పందించి ఈ సహాయాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. రేవంత్ దేశానికి పేరు తీసుకువచ్చి అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

26న ఉచిత సంతానోత్పత్తి వైద్యశిబిరం

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, నోవా ఐవీఎఫ్ సంతాన సాఫల్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న తెనాలిలో ఉచిత సంతానోత్పత్తి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌అవుట్ గేట్ ఎదుటగల ఈ–కన్వెన్షను హాలులో ఆరోజు ఉదయం 10 గంటల్నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం జరుగుతుందని క్లబ్ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, సంతాన సాఫల్య కేంద్రం సేల్స్ మేనేజరు కొంగర శివకష్ణ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం ఎగ్జిక్యూటివ్ కానాల నరేష్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జాన్‌పాల్‌కు సత్కారం



తెనాలిరూరల్: తెనాలి మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చి ఆవరణలో గత మూడు రోజులుగా జరుగుతున్న రెండు తెలుగు రాష్ట్రాల సంఘ కాపరులు సదస్సు శుక్రవారంతో ముగిసింది. సదస్సును విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకుడు, పాస్టర్స్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి వ్యవస్థాపకుడు బిషప్ డాక్టర్ పినపాటి జాన్‌పాల్‌ను బ్రదర్‌ఆనందన్న బిషప్ చిలకా జాన్‌వరప్రసాద్, రెవరెండ్ ఎం. షడ్రక్ తదితర పలువురు సంఘకాపరులు ఘనంగా సత్కరించారు. సంఘ కాపరులకు అవసరమైన వర్తమానాలను అందించి, సంఘాలను బలోపేతం చేసుకునేందుకు ఉపయోగపడే శిక్షణను ఇచ్చినందుకు అభినందించారు.

నేతాజీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

నేతాజీ ఆశయాలను స్మరిస్తూ ప్రతిజ్ఞ చేస్తున్న వలంటీర్లు

తాడేపల్లి రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని కేఎల్‌యూ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నేతాజీ జయంతి సందర్భంగా తాడేపల్లి రూరల్ పరిధి వడ్డేశ్వరం కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్, సీఎస్ఈ–4 ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలంలోని వీరులపాలెం గ్రామంలో ఆయన విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతాజీ పోరాట శ్రమను వివరించారు. నేతాజీ ఆశయాలను స్మరించుకుంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.శ్రీనివాసరెడ్డి, వర్సిటీ హెచ్‌ఓడీ డాక్టర్ టి.పవన్‌కుమార్, అధ్యాపకులు జి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన వలంటీర్లను వర్సిటీ వీసీ పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్‌ప్రసాద్, డాక్టర్ కె.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్ తదితరులు అభినందించారు.

ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో..

మేడికొండూరు: మండల పరిధిలోని విశదల అడ్డరోడ్డులో గల ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.సంజయ్ మాట్లాడుతూ.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. యువతకు ఆయన జీవితం మార్గదర్శకమని తెలిపారు. నేతాజీ జీవిత చరిత్ర, దేశభక్తి, త్యాగాలను విద్యార్థులకు కళాశాల అకడమిక్ డైరెక్టర్ కోట శ్రీనివాసు వివరించారు. దేశభక్తి గీతాలు, నినాదాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు, ఏవో బి.సీతారామయ్య, అధ్యాపకులు, విభాగాధిపతులు, పరిపాలనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దుగ్గిరాలలో నేతాజీ జయంతి..

దుగ్గిరాల: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆజాద్ హిందూ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతదేశ ప్రజల స్ఫూర్తి కెరటమని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.సుభాని అన్నారు. శుక్రవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో నేతాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. నేతాజీ దేశభక్తికి నిలువెత్తు రూపమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ జిలానీ, షేక్.జానీ, షేక్.రసీదు, పఠాన్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు. అలానే దుగ్గిరాల రైలుపేటలో నేతాజీ జయంతిని నిర్వహించారు. దేశ చరిత్రలో నేతాజీ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు.

నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

నేతాజీ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న నాయకులు

కమిషనర్ అలీమ్ బాషా విస్తృత పర్యటన

విస్తృత పర్యటనలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాశం బ్యారేజీ దగ్గర నుంచి మంగళగిరి రూరల్ డాన్‌బాస్కో స్కూల్ వరకు ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎంటీఎంసీ ఆధ్వర్యంలో పలుచోట్ల జంక్షన్‌ల విస్తీరణ పనులు చేపట్టారు. శుక్రవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా వివిధ శాఖల అధికారులతో కలిసి ఆ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ.. రోడ్డు జంక్షన్‌ల విస్తరణ పనులను శరవేగంగా చేయాలని, ఎవరైతే స్థలాలు ఇవ్వరో వారితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను వివరించి స్థలాలు తీసుకోవాలని, త్వరితగతిన జంక్షన్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ డీఈలు, ఏఈలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

డీఆర్‌బీసీ కాలువపై వంతెన ప్రారంభోత్సవంలో అధికారులు

దుగ్గిరాల: పేరుకలపూడి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, నిర్మాణాలు పూర్తయిన వంతెనకు ప్రారంభోత్సవం నిర్వహించారమని ఎంపీపీ షేక్.జబీన్ అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండలం పేరుకలపూడి గ్రామంలో నూతన వంతెనను ప్రారంభించి జబీన్ మాట్లాడారు. ఎంపీ నిధులు రూ.15 లక్షల వ్యయంతో వంతెన నిర్మించి ప్రారంభించామని వివరించారు. గ్రామంలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశామని.. వాటి అంచనా విలువ రూ.33 లక్షలని తెలిపారు. కాగా గ్రామ సర్పంచ్, దుగ్గిరాల మండల జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణను కార్యక్రమానికి ఆహ్వానించలేదని.. కనీసం ప్రోటోకాల్ కూడా పాటించలేదని పలువురు నాయకులు చర్చించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ ఎంపీపీ వెనిగెళ్ల కృష్ణప్రసాద్, ఎంపీటీసీ తాళ్ల అశోక్‌యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

మందు అందజేస్తున్న పశువైద్యాధికారి అహ్మద్

ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు గ్రామంలో నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో పశు ఆరోగ్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సాకి వెంకటరత్నం ప్రారంభించారు. 25 పశువులకు చూడి, ఎద ఇంజక్షన్లు, గర్భకోశ పరీక్షలను పశువైద్యాధికారి షేక్.పీర్ అహ్మద్ చేశారు. వీటితో పాటు 17 పశువులకు సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. 150 జీవాలకు నట్టల నివారణ మందు అందజేశారు. ఈ సందర్భంగా పీర్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రతి పాడిరైతు తమ పశువులకు పశుబీమా పథకం కింద బీమా చేయించుకోవాలని చెప్పారు. వ్యాధి లేదా ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే రూ.లక్ష నగదు వస్తుందని వివరించారు. శిబిరంలో వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఆర్.వినీల, గ్రామ నాయకులు మస్తాన్‌వలి, కె.అశోక్, ఆర్.సైదా, కె.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖబరస్తాన్‌ను తాకితే ముస్లింల విశ్వాసాన్ని తాకినట్లే

ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ

శాంతియుత నిరసన ర్యాలీ చేస్తున్న ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణం తెనాలి రోడ్డులో ఉన్న ఖబరస్తాన్‌ను రహదారి విస్తరణ పేరుతో తాకితే ముస్లింల విశ్వాసాన్ని తాకినట్లేనని ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ నాయకులు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని జామియా మస్జిద్ వద్ద శుక్రవారం కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు ధార్మిక, ముస్లిం పెద్దలు, కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఖబరస్తాన్ అనేది అభివృద్ధికి అడ్డుగా ఉన్న స్థలం కాదని, ముస్లింలకు అత్యంత పవిత్రమైన ధార్మిక స్థలమని అన్నారు. తరతరాలుగా ముస్లిం సమాజం ఆచరిస్తున్న మత సాంప్రదాయాలకు, చరిత్రకు, భావోద్వేగాలకు ఇది ప్రతీకగా నిలుస్తుందని, అటువంటి స్థలంపై ఏ రూపంలో అయినా దాడి చేయడం మత స్వేచ్ఛకు తీవ్రమైన భంగం కలిగించే చర్య అని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం యువతరం గౌరవ అధ్యక్షులు ఇక్బాల్ అహ్మద్, ముస్లిం యువసేన అధ్యక్షులు ఇస్మాయిల్, ముస్లిం ఫ్రంట్ అధ్యక్షులు ముహమ్మద్ రఫీ, ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ యూసఫ్, అహ్లెసున్నతువల్ జమాత్ అధ్యక్షులు మునీర్, జమాత్ ఏ ఇస్లామీ హింద్ అధ్యక్షులు అజీమ్, తబ్లీగ్ జమాత్ ఉపాధ్యక్షులు సైదా, జిలాని, అక్బర్ అలీ, జామియా మస్జిద్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తను తొలగించాలి

మున్సిపల్ కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు

తెనాలిఅర్బన్: రోడ్లపై చెత్త కనిపిస్తే చర్యలు తీసుకుంటానని మున్సిపల్ కమిషనర్ జెఆర్ అప్పలనాయుడు హెచ్చరించారు. 21వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్ల వెంట అక్కడక్కడ చెత్త కనిపించడాన్ని గమనించిన ఆయన సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మేడికొండూరు: మండల పరిధిలో ఈనెల 21న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట మండలం గురవాయిపాలెంకు చెందిన మన్నం రాజేష్‌కుమార్(18) నరసరావుపేటలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. బుధవారం ద్విచక్రవాహనంపై పేరేచర్ల వైపు వస్తున్న సమయంలో గుర్తుతెలియని నంబరు లేని ట్రాక్టర్ రాజేష్‌ను ఢీకొట్టి నరసరావుపేట వైపు వెళ్లింది. ప్రమాదంలో రాజేష్ తీవ్రంగా గాయపడగా స్థానికులు గమనించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

ఎల్ఆర్ఎస్ గడువు మూడు నెలలు పొడగింపు

తెనాలిఅర్బన్: అనధికార లే అవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం గడువును మూడు నెలలు పొడిగిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారని తెనాలి పురపాలక సంఘ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని అనధికార ప్లాట్స్, లే–అవుట్‌లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకునే సమయంలో సగం నగదు చెల్లించాల్సి వచ్చేదని చెప్పారు. ప్రస్తుతం ఈ విధానాన్ని ప్రభుత్వం సవరించిందని తెలిపారు. కేవలం రూ.10వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ 23వ తేదీ లోపు అర్హులైన వారందరూ ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

నేడు తేలప్రోలులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

తెనాలిటౌన్: స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 5.30 గంటల నుండి రూరల్ మండలం తేలప్రోలు గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని కార్మికులు కేటాయించిన క్లస్టర్‌కు పనిముట్లతో ఉదయం 5.30 గంటలకల్లా హాజరు కావాలని ఆదేశించారు.

పీఎం స్వానిధి పథకాన్ని ఉపయోగించుకోవాలి

తెనాలిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్వానిధి పథకాన్ని అర్హులైన వారు ఉపయోగించుకోవాలని తెనాలి పురపాలక సంఘ మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయ పేర్కొన్నారు. మెప్మా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం స్వానిధి పథకం కింద వీధి విక్రయదారులకు క్రెడిట్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో పలువురు విద్యార్థినులు ఎంపిక



తెనాలిఅర్బన్: డైకిన్, హీరో మోటో క్రాప్, ఫాక్స్‌కన్ సంస్థల ఆధ్వర్యంలో జెఎంజె కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో పలువురు విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ సిస్టర్ దెరిస్సామ్మ, ప్రిన్సిపల్ సిస్టర్ శాంతలు తెలిపారు. డైకిన్ సంస్థకు 9 మంది, హీరో మోటో క్రాప్ 38, ఫాక్స్‌కన్ సంస్థకు 58 మంది ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు కె.సురేష్, ఆర్.చిరంజీవి, ఆర్.చంటి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజలిన్, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ జి.సుధాకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. శుక్రవారం తాడేపల్లిలోని యార్డ్ ముఠా కార్మికులతో ఆయన ఇతర నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికవర్గం సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. 8 గంటల పని విధానాన్ని తొలగించి 12 గంటల పని విధానాన్ని తీసుకువస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు ధారపోస్తోందని విమర్శించారు. కార్మికవర్గం ఐక్యంగా ఫిబ్రవరి 12వ తేదీన సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూ నాయకులు శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు వెంకటయ్య, ముఠామేస్త్రి శ్రీనివాసరావు, ఆనందరావు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, విరాట్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లాలన్నా తిప్పలే!

కుంచనపల్లి అప్పర్ ప్రైమరీ పాఠశాల గేటు ఎదురుగా నిలిచిన మురుగు

తాడేపల్లి రూరల్: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. కుంచనపల్లి గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద డ్రైనేజీ లేకపోవడంతో పాఠశాల చుట్టుపక్కల నివాసాల మురుగు వచ్చి పాఠశాల గేటు ముందు చేరుతోంది. ఉదయం, సాయంత్రం సమయంలో ఆ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు మురుగులోంచి రాకపోకలు సాగిస్తున్నారు. సచివాలయానికి 10 అడుగుల దూరంలో ఉన్న ఈ పాఠశాల గేటు వద్ద మురుగు నిల్వ ఉంటున్నా కనీసం అధికారులు బ్లీచింగ్ చల్లడం గానీ, మురుగును మళ్లించే మార్గం గానీ చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కుంచనపల్లి అప్పర్ ప్రైమరీ స్కూల్ ఎదుట ఉన్న మురుగు సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుకుంటున్నారు.

రాజధాని రైతుల ప్లాట్ల కేటాయింపులో గందరగోళం

శ్మశానాలు, పూలింగ్‌కు ఇవ్వని భూముల్లో ప్లాట్లు కేటాయిస్తున్నారని అసంతృప్తి

ప్లాట్ల కేటాయింపును అడ్డుకుంటున్న రైతులు

తాడికొండ: అమరావతిలో రైతుల రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపులో గందరగోళ పరిస్థితి నెలకొంది. శుక్రవారం రైతులకు ప్లాట్ల కేటాయింపుపై రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో లాటరీ నిర్వహించారు. గతంలో రైతులు వద్దన్న చోటే ప్లాట్లు కేటాయిస్తుండటంపై మండిపడ్డ రైతులు తాము గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసిన ప్రాంతంలో ప్లాట్లు ఎలా ఇస్తారని వాపోయారు. శ్మశానాలు, పూలింగ్‌కు భూమి ఇవ్వని ప్రాంతంలో ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఆర్డీఏ పరిధిలోని 16 యూనిట్లకు సంబంధించి గ్రామాల్లో 145 ప్లాట్లు కేటాయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే వీరిలో 20 ప్లాట్లకు పైగా భూములిచ్చిన రైతులు తమకు ప్రస్తుతానికి ప్లాట్ల కేటాయింపు వాయిదా వేయాలని కోరారు. శుక్రవారం ఉదయం లాటరీ ప్రక్రియ ప్రారంభానికి ముందు సీఆర్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంచిన లేఅవుట్ పరిశీలించిన తర్వాత మరో పలు ప్లాట్లకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితిలో కొన్ని ప్లాట్లు పల్లపు ప్రాంతంలో ఉన్నాయని, శ్మశానం దగ్గరగా ఉన్న ప్రాంతంలో కేటాయిస్తున్నారని కొంతమంది రైతులు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారన్నారు. ఇలాంటి ప్లాట్లను రిటర్నబుల్ ప్లాట్ లేఅవుట్ నిబంధనల ప్రకారం పూర్తిగా అభివృద్ధి చేసి ఇస్తామని, ఇప్పుడు కష్టమని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. దీంతో ఆయా రైతులు వెనుదిరిగారు. నమ్మించి నట్టేట ముంచేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ముందు రైతులు కోరకున్న చోటే ఇస్తామని చెప్పి ఇప్పుడు భూములు అందుబాటులో లేవని, ఇష్టముంటే తీసుకోండి.. లేదంటే లేదు అని తెగేసి చెబుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

సీఆర్డీఏ ఆధ్వర్యంలో జాబ్ మేళా

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీ సీఆర్డీఏ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి–శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్‌హబ్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాను పలువురు యువత సద్వినియోగం చేసుకున్నారు. 270కి పైగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్ మేళా నిర్వహించగా 411 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కాగా 127 మందికి ఉద్యోగాలు లభించాయని.. మిగిలిన 53 మంది తదుపరి రౌండ్లకు ఎంపికయ్యారని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు తెనాలి శ్రావణ్‌కుమార్, ఏపీ సీఆర్డీఏ సోషల్ డెవలప్మెంట్ విభాగ గ్రూప్ డైరెక్టర్ వెలుగోటి రాములు పాల్గొని జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారిణి అరుణ కుమారి, సీఆర్డీఏ సీనియర్ లైవ్‌లీహుడ్ ఆఫీసర్ శంకర్, జూనియర్ లైవ్‌లీహుడ్ స్పెషలిస్టులు క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు పాల్గొని జాబ్ మేళాను సమర్థంగా నిర్వహించారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థుల సౌకర్యార్థం సిబ్బందిని నియమించి రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూల నిర్వహణ ప్రక్రియను సాఫీగా నిర్వహించినట్లు సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

మితాహారమే శరీరానికి మేలు

తెనాలిఅర్బన్: హైప్రోటీన్, హైఫైబర్ పోషకాలతో కూడిన మిత ఆహారాన్ని తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ వివేక్ వీరంరెడ్డి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఎన్ఆర్‌కె కెఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో శుక్రవారం గుండె వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మద్యం, ధూమపానం వంటి చెడు అలవాటులకు దూరంగా ఉండాలన్నారు. బయట ఫుడ్‌లకు దూరంగా ఉంటూ ఇంట్లో వేడి వేడి పదార్థాలకు ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ, అధ్యాపకులు ఎం.దశరథరామిరెడ్డి, కె.వి.రవికుమార్, రోశయ్య, టి.జె.కళావతి, వి.వి.ఎస్. వేణుగోపాల్, ఆర్.వి.సునీత, ఎ.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ నోటీసు

[illegible]

దొడ్డక బ్రహ్మయ్య, న్యాయవాది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

● అనలాగ్ లైఫ్

కొత్త తరం ఆపాత మధురం

కొత్తొక వింత, పాతొక రోత అన్న వారే... పాతవి అమూల్యమైన బంగారం లాంటివని కూడా అన్నారు. అంటే మనిషిని మనిషిలా కాకుండా యాంత్రికంగా మార్చేస్తున్న నేటి టెక్నాలజీపై అతిగా ఆధారపడకుండా అప్పట్లోలా మళ్ళీ మనిషిలా జీవించడం అన్న మాట. దీనినే అనలాగ్ లివింగ్ అంటారు. ఇప్పుడు చాలామంది ఈ తరహా జీవన సరళివైపు మొగ్గు చూపుతున్నారు.. దీని గురించి కాస్త వివరంగా...

ఈ డిజిటల్ యుగంలో మన మెదడు నిరంతరం ఒక యాప్ నుండి మరొక దానికి మారే ప్రక్రియలో తీవ్రమైన ఒత్తిడికి లోనవుతోంది. ఈ పరిస్థితుల్లో మెదడును ఒకేవిషయంపై ఎక్కువసేపు ఉంచేలా చేసేవే పుస్తక పఠనం, చేతిరాతలాంటివి. ఇది డిజిటల్ ప్రపంచంలో మనం కోల్పోతున్న 'ఏకాగ్రత'ను తిరిగి ఇస్తుంది.

కీ బోర్డ్ వద్దు.. హ్యాండ్ రైటింగ్ ముద్దు

టైప్‌రైటింగ్ అయినా, కంప్యూటర్ అయినా, కీబోర్డ్ మీద టైప్ చేయడం కంటే చేతితో రాయడం వల్ల మెదడులో సమాచారం మరింత బలంగా ముద్రించబడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అందువల్ల సిస్టమ్‌లో టైప్ చేసే అలవాటున్న వారు లేదా చేయవలసిన పనులను స్మార్ట్ ఫోన్‌లో నోట్‌ప్యాడ్ మీద టైప్ చేసుకుని పెట్టుకునేవాళ్లు ఇప్పుడు కాగితం మీద తాము చేయవలసిన పనుల జాబితాను రాసుకుంటున్నారు.

స్పర్శతోనే సాంత్వన

ఫోన్ చూస్తూ గడిపే సమయం విశ్రాంతి కాదు, అది మెదడుకు మరో రకమైన పని. అనలాగ్ జీవన శైలిలో ఏమీ చేయకుండా ప్రశాంతంగా కూర్చోవడం అనేది ఇప్పుడు లగ్జరీగా మారింది.

వంట చేయడం, తోటపని లేదా మట్టితో వస్తువులు చేయడం వంటి పనులు మన నాడీ వ్యవస్థను ప్రశాంతపరుస్తాయి. అంటే మనం ఆయా వస్తువులను తాకడం, వాటిని స్పర్శించడం ద్వారా సంతోషాన్ని పొందుతాము. అందువల్ల ఇప్పుడు డిజిటల్ ఫెటీగ్ నుంచి విముక్తి కోసం ఏఐ సృష్టించిన బొమ్మలు లేదా సంగీతం కంటే, స్వయంగా అల్లిన స్వెటర్ లేదా తీసిన ఫోటోల దిశగా మొగ్గు చూపుతున్నారు. ఎందుకంటే అందులో హ్యూమన్ టచ్ అనే ఒక 'మానవీయ కోణం' ఉంటుంది కాబట్టి.

స్మార్ట్ కాదు...షార్ప్ కావాలి

స్మార్ట్‌ఫోన్‌ల వల్ల కలిగే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి చాలామంది కేవలం కాల్స్, మెసేజ్‌లు మాత్రమే ఉండే సాధారణ ఫోన్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల 'స్క్రీన్ టైమ్' గణనీయంగా తగ్గుతోంది.

మిసోగి స్టయిల్

ఇటీవల కాలంలో ఎప్పుడూ ఆన్‌లైన్‌లో ఉండటం కంటే, 'నేను ఆఫ్‌లైన్‌లో ఉన్నాను, నాకు ప్రశాంతత ఉంది' అని చెప్పుకోవడం ఒక ట్రెండ్‌గా మారింది. అందువల్ల అనలాగ్ వెల్నెస్ ట్రెండ్‌లో భాగంగా 'మిసోగి' అనే జపాన్ సంప్రదాయం ప్రాచుర్యం పొందింది. ఏడాదికి ఒకసారి సోషల్ మీడియా కోసం కాకుండా, మన శారీరక, మానసిక శక్తిని పరీక్షించుకోవడానికి ఒక కఠినమైన పనిని ఎంచుకోవడం వల్ల మెదడు మొద్దుబారకుండా ఉంటుందన్నది వారి ఉద్దేశ్యం.

డిజిటల్ సన్‌సెట్: నిద్రపోయే ఒక గంట ముందు నుండే ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పక్కన పెట్టేసి, మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం నయా ట్రెండ్.

రీల్స్ వద్దు.. రియల్‌గానే...

సోషల్ మీడియాలో లైక్‌ల కోసం కాకుండా, పర్సనల్‌గా కలవడం, క్లబ్బులు లేదా గ్రూపులుగా ఏర్పడి సమయం గడపడం వంటి 'థర్డ్ స్పేస్' సంస్కృతి పెరుగుతోంది.

విషయం ఏమిటంటే... అనలాగ్ మోడ్ అంటే టెక్నాలజీని వదిలేయడం కాదు, టెక్నాలజీ మనల్ని నియంత్రించకుండా, మనమే దాన్ని నియంత్రించే స్థాయికి ఎదగాలనే నేటి కొత్తతరం నాటి పాతతరం వారనుభవించిన ఆపాత మధురాలను సొంతం చేసుకునే దిశగా ప్రయత్నాలు ప్రారంభించేసింది.

కొత్త ఆవిష్కరణలు

మెదడు ఖాళీగా ఉన్నప్పుడే కొత్త ఆలోచనలు వస్తాయి. అయితే మన మెదడు క్షణం ఖాళీగా లేకుండా అవసరం ఉన్నా లేకున్నా తరచు ఫోన్ చూస్తూ దాని స్క్రీన్‌ను స్క్రోల్ చేస్తున్నాం. అలా కాకుండా ఫోన్లకు దూరంగా ఉంటూ, ఆ ఖాళీ సమయాన్ని కొత్త ఆవిష్కరణలకు లేదా ఆత్మపరిశీలనకు వాడుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నారు మనవాళ్లు.

బలమైన సామాజిక సంబంధాలు

సోషల్ మీడియాలో వేలమంది స్నేహితులు ఉన్నా, ఒంటరితనం పెరగడం ఈ తరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. ఇందుకు విరుగుడుగా లైబ్రరీలు, కమ్యూనిటీ గార్డెన్లు, ఇండోర్ బోర్డ్ గేమ్ క్లబ్‌లు వంటిచోట్ల ప్రజలు ప్రత్యక్షంగా కలుస్తున్నారు. ఫోన్లు లేకుండా ముఖాముఖి మాట్లాడుకుంటూ పరస్పరం ఆత్మీయతను పంచుకుంటున్నారు, పెంచుకుంటున్నారు.

● యోగా

ప్రశాంతతనిచ్చే పశ్చిమోత్తానాసనం

టీనేజ్ అమ్మాయిల నుంచి నడి వయసు మహిళల వరకు.. ఒత్తిడి తగ్గించి, మానసిక ప్రశాంతతను పెంపొందిస్తూ, వెన్నునొప్పిని నియంత్రించేలా చేస్తుంది పశ్చిమోత్తనాసనం. ఈ భంగిమ కూర్చుని చేస్తాం. 'పశ్చిమ' అంటే శరీరంలోని వెనుక భాగం,'ఉత్తాన' అంటే పూర్తిగా వంగడం, 'ఆసనం' అంటే భంగిమ. ఈ ఆసనంలో తల నుంచి మడమల వరకు ఉన్న వెనుక భాగం మొత్తం బాగా లాగబడుతుంది. ఈ ఆసనం వెన్నెముకను దృఢంగా చేసి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అలాగే మనస్సుకు శాంతిని కలిగించి, ఒత్తిడిని తగ్గిస్తుంది. ఉదయం లేదా సాయంత్రం రోజూ పది నిముషాలు ఈ ఆసనాన్ని సాధన చేస్తే మెరుగైన ప్రయోజనాలు పొందచ్చు. కంప్యూటర్‌తో పని చేసే వాళ్లు వెన్ను, మెడ, తలనొప్పి వంటి సమస్యలతో బాధపడుతుంటారు. ఇలాంటి వారు సులువైన, తేలికైనా పశ్చిమోత్తనాసనం ఆసనం ద్వారా ప్రయోజనం పొందచ్చు.

– పి. అనిత, యోగా ట్రైనర్

ఫైబర్ ఎంతవరకు మంచిది?

శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌కు చెక్ పెట్టాలన్నా, జీర్ణక్రియ మెరుగుపడాలన్నా పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని అందరూ భావిస్తుంటారు. అయితే అతి అనర్థ దాయకం అన్నట్లుగా గట్ ఆరోగ్యం కోసం అతిగా ఫైబర్ తీసుకోవడం వల్ల ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. ఇంతకీ అసలు రోజుకు ఎంత ఫైబర్ తీసుకోవాలో తెలుసుకుందాం.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ప్రకారం, వయస్సును బట్టి మనం తీసుకునే ఫైబర్ పరిమాణం మారుతుండాలి. పెద్దలు రోజువారీ ఆహారంలో సుమారు 30 గ్రాముల పీచు పదార్థం ఉండేలా చూసుకోవాలి. 15 ఏళ్లలోపు పిల్లలకు 20 గ్రాములు, మూడేళ్లలోపు వారికి15 గ్రాముల ఫైబర్ సరిపోతుంది.

అతిగా పీచు పదార్థాలు తీసుకోవడం వల్ల పేగుల్లో చికాకు కలగడం, కడుపు బిగుతుగా ఉండటం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువైనప్పుడు తగినంత నీరు తాగకపోతే మలబద్ధకం సమస్య మరింత జటిలమవుతుంది. అంతేకాకుండా, ఆహారంలోని క్యాల్షియం, ఐరన్, జింక్ వంటి కీలక పోషకాలను శరీరం గ్రహించకుండా ఈ ఫైబర్ అడ్డుకుంటుంది. దీనివల్ల బరువు విపరీతంగా తగ్గడంతో పాటు పేగుల్లో అడ్డంకులు కూడా ఏర్పడే ప్రమాదం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఫైబర్ మాక్సింగ్ డైట్ పాటించేవారు కొన్ని ముఖ్యమైన సూచనలు పాటించడం అవసరం. ఒకేసారి కాకుండా ఆహారంలో ఫైబర్ పరిమాణాన్ని క్రమంగా పెంచుకుంటూ పోవాలి. అప్పుడే జీర్ణాశయం ఆ మార్పుకు అలవాటు పడుతుంది. పీచు పదార్థాలు తీసుకున్నప్పుడు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. లేకపోతే కడుపు బిగదీసినట్టుగానూ... తిప్పుతున్నట్టుగానూ ఉండే ప్రమాదం ఉంటుంది.

కృత్రిమ ఫైబర్ పౌడర్లకు బదులుగా పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, తృణ ధాన్యాలను ఎంచుకోవాలి. విభిన్న రకాల ఫైబర్లు అందాలంటే మొక్కల ఆధారిత ఆహారాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పెరుగులో గింజలు వేసుకోవడం లేదా సలాడ్స్ తీసుకోవడం మంచి పద్ధతి. పీచు పదార్థాలు ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతాయి. అయితే వాటిని పరిమితికి లోబడి తీసుకున్నప్పుడే ఆ ప్రయోజనాలు లభిస్తాయని మరువ కూడదు.

హ్యావ్ గుడ్ డే

పొద్దున్నే ఎదురయ్యే అనుభూతులు, అనుభవాలే మన రోజుమొత్తాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే ఉదయం లేచిన వెంటనే మనస్సును సానుకూలమైన ఆలోచనలతో నింపుకోండి. అలాగే పాజిటివ్ థాట్స్‌ని ఇచ్చే వస్తువులను చూడండి. ఇది మనస్సును హాయిగా ఉంచుతుంది. తద్వారా రోజంతా చురుగ్గా.. ఉల్లాసంగా ఉండేందుకు తోడ్పడుతుంది.

లైఫ్ బోర్ కొడుతోందా?

ప్రతిరోజూ ఒకేలా పని చేస్తుంటే మెదడు మందకొడిగా తయారు కావడంతోపాటు లైఫ్ బోర్ కొడుతుంది కాబట్టి దినచర్యకు తాజాదనాన్ని జోడించడానికి కొత్త అలవాట్లను అలవర్చుకోండి. ప్రతి నిమిషం ఏదో ఒకటి నేర్చుకోవడానికి ప్రయత్నించండి.. సమయాన్ని వృథా చేయకుండా ఏదయినా కొత్త వంటకం ట్రై చేయడం, బుక్స్ చదవడం, కొత్త గేమ్స్ ఆడడం వంటి వాటిలో లీనం కావడం వల్ల జీవితం బోర్ కొట్టకుండా ఉంటుంది.

● లంచ్ బాక్స్

స్టీల్, ప్లాస్టిక్, గాజు... ఏది బెటర్?

ఆఫీసులకు, పాఠశాలలకు వెళ్లే వారు మధ్యాహ్న భోజనం కోసం రకరకాల లంచ్ బాక్సులను వాడుతుంటారు. అయితే వీటిలో ఏది సురక్షితం? నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందామా?

ఆరోగ్యపరంగా చూస్తే గాజు పాత్రలు ఉత్తమం. ఎందుకంటే, గాజు వేడిని తట్టుకుంటుంది. ఆహారంలోని రసాయనాలతో ఇది చర్య జరపదు. భోజనం రుచిని, పోషకాలను గాజు పాత్రలు అలాగే కాపాడతాయి. శుభ్రం చేయడం కూడా సులభం.

స్టీల్ బెస్ట్: రోజూ వాడుకోవడానికి స్టీల్ బాక్సులు అత్యంత అనువైనవి. ఇవి ఆహారంతో ఎలాంటి చర్యాజరపవు. దీనివల్ల విషపదార్థాలు ఆహారంలో కలిసే ప్రమాదం ఉండదు.

ఇత్తడి పాత్రలతో జాగ్రత్త: ఇత్తడి పాత్రలు చూడటానికి అందంగా ఉన్నా, లంచ్ బాక్సుల విషయంలో ప్రమాదం పొంచి ఉంది. ఇత్తడిలోని అంశాలు ఆహారంలో కలిసే అవకాశం ఉంది. దీనివల్ల సమస్యలు తలెత్తుతాయి.

అల్యూమినియం అసలే వద్దు

తక్కువ ధర, తేలికగా ఉంటుందని అల్యూమినియంను ఎంచుకుంటారు. కానీ వేడి ఆహారం, నూనె పదార్థాలు, పులుపు వస్తువులతో అల్యూమినియం చర్య జరపడం వల్ల జీర్ణక్రియ సంబంధిత ఇబ్బందులు రావడమే కాకుండా జ్ఞాపకశక్తి తగ్గడానికీ కారణమవుతుంది.

ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరం

వేడి పదార్థాలు వేసినప్పుడు ప్లాస్టిక్ కరిగి విషతుల్యంగా మారుతుంది. ఇది ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు.

సాక్షి సినిమా

ప్రేమికుల దినోత్సవానికి...

రేవంత్–మౌనికల ప్రేమకథ మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనుంది. ఈ లవ్‌స్టోరీ సరిగ్గా ప్రేమికుల దినోత్సవానికి రానుంది.

రేవంత్‌గా నాగచైతన్య, మౌనికగా సాయి పల్లవి నటించిన చిత్రం 'లవ్ స్టోరి'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నారాయణ్ దాస్ కె. నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. 2020లో విడుదల కావాల్సిన ఈ చిత్రం కోవిడ్ కారణంగా వాయిదా పడి, 2021లో విడుదలైంది. శేఖర్ కమ్ముల తనదైన శైలిలో సహజత్వానికి దగ్గరగా తెరకెక్కించిన ఈ ప్రేమకథా చిత్రానికి అద్భుత స్పందన లభించింది. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో నాగచైతన్య, సాయి పల్లవి తమ నటనతో ఆకట్టుకున్నారు. అలాగే సంగీతదర్శకుడు పవన్ సీహెచ్ అందించిన పాటల్లో 'నీ చిత్రమ్ చూసి...', 'సారంగ దరియా...' పాటలకు మంచి ఆదరణ లభించిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న మళ్లీ విడుదల చేయనున్నారు. సో... ప్రేమికుల దినోత్సవానికి రేవంత్–మౌనిక తమ ప్రేమకథతో మరోసారి అలరించనున్నారన్న మాట.

● సాయి పల్లవి, నాగచైతన్య

ఫైట్‌కి రెడీ

● గోపీచంద్

ఫైట్ చేయడానికి రెడీ అయ్యారు గోపీచంద్. ఈ ఫైట్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందట. గోపీచంద్ హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం కోసమే ఈ ఫైట్‌ను షూట్ చేయడానికి రెడీ అయింది యూనిట్. సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలోని క్లైమాక్స్ ఫైట్‌ని 25 రోజుల పాటు చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. ఫైట్ మాస్టర్ వెంకట్ పర్యవేక్షణలో ఈ చిత్రీకరణ ఆరంభమైంది. ''భారత చరిత్రలో వెలుగులోకి రాని ఒక శక్తిమంతమైన అధ్యాయాన్ని ఈ చిత్రంలో ఆవిష్కరిస్తున్నాం. ఈ చిత్రంలో గోపీచంద్ ఇప్పటి వరకు చేయని పాత్రలో కనిపిస్తారు. ఇక రాత్రిపూట చిత్రీకరించే క్లైమాక్స్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్ నిర్మించాం. భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ హిస్టారికల్ మూవీలోని క్లైమాక్స్ తెలుగులో ఇప్పటి వరకు చూడని విధంగా వినూత్నంగా ఉంటుంది'' అని నిర్మాత పేర్కొన్నారు.

మార్చిలో స్టార్ట్

'వీరసింహారెడ్డి' (2023) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ''పక్కా మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది. మార్చిలో రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

● గోపీచంద్, బాలకృష్ణ

మరోసారి లాయర్‌గా...

'ముల్క్, తప్పడ్' వంటి చిత్రాల తర్వాత హీరోయిన్ తాప్సీ, దర్శకుడు అనుభవ్ సిన్హా కాంబినేషన్‌లో రూపొందిన సినిమాకు 'అస్సీ' అనే టైటిల్ ఖరారైంది. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ అండ్ కోర్ట్ రూమ్ డ్రామాలో కని కస్రుతి, రేవతి, మనోజ్ పహ్వా ప్రధాన పాత్రల్లో నటించారు. నసీరుద్దీన్ షా, సుప్రియా పాఠక్, సీమ పహ్వా ప్రత్యేక పాత్రలు చేశారు. భూషణ్‌కుమార్, క్రిషణ్‌కుమార్, అనుభవ్ సిన్హా నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 20న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో లాయర్ పాత్ర చేశారు తాప్సీ. శుక్రవారం ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఓ అమ్మాయిని నలుగురు అబ్బాయిలు వెంబడించడం, ఆ అమ్మాయి భయంతో పరిగెత్తడం వంటి విజువల్స్ ఈ మోషన్ పోస్టర్‌లో కనిపించాయి. ''సీ యు ఇన్ ది కోర్ట్... అంటే థియేటర్స్‌లో కలుద్దాం'' అని ఈ సినిమాను ఉద్దేశించి పేర్కొన్నారు తాప్సీ. ఇక 'ముల్క్' సినిమాలోనూ తాప్సీ లాయర్‌గా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

● 'అస్సీ'లో తాప్సీ

ఆ వీరుడు నేనే!

'యుగ యుగాలుగా ప్రతీ కథలో ఒక సమస్య... ఆ సమస్యను ఛేదించడానికి ఓ వీరుడు పుడతాడు... ఆ వీరుడు ఎవరో అని తెలిసేలోపే నిశ్శబ్దంగా పని ముగిస్తాడు... ఈ కథలో ఆ వీరుడు నేనే' అంటూ సంగీత్ శోభన్ తన గురించి బిల్డప్ ఇచ్చుకున్నారు. ఇదేదో సీరియస్ క్యారెక్టర్ అనుకునేలోపే కామెడీ అని అర్థమైపోతుంది. 'మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాల్లో ఓ హీరోగా ఆకట్టుకున్న సంగీత్ శోభన్ సోలో హీరోగా నటిస్తున్న చిత్రం 'రాకాస'. మానసా శర్మ దర్శకత్వంలో నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. శుక్రవారం విడుదల చేసిన ఈ చిత్రం గ్లింప్స్ పైన పేర్కొన్న పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగి, ఆ తర్వాత సెటైరికల్ టర్న్ తీసుకుంది. ''మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్' చిత్రాల్లో మంచి కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్న సంగీత్ శోభన్ 'రాకాస'లో మరోసారి తన కామెడీతో అలరిస్తారు. కామెడీతో పాటు ఓ కొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ఏప్రిల్ 3న 'రాకాస'ని రిలీజ్ చేయనున్నాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు.



● సంగీత్ శోభన్

హిట్ విలువ ఏంటో మాకు తెలుసు

– శర్వానంద్

''నారీ నారీ నడుమ మురారి' సినిమాతో హిట్ వచ్చింది కదా... ఎలా ఫీల్ అవుతున్నావ్ అని అడుగుతున్నారు. ఎలా ఫీల్ కావాలో నాకు తెలియడం లేదు. కానీ అందరూ హ్యాపీగా నవ్వుతుంటే చూడడం చాలా బాగుంది. ప్రేక్షకులు మాకు మంచి విజయాన్ని అందించారు. థియేటర్స్ కూడా పెరిగాయి. ఈ శుక్రవారం నుంచి మేమేంటో చూపిస్తాం. ఆడియన్స్ మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను'' అని శర్వానంద్ అన్నారు. శర్వానంద్ హీరోగా నటించిన తాజా చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సాక్షీ వైద్య, సంయుక్త హీరోయిన్లుగా నటించారు.

రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర, అనిల్ సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ అయింది. తమ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ స్పందన లభించిందని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో శర్వానంద్ మాట్లాడుతూ– ''రామ్ చాలా మంచి దర్శకుడు అవుతాడు. అనిల్‌గారికి థ్యాంక్స్ చెప్పడం చిన్న విషయం. అలాంటి హిట్ ఇచ్చారు నాకు. నెక్స్ట్ సినిమాకు రూపాయి కూడా అడగను. ఎందుకంటే హిట్ విలువ ఏంటో మాకు తెలుసు. ఆయన పెద్ద సినిమా చేసే వరకు రూపాయి కూడా తీసుకోను'' అని చెప్పారు. ''మా సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయి. మాకు ఇది సెకండ్ రిలీజ్ డేట్‌లా అనిపిస్తోంది'' అని పేర్కొన్నారు రామ్ అబ్బరాజు. ''సరిలేరు నీకెవ్వరు' సినిమా సక్సెస్ సమయంలో షీల్డ్స్ ఇచ్చాం. ఆరేళ్ల తర్వాత మళ్లీ ఈ సక్సెస్‌కి షీల్డ్స్ ఇవ్వడమనేది నాకెంతో ఆనందాన్నిచ్చింది. మా డిస్ట్రిబ్యూటర్స్ అందరూ సంతోషంగా ఉన్నారు'' అని తెలిపారు అనిల్ సుంకర. ఈ కార్యక్రమంలో హీరో శ్రీవిష్ణు, దర్శకులు నక్కిన త్రినాథరావు, వశిష్ఠ, నిర్మాత రాజేష్ దండా, నటి పార్వతీ లోకేష్, రచయిత రామజోగయ్య శాస్త్రి, ఎంపీ కేశినేని నాని తదితరులు ఈ సినిమా విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

● అనిల్, శర్వానంద్, శ్రీవిష్ణు, రామ్ అబ్బరాజు

సమాజానికి అవసరమైన కథ

వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన చిత్రం 'శ్రీ చిదంబరంగారు'. వినయ్ రత్నం దర్శకత్వంలో చింతా వరలక్ష్మీ సమర్పణలో వినీషా రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమాను ఫిబ్రవరి 6న రిలీజ్ చేయనున్నట్లుగా శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అతిథిగా హాజరైన సంగీత దర్శకుడు–గాయకుడు–నటుడు–దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ – ''నేటి సమాజానికి అవసరమైన కథ ఇది. చాలా మంది యువత చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్యల వరకు వెళ్లిపోతున్నారు. మీలోని లోపం మీకు బలం అవ్వాలని చెప్పే స్ఫూర్తిదాయకమైన కథతో రూపొందుతున్న సినిమా ఇది'' అన్నారు. ''మంచి ఎమోషనల్ రైడ్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని తెలిపారు వంశీ. ''ఈ సినిమాను ఫైనల్ మిక్సింగ్‌లో చూసుకుని ఏడ్చాను. ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను'' అని చెప్పారు వినయ్ రత్నం. ''ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటిగారు రిలీజ్ చేస్తున్నారు'' అని తెలిపారు గోపాలకృష్ణా రెడ్డి. ''ఈ చిత్రం కోసం కీరవాణిగారితో పాట పాడించడం హ్యాపీగా ఉంది'' అన్నారు సంగీత దర్శకుడు చందు రవి.

● సంధ్య, వంశీ

హర్ట్ చేయకూడదు బేబీ

● జీవీ ప్రకాశ్, శ్రీ గౌరీప్రియ

జీవీ ప్రకాశ్‌కుమార్, శ్రీ గౌరీప్రియ జంటగా నటిస్తున్న చిత్రం 'హ్యాపీ రాజ్'. ఈ సినిమాను మారియా ఇళంచెళియన్ దర్శకత్వంలో జైవర్ధ నిర్మిస్తున్నారు. ఈ మూవీ తెలుగు ప్రోమోను హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. 'ఇదే మనం పడే ఆఖరి గొడవ అయ్యుండాలి', 'నేను నిన్ను గేమ్‌లో కూడా హర్ట్ చేయకూడదు బేబీ' వంటి డైలాగ్స్ ప్రోమోలో ఉన్నాయి. కొంత గ్యాప్ తర్వాత అబ్బాస్ ఈ చిత్రంలో నటించారు.

● 'బా బా బ్లాక్ షీప్' పోస్టర్

మామూలు కథ కాదు!

ఒక రోజు జరిగిన అనుకోని ఓ ఘటన ఆరుగురు వ్యక్తుల జీవితాలను ఏ విధంగా ప్రభావితం చేసిందనే కథాంశంతో రూపొందిన క్రైమ్ కామెడీ సినిమా 'బా బా బ్లాక్ షీప్'. టినును ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్, కార్తికేయ, అభినవ్, హర్ష, కిషోర్ కృష్ణ, విస్మయశ్రీ, మాళవి, సమృద్ధి, విష్ణు ఓయ్ ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో నటించారు. గుణి మంచికంటి దర్శకత్వంలో వేణు దోనేపూడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను హీరో శర్వానంద్ విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 'చెప్పుకోవడానికి ఇది మామూలు కథ కాదు... అండ పిండ బ్రహ్మాండాలను కూడా అల్లాడించే కథ' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''ఈ సినిమా మొత్తాన్ని మేఘాలయా రాష్ట్రంలోనే పూర్తి చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్ వెల్లడిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

క్లుప్తంగా...

వీధి వ్యాపారులకు రూ.206 కోట్ల రుణాలు

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి పథకం ద్వారా వీధి వ్యాపారుల జీవనోపాధి కోసం రూ.206 కోట్ల రుణాలను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు మెప్మా మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 94,183 మంది వీధి వ్యాపారులకు రుణాలు అందజేశామని వివరించారు. రుణాల పంపిణీతో పాటు క్రెడిట్ కార్డుల జారీ కూడా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని కరుణ తెలిపారు.

పాడి పరిశ్రమ వృద్ధికి సమ్మిళిత నమూనా సర్వే కీలకం

సాక్షి, అమరావతి: పాడిపరిశ్రమ వృద్ధిలో సమ్మిళిత నమూనా శాంపిల్ సర్వే(ఐఎస్ఎస్) కీలక భూమిక పోషిస్తుందని కేంద్ర ఆరోగ్య – కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జాతీయస్థాయి టెక్నికల్ కమిటీ చైర్మన్ తాఖీర్ అహ్మద్ అన్నారు. పశు ఉత్పత్తుల గణాంకాలపై నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ కమిటీ ఆఫ్ డైరెక్షన్ (టీసీడీ) ప్రతినిధుల వార్షిక సమావేశం శుక్రవారం ముగిసింది. దేశవ్యాప్తంగా పశు గణాంకాల నాణ్యత పెంచడం, సమయపాలన పాటించడం వంటి లక్ష్యాలతో ముందుకు సాగాలని అహ్మద్ సూచించారు. భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంతో పాటు ఆధునిక పద్ధతులను అవలంభించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. సమావేశంలో కేంద్ర పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి విభాగం సలహాదారు జగత్ హజారిక, కేంద్ర గణాంక శాఖ(స్టాటిస్టిక్స్) డైరెక్టర్ జనరల్ శ్రీకాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల విభజన గ్రంథాలయ సంస్థలకు వర్తించదా?

సాక్షి, అమరావతి: పాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కొత్త జిల్లాల్లో గ్రంథాలయ సంస్థలు ఏర్పాటు చేయాలని తెలియదా అని గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదన రాజు, ప్రధాన కార్యదర్శి వల్లూరి వెంకటరమణ ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం గ్రంథాలయశాఖను పట్టించుకోవడం లేదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28 జిల్లాల్లో గ్రంథాలయ సంస్థలను విస్తరిస్తే ఉన్న ఉద్యోగులకు పదోన్నతులు దక్కడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

కడప జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్‌గా నిధి మీనా

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్‌గా నిధి మీనాకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. నిధి మీనా ప్రస్తుతం కడప జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న ఆదర్శ్ రాజేంద్రన్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన ప్రస్తుతం అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పవన్

సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేశ్‌కు ‘ఎక్స్’ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సేవ చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు మరింత శక్తిని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా అని పేర్కొన్నారు.

టికెట్ రద్దు.. జేబుకు చిల్లు!

8 గంటల ముందే వందేభారత్ చార్ట్ తయారీ

భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘వందే భారత్ స్లీపర్’ రైళ్లలో ప్రయాణం ఎంత సౌకర్యవంతంగా ఉంటుందో.. టికెట్ రద్దు నిబంధనలు అంత కఠినంగా మారాయి. సాధారణ రైళ్లతో పోలిస్తే ఈ ప్రీమియం రైళ్లలో క్యాన్సిలేషన్ చార్జీలను రైల్వే శాఖ భారీగా పెంచేసింది. చివరి నిమిషంలో టికెట్లు రద్దు చేసే ధోరణిని అరికట్టడానికి, సీట్ల వినియోగాన్ని మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. రైలు బయలుదేరడానికి 8 గంటల ముందే చార్ట్ సిద్ధం చేస్తామని, ఆ తర్వాత టికెట్ రద్దు చేసుకుంటే ఒక్క పైసా కూడా తిరిగి ఇవ్వబోమంటూ రైల్వే బోర్డు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనల కారణంగా.. వందేభారత్ రైలంటేనే ప్రయాణికులు హడలిపోవాల్సిన పరిస్థితి దాపురించింది.

– సాక్షి, విశాఖపట్నం

- ఆ తర్వాత టికెట్ రద్దు చేస్తే నయా పైసా రాదు
- 72 గంటల ముందే క్యాన్సిల్ చేసినా 25 శాతం కోతలు
- సాధారణ రైళ్లలో చార్ట్ తయారీకి 4 గంటల ముందు వరకు రీఫండ్
- కొత్త నిబంధనలపై మండిపడుతున్న ప్రయాణికులు

ప్రీమియం ప్రయాణంగా మారిన వందేభారత్ రైలులో కొత్త నిబంధనలను రైల్వే శాఖ అమల్లోకి తెచ్చింది. టికెట్ ధర మాదిరిగానే.. బుక్ చేసుకున్న టికెట్‌ను రద్దు చేసుకోవడం కూడా అంతే భారంగా మారిపోయింది. ఇకపై వందేభారత్ రైలుకు బుక్ చేసుకున్న టికెట్‌ను చివరి నిమిషంలో రద్దు చేయాలనుకుంటే నిబంధనలు కఠినంగా వర్తిస్తాయి. సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రైలు బయలుదేరడానికి 4 గంటల ముందు వరకు రీఫండ్ పొందే అవకాశం ఉండగా, వందే భారత్ స్లీపర్‌లో ఆ గడువును 8 గంటలకు పెంచారు. ఫలితంగా.. వందేభారత్ టికెట్‌ను రద్దు చేయాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

8 గంటల ముందే చార్ట్ సిద్ధం

సాధారణంగా ప్రతి రైలు చార్ట్‌ను, రైలు బయలుదేరే సమయానికి 4 గంటల ముందు సిద్ధం చేస్తారు. మొన్నటి వరకు వందేభారత్‌లో కూడా ప్రయాణికుల వివరాల చార్ట్ తయారీకి ఇదే సమయం వర్తించేది. కానీ, కొత్తగా వచ్చిన నిబంధనల ప్రకారం.. రైలు బయలుదేరే సమయానికి 8 గంటల ముందుగానే ఫైనల్ చార్ట్‌ను విడుదల చేయనున్నారు. ఈ కారణంగానే.. రిజర్వేషన్ క్యాన్సిలేషన్ చార్జీల్లో కూడా గణనీయంగా మార్పులు చేశారు. ప్రయాణానికి 72 గంటల కంటే ముందే రద్దు చేసుకుంటే టికెట్ ధరలో 25 శాతం కోత విధిస్తారు. 72 గంటల నుంచి 8 గంటల లోపు(చార్ట్ తయారయ్యే నిమిషం ముందు వరకూ) రద్దు చేసుకుంటే 50 శాతం కోత విధిస్తారు. ఇక 8 గంటల కంటే తక్కువ సమయంలో రద్దు చేసుకుంటే ఒక్క పైసా కూడా రాదు. 100 శాతం కోత విధిస్తారు.

విశాఖ నుంచి వందేభారత్ ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో ఎంత మేర నష్టమంటే..

ప్రయాణ మార్గం	టికెట్ ధర అంచనా (రూ.ల్లో)	72 గం. ముందు రద్దు చేస్తే..	72–8 గం. లోపు రద్దు చేస్తే..	8 గం.కంటే తక్కువలో రద్దు చేస్తే..
విజయవాడ	1,868	467	934	1,868
హైదరాబాద్	3,300	825	1,650	3,300
భువనేశ్వర్	2,150	538	1,075	2,150

ప్రధాన రూట్లలో ప్రభావం

వందే భారత్ స్లీపర్ రైళ్లలో కనీస చార్జీ 400 కి.మీ.లకు వర్తిస్తుంది. ఉదాహరణకు, విశాఖపట్నం నుంచి విజయవాడకు వందేభారత్ ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ ధర పన్నులతో కలిపి రూ.1,868 ఉంటుంది. దీనిని 3 రోజుల ముందే రద్దు చేస్తే రూ.467 వరకూ నష్టపోవాల్సి ఉంటుంది. రైలు బయలుదేరడానికి 10 గంటల ముందు రద్దు చేస్తే రూ.934 కట్ అవుతుంది. చివరి 8 గంటల్లోపు రద్దు చేస్తే రూ.1,868 కూడా నష్టపోవాల్సిందే. ఇక హైదరాబాద్‌కు టికెట్ బుక్ చేసుకొని 3 రోజుల ముందే రద్దు చేసుకున్నా.. వెయ్యికి పైగానే జేబుకు చిల్లుపడే అవకాశం ఉంది.

ఎందుకీ కఠిన నిర్ణయం?

ప్రయాణికుల ముక్కు పిండి మరీ వసూలు చేసేలా రైల్వే బోర్డు ఇటీవల కాలంలో కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే వందేభారత్ ప్రయాణికులపైనా వాతలు ప్రారంభించింది. అయితే, తమ క్యాన్సిలేషన్ షరతుల్లో మార్పులు చేయడాన్ని రైల్వే శాఖ సమర్థించుకుంటోంది. వందే భారత్ స్లీపర్‌లో కేవలం కన్ఫర్మ్ అయిన బెర్తులను మాత్రమే కేటాయిస్తారు. ఆర్ఏసీ(రిజర్వేషన్ ఎగైనెస్ట్ క్యాన్సిలేషన్) సౌకర్యం ఉండదు. చివరి నిమిషంలో రద్దు చేయడం వల్ల ఖరీదైన బెర్తులు ఖాళీగా మిగిలిపోతున్నాయని, అందుకే ఈ తరహా భారీ జరిమానాలు విధించాల్సి వస్తోందని రైల్వే చెబుతోంది. కారణమేదైనా.. జేబులకు చిల్లులు పెట్టేందుకు రైల్వే బోర్డు నడుం బిగించినట్లేనని, ఈ తరహా క్యాన్సిలేషన్ చార్జీలు అదనపు భారమేనంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారీ కోతలతో నష్టమే..

వందేభారత్ ప్రయాణమంటేనే భారం. ఇప్పుడు చార్ట్ ప్రిపరేషన్, క్యాన్సిలేషన్ చార్జీల విధింపులో మార్పులు చాలా వరకూ ప్రయాణికులను నష్టపరిచేలా ఉన్నాయి. ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదు. ప్రయాణానికి మూడు రోజుల ముందే టికెట్ రద్దు చేసుకున్నా, కనీసం నాలుగో వంతు డబ్బును వదులుకోవాలంటే ఎవరికైనా బాధగానే ఉంటుంది. దీనిపై అధికారులు పునరాలోచించుకుంటే మంచిది. – ఎస్.ఈశ్వర్, ప్రైవేట్ ఉద్యోగి

వందేభారత్ అంటేనే భయమేస్తోంది

సమయం ఆదా అవుతుందని వందేభారత్‌ను మధ్యతరగతి ప్రజలు కూడా ఉపయోగిస్తున్నారు. టికెట్ ధరలు దాదాపు విమానయానాన్ని పోలి ఉంటున్నాయి. అయినా సమయం కోసం వందేభారత్ ఎక్కుతున్నాం. ఇప్పుడు కొత్త నిబంధనలతో వందేభారత్ రైలు అంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యాన్సిలేషన్ చార్జీలు, చార్ట్ ప్రిపరేషన్ టైమ్ మిగిలిన రైళ్ల మాదిరిగా ఉంచితేనే మంచిది. – బి. కోటేశ్వరరావు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

సంక్రాంతి బరుల్లో మినీ బార్లు

- ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 400కు పైగా బెల్టుషాపులు
- మూడు రోజుల్లో రూ.42.34 కోట్ల మద్యం విక్రయాలు
- కూటమి నేతలు నిర్ణయించిందే బెల్టు ధర
- ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయాలు

ఇటీవల సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన కోడిపందేల బరుల వద్ద వెలసిన మద్యం షాపులు, బెల్టుషాపులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఇటీవల జరిగిన సంక్రాంతి వేడుకలను కూటమి నేతలు అక్రమ ఆదాయానికి మార్గంగా మార్చుకున్నారు. కోడి పందేల బరుల వద్ద మినీ బార్లు ఏర్పాటు చేశారు. మాంసం విక్రయాలతోపాటు మద్యాన్ని ఏరుల్లా పారించారు. ప్రతి బరిలో రెండు, మూడు బెల్టుషాపులు ఏర్పాటు చేసి మరీ 24 గంటలు నిరంతరాయంగా విక్రయించారు. అధికారిక లెక్కల ప్రకారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి మూడు రోజుల్లో రూ.42.34 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి.

రూ.కోట్లు మిగుల్చుకున్నారు

పండుగను వ్యాపారంగా మార్చి జూద క్రీడలు నిర్వహించడం ద్వారా వచ్చిన రాబడిపై తర్జనభర్జనలు ప్రారంభమయ్యాయి. అందరి కంటే మిన్నగా బరి నిర్వాహకులు అత్యధికంగా లబ్ధి పొందారు. అందులోనూ భారీ బరులు ఏర్పాటు చేసిన నిర్వాహకులైతే రూ.కోట్లలో మిగుల్చుకున్నారు. బరుల్లోనే పేకాట, బెల్టుషాపులు, సిగరెట్ షాపులు, వెజ్, నాన్ వెజ్, మినీ హోటళ్లు ఇలా సమస్తం విక్రయించారు. ఇక ప్రతి పందేనికీ 10 శాతం కమీషన్లు గెలిచిన వారి నుంచి వసూలు చేశారు. ఎస్ఐ మొదలుకొని పోలీస్ ఉన్నతాధికారుల వరకు, ఎక్సైజ్ కిందిస్థాయి సిబ్బంది మొదలుకొని డిప్యూటీ కమిషనర్ వరకు అందరూ పండుగ మూడు రోజులూ కూటమి నేతల ఒత్తిళ్లతో వ్యవస్థను పూర్తిగా వదిలేయడంతో ప్రతి బరిలో మినీ బార్ తెరుచుకుంది. ఏలూరు జిల్లాలో ఏర్పాటు చేసిన ఒక భారీ బరిలో మద్యం విక్రయాల కోసం 4 చోట్ల బెల్టుషాపులు, వాటికి అనుబంధంగా కూల్‌డ్రింక్ షాపులు ఏర్పాటు చేసి బరి నిర్వాహకులకు రూ.3 లక్షలు చెల్లించారు. క్వార్టర్‌కు రూ.30 నుంచి రూ.50 పెంచి మూడు రోజులపాటు విక్రయించారు. జిల్లా వ్యాప్తంగా 400కు పైగా బెల్టుషాపుల్లో రూ.15కోట్ల పైనే మద్యం విక్రయాలు జరిగినట్టు అంచనా.

మద్యంపై ఇప్పటికీ అదే ఊపు

పండుగ ఊపును ఉమ్మడి జిల్లాలో ఇంకా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం క్వార్టర్ మద్యంపై రూ.10 పెంచుకోవడానికి అనుమతించగా.. వ్యాపారులు మరో రూ.10 కలిపి రూ.20 చొప్పున పెంచి జిల్లాలో విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఏలూరు జిల్లాలోని 155 మద్యం దుకాణాల్లో పండుగ మూడు రోజులూ కలిపి రూ.21.34 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా.. పశ్చిమ గోదావరి జిల్లాలో 194 షాపుల్లో రూ.22 కోట్ల విక్రయాలు జరిగాయి. సాధారణంగా ఉమ్మడి జిల్లాలో రోజూ సగటున రూ.8 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతుండగా.. పండుగ రోజుల్లో పందెం బరుల్లో బెల్టుషాపుల దెబ్బకు మద్యం వ్యాపారం రెట్టింపైంది.

కోర్టు ధిక్కార పిటిషన్‌పై నోటీసుల జారీని వాయిదా వేయండి

- హైకోర్టును కోరిన ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ న్యాయవాది

సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ పదవికి తాను సమర్పించిన రాజీనామా విషయంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలను శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు ఉల్లంఘించారని, ఆయనపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలంటూ జయమంగళ వెంకటరమణ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా జయమంగళ వెంకటరమణ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ రాజీనామా లేఖపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలపై మండలి చైర్మన్ మోషేన్‌రాజు సీజే ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారని తెలిపారు. ఈ అప్పీల్‌పై ఇటీవల విచారణ జరిపిన సీజే ధర్మాసనం.. మోషేన్‌రాజుపై కోర్టు ధిక్కార చర్యల నిమిత్తం ఒత్తిడి చేయవద్దని తమకు మౌఖికంగా స్పష్టం చేసిందని తెలిపారు. అంతేకాక మోషేన్‌రాజు అప్పీల్ ఫిబ్రవరి 12న విచారణకు రానుందని చెప్పారు. అందువల్ల తాము దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యంలో నోటీసుల జారీ ప్రక్రియను మూడు వారాలపాటు వాయిదా వేయాలని న్యాయమూర్తిని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

రోగి సహాయకుల కష్టాలు... ఆసుపత్రికెరుక!

కర్నూలు పెద్దాసుపత్రి.. ఐదారు జిల్లాల రోగులకు వైద్య సేవలు అందిస్తోంది. పెద్ద పెద్ద డాక్టర్లు ఉన్నారు. ఇక్కడ అరుదైన ఆపరేషన్లు చేస్తారు. దీంతో ఎంతో మంది పేదలు వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. అయితే ఆసుపత్రిలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వివిధ వైద్య పరీక్షల నిమిత్తం రోగులను ఒక చోటు నుంచి మరో చోటుకు తీసుకెళ్లాల్సి రావడంతో ఒక రోగికి ఇద్దరు, ముగ్గురు సహాయకులు ఉండాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. వార్డ్ బాయ్స్, ఆయాలు లేక పోవడంతో రోగుల సహాయకులే స్ట్రెచ్చర్, వీల్‌చైర్లను తోసుకుంటూ వెళ్లాల్సిందే. ఎక్స్‌రే, స్కానింగ్, రక్త పరీక్షలు తదితర చోట్ల గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. రోగి వెంబడి వచ్చే సహాయకులు వార్డులో ఉండలేక ఆసుపత్రి ఆవరణలో చెట్ల నీడలో రాత్రింబవళ్లు సేద తీరుతూ కనిపిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

స్ట్రెచర్, వీల్‌చైర్లను రోగుల సహాయకులే తీసుకెళ్తున్న దృశ్యం

ఆసుపత్రిలో వీరి కష్టాలు కనేదెవరు..

చెట్ల కింద సేద తీరుతూ..

ఒంటరి పోరాటం..

అలసి ఎండలోనే నిద్రించిన వ్యక్తి

చంటి బిడ్డలతో అవస్థలు

రోజూ.. ఇలాంటి దృశ్యాలు ఎన్నో..



నవ్వు మనిషి సొత్తు కాదు

మనిషికి దొరికి వరం 'నవ్వు'. మనిషి నవ్వులు రకరకాలు. వికటాట్టహాసం, మందస్మితం, దరహాసం, చిరుహాసం... ఇలా. జోక్స్ వేసుకుని నవ్వుకోవడానికి మనుషులు ఇష్టపడతారు. అయితే నవ్వు మనిషి సొత్త మాత్రమే కాదు. నవ్వే లేదా నవ్వులాంటి భావన చూపించే జీవజాలం ఉంది. చింపాంజీలు, గొరిల్లాలు, డాల్ఫిన్లు, న్యూజిలాండ్‌లో కనిపించే కీ పారెట్‌లు, ఎలుకలు... కూడా నవ్వుతాయట. కొన్ని పెంపుడు శునకాలు కూడా నవ్వు ముఖం పెట్టి యజమానులను ఆనంద పరుస్తాయి.

ఒంటెలు... గుర్రాలూ... సైన్యమే

పిల్లలూ... మన సైన్యంలో గుర్రాలు, ఒంటెలు, దేగలు కూడా ఉంటాయని మీకు తెలుసా? సైనిక అవసరాల కోసం వీటిని నిర్వహించే సైనిక దళం కూడా ఉంటుంది. దానిని 'రీమౌంట్ వెటర్నరీ కోర్' (ఆర్.వి.సి.) అంటారు. ఈ దళం లోని సైనికులు సైన్యానికి అవసరమయ్యే జంతుజాలాన్ని సంరక్షించడమే కాదు...వాటికి ట్రయినింగ్ ఇస్తుంటారు. జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా ఆర్.వి.సి దళం ఇలా కెమెరా కంటికి చిక్కింది.

• మహనీయులు

భారత సినీరంగానికి ప్రపంచ ఖ్యాతి సత్యజిత్ రాయ్

భారత సినీరంగానికి ప్రపంచ ప్రఖ్యాతి తెచ్చిన వారెందరో ఉన్నారు. అందులో ఒకరు సత్యజిత్ రాయ్. బెంగాల్ రాష్ట్రానికి చెందిన రాయ్ ప్రపంచ సినిమాలో ఉత్తమ దర్శకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. 1921 మే 2న కోల్‌కతా నగరంలో జన్మించిన రాయ్ తండ్రి సుకుమార్ బెంగాలీ కవి, బాల సాహిత్యవేత్త. రాయ్‌కు మూడేళ్లు ఉన్నప్పుడే తండ్రి మరణించారు. తల్లి సుప్రభ కష్టపడి ఆయన్ని పెంచింది. కోల్‌కతా ప్రెసిడెన్సీ కాలేజీలో రాయ్ అర్థశాస్త్రం చదివారు. అనంతరం శాంతినికేతన్‌కు వెళ్లి ఓరియంటల్ ఆర్ట్‌లు అభ్యసించారు. అనంతరం సినిమా దర్శకత్వంపై మక్కువ పెంచుకున్నారు. 1955లో 'పథేర్ పాంచాలి'తో రాయ్ సినిమా దర్శకుడిగా అరంగేట్రం చేశారు. రచయిత బిభూతి భూషన్ బందోపాధ్యాయ రాసిన నవల ఈ చిత్రానికి ఆధారం. ఆ చిత్రం జాతీయ ఉత్తమ చిత్రంగా అవార్డు అందుకోవడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది. కాన్స్ చలనచిత్రోత్సవంలో పాల్గొంది. ఆ తర్వాత 'అపరాజితో', 'అపూర్ సంసార్' సినిమాలు తీశారు రాయ్. ఇవి 'అపూ ట్రయాటజీ'గా పేరు పొందాయి. ఆ తర్వాత 'చారులత', 'మహానగర్', 'ఆగంతక్', 'షత్రంజ్ కె ఖిలారీ' తదితర చిత్రాలన్నీ ప్రేక్షకులను అలరించాయి. మొత్తం 29 సినిమాలు, ఐదు డాక్యుమెంటరీలు, రెండు షార్ట్ ఫిల్మ్‌స్‌కు రాయ్ దర్శకత్వం వహించారు. రాయ్ కేవలం దర్శకత్వంతోనే ఆగిపోలేదు. తన సొంత, ఇతర దర్శకుల చిత్రాలకు సంగీతం అందించారు. స్క్రీన్‌ప్లేలు రాశారు. పిల్లల కోసం బెంగాలీలో అనేక చిన్న కథలు, నవలలు రాశారు. సత్యజిత్ రాయ్ చేసిన సేవలకుగానూ దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్నారు. భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అందించింది. 1992లో అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్స్(ఆస్కార్) రాయ్‌కి అకాడమీ గౌరవ పురస్కారం అందించారు. గౌరవ ఆస్కార్ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయుడిగా సత్యజిత్ రాయ్ నిలిచారు.1992 ఏప్రిల్ 23న రాయ్ మరణించారు.

ఆడు... ఆటాడు...

పిల్లలకు ఈ భూప్రపంచంలో చాలా ఇష్టమైన చోటు ప్లే గ్రౌండ్. స్కూల్లో కొన్ని క్లాసులు ఇంటరెస్టింగ్‌గా ఉంటాయి... కొన్ని క్లాసులు కొంచెం బోర్ కొడతాయి... కాని ప్లేగ్రౌండ్‌లో ప్రతి మూమెంట్ హుషారుగా ఉంటుంది. 'రేయ్... బాల్ వెయ్‌రా'... 'రేయ్... షాట్ కొట్రా'... అరుపులు... కేకలు... కేరింతలు... పరిగెత్తడం... గురి చూడటం.... బలం చూపడం... పిల్లలకు ప్లే గ్రౌండే పౌష్టికాహారం. అటటే హెల్దీఫుడ్. బాగా చదవడం ఎంత ముఖ్యమో బాగా ఆడటం అంటే ముఖ్యం. ఇక మంచి క్రికెటర్, చెస్ ప్లేయర్, బాడ్మింటన్ ప్లేయర్ కావాలంటే ఇదిగో ఇలా రోజూ ప్రాక్టీస్ చేయాలి. కోచ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ముంబైలోని శివాజీ పార్క్‌లో క్రికటర్లు కావాలనుకునే పిల్లలు ఎంత శ్రద్ధగా ప్రాక్టీసు చేస్తున్నారో చూడండి. మరి మీరు ఇంత డిసిప్లిన్‌గా ప్రాక్టీసు చేస్తున్నారా?

• పుస్తకాలు

సాహసయాత్రలో ఆమె గెలిచిందా?



వుడ్ అనే అమ్మాయికి సాహస యాత్రలంటే ఇష్టం. ఆమె ఆర్కిటిక్ ప్రాంతంలో ఉంటోంది. ఒక ధ్రువపు ఎలుగు బంటి ఆమె ప్రాణ స్నేహితురాలు. గడ్డ కట్టిన టండ్రా మీదుగా 'పోలార్ రేస్' చేయాలని అనుకుంది. ఇది చాలా బీభత్సమైన ప్రయాణం. ఇది ఆమె వల్ల అవుతుందా లేదా? ఆమెకు పోటీగా బాలుడు ఫిన్ ఉన్నాడు. గెలవడానికి అతను ఎంతకైనా తెగిస్తాడు. ఈ సమయంలో ఆమె గెలుస్తుందా? ఏం జరుగుతుందనేది 'లోన్ హస్కీ'లో చదవొచ్చు. ఆద్యంతం ఆసక్తి కలిగించే పుస్తకం ఇది.

'కార్వేటి నగరం' కథలు సంపుటి

కార్వేటినగరం ప్రాంతంలోని సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, స్థానికతను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన కథలివి. కార్వేటి నగరం పూర్వం ఒక పురాతన సంస్థానం. దీని చరిత్ర, అక్కడి గాథలను పిల్లలకు అర్థమయ్యేలా కథల రూపంలో అందించారు రచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజు. ప్రతి కథ స్థానిక అంశాలను ప్రతిబింబిస్తూ ఆసక్తికరంగా సాగుతుంది. కృషస్వామి రాజు రాసిన పిల్లల పుస్తకాలు మరికొన్ని ఉన్నాయి. అన్నీ చదవదగ్గవే.

• కథ

వజ్రాలు-పండ్లు



అనగనగా ఓ ఊరిలో అనంతుడు అనే యువకుడు దేశాటన చేయాలని, వివిధ ప్రాంతాల్లో పర్యటించాలని ఆశపడేవాడు. పేదరికం కారణంగా ఎక్కడికీ వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఆ సమయంలో అతని ఊరికి కొంతమంది బాటసారులు వచ్చారు. వారు వజ్రాల వ్యాపారులు. వజ్రాల అన్వేషణ కోసం ఒక నిర్జన దీవికి వెళ్లాలని అనుకుంటున్నారు. తాను వారికి సాయంగా ఉంటానని, తననూ తీసుకువెళ్లమని అనంతుడు వారిని అభ్యర్థించాడు. వారు సరేనని అతణ్ని వెంట తీసుకెళ్లారు. ఎన్నో రోజులు వారు ఓడలో ప్రయాణించి చివరకు ఆ నిర్జన దీవికి తీసుకెళ్లారు. అక్కడ నరసంచారం లేదు. అంతా అడవితో నిండి ఉంది. అందరూ కలిసి ఆ అడవిలో అన్వేషించగా చివరకు వజ్రాలు దొరికే స్థలం కనబడింది. వ్యాపారులు ఉత్సాహంతో ఆ వజ్రాలను మూటల్లో నింపుకున్నారు. అయితే అనంతుడు మాత్రం తన మూటలో అక్కడ అడవిలో దొరికే ఫలాలు, దుంపలు, కాయలు నింపుకున్నాడు. అతను చేసిన పనిని చూసి వ్యాపారులు నవ్వుకున్నారు. వజ్రాల విలువ తెలియని అమాయకుడు అనుకున్నాడు. వజ్రాల మూటలతో వ్యాపారులు, పండ్లు, ఫలాల మూటలతో అనంతుడు ఓడలోకి చేరుకున్నారు. తిరిగి ప్రయాణం ప్రారంభించారు. అప్పటికే వారు వెంట తెచ్చుకున్న ఆహారం అయిపోయింది. అనంతుడి వద్ద ఫలాలు ఉన్నాయి. వాటిని ఇవ్వమని కోరారు. 'మీ వద్ద ఉన్న ఒక వజ్రం ఇస్తే దానికి ప్రతిగా ఒక పండు ఇస్తాను' అన్నాడు. వజ్రాలకు మారుగా పండ్లా అనుకొని వారు ఇవ్వకుండా ఉన్నారు. రెండు రోజులు గడిచే సరికి ఆకలికి వారి పేగులు మాడిపోతున్నాయి. ఇక తట్టుకోలేక ఒక వజ్రం ఇచ్చి ఒక పండు తీసుకొని తిని ఆకలి తీర్చుకున్నారు. తర్వాత పూట మరో వజ్రం ఇచ్చి మరో పండు తీసుకున్నారు. అలా వారు ప్రయాణం చేసిన కాలమంతా రోజుకు నాలుగైదు వజ్రాలు ఇచ్చి అనంతుడి వద్ద పండ్లు తీసుకుని తిని ప్రాణాలు నిలుపుకున్నారు. చివరకు గమ్యస్థానం చేరుకునేసరికి వారి వజ్రాల్లో చాలా భాగం అనంతుడికి చేరాయి. అతను వజ్రాలకు బదులు పండ్లు ఎందుకు మూటగట్టుకొని వచ్చాడో వారికి అర్థమైంది. అతను అమాయకుడు కాదని, చాలా తెలివైన వాడని గ్రహించారు. అనంతుడు ఆ వజ్రాలతో తన ఊరు చేరుకొని, వాటిని అమ్మి ధనవంతుడిగా మారి హాయిగా దేశ విదేశాలు పర్యటించాడు.

కరెంటు కథ తెలుసా?

ఇవాళ పొద్దున్న లేస్తే రాత్రి పడుకునేదాకా కరెంట్ (పవర్/ఎలక్ట్రిసిటీ/విద్యుత్తు) లేకుండా ఏ పనీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. కరెంట్ లేకుండా ఏ పనీ జరగదు. అలా మన నిత్యజీవితంలో కరెంట్ ఒక కీలకమైన అంశంగా మారింది. కాసేపు కరెంట్ పోయినా విలవిలలాడిపోతుంటారు కొందరు. మరి ఈ కరెంట్ కథేమిటో తెలుసా?

విద్యుత్తుకు 200 ఏళ్ల చరిత్ర ఉంది. విద్యుత్తు అనేది ఎలక్ట్రాన్ల ప్రవాహం.

విద్యుత్తు ఒక వాహకం గుండా ప్రవహిస్తుంది. దీన్ని ఆంపియర్స్‌లో కొలుస్తారు.



బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనే శాస్త్రవేత్త మెరుపును విద్యుత్ అని నిరూపించాడు. ఆ తర్వాత 1800 సంవత్సరంలో అలెశాండ్రో వోల్టా మొదటి రసాయన బ్యాటరీని (వోల్టాయిక్ పైల్) కనుగొన్నారు. ఇది నిరంతర విద్యుత్ ప్రవాహానికి మార్గం సుగమం చేసింది. ఆ తర్వాత థామస్ ఎడిసన్ విద్యుత్ బల్బును తయారు చేశారు. నికోలా టెస్లా ఆల్టర్నేటింగ్ కరెంట్ వ్యవస్థలను, మోటార్‌లను అభివృద్ధి చేసి విద్యుత్ ప్రసారంలో విప్లవం తెచ్చారు. అప్పటి నుంచి విద్యుత్తు వ్యవస్థ పటిష్ఠంగా మారింది. ఎలక్ట్రాన్ల ప్రవాహం ద్వారా శక్తిని ఉత్పత్తి చేయడం, నియంత్రించడం వంటివి మొదలయ్యాయి. ప్రస్తుతం జల విద్యుత్, థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, పవన విద్యుత్... అలా అనేక పద్ధతుల్లో కరెంటును ఉత్పత్తి చేస్తున్నారు. కరెంట్ మీద ఆధారపడి అన్ని పరిశ్రమలు, కర్మాగారాలు నడుస్తున్నాయి. ఒక్క నిమిషం కరెంట్ పోయినా కోట్ల రూపాయల నష్టం వచ్చే అవకాశం ఉంది.

• భలే భలే

కొండల నడుమ కనులవిందుగా ప్రయాణం

పిల్లలూ! మీకు రైలు ప్రయాణాలంటే ఇష్టమా? పర్వత ప్రాంతాల గుండా ప్రయాణిస్తూ చుట్టూ ఉండే రమణీయమైన ప్రకతి దృశ్యాలు చూస్తే రైలు ప్రయాణం సాగిపోతే చాలా బాగుంటుంది కదా? అటువంటి అవకాశం హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం సిమ్లాకు వెళ్తే దొరుకుంది. కల్కా–సిమ్లా రైల్వే రైల్వే మార్గం దేశంలో ప్రసిద్ధి చెందింది. ఈ మార్గం హిమాలయ శివాలిక్ కొండల పాదాల చెంత ఉన్న కల్కాలో 656 మీటర్ల ఎత్తు నుండి ప్రారంభమై, ధరంపూర్, సోలన్, కండఘాట్, తారాదేవి, బరోగ్, సలోగ్రా, తోటు, సమ్మర్‌హిల్ మీదుగా, 2,075 మీటర్ల ఎత్తులో ఉన్న సిమ్లా వరకు సాగుతుంది. హిమాలయాలకు 7,116 అడుగుల ఎత్తులో ఈ మార్గం ఉంది. కల్కా నుండి సిమ్లా వరకు ఉన్న పర్వత ప్రాంతాల గుండా రైలు ప్రయాణిస్తుంది. 1864లో బ్రిటిష్ పాలనలో సిమ్లా భారతదేశ వేసవి రాజధానిగా ఉంది. ఈ కారణంగా మిగిలిన భారతీయ రైలు వ్యవస్థతో ఈ ప్రాంతాన్ని అనుసంధానించడానికి హెర్బర్ట్ సెప్టిమస్ హారింగ్టన్ పర్యవేక్షణలో 1898 మరియు 1903 మధ్య రైలు మార్గం నిర్మించారు. ఈ మార్గంలో 20 స్టేషన్లు, 103 సొరంగాలు, 912 వంపులు, 969 వంతెనలు ఉన్నాయి. బరోగ్ స్టేషన్‌కు సరిగ్గా ముందు ఉన్న 1,143.61 మీటర్ల సొరంగం అత్యంత పొడవైనది. 2008 జూలై 8న కల్కా–సిమ్లా రైల్వే మార్గాన్ని యునెస్కో పర్వత రైల్వేల ప్రపంచ వారసత్వ ప్రదేశాలలో ఒకటిగా చేర్చింది.

శ్రమించిన సబలెంకా

సబలెంకా

- ప్రిక్వార్టర్ ఫైనల్లో బెలారస్ టెన్నిస్ స్టార్
- మూడో రౌండ్‌లో కష్టపడి గెలిచిన నంబర్‌వన్
- కోకో గాఫ్, ఆంద్రీవా కూడా ముందంజ
- ఏడో సీడ్ పావోలిని అవుట్

అల్‌కరాజ్

మెల్‌బోర్న్: ఆ్రస్టేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో బెలారస్ టెన్నిస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా తొలిసారి కఠిన పరీక్ష ఎదుర్కొంది. తొలి రెండు రౌండ్‌లలో అలవోకగా నెగ్గిన ఈ మాజీ చాంపియన్‌కు మూడో రౌండ్‌లో మాత్రం తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ప్రపంచ 55వ ర్యాంకర్ అనస్తాసియా పొటపోవా (ఆ్రస్టియా)తో జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సబలెంకా 7–6 (7/4), 7–6 (9/7)తో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. 2 గంటల 2 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా రెండు సెట్‌లను టైబ్రేక్‌లో సొంతం చేసుకోవడం గమనార్హం. మూడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసిన గత ఏడాది రన్నరప్... 34 విన్నర్స్ కొట్టి 44 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను కూడా నాలుగుసార్లు బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో చోటు కోసం 17వ సీడ్ విక్టోరియా ఎంబోకో (కెనడా)తో సబలెంకా తలపడుతుంది. మూడో రౌండ్‌లో ఎంబోకో 7–6 (7/5), 5–7, 6–3తో 14వ సీడ్ క్లారా టౌసన్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. 2023, 2024లలో ఆ్రస్టేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సబలెంకా గత ఏడాది ఫైనల్లో మాడిసన్ కీస్ (అమెరికా) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. మరోవైపు మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), ఎనిమిదో సీడ్ మిరా ఆంద్రీవా (రష్యా), 12వ సీడ్ ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో కోకో గాఫ్ 3–6, 6–0, 6–3తో హైలీ బాప్టిస్ట్ (అమెరికా)పై, ఆంద్రీవా 6–3, 6–4తో ఎలీనా రూస్ (రొమేనియా)పై, స్వితోలినా 7–6 (7/4), 6–3తో డయానా ష్నయిడర్ (రష్యా)పై గెలుపొందారు. ఏడో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ) మాత్రం మూడో రౌండ్ అడ్డంకిని దాటలేకపోయింది. మూడో రౌండ్‌లో పావోలిని 2–6, 6–7 (3/7)తో ఇవా జోవిచ్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. ఏడోసారి ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో ఆడిన పావోలిని నాలుగుసార్లు తొలి రౌండ్‌లో, రెండుసార్లు మూడో రౌండ్‌లో, ఒకసారి నాలుగో రౌండ్‌లో నిష్క్రమించింది.

పావోలిని

అల్‌కరాజ్ జోరు...

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అల్‌కరాజ్ మరో అలవోక విజయంతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. శుక్రవారం జరిగిన మూడో రౌండ్‌లో అల్‌కరాజ్ 6–2, 6–4, 6–1తో కొరెన్‌టిన్ ముటెట్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. 2 గంటల 5 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ 30 విన్నర్స్ కొట్టి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేశాడు. ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను రెండుసార్లు చొప్పున సాధించిన 22 ఏళ్ల అల్‌కరాజ్‌కు ఆ్రస్టేలియన్ ఓపెన్ మాత్రం కలిసిరావడం లేదు. ఐదోసారి ఈ టోర్నీలో ఆడుతున్న ఈ స్పెయిన్ స్టార్ గత రెండేళ్లలో క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగాడు. ఈసారి ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో అల్‌కరాజ్ విజేతగా నిలిస్తే... 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' ఘనత సాధించిన అతిపిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టిస్తాడు. మరోవైపు మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఆరో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆ్రస్టేలియా), 10వ సీడ్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్), 11వ సీడ్ మెద్వెదెవ్ (రష్యా) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో జ్వెరెవ్ 7–5, 4–6, 6–3, 6–1తో కామెరాన్ నోరి (బ్రిటన్)పై, డిమినార్ 6–3, 6–4, 7–5తో ఫ్రాన్సెస్ టియాఫో (అమెరికా)పై, బుబ్లిక్ 7–6 (7/4), 7–6 (7/5), 6–4తో టొమాస్ ఎచ్‌వెరీ (అర్జెంటీనా)పై, మెద్వెదెవ్ 6–7 (5/7), 4–6, 7–5, 6–0, 6–3తో ఫాబియన్ మరోజ్‌సన్ (హంగేరి)పై గెలిచారు. 13వ సీడ్ రుబ్లెవ్ (రష్యా) 3–6, 6–7 (4/7), 3–6తో ఫ్రాన్సిస్కో సెరున్‌డోలో (అర్జెంటీనా) చేతిలో ఓడిపోయాడు.

స్ప్రింగర్ 'హ్యాట్రిక్'

మూడో టి20లో వెస్టిండీస్ విజయం ● 2–1తో సిరీస్ అఫ్గానిస్తాన్ సొంతం

దుబాయ్: అఫ్గానిస్తాన్‌తో మూడో టి20లో వెస్టిండీస్ బౌలర్ షమర్ స్ప్రింగర్ 'హ్యాట్రిక్'తో చెలరేగాడు. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా గురువారం అర్ధరాత్రి ముగిసిన ఆఖరి మ్యాచ్‌లో స్ప్రింగర్ విజృంభించాడు. మొదట విండీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. కెప్టెన్ బ్రాండన్ కింగ్ (35 బంతుల్లో 47; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. జాన్సన్ చార్లెస్ (17), కార్టీ (10), జస్టిన్ గ్రేవ్స్ (12), హెట్‌మైర్ (13), మాథ్యూ ఫోర్డ్ (27), సాంప్సన్ (3) విఫలమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో కెప్టెన్ రషీద్ ఖాన్, జియాఉర్ రహమాన్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 136 పరుగులు చేసింది. వికెట్ కీపర్ రహ్మానుల్లా గుర్బాజ్ (58 బంతుల్లో 71; 8 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే హాఫ్‌సెంచరీతో పోరాడగా... ఇబ్రహీం జద్రాన్ (28) ఫర్వాలేదనిపించాడు. తక్కినవాళ్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఛేదనలో అఫ్గానిస్తాన్ విజయానికి 12 బంతుల్లో 25 పరుగులు అవసరమైన దశలో 19వ ఓవర్ వేసిన స్ప్రింగర్ అద్భుతం చేశాడు. తొలి బంతికి రహ్మానుల్లాను అవుట్ చేసిన అతడు... ఆ తర్వాత వరుసగా రషీద్ ఖాన్ (0), షాహిదుల్లా (0)ను పెవిలియన్ పంపి 'హ్యాట్రిక్' పూర్తి చేసుకున్నాడు. టి20ల్లో వెస్టిండీస్ తరఫున 'హ్యాట్రిక్' తీసిన మూడో బౌలర్‌గా స్ప్రింగర్ నిలిచాడు. గతంలో విండీస్ తరఫున రొమారియో షెఫర్డ్ (బంగ్లాదేశ్‌పై 2025లో), జేసన్ హోల్డర్ (ఇంగ్లండ్‌పై 2021లో) ఈ ఫీట్ నమోదు చేశారు. దీంతో చివరి ఓవర్‌లో అఫ్గాన్ విజయానికి 20 బంతులు అవసరం కాగా... ఆ జట్టు 4 పరుగులు మాత్రమే చేసి 15 పరుగుల తేడాతో ఓడింది. ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు గెలిచిన అఫ్గాన్ 2–1తో సిరీస్ కైవసం చేసుకుంది. స్ప్రింగర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', అఫ్గాన్ ప్లేయర్ డార్విష్ రసూలీకి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

పార్థ్, ధర్మేంద్ర మాయాజాలం

పంజాబ్‌పై 194 పరుగుల తేడాతో సౌరాష్ట్ర ఘనవిజయం ● శుబ్‌మన్ గిల్ మళ్లీ విఫలం

పార్థ్

ధర్మేంద్ర

రాజ్‌కోట్: దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో పంజాబ్ జట్టుపై సౌరాష్ట్ర విజయం సాధించింది. గ్రూప్ 'బి'లో భాగంగా రెండు రోజుల్లోనే ముగిసిన పోరులో సౌరాష్ట్ర 194 పరుగుల తేడాతో పంజాబ్‌ను చిత్తు చేసింది. పంజాబ్ జట్టుకు సారథ్యం వహిస్తున్న టీమిండియా వన్డే, టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ వరుసగా రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలం కావడం ఫలితంపై ప్రభావం చూపింది. ఓవర్‌నైట్ స్కోరు 24/3తో శుక్రవారం రెండో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్ర... చివరకు 58.5 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. ప్రేరక్ మన్కడ్ (41 బంతుల్లో 56; 10 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... టీమిండియా స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా (44 బంతుల్లో 46; 4 ఫోర్లు), హేత్విక్ కొటక్ (39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), పార్థ్ భట్ (37 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కీలక పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్ 5 వికెట్లు పడగొట్టగా... జస్విందర్ సింగ్ 3 వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలుపుకొని ప్రత్యర్థి ముందు 320 పరుగుల లక్ష్యం నిలవగా... పంజాబ్ మరోసారి పేలవ ప్రదర్శన కనబర్చింది. భారీ ఆశలు పెట్టుకున్న శుబ్‌మన్ గిల్ (32 బంతుల్లో 14; 1 ఫోర్) విఫలమవడంతో పంజాబ్ చివరకు 39 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది. ఉదయ్ శరణ్ (71 బంతుల్లో 31; 2 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... తక్కినవాళ్లంతా చేతులెత్తేశారు. సౌరాష్ట్ర బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ పార్థ్ భట్, ధర్మేంద్ర జడేజా చెరో 5 వికెట్లు పడగొట్టారు. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో గిల్ సహా ఐదు వికెట్లు తీసిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పార్థ్ భట్... రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లు వేసి కేవలం ఎనిమిది పరుగులే ఇచ్చి 5 వికెట్లు తీయడం విశేషం. రెండో ఇన్నింగ్స్‌లోనూ గిల్‌ను పార్థ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అంతకుముందు సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులు చేయగా... పంజాబ్ 139 పరుగులు చేసింది. ఈ విజయంతో సౌరాష్ట్ర పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి చేరి నాకౌట్ అవకాశాలను మెరుగు పరుచుకోగా... పంజాబ్ మూడో ఓటమితో క్వార్టర్స్ రేసుకు దూరమైంది.

ఇదే గ్రూప్‌లో భాగంగా జరుగుతున్న మరో మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 323 పరుగులకు ఆలౌట్ కాగా... కర్ణాటక 58 ఓవర్లలో 8 వికెట్లకు 168 పరుగులు చేసింది. మహారాష్ట్రతో మ్యాచ్‌లో గోవా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులకు ఆలౌట్ కాగా... మహారాష్ట్ర 91 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. కేరళతో మ్యాచ్‌లో చండీగఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 416 పరుగులు చేయగా... కేరళ రెండో ఇన్నింగ్స్‌లో 5.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 21 పరుగులు చేసింది.

మిల్నే స్థానంలో జేమీసన్

న్యూజిలాండ్ టి20 ప్రపంచకప్ జట్టులో మార్పు

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ ఇదివరకే ప్రకటించిన ప్రపంచకప్ టి20 జట్టులో ఒక మార్పు చోటు చేసుకుంది. గాయపడిన సీమర్ ఆడమ్ మిల్నే స్థానంలో కైల్ జేమీసన్‌ను తీసుకుంది. దక్షిణాఫ్రికా టి20 లీగ్ టోర్నీ 'ఎస్‌ఏ20'లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మిల్నే ఆదివారం ముంబై ఇండియన్స్ కేప్ టౌన్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా గాయపడ్డాడు. అతని ఎడమ తొడ కండరాలకు గాయం కావడంతో భారత్, శ్రీలంక ఉమ్మడిగా ఆతిథ్యమివ్వబోయే మెగా ఈవెంట్‌కు దూరమయ్యాడు. దీంతో అతని స్థానాన్ని ప్రస్తుతం భారత్‌లోనే ఉన్న సీమర్ కైల్ జేమీసన్‌తో భర్తీ చేసినట్లు న్యూజిలాండ్ క్రికెట్ తెలిపింది. నిజానికి భారత పర్యటకు దూరంగా ఉండి మరీ ప్రపంచకప్ కోసం సన్నద్ధమవుతున్న సీనియర్ పేసర్ మిల్నే ఇలా జట్టుకు దూరమవడం దురదృష్టకరమని కివీస్ హెడ్‌కోచ్ వాల్టర్ తెలిపారు. ప్రస్తుతం టీమిండియా పర్యటనలో ఉన్న కివీస్ 2–1తో వన్డే సిరీస్‌ను నెగ్గింది. తాజాగా మూడు టి20ల సిరీస్ ఆడుతోంది. వచ్చే నెల 7 నుంచి టి20 ప్రపంచకప్ మొదలవుతుంది. మొత్తం 20 జట్లను 'ఎ', 'బి', 'సి', 'డి' నాలుగు గ్రూపులుగా విభజించారు. న్యూజిలాండ్... దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్, కెనడా, యూఏఈలతో కలిసి గ్రూప్ 'డి'లో ఉంది.

ఫైనల్లో కళింగ లాన్సర్స్

భువనేశ్వర్: పురుషుల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో వేదాంత కళింగ లాన్సర్స్ జట్టు ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన తొలి క్వాలిఫయర్‌లో కళింగ లాన్సర్స్ జట్టు 2–1 గోల్స్‌తో రాంచీ రాయల్స్‌పై గెలుపొందడంతో నేరుగా టైటిల్ పోరుకు అర్హత సంపాదించింది. కళింగ తరఫున అలెగ్జాండర్ హెండ్రిక్స్ (12వ, 32వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా, రాంచీ రాయల్స్ జట్టులో మన్‌దీప్ సింగ్ 40వ నిమిషంలో గోల్ చేశాడు. రాంచీకి ఫైనల్ చేరే అర్హత రెండో క్వాలిఫయర్ రూపంలో ఇంకా సజీవంగానే ఉంది. ఆదివారం ఫైనల్ బెర్త్ లక్ష్యంగా రాంచీతో హైదరాబాద్ తుఫాన్స్ తలపడుతుంది. ఇందులో విజేతగా నిలిచిన జట్టుతో ఆదివారం జరిగే ఫైనల్లో కళింగ లాన్సర్స్ అమీతుమీ తేల్చుకుంటుంది. మరోవైపు గత ఏడాది రన్నరప్ హైదరాబాద్ తుఫాన్స్ జట్టు రెండో క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ పోరులో హైదరాబాద్ జట్టు 2–0తో హెచ్ఐఎల్ జీసీ జట్టుపై విజయం సాధించింది. తుఫాన్స్ స్ట్రయికర్ శిలానంద్ లాక్రా అద్భుతమైన ఆటతీరుతో అదరగొట్టాడు. అతను 16వ, 39వ నిమిషాల్లో రెండు గోల్స్ సాధించాడు. హైదరాబాద్ గోల్‌కీపర్ జీన్ పాల్ డానెబర్గ్ ప్రత్యర్థి గోల్స్ చేయకుండా అడ్డుగోడ కట్టేశాడు.

సుదీప్ డబుల్ సెంచరీ

బెంగాల్ 519 ఆలౌట్

కోల్‌కతా: సీనియర్ బ్యాటర్ సుదీప్ చటర్జీ (327 బంతుల్లో 209; 18 ఫోర్లు, 1 సిక్స్) ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఫలితంగా రంజీ ట్రోఫీ గ్రూప్ 'సి'లో భాగంగా సర్వీసెస్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 135 ఓవర్లలో 519 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 340/4తో శుక్రవారం రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ భారీ స్కోరు చేసింది. గాయం నుంచి కోలుకొని తిరిగి వచ్చిన సుదీప్ దుమ్మురేపగా... హబీబ్ గాంధీ (151 బంతుల్లో 91 నాటౌట్; 10 ఫోర్లు) సెంచరీకి తొమ్మిది పరుగుల దూరంలో నిలిచిపోయాడు. సర్వీసెస్ బౌలర్లలో వినీత్ ధన్కర్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సర్వీసెస్ ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 8 వికెట్లకు 126 పరుగులు చేసింది. నకుల్ శర్మ (32 బ్యాటింగ్; 4 ఫోర్లు), శుభమ్ (30; 6 ఫోర్లు) కాస్త పోరాడగా... తక్కినవాళ్లు విఫలమయ్యారు. బెంగాల్ బౌలర్లలో ఆకాశ్ దీప్, సూరజ్ జైస్వాల్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... షమీ రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. చేతిలో రెండు వికెట్లు ఉన్న సర్వీసెస్ ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 393 పరుగుల దూరంలో ఉంది. ఇదే గ్రూప్‌లో భాగంగా జరుగుతున్న మరో మ్యాచ్‌లో త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 266 పరుగులకు ఆలౌట్ కాగా... ఉత్తరాఖండ్ 85 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. హరియాణాతో మ్యాచ్‌లో అస్సాం తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేయగా... బదులుగా హరియాణా 3 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. గుజరాత్‌తో మ్యాచ్‌లో రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో 424 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 175 పరుగులకు పరిమితమైన గుజరాత్... రెండో ఇన్నింగ్స్‌లో 7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 20 పరుగులు చేసింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా... బరోడా జట్టు ఇన్నింగ్స్ 6 పరుగుల తేడాతో నాగాలాండ్‌పై విజయం సాధించింది.

పాక్ టి20 జట్టులో షాహిన్, బాబర్

కరాచీ: పాకిస్తాన్ సొంతగడ్డపై ఆ్రస్టేలియాతో జరిగే టి20 సిరీస్ కోసం షాహిన్ అఫ్రిదిని ఎంపిక చేశారు. గాయం నుంచి కోలుకోవడంతో అతనికి ఎప్పట్లాగే రెగ్యులర్ జట్టులో చోటు ఇచ్చారు. ఈ ఒక్క మార్పు మినహా ఇటీవల శ్రీలంకతో ఆడిన పాకిస్తాన్ జట్టే... త్వరలో ఆ్రస్టేలియాతోనూ మూడు టి20ల ద్వైపాక్షిక సిరీస్‌లో తలపడుతుంది. ఆ్రస్టేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ జట్టుకు ఆడిన బాబర్ ఆజమ్ కూడా పాక్ జట్టులోకి వచ్చాడు. భారత్, శ్రీలంకలో జరగబోయే మెగా ఈవెంట్‌కు ముందు పాక్, ఆసీస్‌లకు ఇది చివరి సన్నాహక టోర్నీ! 3 మ్యాచ్‌లకు లాహోర్‌లోని గడాఫీ స్టేడియమే ఆతిథ్యమిస్తుంది. ఈ నెల 29, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో మూడు టి20లు జరుగుతాయి. ఈ టోర్నీ కోసం ఆ్రస్టేలియా ఈ నెల 28న పాకిస్తాన్‌కు చేరుకుంటుంది.

పాకిస్తాన్ జట్టు: సల్మాన్ అలీ ఆఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజమ్, ఫహీమ్, ఫఖర్ జమాన్, ఖ్వాజా మొహమ్మద్, మొహమ్మద్ నవాజ్, సల్మాన్ మీర్జా, మొహమ్మద్ వసీమ్, నసీమ్ షా, సాహిబ్‌జాదా ఫర్హాన్, సయీమ్ అయూబ్, షాహిన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తారిఖ్.

గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం శుక్రవారం గౌహతిలో రిహార్సల్స్ చేస్తున్న అసోం పోలీస్ బ్లాక్ పాంథర్ మహిళా కమాండోలు

హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం మంచుకురిసింది. మనాలిలో భారీగా మంచు పేరుకుపోవడంతో స్తంభించిన ట్రాఫిక్

ఢిల్లీలో శుక్రవారం ఉదయం వర్షం కురియడంతో అక్షర్‌ధామ్ ప్రాంతంలో భారీగా నిలిచిపోయిన వాహనాలు

ప్రశాంతంగా పూజలు.. నమాజ్

భోజ్‌శాల సముదాయంలో గట్టి బందోబస్తు

ధార్: మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఉన్న భోజ్‌శాల–కమాల్ మౌలా మసీదు సముదాయంలో శుక్రవారం ప్రశాంత వాతావరణం నెలకొంది. ఆ ప్రాంగణంలోని ఒక ప్రాంతంలో హిందువులు వసంత పంచమిని పురస్కరించుకుని పూజలు నిర్వహించగా, ముస్లిం మరోచోట నమాజ్ చేసుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. ఉదయం నుంచి హిందువులు పూజలు మొదలుపెట్టారు. సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. మధ్యలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు ముస్లింలు ప్రార్థనలు చేశారు. నగర వ్యాప్తంగా 8 వేల మంది పోలీసులు, పారా మిలటరీ సిబ్బందిని మోహరించారు. భోజ్ ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులు నిర్దేశించిన ప్రాంతంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్టించి, అఖండ పూజను ప్రారంభించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటన జరగలేదని, ప్రశాంత వాతావరణానికి భంగం కలగలేదని జిల్లా మేజిస్ట్రేట్ ప్రియాంక్ మిశ్రా తెలిపారు. నగరంలోని ప్రతి వీధిలోనూ బందోబస్తుతోపాటు సీసీటీవీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ మయాంక్ అవస్థి చెప్పారు. సామాజిక మాధ్యమ వేదికలపైనా ఓ కన్నేసి ఉంచామన్నారు. 11వ శతాబ్దం నాటి ఈ కట్టడాన్ని భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) పరిరక్షిస్తోంది. 2003లో ఏఎస్ఐ ఇచ్చిన ఆదేశాల ప్రకారం భోజ్‌శాలలో ప్రతి మంగళవారం హిందువులు పూజలు, ముస్లిం ప్రతి శుక్రవారం నమాజ్ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే, వసంత పంచమి శుక్రవారం రోజే రావడంతో గురువారం ఇరువర్గాలకు అనుకూలంగా ఉండేలా పూజలు, నమాజ్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించడం తెల్సిందే.

భవ్య సరస్వతీ ఆలయం నిర్మిస్తాం: వీహెచ్‌పీ

వివాదాస్పద భోజ్‌శాల సముదాయంలో బ్రహ్మాండమైన సరస్వతీ మాత ఆలయాన్ని నిర్మించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ప్రకటించింది. చట్ట పరమైన ప్రక్రియను పూర్తి చేసుకున్నాక 2034కల్లా ఆలయ నిర్మాణ కలను సాకారం చేస్తామని తెలిపింది. ప్రస్తుతం లండన్ మ్యూజియంలో ఉన్న వాగ్దేవి మాత విగ్రహాన్ని తిరిగి తీసుకువచ్చి, ఆ ఆలయంలో ప్రతిష్ఠిస్తామని వీహెచ్‌పీ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్ కుమార్ తెలిపారు. శ్రీరాముడి జన్మస్థలం అయోధ్యలో నిర్మించిన ఆలయం మాదిరిగానే ఇది కూడా ఉంటుందన్నారు. శుక్రవారం ఆయన భోజ్‌శాలలో జరిగిన సరస్వతీమాత పూజకు హాజరైన భక్తులనుద్దేశించి మాట్లాడారు. 'భోజ్‌శాలలో వాగ్దేవి ఆలయం 1034లో నిర్మితమైంది. ఆలయ ప్రతిష్ట జరిగి ఇప్పటికి 992 ఏళ్లు పూర్తయ్యాయి. 2034కల్లా వెయ్యేళ్లు అవుతాయి. అప్పటి కల్లా చట్టపరమైన అడ్డంకులను అధిగమించేందుకు మనమంతా కృషి చేయాలి. అయోధ్య రామాలయం మాదిరిగా భవ్య సరస్వతీ మాత ఆలయాన్ని నిర్మించుకోవాలి'అని అలోక్ కుమార్ పిలుపునిచ్చారు. లండన్ నుంచి వాగ్దేవి విగ్రహాన్ని భారత్‌కు తిరిగి తేవాలని ఈ సందర్భంగా పలువురు సాధుసంతులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉజ్జయినిలోని శ్రీ మహాకాల్ లోక్ కారిడార్ మాదిరిగానే వాగ్దేవి కారిడార్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

అమెరికాలో టిక్‌టాక్ సేఫ్

- అమెరికా కంపెనీలతో చేతులు కలిపిన టిక్‌టాక్ కంపెనీ
- మగిసిన చర్చలు.. ఒప్పందాలపై సంతకాలు పూర్తి
- ఇకపై నూతన జాయింట్ వెంచర్ ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు

వాషింగ్టన్: అమెరికాలో నిషేధం హెచ్చరికల నుంచి తప్పించుకోవడానికి టిక్‌టాక్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికా సంస్థలతో చేతులు కలిపింది. ఈ మేరకు ఒప్పందాలపై తాజాగా సంతకాలు జరిగాయి. అమెరికాలో ఒరాకిల్, సిల్వర్ లేక్, ఎంజీఎక్స్ సంస్థలతో టిక్‌టాక్ కంపెనీ కలిసి పనిచేయనుంది. కొత్తగా టిక్‌టాక్ యూఎస్ జాయింట్ వెంచర్ ఏర్పాటు కానుంది. ఒరాకిల్, సిల్వర్ లేక్, ఎంజీఎక్స్‌కు 15 శాతం చొప్పున వాటా ఉంటుంది. డెల్ టెక్నాలజీస్, బైట్‌డ్యాన్స్ సంస్థలు కూడా ఇందులో పెట్టుబడులు పెడుతున్నాయి. టిక్‌టాక్ ప్రసుతం చైనా కంపెనీ యాజమాన్యంలో ఉంది. అమెరికాలో 20 కోట్ల మందికిపైగా యూజర్లు ఉన్నారు. వీడియోలు సృష్టించి, షేర్ చేసుకుంటున్నారు. తమ పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని టిక్‌టాక్ కంపెనీ చోరీచేసి, చైనాకు చేరవేస్తోందని అధ్యక్షుడు ట్రంప్ ఆరోపిస్తున్నారు. చైనా యాజమాన్యం కింద కొనసాగితే తమ దేశంలో టిక్‌టాక్‌ను నిషేధిస్తామని ఆయన ఇప్పటికే హెచ్చరించారు. దేశ భద్రత కోసమే నిషేధించక తప్పదని పేర్కొన్నారు. అమెరికా సంస్థల పరిధిలో పనిచేస్తే అభ్యంతరం లేదని ప్రకటించారు. 20 కోట్ల మంది యూజర్లను వదులుకోవడం ఇష్టంలేని టిక్‌టాక్ యాజమాన్యం అమెరికా కంపెనీలతో జతకట్టింది. ఏడాదికాలంగా జరుగుతున్న చర్చలు పూర్తయ్యాయి. అమెరికా సంస్థలతో ఎట్టకేలకు ఒప్పందానికి వచ్చింది. ఇకపై నూతన జాయింట్ వెంచర్ ఆధ్వర్యంలోనే అమెరికాలో టిక్‌టాక్ కార్యకలాపాలు కొనసాగుతాయి. ఇందులో ఏడుగురు సభ్యులు ఉంటారు. మెజార్టీ సభ్యులు అమెరికన్లే ఉంటారనడంలో సందేహం లేదు. సమగ్ర డేటా రక్షణలు, ఆధునిక కంటెంట్, సాఫ్ట్‌వేర్‌తో జాతీయ భద్రతకు కట్టుబడి ఉంటూ యూజర్లకు సేవలు అందించనున్నట్లు టిక్‌టాక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అమెరికాలో టిక్‌టాక్‌పై నిషేధం తప్పినట్లయ్యింది. సేవలు యథావిధిగా కొనసాగుతాయి.

ట్రంప్ ప్రశంసలు

అమెరికా కంపెనీలతో టిక్‌టాక్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసించారు. చైనా అధినేత షీ జిన్‌పింగ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. జిన్‌పింగ్ తమతో కలిసి పనిచేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో టిక్‌టాక్ యూజర్లకు తాను గుర్తుండిపోతానని ఉద్ఘాటించారు.

కశ్మీర్‌లో జైషే టాప్ కమాండర్ హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవ్యతిరేక ఆపరేషన్లలో భద్రతా బలగాలు కీలక విజయం సాధించాయి. కథువా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో జైషే మహమ్మద్‌కు చెందిన కరుడుగట్టిన విదేశీ ఉగ్రవాదిని హతమార్చాయి. బిల్లావర్‌లోని పర్రేటార్ ప్రాంతంలో ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ సంయుక్త ఆపరేషన్‌లో జేషే కమాండర్ ఉస్మాన్ అలియాస్ అబూ మావియాను మట్టుబెట్టినట్టు జమ్మూ ఐజీ భీమ్ సేన్ టుటి తెలిపారు. మారుమూల గ్రామంలోని ఓ ఇంటిపై బలగాలు దాడి చేయగా లోపల దాక్కున్న ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఉస్మాన్ హతమయ్యాయని చెప్పారు. ఘటనలో అత్యాధునిక ఎం4 ఆటోమేటిక్ రైఫిల్‌తోపాటు పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి కూడా పట్టుబడ్డాయన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన కార్డన్ సెర్చ్ సందర్భంగా ఓ విదేశీ ఉగ్రవాదిని చంపేసినట్లు ఆర్మీ ఎక్స్‌లో తెలిపింది. ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోందని కూడా వెల్లడించింది. ఈ నెల 7, 13వ తేదీల్లో కహోగ్, నజోట్ అటవీ ప్రాంతాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఉస్మాన్ తప్పించుకున్నాడని పేర్కొంది.

పాకిస్తాన్‌కు చెందిన ఇతడు రెండేళ్ల క్రితం దొంగచాటుగా సరిహద్దులు దాటి కశ్మీర్‌లోకి ప్రవేశించాడు. ఉథంపూర్–కథువా ప్రాంతంలో కార్యకలాపాలు సాగిస్తున్న జేషే మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదిగా మారాడు. గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో బలగాలు ఆదివారం ఆపరేషన్ త్రాషి–ఇ పేరుతో కూంబింగ్ చేపట్టాయి. ఆదివారం ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక పారాట్రూపర్ నేలకొరగ్గా, ఏడుగురు జవాన్లకు గాయాలయ్యాయి. నాలుగు రోజులపాటు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోలేదు. గురువారం ఎదురుకాల్పుల సమయంలో ఉస్మాన్ మరికొందరు దట్టమైన అటవీ ప్రాంతాన్ని అవకాశంగా మల్చుకుని పరారయ్యారు.

హైకోర్టుకు క్షమాపణ చెప్పండి

జడ్జిని హెచ్చరించిన జార్ఖండ్ లాయర్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: జార్ఖండ్ హైకోర్టులో ఓ కేసు విచారణ సమయంలో న్యాయమూర్తితో పరుషంగా మాట్లాడిన లాయర్ తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టింది. హైకోర్టుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఆ లాయర్ క్షమాపణను సానుభూతితో స్వీకరించాలని హైకోర్టుకు కూడా సూచించింది. గతేడాది అక్టోబర్ 16వ తేదీన ఈ ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరణకు సంబంధించిన కేసును లాయర్ మహేశ్ తివారీ హైకోర్టులో వాదిస్తున్నారు. కనెక్షన్ తిరిగి ఇచ్చేందుకు రూ.25 వేలు డిపాజిట్ చేస్తామని క్లయింట్ తరఫున ఆయన ప్రతిపాదించగా, మొత్తం బకాయిలో 50 శాతం చెల్లించడం తప్పనిసరంటూ గత తీర్పులను న్యాయమూర్తి రాజేశ్ కుమార్ ఉదహరించారు. చివరకు రూ.50వేలు డిపాజిట్ చేయాలనే నిబంధనతో సమస్య పరిష్కారమైనప్పటికీ, వాదనల సమయంలో మాటామాటా పెరిగింది. లాయర్ తివారీ తీరు సరిగా లేదంటూ జస్టిస్ కుమార్ జార్ఖండ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆగ్రహించిన మహేశ్ తివారీ.. 'నేను ఆలాగే వాదిస్తా..హద్దు మీరకండి' అంటూ కోర్టు హాలులో న్యాయమూర్తితో వ్యాఖ్యానిస్తున్నట్టుగా ఉన్న వీడియో క్లిప్పింగ్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ చౌహాన్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం లాయర్ తివారీకి ధిక్కరణ నోటీసు పంపింది. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం విచారణ చేపట్టింది. లాయర్ తివారీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదన వినిపించారు. తన క్లయింట్ అప్పటి ఘటనపై పశ్చాత్తాపం చెందుతున్నారని, బేషరతుగా క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గౌరవ న్యాయమూర్తిని అగౌరవపర్చాలని గానీ, కోర్టు కార్యకలాపాలకు అవరోధం కల్పించాలని గానీ ఆయన ఉద్దేశం కాదన్నారు. స్పందించిన ధర్మాసనం ధిక్కారం నోటీసు ఇచ్చిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఎదుట తివారీ క్షమాపణ చెబితే సరిపోతుందని పేర్కొంది. ఈ మేరకు అఫిడవిట్ వేయాలంది. దీనిని సానుభూతితో పరిశీలించాలని హైకోర్టుకు సూచించింది. అదే సమయంలో లాయర్ ప్రవర్తనను ధర్మాసనం ఆక్షేపించింది. 'జడ్జిల ఎదుట ఆయనే స్వయంగా హాజరై వివరణ ఇవ్వొచ్చు కదా? మూర్ఖత్వానికి తగు ఫలితం స్వయంగా అనుభవించాల్సిందే. అతడినే వివరణ ఇచ్చుకోనివ్వండి. అక్కడా గుడ్లు ఉరమాలని అనుకుంటే... ఉరమనీయండి. అతడిని ఎలా డీల్ చేయాలో మాకు తెలుసు'అంటూ ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈక్వెడార్ అడవుల్లో

అందాల పక్షి ఆఖరి పోరాటం

అండీస్ పర్వతాల దట్టమైన పొగ మంచులో, మేఘాలను తాకే ఎత్తయిన అడవుల మధ్య ఓ అపురూపమైన అందాల జీవి ప్రాణాల కోసం కొట్టుమిట్టాడుతోంది. అది ఒక అద్భుతమైన తేనె పిట్ట (హమ్మింగ్ బర్డ్). దాని పేరు 'బ్లాక్–బ్రెస్టెడ్ పఫ్‌లెగ్'. కేవలం 9 సెంటీమీటర్ల పొడవుండే ఈ చిన్ని పిట్టను చూస్తే ప్రకృతి ఒక అందమైన కళాఖండాన్ని సృష్టించిందా.. అనిపిస్తుంది. ఈక్వెడార్ రాజధాని క్విటోకు చిహ్నమైన ఈ హమ్మింగ్ బర్డ్ (తేనె పిట్ట), ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర స్థాయిలో అంతరించిపోతున్న జాతులలో ఒకటిగా నిలిచింది.

ప్రమాదంలో 'చిన్నారి దేవతలు'

ఈ పక్షిని చూడగానే అందరినీ ఆకట్టుకునేది.. దాని కాళ్ల చుట్టూ ఉండే తెల్లటి మెత్తని ఈకలు. అవి చిన్నారి పిట్ట 'నిక్కరు'వేసుకున్నట్లు అనిపిస్తాయి. కాంస్య–పచ్చ రంగులో మెరిసిపోయే రెక్కలతో ఇది అడవిలో ఒక ఎగిరే మణిలా కనిపిస్తుంది. అందుకే దీనిని అండీస్ పర్వతాల 'చిన్నారి దేవత'అని పిలుచుకుంటారు.

వందల్లో మిగిలిన పక్షులు

దురదృష్టవశాత్తూ, ఈ అందమైన పక్షులు ఇప్పుడు ప్రపంచం మొత్తం మీద కేవలం 150 నుండి 200 లోపు మాత్రమే మిగిలి ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం మనిషి స్వార్థమే.. పశువుల మేత, వ్యవసాయం కోసం అడవులను నరికేయడంతో ఈ పిట్టలకు గూడు లేకుండా పోతోంది. ఇవి సముద్ర మట్టానికి సుమారు 3,500 మీటర్ల ఎత్తులో ఉండే నిర్దిష్టమైన అడవుల్లోనే బతకగలవు. ఆ ప్రాంతాలే ఇప్పుడు వ్యవసాయ భూములుగా మారిపోతున్నాయి.

ఊపిరి నిలిపే 'యానకోచా రిజర్వ్'

ఈ పక్షులను కాపాడేందుకు 'జోకోటోకో ఫౌండేషన్'25 ఏళ్ల క్రితం 'యానకోచా రిజర్వ్'ను ఏర్పాటు చేసింది. 'మేము కేవలం ఒక పక్షిని మాత్రమే కాదు, ఒక అద్భుతమైన పర్యావరణ వ్యవస్థనే కాపాడుతున్నాం'.. అని పర్యావరణవేత్త పావలా విల్లాల్బా స్పష్టం చేశారు. ప్రస్తుతం పిచించా అగ్నిపర్వత వాలు ప్రాంతాల్లో ఈ అడవులను మళ్లీ పెంచేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

సర్ ఆందోళనతో రోజుకు నాలుగు బలవన్మరణాలు

బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపణ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)పై సామాన్య ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని సీఎం మమతా బెనర్జీ తెలిపారు. ఆందోళనలు తాళలేక రోజుకు ముగ్గురు లేదా నలుగురు బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్నారు. వీరి చావులకు కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌లదే బాధ్యతని ఆమె ఆరోపించారు. శుక్రవారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కోల్‌కతాలో ఏర్పాటైన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'సర్ కారణంగా భయాందోళనలతో ఇప్పటికే 110 మందికి పైగా ప్రాణాలు తీసుకున్నారు. రోజుకు ముగ్గురు, నలుగురు చొప్పున చనిపోతున్నారు. మరో 40, 45 మంది ఆస్పత్రుల్లో చావుబతుకుల మధ్య ఉన్నారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్న మనం ఈ దేశ పౌరులమని మళ్లీ నిరూపించుకోవాలా?'అని మమత ప్రశ్నించారు. ఇప్పటికే 58 లక్షల మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించిన ఈసీ, మరో 1.38 కోట్ల మందికి నోటీసులు పంపిందన్నారు. రాష్ట్రంలో మొత్తమ్మీద రెండు కోట్ల మందికి ఈసీ ఓటు హక్కు లేకుండా చేయాలని కంకణం కట్టుకుందని పేర్కొన్నారు. బెంగాల్‌పై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షగట్టిందన్నారు. సర్ కారణంగా మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, బోస్, బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులకు అవమానం జరుగుతోందని ఆమె వ్యాఖ్యానించారు. మరోవైపు, దేశ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న యత్నాలను మనం చూస్తున్నామని సీఎం మమత చెప్పారు. భాషలపై దాడి జరుగుతోందని ఆరోపించారు. సుభాష్ చంద్రబోస్ జయంతి రోజును జాతీయ సెలవుదినంగా ప్రకటించకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు.

హింస, విద్వేషాలను రెచ్చగొడుతున్న సంఘ్ పరివార్

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగ్రహం

తిరువనంతపురం: ఎల్డీఎఫ్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ చేసిన ఆరోపణలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిప్పికొట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన ఒడిశాలో క్రైస్తవ పాస్టర్‌పై ఇటీవల దాడి జరిగిందని గుర్తుచేశారు. దానిపై మోదీ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. దేశంలో సంఘ్ పరివార్ ఒక వ్యూహం ప్రకారం హింస, విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. మనిషితో బలవంతంగా ఆవు పేడ తినిపించడం అమానవీయం కాదా? అని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలపై విచ్చలవిడిగా అకృత్యాలు జరుగుతున్నాయని విజయన్ శుక్రవారం 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా లౌకిక శక్తులపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సంఘ్ పరివార్ మత రాజకీయాలను వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పొరపాట్లకు అతీతంగా ఎలక్టోరల్ రోల్స్

ప్రతి ఓటర్‌కూ ఫొటో ఐడీ కార్డు

- అంతర్జాతీయ సదస్సులో ప్రతిన
- ఢిల్లీ డిక్లరేషన్‌కు ఈసీల ఆమోదం

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ రోల్స్‌లో అవకతవకల్ని ఎప్పటికప్పుడు సరిదిద్ది వాటిని పొరపాట్లకు అతీతంగా తీర్చిదిద్దాలని పలు దేశాలకు చెందిన ఎన్నికల సంఘాలు ముక్త కంఠంతో అభిప్రాయపడ్డాయి. అంతేగాక ప్రతి ఓటర్‌కూ ఫొటో ఐడెంటిటీ కార్డు జారీ చేయాలని పేర్కొన్నాయి. 'ప్రజాస్వామ్యం, ఎన్నికల నిర్వహణ'పై ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పలు దేశాలకు చెందిన ఎన్నికల సంఘాల సారథులు, అత్యున్నతాధికారులు పాల్గొన్నారు. ఎన్నికల సంస్కరణలతో సహా ఆ ప్రక్రియను మరింత సమర్థంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలు తదితరాలతో కూడిన ఢిల్లీ డిక్లరేషన్‌ను ఈ సందర్భంగా వారంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ దాన్ని చదివి విన్పించారు. ఓటర్లందరి పేర్లతో కూడిన పరిశుద్ధమైన ఎలక్టోరల్ రోల్స్ ఏ ప్రజాస్వామ్యానికైనా పునాది వంటివని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి కావాలంటే ప్రజలతో పాటు అన్ని స్థాయిల్లో అధికారులు తదితరుల చిత్తశుద్ధితో కూడిన భాగస్వామ్యం చాలా ముఖ్యమన్నారు. ఎన్నికల క్రతువులో టెక్నాలజీది కీలక పాత్ర అని ఆయన గుర్తు చేశారు. ఈ విషయంలో ఇతర దేశాల ఎన్నికల సంఘాలకు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం) ద్వారా సమగ్ర శిక్షణ ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు దేశాల ఎన్నికల సంఘాల సారథులతో జ్ఞానేశ్ విడిగా సమావేశమయ్యారు. 70కి పైగా దేశాల నుంచి 100 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

శాంతిమండలి ఐరాసకూ మేలే: ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్: అంతర్జాతీయ వేదికపై కొత్తగా శాంతిమండలి ఆవిర్భావం ఐక్యరాజ్యసమితికి కూడా మేలు చేసే అంశమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఐరాస తన సామర్థ్యానికి తగ్గట్టుగా ఫలితాలు సాధించడంలో విఫలమైందని ఆక్షేపించారు. గురువారం దావోస్ నుంచి అమెరికా తిరిగి వెళ్తూ ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''గాజాలో శాంతి స్థాపనకు మాత్రమే కాదు, అంతకుమించి కూడా మరెన్నో అంశాల్లో ఐరాసతో కలిసి గొప్పగా పని చేస్తాం. ఒక సంస్థగా ఐరాసకు ఉన్న సామర్థ్యం అంతా ఇంతా కాదు. కానీ అందుకు తగ్గట్టుగా పని చేయడంలో, ఫలితాలు సాధించడంలో ఐరాస విఫలమైంది. నేను ఏకంగా ఎనిమిది యుద్ధాలు ఆపాను. కానీ దీని గురించి ఐరాసతో ఒక్కసారి కూడా మాట్లాడలేదు''అన్నారు. దీనిపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అధికార ప్రతినిధి స్టీఫన్ డుజారిక్ స్పందించారు. ''ట్రంప్ ప్రకటనలు (శాంతి మండలిని ఉద్దేశిస్తూ) చూశాం. అయితే సార్వత్రిక సభ్యత్వమున్న ఏకైక అంతర్జాతీయ సంస్థ ఐరాసే'' అని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ శాంతి దిశగా తమ కృషి, ప్రయత్నాలు కొనసాగుతూనే ఉంటాయని చెప్పారు. గాజాలో అత్యధిక పరిమాణంలో మానవతా సాయాన్ని పంచింది ఐరాస మాత్రమేనని స్టీఫన్ గుర్తు చేశారు.

జపాన్ పార్లమెంట్ రద్దు

టోక్యో: జపాన్‌లో ముందస్తు ఎన్నికల నగారా మోగింది. అధికార పగ్గాలు చేపట్టిన కేవలం మూడు నెలల్లోనే ప్రధానమంత్రి సనే తకాయిచీ శుక్రవారం పార్లమెంట్ దిగువ సభను రద్దు చేశారు. దీంతో, ఫిబ్రవరి 8వ తేదీన తిరిగి ఎన్నికలు జరగనున్నాయి. శుక్రవారం సమావేశమైన ప్రతినిధుల సభను రద్దు చేస్తున్నట్లు స్పీకర్ నుకాగా ప్రకటించగానే సభ్యులు వర్ధిల్లాలి (బాన్‌జాయ్) అంటూ హర్షం వ్యక్తం చేస్తూ హడావుడిగా బయటకు వెళ్లిపోయారు. ఎన్నికలకు అతి తక్కువ సమయం ఉండటం, మంగళవారం నుంచి అధికారికంగా ప్రచారం ప్రారంభం కానుంది. ఇటీవలి కాలంలో క్రమంగా ప్రాభవం కోల్పోతూ వస్తున్న అధికార లిబరల్ డెమోక్రాటిక్ పార్టీ తన ప్రభుత్వానికున్న ప్రజాదరణతో తిరిగి పుంజుకుంటుందని తకాయిచీ ఆశాభావంతో ఉన్నారు. జపాన్ మొట్టమొదటి మహిళా ప్రధాని అయిన తకాయిచీకి 70 శాతం మంది మద్దతిస్తున్నట్లు తేలింది. అదే సమయంలో, ప్రతిపక్ష పార్టీలు ధీటుగా పోటీ ఇచ్చే స్థాయిలో లేకపోవడం ఎల్డీఎఫ్‌కు ఊరట కలిగించే అంశం.

వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా లామ్ మళ్లీ ఎన్నిక

హనోయ్: వియత్నాం అధికార కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఐదేళ్లుగా కొనసాగుతున్న టో లామ్ మరోసారి ఎన్నికయ్యారు. శుక్రవారంతో ముగిసిన పార్టీ జాతీయ కార్యవర్గం సమావేశాల్లో లామ్‌ను ఎన్నుకున్నారు. అయితే, ఆయనే దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపడతారా లేదా అనేది స్పష్టం కాలేదు. ఒకవేళ అదే జరిగితే, రెండు పదవులతో శక్తివంతమైన నేతగా లామ్ మారే అవకాశముంది. సుమారు 1,600 మంది ప్రతినిధులు హాజరైన ఈ సమావేశాల్లో దేశానికి 2031 వరకు రాజకీయ, ఆర్థిక దిశానిర్దేశం చేశారు. అత్యున్నత నాయకత్వ మండలి అయిన పొలిట్ బ్యూరోకు 19 మందిని ఎన్నుకున్నారు.

తిరుప్పరన్‌కుండ్రం ఆలయ వ్యవహారంపై కేంద్రం, తమిళ సర్కారుకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: తమిళనాడులోని తిరుప్పరన్‌కుండ్రం ఆలయాన్ని భారత పురాతత్వ శాఖ(ఏఎస్ఐ) స్వాధీనం చేసుకునేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు కేంద్రానికి, ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు పంపించింది. హిందూ ధర్మ పరిషత్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీల ధర్మాసనం విచారణ చేపట్టింది. మదురైలోని తిరుప్పరన్‌కుండ్రం మురుగన్ సుబ్రమణియ ఆలయం సమీపంలోని రాతి స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును మద్రాస్ హైకోర్టు ఈ నెల 6వ తేదీన సమర్థించిందంటూ ఈ సందర్భంగా ధర్మాసనం ఎదుట లాయర్లు ప్రస్తావించారు. ఆలయాన్ని ఏఎస్ఐ ఆధీనంలోకి తేవడంతోపాటు ఏటా కార్తీక మాసంలో ఆ కొండపై దీపాలు వెలిగించేందుకు, మురుగన్ భక్తులు పూజలు చేసుకునేందుకు అనుమతించాలని పిటిషనర్ కోరారు. పరిశీలించిన ధర్మాసనం కేంద్రానికి, తమిళనాడు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆలయమున్న కొండపై కార్తీక దీపం వెలిగించడం వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందంటూ రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం, ఇది వివాదంగా మారడం తెల్సిందే.

పూర్తయిన పనులకు పర్యావరణ అనుమతులా?

సుప్రీంకోర్టులో కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ సవాల్

న్యూఢిల్లీ: వివిధ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయ్యాక కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు మంజూరు చేయడంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఇటువంటి విధానాలు చట్టరీత్యా చెల్లుబాటుకానివి, ప్రజారోగ్యానికి హాని కల్గించేవి, ప్రభుత్వ పాలనను అపహాస్యం చేసేవిగా ఆయన అభివర్ణించారు. 'ఆరావళి పర్వతాలను పునర్నిర్వచిస్తూ గతంలో ఇచ్చిన తీర్పును తిరిగి సమీక్షించాలంటూ 2025 డిసెంబర్ 29వ తేదీన సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయమిచ్చిన ప్రేరణతోనే పూర్తయిన పనులకు పర్యావరణ అనుమతులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్ వేశాను'అని జైరాం రమేశ్ శుక్రవారం ఎక్స్‌లో వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా నిబంధనలను ఉల్లంఘించిన వారికి సులభంగా తప్పించుకునే మార్గాన్ని ఇటువంటి విధానాలు వీలు కల్పిస్తున్నాయని రమేశ్ పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించడానికి చట్టం తెలియదని చెప్పడం సాకు కారాదన్నారు. తన పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాలని ఆయన సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు మంజూరు చేయడాన్ని నిషేధిస్తూ, మే 16న ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు 2:1 మెజారిటీతో వెనక్కి తీసుకుంది. ఈ కేసుకు సంబంధించిన వివిధ అంశాలపై విచారణకు మరో ధర్మాసనానికి బదలాయించాలని నిర్ణయించింది.

గోవా నైట్‌క్లబ్ ప్రమాదం కేసు.. మూడు రాష్ట్రాల్లో ఈడీ దాడులు

పణజి/న్యూఢిల్లీ: గోవాలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న రోమియో లేన్ నైట్‌క్లబ్ యజమానులపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు శుక్రవారం గోవా, హరియాణా, ఢిల్లీల్లో దాడులు జరిపారు. క్లబ్ యాజమాన్య బాధ్యతల్లో కీలకంగా ఉన్న సౌరభ్, గౌరవ్ లూథ్రా సోదరులతోపాటు సహ భాగస్వామి అజయ్ గుప్తాలకు చెందిన మొత్తం 9 చోట్ల సోదాలు చేపట్టినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. గతేడాది డిసెంబర్‌లో ఈ క్లబ్‌లో జరిగిన ప్రమాదంలో 25 మంది ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. ఘటన చోటుచేసుకున్న అర్పొరా–నగోవా మాజీ సర్పంచి రోహన్ రెడ్‌కర్, పంచాయతీ కార్యదర్శి రఘువీర్ బాగ్‌కర్‌ల ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నాయని ఈడీ అధికారి ఒకరు తెలిపారు. వీరిద్దరూ క్లబ్‌కు అక్రమంగా వ్యాపార అనుమతులు, ఎన్‌వోసీలను ఇచ్చినట్లు ఈడీ ఆరోపిస్తోంది. క్లబ్ యజమానుల్లో ఒకరైన బ్రిటిష్ పౌరుడు సురీందర్ కుమార్ ఖోస్లా కోసం ఇంటర్‌పోల్ సాయంతో రెడ్ నోటీస్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, 1999 నుంచి వివిధ పేర్లతో నడుస్తున్న రోమియో లేన్ క్లబ్ నిర్వహణపై ప్రత్యేకంగా దర్యాప్తు చేపడతామని గోవా ప్రభుత్వం తెలిపింది.

ఎల్గార్ పరిషత్ కేసులో మరో ఇద్దరికి బెయిల్

ముంబై: ఎల్గార్ పరిషత్–మావోయిస్ట్ లింకుల కేసులో బాంబే హైకోర్టు మరో ఇద్దరు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఇతర నిందితులకు ఇదే విధమైన వెసులుబాటు కల్పించినట్లు తెలిపింది. ఈ కేసు విచారణ ఇప్పట్లో పూర్తయ్యే సూచనలు కన్పించడం లేదని వ్యాఖ్యానించింది. జస్టిస్ ఎస్‌సీ చందక్, జస్టిస్ ఏఎస్ గడ్కరీల ధర్మాసనం శుక్రవారం సాగర్ గోర్ఖె, రమేశ్ గైచోర్‌లకు రూ.లక్ష చొప్పున పూచీకత్తుతో బెయిల్ ఇస్తున్నట్లు తెలిపింది. మావోయిస్ట్ కార్యకర్తలుగా ఆరోపణలున్న వీరిద్దరూ 2020 సెప్టెంబర్ నుంచి నవీ ముంబైలోని తలోజా జైలులో ఉంటున్నారు. కాగా, ఈ కేసులో సురేంద్ర గాడ్లింగ్ అనే నిందితుడు మాత్రమే ఇంకా జైలులో ఉన్నారు. 2017 డిసెంబర్ 31వ తేదీన పుణెలో ఎల్గార్ పరిషత్ సమావేశంలో విద్యావేత్తలు, హక్కుల కార్యకర్తలు, లాయర్ల రెచ్చగొట్టే ప్రసంగాల కారణంగానే సమీపంలోని కోరేగావ్–భీమాలో మరునాడే హింస చోటుచేసుకున్నట్లు కేసులు నమోదయ్యాయి.

దివ్యజ్ఞాన సమాజాన్ని ఎవరు స్థాపించారు?

'ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకపోవడం కంటే.. ప్రయత్నించి ఓడిపోవడం మేలు!!'

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

మత, సాంఘిక సంస్కరణ ఉద్యమాలు

పాశ్చాత్య దేశాల్లో మేధాసంపత్తి, వ్యక్తి వాదం ఆధిక్యంలో ఉన్నప్పుడు భారతీయులకు పశ్చిమ దేశాలతో సాన్నిహిత్యం ఏర్పడింది. తొలి దశలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన భారతీయులు విదేశీ సంస్కృతిపై వ్యామోహంతో వారి వేషధారణ, అలవాట్లు, మత భావాల పట్ల ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలోనే 19వ శతాబ్దంలో భారతీయుల్లో జాతీయ భావం అంకురించింది. రాజా రామ్మోహన్‌రాయ్ తదితరులు మత, సాంఘిక సంస్కరణోద్యమాలు సాగించారు. ఫలితంగా హిందూ సమాజంలో సంస్కరణలొచ్చాయి. ఈ సంస్కర్తల ప్రభావం జాతీయోద్యమంపై ప్రసరించింది.

రాజా రామ్మోహన్‌రాయ్

హిందూ మత సాంస్కృతిక పునరుజ్జీవనానికి రాజా రామ్మోహన్‌రాయ్ (1772–1833) నాంది పలికాడు. ఈయన బెంగాల్‌లోని రాధానగరంలో ఉన్నత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఇతడి తండ్రి రమాకాంత్ రాయ్ జమీందారు. రాయ్ చిన్నతనంలోనే బెంగాలీ, అరబిక్, పర్షియన్, సంస్కృత భాషలను నేర్చుకున్నాడు. తర్వాత ఇంగ్లిష్, ఫ్రెంచ్, లాటిన్, గ్రీకు, హిబ్రూ భాషలపై పట్టు సాధించాడు. హిందూ, ముస్లిం, క్రైస్తవ గ్రంథాలను కూలంకషంగా చదివాడు. రాయ్ 1805లో ఈస్టిండియా కంపెనీలో చేరి తొమ్మిదేళ్లు ఉద్యోగం చేశాడు. కానీ ఉద్యోగంలో సంతృప్తి కలగలేదు. సనాతన హిందూ ఆచారాల్లోని దోషాలు నశించి, సమాజం అభివృద్ధి చెందాలంటే ఆంగ్ల విద్య నేర్చుకోవాలని, తద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడం సాధ్యమవుతుందని భావించాడు.

బ్రహ్మ సమాజ స్థాపన (1828)

రాయ్ 1828లో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. దేవుడొక్కడేనని, ఉపనిషత్తుల్లో పేర్కొన్న మార్గమే మోక్షసాధన అని బోధించాడు. విగ్రహారాధను నిరసించాడు. సర్వమానవ సమానత్వాన్ని బోధించాడు. పరమత సహనం చూపాలని, మానవ కోటిని ఉద్ధరించాలని ప్రబోధించాడు. ఈ మతం హిందూ మతాన్ని వదల్లేకపోయినా పాశ్చాత్య ఉదార వైఖరి అవలంబించిందని మెకనాల్డ్ విశ్లేషించాడు.

సాంఘిక దురాచారాలపై..

మత బోధనలే కాకుండా హిందూ మతంలోని సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి రాయ్ నడుం బిగించాడు. 1811లో తన సోదరుడు జగన్‌మోహన్ రాయ్ మరణించినప్పుడు ఆయన భార్యను కూడా చితిపై ఉంచి దహనం చేయడం చూసి రాయ్ హృదయం ద్రవించింది. సతీసహగమనం, బాల్యవివాహాలను నిర్మూలించాలని భావించాడు. ఉపన్యాసాలు, పత్రికల ద్వారా తన భావాలను ప్రచారం చేశాడు. విలియం బెంటింగ్ 1829లో సతీసహగమన నిషేధ చట్టాన్ని రూపొందించడంలో రాజా రామ్మోహన్‌రాయ్ కృషి దాగి ఉంది. బాల్యవివాహాలను రద్దు చేయడానికి, కులవ్యవస్థ నిర్మూలనకు, స్త్రీ జనోద్ధరణకు నిర్విరామ కృషి చేశాడు.

విద్యాసేవ

ఆంగ్ల విద్యను అభ్యసించనిదే దేశం బాగుపడదని భావించిన రాయ్ ఆంగ్ల విద్యను ప్రోత్సహించాడు. 1830లో అలెగ్జాండర్ డఫ్ ఆంగ్ల పాఠశాలను నెలకొల్పినప్పుడు, మెకాలే ఇంగ్లిష్ విద్యను ప్రవేశపెట్టినప్పుడు సమర్థించాడు. తన భావాలను ప్రచారం చేయడానికి సంబంధకౌముది అనే బెంగాలీ వార పత్రికను, మీరట్– ఉల్– అక్బర్ అనే పారశీక పత్రికను నడిపాడు. పత్రికా స్వాతంత్ర్యం కోసం పాటుపడ్డాడు. విలియం బెంటింగ్ రాయ్ ఘనతను గుర్తించి 'రాజా' బిరుదుతో సత్కరించి ఇంగ్లండ్‌కు పంపాడు. 1833లో బ్రిస్టల్ నగరంలో రాయ్ మరణించాడు. అతడి మరణానంతరం దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవచంద్రసేన్ బ్రహ్మ సమాజ ఆశయాలను కొనసాగించారు.

స్వామి దయానంద సరస్వతి

ఆర్య సమాజ స్థాపకుడు స్వామి దయానంద సరస్వతి (1824–1883). ఈయన గుజరాత్‌లోని మోర్వి గ్రామంలో జన్మించాడు. ఇతణ్ని హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనానికి మూల పురుషుడిగా పేర్కొంటారు. దయానంద సరస్వతి అసలు పేరు మూల్‌శంకర్ తివారి. ఇతడికి చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఇది వయస్సుతో పాటు పెరగడంతో వివాహాన్ని తిరస్కరించి ఇల్లు వదిలివెళ్లాడు. అనేక పుణ్యక్షేత్రాలు, పుణ్య పురుషులను దర్శించి సన్యాసాశ్రమం స్వీకరించాడు. చివరకు మధురలో విరజానందుడనే గురువు వద్ద వేదాలు అభ్యసించాడు. సత్యార్థ్ ప్రకాశ్ అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో తన భావాలను ప్రకటించాడు. అవి.. 1) దేవుడొక్కడే 2) విగ్రహారాధన పనికిరాదు 3) వేదాలు విజ్ఞాన గనులు. వేదోక్తమయిన హిందూమతం అన్నిటికన్నా మిన్న 4) మోక్షానికి సత్ప్రవర్తన అవసరం 5) జాతి ఐక్యతకు ఏకమతం ఉండాలని భావించాడు. వేరే మతాల్లో చేరిన హిందువులను తిరిగి సొంత మతంలోకి మార్చడానికి శుద్ధి అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఈ సిద్ధాంతాలే ఆర్య సమాజానికి మూల సూత్రాలయ్యాయి. తన సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించాడు. కులభేదం, అంటరానితనం, బాల్య వివాహాలను ఖండించి స్త్రీ జనోద్ధరణ, వెనుకబడిన జాతుల అభివృద్ధి కోసం కృషి చేశాడు. 1883లో ఆయన మరణించాక స్వామి శ్రద్ధానందుడు, లాలా లజపతిరాయ్, లాలా హంసరాజ్ మెదలైనవారు ఆర్యసమాజాన్ని ప్రచారం చేశారు.

రామకృష్ణ పరమహంస

భారతీయ ఆధ్యాత్మిక తత్వానికి మారో రూపం రామకృష్ణ పరమహంస. ఈయన అసలు పేరు గదాధర్ చటోపధ్యాయ్. 1833లో బెంగాల్‌లోని కామర్స్‌కూర్ గ్రామంలో జన్మించాడు. ఈయన గొప్ప భక్తుడు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. కలకత్తాలోని దక్షిణేశ్వర్‌లో ఇతడి సోదరుడు రామ్ కుమార్ ఛటర్జీ అర్చకుడిగా పనిచేసేవాడు. దీంతో రామకృష్ణుడు కూడా దక్షిణేశ్వర్‌లో నివసించేవాడు. కొద్ది కాలానికి రామకృష్ణ పరమహంస అక్కడి కాళీమాత ఆలయానికి అర్చకుడయ్యాడు. ఆమెను ధ్యానం చేస్తూ ధ్యాన సమాధిలో మునిగిపోయేవాడు. 'తోతాపురి' అనే యోగి ఆయన సమాధి స్థితిని సరి చేయడంతో రామకృష్ణుడు పరిపూర్ణుడయ్యాడు. తర్వాత..

1) దేవుడొక్కడే, అతడు సర్వాంతర్యామి 2) భగవంతుణ్ని తెలుసుకోవడమే జ్ఞానం 3) అన్ని మతాలు భగవంతుణ్ని చేరే మార్గాలను చూపుతాయి 4) మోక్ష సాధనకు కోర్కెలను విసర్జించాలి 5) మానవ సేవే మాధవసేవ అని బోధించాడు. తన బోధనలను వ్యాప్తం చేసే బాధ్యతను ప్రియ శిష్యుడైన స్వామి వివేకానందుడికి అప్పగించి 1886లో పరమపదించాడు.

ప్రభావం: భారతదేశ సంస్కృతిపై రామకృష్ణ పరమహంస ప్రభావం పరోక్షంగా ఉంది. ఆయన వివేకానందుణ్ని తీర్చిదిద్దాడు. వివేకానందుడు ప్రపంచానికి భారతదేశ గొప్పతనాన్ని చాటాడు. అతడి వల్ల ప్రపంచం భారతదేశ ఔన్నత్యాన్ని గ్రహించింది.

స్వామి వివేకానంద(1863-1902)

19వ శతాబ్దం నాటి సంస్కర్తలందరూ దేశంలో హిందూ మత సంస్కరణకు పూనుకున్నారు. అయితే స్వామి వివేకానంద హిందూ మత ఔన్నత్యాన్ని, భారతీయ మత శాస్త్ర లోతులను ప్రపంచానికి చాటాడు. వివేకానందుడి అసలు పేరు నరేంద్ర నాథ్ దత్తా. ఇతడు 1863లో కలకత్తాలో జన్మించాడు. మొదట బ్రహ్మసమాజం పట్ల ఇతడికి అభిమానం ఏర్పడింది. కానీ కుటుంబంలో వచ్చిన కొన్ని కల్లోలాల కారణంగా భగవంతుడిపై నమ్మకం పోయింది. ఆ సందర్భంలో రామకృష్ణ పరమహంస గురించి తెలుసుకున్నాడు. ఆయనను చూడటానికి వచ్చి 'నీవు భగవంతుణ్ని చూశావా? నాకు చూపిస్తావా?' అని ప్రశ్నించాడు. రామకృష్ణుడు చూపిస్తానని తన బొటన వేలితో వివేకానందుణ్ని తాకాడు. దీంతో వివేకానందుడు అనిర్వచనీయమైన అనుభూతి పొందాడు. తర్వాత నాస్తిక భావాన్ని వదిలి రామకృష్ణుడికి శిష్యుడయ్యాడు. సన్యాసిగా, గొప్ప వేదాంతిగా మారాడు. వివేకానందుడు గొప్ప వక్త, మధుర గాయకుడు. రామకృష్ణుడి భావాలను ప్రచారం చేసేందుకు అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతాల సదస్సుకు హాజరయ్యాడు. తన ఉపన్యాసంతో కొద్ది నిమిషాల్లోనే సభికులను ఆకట్టుకున్నాడు. సభికుల కోరికపై ఉపన్యాసాన్ని కొనసాగించి అద్వైత సిద్ధాంతాన్ని 5 గంటల పాటు వివరించాడు. భారతీయ ఆధ్యాత్మిక తత్వబోధనలను వారికి తెలియజేశాడు. రామకృష్ణుడి బోధనలు ప్రచారం చేయడానికి కలకత్తాలోని బేలూరు వద్ద మఠం నిర్మించాడు. అందులో రామకృష్ణుడి విగ్రహం ప్రతిష్ఠించి 'రామకృష్ణ' అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. నేటికీ రామకృష్ణుడి బోధనలను ప్రచారం చేస్తూ సంఘ సేవలో పాలుపంచుకుంటోంది. నిర్వీర్యమవుతున్న భారత జాతిని మేల్కొలుపుతూ వివేకానందుడు అనేక బోధనలు చేశాడు.

వివేకానందుడు ప్రచారం చేసిన సిద్ధాంతాలు

1) సర్వమతాల వేదాంతానికి మూలం హిందూ మతం.
2) హిందూ మతంలో జీవముంది. దాన్ని పునరుద్ధరించడమే మన కర్తవ్యం.
3) పాశ్చాత్యులను అనుసరించడం నాగరికత కాదు. అది దుర్బలుల లక్షణం. నీ సంస్కృతి గొప్పది. దానికి దూరం కావొద్దు.
4) నువ్వు నీ దేశానికి దూరం కావొద్దు.
5) మానవ సేవే మాధవసేవ. కాబట్టి సాటి మనుషులకు సేవ చేయి.
6) భారతదేశం నశిస్తే ప్రపంచంలో ఆధ్యాత్మిక తత్వం నశిస్తుంది.

ఇంకా దేశభక్తికి దృఢ దీక్ష అవసరమని బోధించాడు. ఆకలితో అల్లాడే సాటి భారతీయులను ఆదుకోండని దేశ ప్రజలను కోరాడు. ఇలా అభ్యర్థిస్తూ మైసూరు మహారాజుకు ఒక ఉత్తరం రాశాడు. హిందూ సంస్కృతి వ్యాప్తికి అహోరాత్రాలు కృషి చేసి 1902లో తన 39వ ఏట మరణించాడు.

దివ్యజ్ఞాన సమాజం - అనిబిసెంట్

మేడమ్ బ్లావట్‌స్కీ, కల్నల్ ఆల్‌కాట్ 1875లో అమెరికాలో థియోసోఫికల్ సొసైటీని స్థాపించారు. ఐర్లాండ్‌కు చెందిన అనిబిసెంట్ ఈ సొసైటీ శాఖను 1893లో మన దేశంలో ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనిబిసెంట్ హిందూ మత గ్రంథాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, హిందూ మత గొప్పదనాన్ని తెలుసుకున్నారు.

హిందూ సంస్కృతిని కాపాడి ఆ మతాన్ని పునరుద్ధరించాలని నిశ్చయించుకున్నారు. దివ్యజ్ఞాన సమాజం సర్వసమాన సౌభ్రాతృత్వం, పరమత సహనం, సర్వమత సమానత్వాలను ప్రచారం చేసింది. కులవ్యవస్థను ఖండించి సంఘంలోని వెనుకబడిన జాతుల సంక్షేమానికి పాటు పడింది. భారతీయులకు విద్యాబుద్ధులు నేర్పడానికి అనిబిసెంట్ కాశీలో హిందూ కళాశాలను స్థాపించారు. కొద్ది కాలం తర్వాత మదన్‌మోహన్ మాలవ్య ఈ కళాశాలను హిందూ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చేశారు.

హోమ్ రూల్ లీగ్

అనిబిసెంట్ సంఘ సేవ చేయడమే కాకుండా భారత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1916 సెప్టెంబర్‌లో మద్రాసులో 'హోమ్‌రూల్ లీగ్' ప్రారంభించారు. 27,000 మందితో దేశమంతా దీని శాఖలు ఏర్పడ్డాయి. వారి సహాయంతో ఆమె దేశమంతా హోమ్‌రూల్ ఉద్యమాన్ని నడిపారు. చాలా పట్టణాల్లో బహిరంగ సభల్లో ఉపన్యాసాలు ఇచ్చి దేశభక్తిని ప్రబోధించారు. ఆమె కృషి వల్ల దేశమంతటా జాతీయభావం బలపడింది. ఆమె విదేశీ వనిత అయినా భారతదేశాన్ని మతృభూమిగా భావించి గొప్ప సేవ చేశారు. 1917లో బ్రిటిష్ ప్రభుత్వం ఆమెను జైల్లో నిర్బంధించింది. అనిబిసెంట్ గొప్ప పండితురాలు. ఆమె తొలి పేరు మిస్ ఉడ్. ఐర్లాండ్‌లో చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి దివ్యజ్ఞాన సమాజ సభ్యురాలిగా భారత్‌కు వచ్చారు.

ఈశ్వర చంద్ర విద్యాసాగర్

రాజా రామ్మోహన్‌రాయ్ తర్వాత హిందూ సమాజానికి అంతటి సేవ చేసిన మహనీయుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ఇతడి అసలు పేరు ఈశ్వర చంద్రుడు. హిందూ శాస్త్రాల్లో విద్యాసాగర్ అనే పట్టాను పొందడంతో విద్యాసాగర్ అని పేరుతో కలిసిపోయింది. ఈయన 1820లో బెంగాల్‌లో వీరశింఘ అనే గ్రామంలో జన్మించాడు. ధర్మ, వేదాంత, జ్యోతిష శాస్త్రాల్లో గొప్ప పండితుడు. ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విద్యాశాఖాధికారి అయ్యాడు. కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశాడు. విద్యావ్యాప్తి కోసం విశేష కృషి చేశాడు. విద్యాశాఖాధికారిగా ఉన్న కాలంలో 40 పాఠశాలలను, కలకత్తాలో మెట్రోపాలిటన్ కాలేజీని స్థాపించాడు. స్త్రీ విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈయన కృషి వల్ల చాలామంది బెంగాలీ స్త్రీలు విద్యావంతులయ్యారు. సత్పురుషుల చరిత్ర, బెంగాల్ చరిత్ర, సీతావనవాసం అనే గ్రంథాలను రచించాడు. సులభంగా సంస్కృతం నేర్చుకోవడానికి వీలుగా అనేక సంస్కృత పుస్తకాలు రాశాడు.

సంఘ సంస్కరణలు

రాజా రామ్మోహన్‌రాయ్‌లా ఈశ్వరచంద్రుడు స్త్రీ జనోద్ధరణకు విశేష కృషి చేశాడు. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, వరకట్న దురాచారాలను ఖండించాడు. వితంతు వివాహాలను చట్టబద్ధం చేయాలని ప్రచారం చేసి వితంతు వివేకం అనే గ్రంథాన్ని రాశాడు. తన కుమారుడికి వితంతువును ఇచ్చి వివాహం చేసి ఆదర్శప్రాయుడయ్యాడు. ఈయన కృషి వల్ల 1856లో డల్హౌసీ వితంతు పునర్వివాహ చట్టం చేశాడు. తన సంపాదనంతా సంఘ సంస్కరణలకు ఖర్చు చేశాడు. ఈశ్వరచంద్రుడు 1891లో మరణించాడు.

దక్కన్ పీఠభూమి ఏ దిశ వైపు వాలి ఉంది?

దీ్వపకల్ప ప్రాంతం.. భారతదేశ నైసర్గిక విభాగాల్లో అతి పెద్దది. పశ్చిమాన సహ్యాద్రి కొండలు, తూర్పున తూర్పు కనుమలు, ఉత్తరాన గంగా మైదానం, సరిహద్దులుగా ఉన్న ద్వీకల్ప ప్రాంతం.. దక్షిణాన కన్యాకుమారి వరకు విస్తరించి ఉంది. ఇది వివిధ పీఠభూములు, కొండలు, నదీలోయలతో కూడి ఉంది. ద్వీపకల్ప భారతదేశ ఉత్తర భాగాన్ని మధ్యమెట్టభూములుగా, దక్షిణ భాగాన్ని దక్కన్ పీఠభూమిగా వ్యవహరిస్తారు. మధ్య మెట్టభూముల ప్రాంతం.. మాళ్వా, బుందేల్‌ఖండ్, బాగేల్‌ఖండ్, ఛోటా నాగ్‌పూర్, మైకాల పీఠభూములు, వింధ్య, సాత్పూరా, అజంతా, బాలాఘాట్, చందేరి, క్రైమూరు, ఆరావళి మొదలైన కొండలతో కూడి ఉంది!!



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భూగోళశాస్త్రం

ద్వీపకల్ప భారతదేశం - నైసర్గిక స్వరూపం

దక్కన్ పీఠభూమి

మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ల్లో దక్కన్ పీఠభూమి విస్తరించి ఉంది. దక్కన్ పీఠభూమిలో బసాల్ట్ రకానికి చెందిన లావాతో ఉన్న ప్రాంతాన్ని దక్కన్ నాపలు అంటారు. పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణాల్లో దక్కన్ నాపలు విస్తరించి ఉన్నాయి. బసాల్టిక్ లావా ఘనీభవించి ఏర్పడ్డ అగ్నిపర్వత శిలలు శిథిలమవడంతో దక్కన్ నాపల ప్రాంతంలో నల్లరేగడి నేలలు ఏర్పడ్డాయి.

ఆరావళి పర్వత శ్రేణులు

ఇవి ద్వీపకల్ప పీఠభూమికి వాయవ్య సరిహద్దులో నైరుతి–ఈశాన్య దిశలో విస్తరించాయి. ఈ శ్రేణులు గుజరాత్‌లోని పాలంపూర్ నుంచి ఢిల్లీ వరకు వ్యాపించి ఉన్నాయి. ఆరావళి పర్వతాలు పురాతన ముడుత పర్వతాల కోవకు చెందుతాయి. ఇవి ప్రీ కాంబ్రియన్ భౌమ్యయుగంలో ఏర్పడ్డాయి. ఆ కాలంలో ఇవి ప్రస్తుత హిమాలయాల కంటే విశిష్టంగా ఉండేవని నిపుణుల అంచనా. తర్వాత ఇవి శిథిలమై.. ప్రస్తుతం అవశిష్ట పర్వతాలకు ఉదాహరణగా మిగిలాయి. వింధ్య–సాత్పూరా పర్వతశ్రేణుల మధ్య ఉన్న విదరణ లోయ (Rift valley) ద్వారా నర్మదా నది ప్రవహిస్తోంది. వింధ్య–సాత్పూరా పర్వతశ్రేణులు భ్రంశ/ఖండ పర్వతాలకు మంచి ఉదాహరణలు. వింధ్య పర్వతశ్రేణులను ఆనుకొని ఉన్న మాళ్వా పీఠభూమి గిరిపద పీఠభూములకు మంచి ఉదాహరణ. మైకాల పీఠభూమిలోని అమర్ ఖంఠక్ శిఖర ప్రాంతం నుంచి నర్మదా నది ప్రవహిస్తోంది. పశ్చిమ తీరంలోని పశ్చిమ కనుమలు(సహ్యాద్రి కొండలు) మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళల్లో విస్తరించి ఉన్నాయి. కేరళలోని పాల్‌ఘాట్ కనుమను మినహాయిస్తే ఇవి దాదాపు అవిచ్ఛిన్నంగా విస్తరించి ఉన్నాయి.

పశ్చిమ కనుమలు

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో అన్నామలై, పళని, ఏలకుల కొండల రూపంలో పశ్చిమ కనుమలు వ్యాపించి ఉన్నాయి. పాల్‌ఘాట్ కనుమ వద్ద నీలగిరి కొండలు, పశ్చిమ–తూర్పు కనుమలను అనుసంధానిస్తున్నట్లుగా కనిపిస్తాయి. ఇవి శంఖు ఆకార శిఖరాలను పోలి ఉంటాయి. ఇవి పశ్చిమాన అరేబియా సముద్రం వైపు నిట్రవాలుగా ఉంటాయి. దక్కన్ పీఠభూమి వైపు మెట్లలా తిన్నని వాలులను కలిగి ఉంటాయి. వీటిని 'ట్రిపియన్ నైసర్గిక స్వరూపం'గా అభివర్ణిస్తారు.

తూర్పు కనుమలు

మహారాష్ట్రలోని సహ్యాద్రి కొండల్లో ఉన్న సన్నని థాల్‌ఘాట్, భోర్‌ఘాట్ కనుమల ద్వారా ముంబై–పుణే, ముంబై–ఇండోర్ రైలు, రహదారి మార్గాలు నిర్మించారు. పశ్చిమ కనుమలతో పోలిస్తే తూర్పు కనుమల సగటు ఎత్తు తక్కువ. తూర్పు కనుమలు కూర్చొని ఉన్న ఏనుగుల ఆకారంలో కనిపిస్తాయి. విస్తారమైన వికోశీకరణం వల్ల వీటి శిఖర భాగాలు బోర్లించిన మూకుళ్ల మాదిరిగా ఉంటాయి. తూర్పు కనుమలు మహానది–కృష్ణానది డెల్టాల మధ్య మాత్రమే అవిచ్ఛిన్న పర్వత శ్రేణిగా వ్యాపించాయి. ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా–గోదావరి డెల్టా ప్రాంతంలో సుమారు 150 కిలోమీటర్ల మేర దాదాపు అదృశ్యమవుతాయి. కృష్ణానది డెల్టాకు దక్షిణంగా నల్లమలై, ఎర్రమలై, వెలికొండ పర్వతాలుగా తూర్పు కనుమలు విస్తరించాయి.

నీలగిరి కొండలకు దక్షిణంగా దక్షిణ తమిళనాడులోని షెవరాయి, జావ్వో కొండలను తూర్పు కనుమల విస్తరణలుగా పరిగణిస్తారు. మేఘాలయలోని షిల్లాంగ్ పీఠభూమి ఒకప్పుడు ద్వీపకల్ప భారతదేశంలో భాగంగా ఉండేది. గారో– రాజ్‌మహల్ కొండల మధ్య భూఅవనతం జరగడంతో ఈ భాగం ద్వీపకల్ప భారత ప్రాంతం నుంచి విడిపోయి ఈశాన్య భారతదేశం వైపు వెళ్లింది. అందువల్ల షిల్లాంగ్ పీఠభూమిని ద్వీపకల్ప భారతదేశ అవుట్‌పోస్ట్ అంటారు. ద్వీపకల్ప భారతదేశ పీఠభూములుప్రపంచంలోనే అతి ప్రాచీనమైన శిలలు కలిగి ఉన్నాయి. ఆర్కియన్ (ప్రీ కాంబ్రియన్) భౌమ్య యుగానికి చెందిన శిలలు వీటి పునాదులు. వీటి వయసు దాదాపు 2500 మిలియన్ ఏళ్లకు పైనే. ద్వీపకల్ప పీఠభూముల శిలలు అతి కఠినమైన రూపాంతర, అగ్నిశిలల తరగతికి చెందినవి. ద్వీపకల్ప పీఠభూమి పటలం ఏ రకమైన భౌమ్య చలనాలకు గురికాకుండా సుస్థిరంగా ఉండటంతో ఇక్కడ భూకంప ప్రక్రియ జరగడం అరుదు..

మాదిరి ప్రశ్నలు

1. ద్వీపకల్ప భారతదేశంలో ఎత్తయిన పర్వత శిఖరం?
ఎ) వావుల్‌మాలా బి) అనైముడి
సి) మహేంద్రగిరి డి) హరిశ్చంద్ర
2. దొడబెట్ట కింది ఏ పర్వతశ్రేణుల్లో ఎత్తయిన శిఖరం?
ఎ) తూర్పు కనుమలు బి) పళని కొండలు
సి) నీలగిరి కొండలు
డి) అన్నామలై కొండలు
3. రాంచీ పీఠభూమి ఏ నైసర్గిక స్వరూపంలో భాగం?
ఎ) మైకాల పీఠభూమి
బి) మాళ్వా పీఠభూమి
సి) బుందేల్‌ఖండ్ పీఠభూమి
డి) ఛోటానాగపూర్ పీఠభూమి
4. ఆరావళి పర్వతశ్రేణులు ఏయే నదీ లోయలను వేరు చేస్తున్నాయి?
ఎ) గంగా–సింధు బి) గంగా–యమున
సి) గంగా–చంబల్ డి) గంగా–సట్లెజ్
5. దక్కన్ నాపల ప్రాంతం ఏ తరగతికి చెందిన శిలలతో ఉంది?
ఎ) గ్రానైట్ బి) సున్నపురాయి
సి) బసాల్ట్ డి) ఇసుకరాయి
6. పచ్‌మాడి వేసవి విడిది కేంద్రం ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
ఎ) సాత్పూరా బి) మహాదేవ
సి) వింధ్య డి) బాలాఘాట్
7. గోదావరి, కృష్ణా నదులు ఏ పర్వతాల్లో ఉద్భవిస్తున్నాయి?
ఎ) తూర్పు కనుమలు
బి) అజంతా కొండలు
సి) నీలగిరి కొండలు
డి) సహ్యాద్రి కొండలు
8. దక్కన్ పీఠభూమి ఏ దిశ వైపు వాలి ఉంది?
ఎ) తూర్పు–ఆగ్నేయ బి) ఉత్తర
సి) ఈశాన్య డి) తూర్పు–ఈశాన్య
9. కింది ఏ పర్వతశ్రేణులు భారతదేశాన్ని ఉత్తర దక్షిణాలుగా విభజిస్తాయి?
ఎ) వింధ్య పర్వతాలు
బి) సాత్పూరా పర్వతాలు
సి) మైకాల డి) అజంతా కొండలు
10. బస్తర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
ఎ) ఒడిశా బి) మధ్యప్రదేశ్
సి) ఛత్తీస్‌గఢ్ డి) కర్ణాటక
11. ద్వీపకల్ప భారతదేశంలోని ఏ ప్రాంతంలో బ్యాడ్ ల్యాండ్ భూ దృశ్యం ఏర్పడింది?
ఎ) మాళ్వా పీఠభూమి
బి) బీగల్ ఖండ్ పీఠభూమి
సి) చంబల్ లోయ డి) సోన్ లోయ
12. ద్వీపకల్ప భారతదేశంలో తీవ్ర స్థాయిలో భూకంపాలు సంభవించే ప్రాంతం?
ఎ) మరత్వాడ బి) విదర్భా
సి) బుందేల్ ఖండ్ డి) కచ్
13. దక్కన్ నాపలు సుమారు ఎన్ని సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి?
ఎ) 100 బిలియన్ సంవత్సరాలు
బి) 150 బిలియన్ సంవత్సరాలు
సి) 200 బిలియన్ సంవత్సరాలు
డి) 250 బిలియన్ సంవత్సరాలు
14. షేన్ కొట్టా కనుమ ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
ఎ) తూర్పు కనుమలు
బి) పశ్చిమ కనుమలు
సి) బాలాఘాట్ పర్వత శ్రేణులు
డి) అజంతా కొండలు
15. ద్వీపకల్ప భారతదేశంలోకెల్లా నిట్రవాలులు కలిగిన పీఠభూమి?
ఎ) కర్ణాటక బి) మహారాష్ట్ర
సి) తెలంగాణ డి) అమరఖంఠక్
16. ఆంధ్రప్రదేశ్‌లో సుప్రసిద్ధ శ్రీశైలం పుణ్య క్షేత్రం ఏ కొండల్లో ఉంది?
ఎ) ఎర్రమలై బి) నల్లమలై
సి) శేషాచలం డి) వెలిగొండ
17. గురు శిఖర్ ఏ పర్వత శ్రేణుల్లో ఎత్తయిన శిఖరం?
ఎ) వింధ్య బి) సాత్పూరా
సి) ఆరావళి డి) తూర్పు కనుమలు
18. భారతదేశంలోని ఏ ప్రాంతంలో అతి పురాతన శిలలు లభ్యమవుతున్నాయి?
ఎ) హిమాలయాలు
బి) పూర్వాంచల్ కొండలు
సి) గంగా మైదానం
డి) ద్వీపకల్ప పీఠభూమి
19. మాళ్వా పీఠభూమి ఏ దిశగా వాలి ఉంది?
ఎ) ఉత్తర బి) దక్షిణ
సి) తూర్పు డి) పడమర
20. పెండ్రా పీఠభూముల్లో ఏ నది ఉద్భవిస్తోంది?
ఎ) చంబల్ బి) సోన్
సి) దామోదర డి) తపతి
21. సహ్యాద్రి కొండల్లో ఎత్తయిన పర్వత శిఖరం?
ఎ) అనైముడి బి) త్రయంబక్
సి) వావుల్ మలై డి) హరిశ్చంద్ర
22. రాజమహల్ కొండలు ఏ పీఠభూమిలో భాగం?
ఎ) ఛోటా నాగపూర్ బి) దక్కన్
సి) షిల్లాంగ్ డి) బస్తర్

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) ఎ; 5) సి; 6) డి; 7) డి; 8) ఎ; 9) ఎ; 10) సి; 11) సి; 12) డి; 13) ఎ; 14) బి; 15) ఎ; 16) బి; 17) సి; 18) డి; 19) ఎ; 20) బి; 21) సి; 22) ఎ.

విద్య, ఉద్యోగ సమాచారం

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ -1 పోస్టులు

» చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.67,200.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.01.2026.
» **ఇంటర్వ్యూ తేది:** 30.01.2026.
» **వెబ్‌సైట్:** https://pgimer.edu.in/

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-2 పోస్టులు

» చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 31.01.2026 నాటికి 40 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2026.
» **వెబ్‌సైట్:** https://pgimer.edu.in/

తెలంగాణ అపాయింటెడ్ డే ఎప్పుడు ?

కాంగ్రెస్.. దేశంలోనే ప్రాచీనమైన రాజకీయ పార్టీ. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటులో, ఆ తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరిట ఆంధ్రప్రదేశ్ రూపుదిద్దుకోవడంలో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం పురుడు పోసుకోవడంలోనూ కాంగ్రెస్‌ది కీలకపాత్ర. రాష్ట్ర విభజన విషయంలో తొలుత ఊగిసలాట ధోరణిని అవలంభించినా.. ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడానికే ఆ పార్టీ మొగ్గు చూపింది.

శ్రీకృష్ణ కమిటీ

- 2010 ఫిబ్రవరి 3న జస్టిస్ శ్రీకృష్ణ కమిటీని నియమించారు. 2010 ఫిబ్రవరి 19న రాజకీయ జేఏసీ నుంచి కాంగ్రెస్ బయటకు వచ్చింది. రాష్ట్రంలో ఆందోళనల నేపథ్యంలో కేంద్రం రోశయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించింది. 2010 నవంబర్‌లో ఆయన స్థానంలో స్పీకర్ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రిగా నియమించింది.
- విద్యార్థులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు 2010 డిసెంబర్ 26న గన్‌పార్క్ వద్ద దీక్ష చేశారు. అదే నెల 30న శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను కేంద్ర హోంశాఖకు సమర్పించింది.
- 2011 జనవరి 6న కేంద్ర ప్రభుత్వం శ్రీకృష్ణ కమిటీ నివేదికను బహిర్గతం చేసింది.
- శ్రీకృష్ణ కమిటీ సమైక్యాంధ్రకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చింది. దీంతో తెలంగాణలో ఆందోళనలు కొనసాగాయి. తెలంగాణ ఏర్పాటుపై ఆలస్యానికి నిరసనగా జూపల్లి కృష్ణారావు 2011 మార్చి 3న మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 2011 జూన్‌లో పీసీసీ అధ్యక్షుడిగా డి. శ్రీనివాస్ స్థానంలో బొత్స సత్యనారాయణను నియమించారు. ఈ ఘటనతో సీఎం, స్పీకర్, పీసీసీ అధ్యక్షుడి లాంటి మూడు కీలక పదవులు ఆంధ్రా ప్రాంతానికే దక్కాయి.
- 2011 అక్టోబర్ 1న నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారు.
- 2012 డిసెంబర్ 28న హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. 2013 జూన్ 30న హైదరాబాద్‌లో తెలంగాణ సాధన సభ పేరుతో కాంగ్రెస్ బహిరంగ సభ నిర్వహించింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వివిధ రాజకీయ పార్టీల పాత్ర

కాంగ్రెస్ పార్టీ

కాంగ్రెస్ పార్టీ 1885 డిసెంబర్ 28న ఆవిర్భవించింది. దేశంలోనే పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ భారత్‌ను ఎక్కువ కాలం పాలించింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సుమారు 38 ఏళ్లపాటు పరిపాలన సాగించారు.

- జవహర్‌లాల్ నెహ్రూ 16 సంవత్సరాల 286 రోజులు, ఇందిరా గాంధీ 15 సంవత్సరాల 350 రోజులు(రెండు పర్యాయాలు), రాజీవ్ గాంధీ 5 సంవత్సరాల 32 రోజులు ప్రధానిగా పనిచేశారు.
- కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లోనూ సుమారు 42 ఏళ్లపాటు (1956-83, 1989-94, 2004-14) అధికారంలో ఉంది.
- 1971లో పీవీ నరసింహారావు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఈయనే తెలంగాణకు చెందిన తొలి ముఖ్యమంత్రి. పీవీ తర్వాత మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య ముఖ్యమంత్రులుగా పనిచేశారు. వీరెవరూ పూర్తి కాలం పదవిలో కొనసాగలేదు.

ఉద్యమంలో కాంగ్రెస్ పాత్ర

- 1956-83 వరకు ఏపీ కాంగ్రెస్‌లో వైరివర్గాల ఆధిపత్యమే కొనసాగింది. 1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆ ప్రాంత కాంగ్రెస్ నేతలు కీలక పాత్ర పోషించారు.
- ఉద్యమాన్ని శాంతింపజేసేందుకు 1969 ఏప్రిల్ 11న ఢిల్లీలో అష్టసూత్ర పథకాన్ని ప్రకటించారు. 1971లో చెన్నారెడ్డి అధ్యక్షత వహించిన తెలంగాణ ప్రజాసమితి పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు సాధించింది. తెలంగాణలోని 14 పార్లమెంట్ స్థానాల్లో పదింటిని టీపీఎస్ అభ్యర్థులు గెలుచుకున్నారు. కాంగ్రెస్ దారుణంగా ఓటమి పాలైంది.
- ముల్కీ నిబంధనలు చెల్లుబాటు అవుతాయని 1972 అక్టోబర్ 3న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీంతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ప్రారంభమైంది.

కాంగ్రెస్ (ఐ) ఏర్పాటు

- ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని 1972 నవంబర్ 27న ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటించారు. వెంటనే పంచసూత్ర పథకాన్ని విడుదల చేశారు. అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో కాసు బ్రహ్మానందరెడ్డికి ఇందిరా గాంధీతో అభిప్రాయభేదాలు వచ్చాయి. పార్టీని చీల్చేందుకు ప్రయత్నించారు. ఇందిరా గాంధీ 1978 జనవరి 1న కాంగ్రెస్ (ఐ)ను స్థాపించారు.
- అదే సమయంలో కాసు బ్రహ్మానందరెడ్డి 'రెడ్డి కాంగ్రెస్'ను స్థాపించారు.
- 2000లో జి.చిన్నారెడ్డి నాయకత్వంలో 41 మంది ఎమ్మెల్యేలు తెలంగాణకు అనుకూలంగా సోనియా గాంధీకి వినతిపత్రం ఇచ్చారు.
- 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్, వామపక్ష పార్టీలు కలిసి పోటీ చేసి విజయం సాధించాయి. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో తెలంగాణ అంశాన్ని చేర్చింది. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలోనూ యూపీఏ ప్రభుత్వం ఈ అంశాన్ని పొందుపర్చింది.
- 2004 జూన్ 7న రాష్ట్రపతి ప్రసంగించారు. యూపీఏ ప్రభుత్వం ఆ ప్రసంగంలోనూ తెలంగాణ అంశాన్ని చేర్చింది. తెలంగాణపై విస్తృత అంగీకారం కోసం ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన 2004 నవంబర్‌లో కేంద్రం ఒక ఉపసంఘాన్ని నియమించింది.
- ఉద్యమం తీవ్రం కావడంతో తెలంగాణ ఏర్పాటుపై అభిప్రాయాలు స్వీకరించడానికి వైఎస్ ప్రభుత్వం 2008లో రోశయ్య కమిటీని నియమించింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ ఉద్యమం

- 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా బరిలో దిగింది. అధికారంలోకి వస్తే తెలంగాణ ఇస్తామని ఆ పార్టీ ప్రచారం చేసింది.
- ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 156 స్థానాల్లో విజయం సాధించింది. వైఎస్ రాజశేఖర రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు.
- రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తూ 2009 సెప్టెంబర్ 2న నల్లమల అటవీ ప్రాంతంలోని పావురాల గుట్ట వద్ద హెలికాప్టర్ ప్రమాదంలో వైఎస్ మరణించారు.
- 2009 సెప్టెంబర్ 3న రోశయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.
- 2009 అక్టోబర్ 9న హైదరాబాద్ ఫ్రీజోన్ అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పుతో తెలంగాణవాదుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 2009 అక్టోబర్ 13న రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.
- 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించారు. తెలంగాణలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. 2009 డిసెంబర్ 7న సచివాలయంలో రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎం, ఎంఐఎం తప్ప ఈ సమావేశంలో పాల్గొన్న మిగిలిన పార్టీలన్నీ తెలంగాణకు మద్దతిచ్చాయి.

అఖిలపక్ష సమావేశం

- 2009 డిసెంబర్ 9న రాత్రి 11.30 గంటలకు హోంమంత్రి చిదంబరం తెలంగాణపై ప్రకటన చేశారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించి, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడతారు' అని చిదంబరం పేర్కొన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన తర్వాతే తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని డిసెంబర్ 23న మరో ప్రకటనలో పేర్కొన్నారు.
- రెండో ప్రకటనతో తెలంగాణలో ఆందోళనలు మొదలయ్యాయి.
- తెలంగాణకు మద్దతుగా కాంగ్రెస్ నేతలు రాజీనామా చేయకపోవడం పట్ల ఆగ్రహంతో ఉన్న విద్యార్థులు, జేఏసీ నేతలు 2010 ఫిబ్రవరి 14న మంత్రులు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇళ్లపై దాడి చేశారు.
- కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణ తరపున ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆంధ్రా తరపున కావూరి సాంబశివరావు హాజరయ్యారు.

రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం

- 2013 జూలై 11న ఢిల్లీలో కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో తెలంగాణపై చర్చ జరిగింది. 2013 జూలై 30న హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ప్రకటించింది. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని 2013 ఆగస్టు 5న చిదంబరం పార్లమెంటులో ప్రకటించారు. ఆగస్టు 6న ఆంటోని నేతృత్వంలో అంతర్గతంగా విభజన కమిటీ ఏర్పాటైంది. దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, అహ్మద్ పటేల్ ఈ కమిటీలో సభ్యులు. 2013 అక్టోబర్ 8న ఎ.కె. ఆంటోనీ చైర్మన్‌గా కేంద్ర మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేశారు.
- 2013 డిసెంబర్ 5న 'తెలంగాణ ముసాయిదా బిల్లు 2013'ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ బిల్లు డిసెంబర్ 12న రాష్ట్రానికి చేరింది. డిసెంబర్ 15న బిల్లు ప్రతులను ఎమ్మెల్యేలకు అందజేశారు. తర్వాతి రోజు చర్చ ప్రారంభమైంది. 2014 జనవరి 22న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.
- సభలో 87 మంది ఎమ్మెల్యేలు మాట్లాడారు. మిగతా సభ్యులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలిపారు. దీనిపై చర్చ ముగిసిందంటూ 2014 జనవరి 30న స్పీకర్ ప్రకటించారు.
- పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా ఫిబ్రవరి 9న ఆంధ్రాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాసానికి కారణమైన పదకొండు మంది ఎంపీలను ఫిబ్రవరి 11న కాంగ్రెస్ సస్పెండ్ చేసింది. ఫిబ్రవరి 14న కాంగ్రెస్ ఎంపీ లగడపాటి రాజగోపాలరెడ్డి లోక్‌సభలో పెప్పర్ స్ప్రేతో దాడిచేశారు.
- ఈ సందర్భంగా 16 మంది ఆంధ్రప్రదేశ్ ఎంపీలను స్పీకర్ మీరాకుమార్ లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. 2014 ఫిబ్రవరి 13న యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది.
- 2014 ఫిబ్రవరి 18న తెలంగాణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఫిబ్రవరి 20న యూపీఏ ప్రభుత్వం రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టగా, ఆ రోజే బిల్లు ఆమోదం పొందింది. 2014 మార్చి 1న బిల్లుపై రాష్ట్రపతి సంతకం చేశారు. మార్చి 2న కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.
- జూన్ 2ను అపాయింటెడ్ డేగా కేంద్రం 2014 మార్చి 4న ప్రకటించింది.
- దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది.

ఎంఐఎం

- హైదరాబాద్ కేంద్రంగా ఎంఐఎం రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.
- ప్రస్తుత అసెంబ్లీలో ఈ పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.
- తెలంగాణ ఉద్యమానికి ఎంఐఎం దూరంగానే ఉంది.
- 2010 జనవరి 5న ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశానికి ఎంఐఎం అగ్రనేతలు అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీ హాజరయ్యారు.
- తెలంగాణ ఏర్పడితే మతతత్వ శక్తులు విజృంభిస్తాయనే భయాన్ని వారు వెలిబుచ్చారు.
- 2013 నవంబర్ 12, 13 తేదీల్లో రాష్ట్ర విభజనపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందానికి ఎంఐఎం తన సూచనలు, సలహాలు అందజేసింది.
- 2014 జనవరి 20న ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ విభజన బిల్లుపై అసెంబ్లీలో మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో కోస్తాంధ్ర పాత్ర ఏమీలేదని, నిజాం కాలం నుంచే హైదరాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని గణాంకాలతో సహా వివరించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణకు మొగ్గు చూపారు.

A half byte is known as..

BANK EXAMS
COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.

Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites)

Applications of Internet

Traditionally the internet has the following applications.
1) E-mail2) News 3) Remote login
4) File transfer
5) World wide web (www)

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
1) Folder 2) Pod 3) Version
4) Bag 5) None of the above

2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
1) System menu
2) Address bar
3) Menu bar
4) Tool bar
5) None of the above

3. A _____ is a set of computer instructions that carry out a task on the computer.
1) Program 2) Database
3) Memory file4) Folder
5) None of the above

4. An operating system version designed for home use is Microsoft Windows XP______
1) Home Edition
2) Media Center Edition
3) Tablet PC Edition
4) All of the above 5) None

5. A user-interface that is easy to use is considered to be______
1) user-happy 2) user-simple
3) user-friendly 4) Interface
5) None of the above

6. When you press and release the secondary mouse button you are______
1) Right-clicking
2) Left-clicking
3) Either 1 or 2
4) All of the above
5) Neither 1 nor 2

7. Another term for hyperlink is_______
1) Link 2) Source
3) Bar 4) All of the above
5) None of the above

8. A graphical user interface displays_________
1) Graphics 2) Text
3) Both 1 and 2
4) Neither 1 nor 2 5) None

9. The ______ program compresses larger files into a smaller file.
1) Win Zip 2) Win Shrink
3) Win Style 4) Win small
5) None of the above

10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is _________.
1) Queue 2) Linked list
3) Doubly linked list
4) Binary tree
5) None of the above

11. Caps lock, Num-lock are known as _______.
1) Modifier key2) Toggle key
3) Function key 4) Numeric key
5) None of these

12. Which of the following memories must be refreshed many times per second?
1) Static RAM
2) Dynamic RAM 3) EPROM
4) ROM 5) None of these

13. Anurag is a supercomputer developed in _____
1) China 2) USA 3) India
4) England 5) None of these

14. A result of a computer virus can not lead to_______.
1) Disk Crash
2) Mother Board Crash
3) Corruption of program
4) Deletion of files
5) None of these

15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
1) Begin the line with a # sign
2) Begin the line with double slashes (/ /)
3) Begin and end the line with double hyphens (-_-)
4) Indent the line
5) None of these

16. Programming language built into user programs such as Word and Excel are known as_____.
1) 4GLs 2) Macro languages
3) Procedure-oriented languages
4) Visual programming languages
5) None of these

17. Firewalls are used to protect against _______.
1) Unauthorized Attacks
2) Virus Attacks
3) Data Driven Attacks
4) Fire Attacks
5) All of these

18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
1) Management 2) Processing
3) Utility 4) Application
5) None of these

19. RAM can be thought of as the ________ for the computer's processor.
1) Factory 2) Operating room
3) Waiting room
4) Planning room
5) None of these

20. The CPU and memory are located on the ________.
1) Expansion board
2) Motherboard
3) Storage device
4) Output device
5) None of these

21. Word processing, spreadsheet and photo-editing are examples of ________.
1) Application software
2) System software
3) Operating system software
4) Platform software
5) None of the above

22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
1) <ahref> 2) <a> 3) <link>
4) <hlink> 5) <href>

23. Drop cap option found in which menu?
1) Insert 2) Format 3) Edit
4) Tools 5) None of these

24. A half byte is known as_______.
1) Data 2) Bit 3) Half byte
4) Nibble 5) All of these

25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called_______.
1) Modern 2) Interface
3) Clue 4) Data bus
5) All of these

26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
1) POS 2) RFID 3) PPS
4) GPS 5) None of these

27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called_______.
1) HTML 2) MP3 3) MPEG
4) MIDI 5) None of these

KEY

1) 1 2) 2 3) 1 4) 1 5) 3
6) 1 7) 1 8) 3 9) 1 10) 3
11) 2 12) 2 13) 3 14) 2 15) 2
16) 4 17) 1 18) 4 19) 3 20) 2
21) 1 22) 1 23) 1 24) 4 25) 2
26) 2 27) 4